# ధర్మసంస్థాపనార్థం

## కథల సంపుటి



వేమూరి వేంకటేశ్వరరావు

# ధర్మసంస్థాపనార్థం

కథల సంపుటి



**వేమూరి వేంకటేశ్వరరావు**

# విషయ సూచిక


వేమూరి వేంకటేశ్వరరావు ఇతర రచనలు

తొలిపలుకు

1. ధర్మసంస్థాపనార్థం

2. ఎమిలీ

3. అవధులు

4. ఉపతాపి నేర్పిన పాఠం

5. శృతి మించిన రాగం

6. మరోలోకం

7. తిరుగులేని ప్రయాణం

8. బొమ్మలూరు

9. శిక్ష

10. పెళ్లి చేసి చూడు

11. ఇల్లు కట్టి చూడు

12.బల్లి ఫలితం

13. జాతకబలం

14. ఓ పెన్నీ, నా పెన్నీ!

# వేమూరి వేంకటేశ్వరరావు తెలుగు పుస్తకాలు

1. English-Telugu & Telugu-English Dictionary & Thesaurus, Asian Educational Services, New Delhi, 2002. ఈ నిఘంటువుని తెలుగు వికీపీడియాలో ఉచితంగా కూడ సంప్రదించవచ్చు. https://te.wikipedia.org/wiki/
2. జీవరహాశ్యం, ప్రతులు అలభ్యం
3. రసగంధాయ రసాయనం, ప్రతులు అలభ్యం
4. కించిత్ భోగో భవిష్యతి, ప్రతులు అలభ్యం (వైజ్ఞానిక కథలు)
5. అమెరికా అనుభవాలు, ఎమెస్కో
6. జీవనది: రక్తం కథ, కినిగె.
7. నిత్యజీవితంలో రసాయనశాస్త్రం, కినిగె.
8. విశ్వస్వరూపం, కినిగె.
9. ప్రాణి ఎలా పుట్టింది?, కినిగె.
10. మహాయానం, కినిగె. (వైజ్ఞానిక కల్పనలు)
11. రామానుజన్ నుండి ఇటూ అటూ, కినిగె.

### వేమూరి వేంకటేశ్వరరావు జీవిత సంగ్రహం

భారతదేశంలో తుని, మచిలీపట్నం, కాకినాడలలో విద్యాభ్యాసం. ఉన్నత విద్యకి 1961 లో అమెరికా ప్రయాణం. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ కేలిఫోర్నియా, డేవిస్ కేంద్రంలో విశ్రాంత ఆచార్యులు. నివాసం ప్లెజంటన్, కేలిఫోర్నియాలో. సైన్సు విషయాల మీద విశేషంగా తెలుగులో రాసేరు. యూనివర్సిటీ ఆఫ్ కేలిఫోర్నియా, బర్క్లి కేంద్రంలో తెలుగు పీఠం స్థాపించడానికి అవిరామంగా పాటుపడుతున్నారు.

# తొలిపలుకు

ఈ పుస్తకంలో ప్రచురణకి నేను రాసిన కథలలో పదునాల్గింటిని ఎంపిక చేసేను. ఈ ఎంపికలో వైవిధ్యతకి పెద్ద పీట వేసేను. కొన్ని పెద్ద కథలు, కొన్ని చిన్న కథలు. వీటిల్లో కొన్ని నిజంగా జరిగిన సంఘటనలని ఆధారంగా చేసుకుని అల్లిన కథలైతే కొన్ని పూర్తిగా కల్పితాలు. కొన్ని నేను ఎప్పుడో రాసినవి అయితే కొన్ని ఇటీవల రాసినవి. కొన్ని భారతదేశం నేపథ్యంలో రాసినవి, కొన్ని అమెరికా నేపథ్యంలో రాసినవి. కొన్ని పెద్దల కోసం రాసినవి, కొన్ని పిల్లల కోసం రాసినవి. ఒకటి కథ కానేకాదు.

ధర్మసంస్థాపనార్థం ఈ సంకలనంలో చేర్చిన కథలన్నిటిలోనూ పాత కథ. ఇది "తిరగేసిన" పత్తేదారీకథ; అంటే అర్థం ఏమిటో చదివితే మీకే తెలుస్తుంది. ఎమిలీ నిజంగా అమెరికాలో జరిగిన పత్తేదారీ కథ. అవధులు, ఉపతాపి నేర్పిన పాఠం, శృతిమించిన రాగం – ఈ మూడూ ఒక దృష్టితో చూస్తే పత్తేదారీ కథలే కాని ఇక్కడ పత్తేదారు వైద్యుడు. ఈ కథలలో వర్ణించిన సంఘటనలలో కల్పన లేదు. ఒక వైద్యుడి దగ్గరకి ఒకరు సలహా కోసం వెళ్లినప్పుడు ఆ వైద్యుడు రోగనిర్ణయం ఎలా చేసేడో చెప్పే కథలు ఇవి; నిజంగా జరిగినవి! మరోలోకం, తిరుగులేని ప్రయాణం, బొమ్మలూరు, శిక్ష – ఈ నాలుగూ పక్కా వైజ్ఞానిక కల్పనలు. ఈ కథలలోని కథావస్తువులు కాలాతీతాలు, అనుభవాతీతాలు. ఈ ఊహాచిత్రణలని చదివి ఆనందించాలంటే మనస్సుని అలవాటు పడ్డ పరిధి బయటకి పంపాలి. ఇవి పూర్తిగా కల్పించి రాసినవి. తరువాత వచ్చే పెళ్లి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు, బల్లి ఫలితం నిజంగా భారతదేశంలో – నా అనుభవంలో – జరిగిన సంఘటనలని ఆధారంగా చేసుకుని రాసినవి. అక్కడక్కడ పేర్లు మార్చడం జరిగింది కాని సంఘటనలలో కల్పన ఏమీలేదు. చివరి రెండింటిలో జాతక బలం చిన్న పిల్లలకి చెప్పడానికి వీలయిన కథ. చివరికి మిగిలిన "ఓ పెన్నీ, నా పెన్నీ" కథ కానేకాదు.

వేమూరి వేంకటేశ్వరరావు

ప్లెజెంటన్, కేలిఫోర్నియా, 2016

# ధర్మసంస్థాపనార్థం

1

ఇసక వేస్తే రాలనంత జనం ఉన్నారు. పత్రికల వాళ్లు. ఫోటోగ్రాఫర్లు...ఉహ్! ఒకరేమిటి! కోలాహలానికి కొదువ లేదు.

జడ్జీ గారు ఆయన గదిలోంచి బయటకు వస్తున్నారని తెలియజెయ్యడానికి డఫేదారు గాభరాగా ముందుకి వచ్చి అందరినీ నిశ్శబ్దంగా ఉండమని గొంతెత్తి అరిచేడు.

ధర్మరాజు ఆఖరి దమ్ము గట్టిగా లాగి, సిగరెట్టుని బూటు కాలి కింద వేసి గట్టిగా రాసేడు.

జడ్జీగారు వచ్చి కుర్చీలో కూర్చున్నారు. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దంగా అయిపోయింది కోర్టు. తీర్పు ఎటు తిరుగుతుందో అన్న ఉత్కంఠతో  ఇరు పక్షాల వారూ ఊపిరి బిగపట్టి కూర్చుని ఉన్నారు.

అటో, ఇటో తూగే తులాదండంలా ఉంది రవణ బతుకు. భవిష్యత్తు అంతా బండ పాలు అవుతుందేమోనన్న భయంతో బితుకు బితుకు మంటోంది అతని హృదయం.

గత రెండు నెలలబట్టీ జరుతూన్న తంతు వల్ల మానుతూన్న గాయం రేపినట్లయింది. ప్రతీకార వాంఛతో ఆమె హృదయం భగభగ లాడుతోంది. పండంటి తన కాపురంలో ఈ విధంగా చిచ్చు పెట్టిన కిరాతకుడు కఠినమైన శిక్ష పొందడం భగవదేచ్ఛగా భావిస్తోంది భారతి.

భారతి జమిందారు గారి కోడలు. జమిందారు గారు తన పలుకుబడినంతా ఉపయోగించి, పబ్లిక్ ప్రాసిక్యూటరు గారి చేత కేసు స్వయంగా నడిపిస్తున్నారు.

కంచు గంట లాంటి జడ్జి గారి కంఠం కోర్టు గదిలో ప్రతిధ్వనించింది: “నిందితుడు నిర్దోషి అని న్యాయస్థానం నిర్ణయిస్తున్నాది కనుక నిందితుడిని స్వేచ్ఛగా వదలి పెట్టవలసిందిగా పోలీసులకి కోర్టు వారు...”

నిశ్చలంగా, నిశ్శబ్దంగా కోర్టులో కూర్చున్న జనాలలో ఒక్క సారి చైతన్యం పెల్లుబికింది. తీర్పు విన్న భారతి స్థాణువులా నిశ్చేష్టురాలై కుర్చీలో కూలబడిపోయింది. పాలిపోయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముఖం వంక చూసింది, భారతి. తమకి అనుకూలంగా తీర్పు లభించకపోతే పై కోర్టులో అప్పీలు చేసుకునే హక్కు నిందితుడికి ఉంది కాని, ఇదే విధమైన హక్కు

నేరం మోపిన ప్రాసిక్యూషన్ వారికి లేదు. ఒక వ్యక్తిని, ఒకే నేరానికి, ఒకటి కంటె ఎక్కువ సార్లు కోర్టుకి ఈడ్చుకు వెళ్లే హక్కు ప్రాసిక్యూషన్ వారికి కాని, తద్రూపేణా భారతి కాని లేదు!

తనకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం జరగలేదు. తనెక్కడ? తన అంతస్తు ఎక్కడ? తన ఐశ్వర్యం  ఎక్కడ? ఇంత పరపతీ  కోర్టులో పనికొచ్చింది కాదు. ఇది సహించరాని విషయం.

"ఇది సహించరాని విషయం!"

తన మనస్సులోని మాటనే ఎవరో పైకి అంటూన్నట్లు భారతి చెవులకి వినిపించింది.. భారతి తల పైకెత్తి చూసింది.

"క్షమించాలి. న్యాయం వక్రించిందని మీరనుకుంటూ ఉంటే మీరు నాతో ఒకసారి మాట్లాడడం మంచిది. ఉభయత్రా మంచిది." అంటూ ధర్మరాజు తన విజిటింగ్ కార్డు భారతి చేతిలో ఉంచేడు.

అందమైన విగ్రహం. వేషభాషలు ఆకర్షణీయంగానే ఉన్నాయి. మంచి ఎత్తరి. సన్నని పెదాలు. ఫ్రెంచి కట్ మీసాలు. నల్లద్దాల కళ్లజోడు. చేతిలో ఉన్న కార్డు వైపు చూసింది భారతి.

"ధర్మం చర అండ్ కంపెనీ?!" ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం ఒకే గుక్కలో మేళవిస్తూ, విజిటింగ్ కార్డుని వేలితో చూపిస్తూ అడిగింది భారతి.

"ష్!" నిశ్శబ్దం అన్నట్లు చూపుడు వేలిని పెదాల మీద ఆనించి, "కొంచెం ఏకాంతంగా మాట్లాడుకుందాం, వస్తారా?"

జనాలని తోసుకుని ఇరువురు కోర్టులోంచి బయట పడ్డారు.

## 2

సి-వ్యు హొటేలు  వరండాలో కూర్చుని, సముద్రాన్ని చూస్తూ, కాఫీ తాగుతున్నారు ధర్మరాజూ, భారతీ!

ఉండబట్టలేక భారతే విషయాన్ని కదిపింది.

"నాకు కోర్టులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతాననేగా మీరనేది?"

భారతి కళ్లల్లోకి సూటిగా చూసేడు ధర్మరాజు. భారతి మంచి అందగత్తె! నాజూకైన విగ్రహం. ముప్ఫయ్ ఏళ్లయినా నిండని పండంటి నిండైన వయస్సు.

"చుడండి, భారతీ! వెన్నెల రాత్రులన్నీ ఇంకా ముందే ఉన్నాయి. పండు వంటి మీ జీవితాన్ని బుగ్గి చేసిన కిరాతకుడికి తగిన శాస్తి జరపాలని లేదా?" తన ప్రశ్నలో ఉన్న అంతరార్థం అందుకోమన్నట్లు భారతి వైపు చూశాడు ధర్మరాజు.

"కిరాయికి కూనీయా?" అనుమానంగానే అడిగింది.

ధర్మరాజుకి విపరీతంగా కోపం రాలేదు. ముఖం ఎర్రగా జేవురించనూ లేదు. లిప్తమాత్రపు కాలం నిశ్శబ్దంగా ఊరుకున్నాడు, ఏదో ఆలోచిస్తున్నవాడిలా.

"ఎర్ర సిరా చూస్తే నాకు ముఖం తిరుగుతుందని చెబితే మీరు నమ్ముతారా?"

"అయితే మీరనేది?"

"మీ కసి తీరడానికి అవకాశం కల్పిస్తానంటున్నాను."

"బెందడిలో రాయి మరొకరి చేత వేయిస్తానంటారు?"

ధర్మరాజు మెదలకుండా, మౌనంగా సముద్రం వైపు చూస్తూ కూర్చున్నాడు.

"ఈ పని చేయించినందుకు మీ ఫీజు?" భారతి కొంచెం అసహనంగా అడిగింది.

"పది వేలు!" కంగకుండా సమాధానం చెప్పేడు, ధర్మరాజు.

"అందులో అయిదు వేలు అడ్వాన్సుగా ఇమ్మంటారు. పని జరిగిన తరువాత మిగిలినది పుచ్చుకుంటారు. అవునా? ఆ అయిదు వేలూ పట్టుకుని మీరు ఉడాయిస్తే నేను దొంగాడికి తేలు కుట్టిన మాదిరి కిక్కురుమనకుండా...."

సన్నని ఫ్రెంచి కట్ మీసాల మధ్య నుండి ధర్మరాజు చిన్నగా నవ్వేడు. "నోట్లో ఉన్న మాట అందుకున్నారు. మనస్సులో మర్మం లేకుండా చెబుతున్నాను. నిజంగా నా పథకం అదే! అంటే, అడ్వాన్సు అడగడం మాట. ఉడాయించడం మాట కాదు. కాని మీకంత అపనమ్మకంగా ఉంటే అడ్వాన్సు ఇవ్వనక్కర లేదు. ఫలితం చూసిన తరువాత పది వేలూ ఒకే సారి ఇచ్చినా పరవా లేదు."

ధర్మరాజు ప్లేటు ఫిరాయించేసరికి భారతికి అనుమానం వేసింది. కిరాయికి కూనీ చేయిస్తానంటున్నాడు. అడ్వాన్సు ఇవ్వకపోయినా పరవా లేదంటున్నాడు. ఎర్ర సిరా చూస్తే చాలు ముఖం తిరుగుతుందంటున్నాడు. రౌడీలా, గళ్ల లుంగీ,

చెవిలో బీడీతో ఉన్నాడా అంటే అదీ లేదు. ఊదెస్తే పడిపోయేలా ఉన్నాడు. ఇటువంటి వ్యవహారాలలో ఆది నిష్టూరం మంచిదని అనుమానం వెళ్లగక్కింది, భారతి.

"మీ మాట మీరు నిలబెట్టుకున్న తరువాత మీకు నేను నామం పెడితే అప్పుడేమి చేస్తారు?"

"ఈ మాత్రపు విషయాలు ఆకళింపు చేసుకోకుండా మేము వ్యాపారంలో వారం రోజులు కూడ ఉండలేం. మాకు కావలిసినదల్లా మీ మాట. అంతే. తరువాత మీరు మాకు నామం పెడతానంటారా? పెట్టండి. రవణ లేడూ. ఇప్పటికే అతను మీకు ఒక నామం పెట్టేడు. పెట్టేడు అందామా, చెరిపేడు అందామా?...." అంటూ వాక్యం మధ్యలోనే ఆపేసి భారతి వైపు చూసేడు ధర్మరాజు. అతని కంఠంలో వ్యంగ్యం గోచరించలేదు కాని భారతికి ధర్మరాజు శక్తి సామర్ధ్యాల మీద శంక పోయింది.

"సరే! మీరు ఆరంభ శూరులు కారనిన్నీ, ఇదేమీ కుర్రకారు కొంటె వ్యవహారం కాదనిన్నీ నాకు నమ్మకం కుదిరింది. మీరు అడగకపోయినా నేనే అడ్వాన్సుగా అయిదు వేలు ఇస్తున్నాను," అంటూ భారతి చెక్కు పుస్తకం తీసి "ఎలా రాయమంటారు?" అని అడిగింది.

"నా పేరు మీదనే రాయండి. ఇందులో భయపడవలసినది ఏమీ లేదు. మా కంపెనీని పబ్లిక్ గా రిజిష్టరు చేయించి మరీ నడుపుతున్నాను," అని అభయం ఇచ్చేడు ధర్మరాజు.

భారతి చెక్కు రాసి ధర్మరాజు చేతికి ఇచ్చింది. చెక్కు అందుకుంటున్నప్పుడు అతని దరహాస వదనం వర్ణించడం అంత తేలిక కాదు.

## 3

అదే దరహాస వదనాన్ని వర్ణించడం ఎలాగో తలుపుచాటు నుండి చూస్తూన్న రవణకి కూడ అర్ధం కాలేదు. మసక మసకగా ఉన్న సంధ్య వెలుగులో ఆగంతకుని విగ్రహం లీలగా కనిపించింది, రవణకి.

"క్షమించాలి, రవణ గారూ! మీతో కొంచెం వ్యవహారం మాట్లాడడానికి వచ్చేను. కొంచెం లోపలికి రావచ్చా? మన సంభాషణ ఉభయత్రా శ్రేయస్కరమనే నమ్మకంతోనే వచ్చాను," అంటూ విజిటింగ్  కార్డు ఒకటి తలుపు సందులోంచి రవణకి అందించేడు ధర్మరాజు.

ధర్మరాజుని లోపలికి ఆహ్వానించకుండా బయటే నిలబెట్టి, గుడ్డిగా వెలుగుతూన్న కిరసనాయిలు దీపం పెద్దది చేసి ఆ కార్డుని పరికించి చూసేడు, రవణ.

"సత్యం వద — టేక్స్ స్పెషలిస్ట్ – రవణ" అని ముచ్చటయిన అచ్చులో తన పేరు కనిపించేసరికి ఆశ్చర్యంతో కనుబొమలు పైకెత్తి, ప్రశ్నార్థకంగా ధర్మరాజు వైపు చూశాడు రవణ.

"క్షమించాలి. మీ పెర్మిషను తీసుకోకుండా కార్డులు అచ్చు వేయించవలసి వచ్చింది. నేను మీకు ఇచ్చే ఉద్యోగం మీరు నిరాకరించరనే ధీమాతో విజిటింగ్ కార్డులు అచ్చు వేయించేసేను."

"ఉద్యోగం ఏమిటి?" కొంచెం కరుకుగానే వచ్చింది రవణ కంఠస్వరం.

"ష్! కొంచెం నెమ్మదిగా లోపల మాట్లాడుకుంటే...."

రవణ తలుపు పూర్తిగా తెరచి ఆగంతకుడిని లోపల ప్రవేశపెట్టేడు. ధర్మరాజు చుట్టూ కలయజూసేడు. గదిలో దరిద్రం తాండవిస్తోంది: నులక మంచం. కుంటి కుర్చీలు. కిరసనాయిలు దీపం.

"మిమ్మల్ని ఈ మధ్య ఎక్కడో చూసినట్లు ఉందే!" వెలుగులో స్ఫుటంగా కనిపిస్తూన్న వ్యక్తిని చూస్తూ అన్నాడు రవణ.

"కోర్టులో చూసి ఉంటారు. ఆఁ, అన్నట్లు నా పేరు ధర్మరాజు" అని తనని తాను పరిచయం చేసికుంటూ చెయ్యి ముందుకు చాచేడు. ఇద్దరూ కరచాలనం చెసేరు. ధర్మరాజు అక్కడున్న ఒక పాత కుర్చీని ముందుకి లాగి, దాని మీద తన జేబు రుమాలు పరచి, దాని మీద కూర్చున్నాడు.

"నా కథంతా కోర్టులో చూసి కూడ నాకు ఉద్యోగం ఇస్తానంటూ ముందుకి రాడానికి మీకు దమ్ములు ఎక్కడనుంది వచ్చేయి? ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుంది."

"మోసం?" ధర్మరాజు బిగ్గరగా నవ్వేడు. "ఒక వేళ జమీందారు హత్య కేసులో మీరే నిజంగా నేరస్తులైనా అదే నేరాన్ని నేను కాదు కదా ఆ బ్రహ్మ దేవుడు కూడా మీమీద మళ్లా మోపలేడు. మీ మీద కోర్టులో విచారణ జరిగిపోయింది. మీరు నిర్దోషి అని న్యాయస్థానం తీర్మానించింది. "ఈ తీర్మానం మాకు నచ్చ లేదు, మరొక సారి దావా వేస్తాం" అనడానికి ప్రభుత్వానికి హక్కు లేదు. ఇది లా పోయింటు.

“నేను ప్రతిపాదించేది మోసం కాదు. అవకాశం. మించితే దొరకని మంచి తరుణం. వారానికి రెండు వందలు జీతం. కంపెనీ కారులో తిరగడం. కేంపుకి వెళ్లినప్పుడల్లా రోజుకి పది రూపాయలు బేటా. మీరు కంపెనీకి తీసుకువచ్చిన లాభంలో కమిషన్. కారు ఖర్చులు మావే.”

రవణ ముఖంలో కళవళికలు మారతాయని ధర్మరాజుకి ఎప్పుడో తెలుసు. మారకేంజేస్తాయి?

“మాయ మర్మాలు లేకుండా ఈ కలికాలంలో బిళ్లకుడుములు లాంటి డబ్బులు ఎవరిస్తారండీ? కారిచ్చి, పెళ్లికొడుకులా తిరగమంటున్నారు. నేను చెయ్యవలసిన విధులన్నీ వివరంగా చెబితే కాని….” రవణ నీళ్లు నమలడం మొదలు పెట్టేడు. దొరికిన అవకాశం జారవిడుచుకోవాలని లేదు. ఉద్యోగం దొరకడమే గగనమైపోతూన్న ఈ రోజుల్లో సిరిరా మోకాలొడ్డడం మంచిది కాదేమో.

“మీ పరిస్థితి నేను అర్థం చేసుకోగలను. సత్యం వద అండ్ కో గురించి మరికొంచెం వివరంగా చెబుతాను. మా కంపెనీలో గుమస్తాలు, ఎక్కవుంటెంట్లు, బుక్ కీపర్లు, వగైరాలు చాలమంది ఉన్నారు. రోగులకి వైద్యులు ఎలాగో, వ్యాజ్యాలలో పడ్డవాళ్లకి వకీళ్లు ఎలాగో, అలాగే వ్యాపారస్తులకి మేము. మేము పది కాలాల బట్టి పాతుకుపోయి ఉన్న వాళ్లమి కాదు; మాది కొంచెం కొత్త కంపెనీ. కనుక మా ఉనికి, మేము చేసే సపర్యలు గురించి చాల మందికి తెలియదు. మీరు చెయ్యబోయే ఉద్యోగం వల్ల మా ఉనికి నలుగురుకీ తెలుస్తుంది. మీరు చెయ్యవలసిన పని చాల సులభం. ఊరూరుకీ వెళ్లి, ప్రత్యేకించి చిన్న ఊళ్లకి వెళ్లి, అక్కడ వ్యాపారస్తులని కలుసుకోవాలి మీరు. ఈ రోజులలో బ్లేక్ మార్కెట్ చెయ్యని వ్యాపారస్తుడూ, లంచాలు తినని ప్రభుత్వోద్యోగి కరువై పోతున్నారు కదా….”

“అందుకనే వీటిని కరువు రోజులు అన్నారు,” రవణ చమత్కరించేడు.

ఇద్దరూ ఒక సారి నవ్వుకున్నారు.

“ఒ. కె. ఎక్కడున్నాం? ఆఁ బ్లేక్ మార్కెట్, లంచాలు. ఈ రెండూ మన దేశాన్ని చెద పురుగుల్లా తినేస్తున్నాయి. వీటిని అరికట్టడం నా గమ్యం. ఇది ఒక విష చక్రం. మూడేసి నెలలకి ఒక సారి వచ్చే ఎ. సి. టి. ఒ. (అసిస్టెంటు కమర్షియల్ టేక్స్ ఆఫీసరు) గారికి ముడుపు చెల్లించుకోవాలి ప్రతి వ్యాపారస్తుడూ. ఏదో కమిషన్ వ్యాపారాలు చేసి, తూకాలలో రైతులని మోసం చేసి గణించే వారయితే వీరిని భరించగలరేమో కాని సామాన్యమైన చిన్న కారు వ్యాపారస్తుడు వీరిని భరించ లేడు. పోనీ ఎవడైనా ఒక ఎ. సి. టి. ఒ. మడిగట్టుకుని లంచాలు తినకుండా ప్రపంచాన్ని ఉద్ధరిస్తానంటే వాడిని

వారం రోజులలో బదిలీ చేయిస్తుంది. ఎవరని అడగరేం? వర్తక సంఘం లేదా చేంబర్ అఫ్ కామర్స్. 'ధర్మం చర' ఈ విషమ చక్రాన్ని ఆపి, విరగ్గొట్టి ధర్మాన్ని తిరిగి స్థాపించడానికి కంకణం కట్టుకుంది."

భారత యుద్ధంలో నరుడు నారాయణుడి మాట విన్నట్టే రవణ ధర్మరాజు మాటలు విన్నాడు. అవును మరి. ఇది నవ భారత యుద్ధం.

"మరి నాకు వ్యాపార వ్యవహారాల గురించి ఒ అంటే ఢం రాదే!"

"నువ్వు నిమిత్తమాత్రుడవేనయ్యా! రథం నడిపేది నేను. తోలుబొమ్మలాటలో సూత్రధారుడిలా, ఈ జగన్నాటకంలో భగవానుడిలా, ఈ ఉద్యోగ పర్వంలో సూత్రధారుడను నేనే. నేను చెప్పినట్లు మీరు చెయ్యడమే."

అయితే చెప్పమన్నట్లు రవణ మౌనంగా కూర్చుని వినడం మొదలుపెట్టేడు.

"మీరు చెయ్యవలసినదల్లా కాలి పని. ప్రతి ఊళ్లోనూ, ప్రతి దుకాణం దగ్గరకీ వెళ్లడం. ప్రతి వ్యాపారస్తుడూ నిరాకరించలేని విధంగా 'బేరం' ఎరగా చూపించడం. మనతో సహరించిన వాళ్లని రక్షించడం. సహాయం నిరాకరించిన వాళ్లని శిక్షించడం."

కురుక్షేత్ర రణరంగంలో గీతోపదేశం చేస్తూన్న కృష్ణ భగవానుడి చెంత కూర్చుని వింటూన్న అర్జునుడిలా రవణ వింటున్నాడు. ధర్మరాజు గుక్కెడు నీళ్లు తాగి చెప్పడం కొనసాగించేడు.

"మీరు ప్రతి వ్యాపారస్తుడి దగ్గరకి వెళ్లి గత అయిదేళ్ల చిట్టా ఆవర్జాలు మన కంపెనీ తనిఖీ చెయ్యడానికి ఇమ్మని అడుగుతారు. అలా అడగగానే వారు మీకివ్వాలంటే వారికి ఏదో లాభం చూపించాలి. ఆ పుస్తకాలు మీరు మన కంపెనీకి పంపితే అక్కడ మన నిపుణులు వాటిని తనిఖీ చేసి, జమాబందీలు సరి చూసి, ఏదో ఒక విధంగా ఆ వ్యాపారస్తుడికి లాభించేలా సలహాలు ఇస్తారు. ప్రభుత్వంవారికి అనవసరమైన అదనపు పన్నులు చెల్లించకుండా ఆదా చెయ్యాలంటే ఏమిటి చెయ్యాలో, లంచాలు ఇవ్వకుండా తప్పించుకోవాలంటే ఏమి చెయ్యాలో, వగైరాలన్నీ వాళ్లకి మనం చెబుతాం. మన సహాయం వల్ల వారికి కలిసొచ్చిన డబ్బులో సగం మన ఫీజు. వాళ్లకి కలిసొచ్చేది ఏదీ మనం చెయ్యలేక పోతే మనకి ఫీజు లేదు, వాళ్లకి నష్టం లేదు. ఎలాగూ చెయ్యగలిగేది ఏదీ లేదని ఆశ వదలిపెట్టుకున్న వాడికి లాభం చూపెడతామని ఆశ పెడుతున్నాం. ఆశ బలమైన ఎర.

పెద్ద పెద్ద కమిషన్ వ్యాపారస్తులు ఉంటారు కదా. వాళ్లు మనకి సహాయం చెయ్యడానికి నిరాకరిస్తారు. మనకి వాళ్ల కాటా లెక్కలు చూపించడానికి, మన తనిఖీలకి ఇష్టపడరు. మనం ప్రభుత్వపు సిబ్బందిమి కాదని తెలిస్తే అస్సలు ఇష్టపడరు. వీరంతా ఇంటి గుట్టు రచ్చకెక్కించడం అంటే ఇష్టం లేని వాళ్లు. వీళ్లేదో దాస్తున్నారన్నమాటే కదా. వాళ్ల పేర్లు, చిరునామాలు సేకరించి మీరు మన హెడ్డాఫీసుకి పంపాలి. మేము కలెక్టరుగారికి ఒకటి, సి. టి. ఒ. గారికి ఒకటి, అవసరమైతే విజిలెన్సు ఆఫీసుకొకటి రాసి పడేస్తాం. ఈ రకంగా ఊళ ఊది పట్టించినందుకుగాను ప్రభుత్వం మనకి పారితోషికం ఇస్తుంది. ఈ వేటలో లంచాలు తినే ఎ. సి. టి. ఒ. లు ఎవ్వరో మనకి తెలుస్తారు. వాళ్ల పేర్లు కూడ కలెక్టరుకి ఒకటి, విజిలెన్సు ఆఫీసుకి ఒకటి రాసి పడెస్తాం."

"ఈ పని చేసినందుకు వారానికి రెండు వందలా?"

ఈ ప్రశ్నకి సమాధానంగా రెండు వంద రూపాయల కాగితాలు రవణ చేతిలో పెట్టేడు ధర్మరాజు. "ఇది మొదటి వారం జీతం. ముందు మీరు ఈ వేషం మార్చాలి. నా స్వంత టెయిలర్ దగ్గరకి వెళ్లి ఒక సూటు కుట్టించుకొండి. డబ్బు సరిపడకపోతే నేను చెప్పేనని చెప్పి బకాయి పెట్టండి. వారం రోజులలో మళ్లా కలుసుకుందాం," అని చెప్పి, రవణ అంగీకారం కోసం కాసుక్కూర్చోకుండా ధర్మరాజు బయట ఉన్న చీకటిలోకి వెళ్లిపోయాడు.

స్థాణువులా నిలబడిపోయాడు రవణ. నిన్నటి వరకు చావు బతుకుల మధ్య ఊగిసలాడింది అతని జీవితం. జైల్లో మగ్గి, కోర్టుల వెంట తిరిగి అతని మెదడు మొద్దుబారి పోయింది. రవణ అందరిలాంటి వాడు అయితే అసలు జెయిలుకే వెళ్లేవాడు కాదు. అతనిలో కొంత 'ఒరిజినాలిటీ' లేకపోలేదు. ఈ అవకాశాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకుందామా అని అతని మస్తిష్కం ధర్మరాజు ప్రణాళికకి పై ఎత్తులు వెయ్యడం ఎలాగా అని ఆలోచనలతో పరుగులు తీస్తోంది. ఇంత పకడ్బందీగా ఉన్న ఊహ తన బుర్రకే ఇంతకు పూర్వం తట్టనందుకు తనని తనే నిందించుకున్నాడు.

4

గత రెండు వారాలబట్టీ కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది భారతి. ఎక్కడెక్కడికో కాదు. తన స్వంత ఇంట్లోనే. అప్పటికే ధర్మరాజుకి అయిదు వేలు ఇచ్చి దరిదాపు రెండు నెలలు కావస్తోంది. మరి ధర్మరాజు ఫికరు లేదు. గోరుచుట్టు మీద రోకటి పోటులా ప్రాణ నష్టానికి తోడు ధన నష్టం కూడానా? చేసుకున్నదానికి చేసుకున్నంత మహదేవా అని చేతులు కడిగేసుకుని ఊరుకోవలసిందో ఏమో! ధర్మరాజు ఆ రోజు కోర్టులో ఇచ్చిన విజిటింగ్ కార్డు వెతికి అతనికి ఫోను చేసింది.

“హలో!” అటు నుండి తియ్యని కంఠం.

“ధర్మరాజు గారితో అర్జంటుగా మాట్లాడాలి,” గదమాయిస్తూన్న స్వరంతో అడిగింది, భారతి.

“సారీ, ధర్మరాజు ప్రస్తుతం ఆఫీసులో లేరు. మీరెవరో చెప్పి, మీ నంబరు ఇస్తే ఆయనకి కబురు అందజేస్తాను.”

“నా పేరు భారతి. కబుర్లూ, కాకరకాయలూ….”

“దయచేసి ఒక్క నిమిషం ఆగండి.”

ఒక క్షణం నిశ్శబ్దం. టెలిఫోను అవతలపక్క నేపథ్యంలో కాగితాలు కదలుతూన్న చప్పుళ్లు, టైపు యంత్రాల చప్పుళ్లు వినిపిస్తున్నాయి.

“ఇదేదో ఆఫీసులా ఉందే! అయితే ధర్మరాజుకి నిజంగానే ఆఫీసు, సెక్రటరీలు, పటాటోపం ఉన్నాయన్న మాట!” భారతి స్వగతంగా అనుకుంది.

“ఓ! మీరా! భారతి అంటే పీపుల్ వెర్సస్ రవణ కేసులో…” మరొక కంఠం టెలిఫోనులో మాట్లాడుతోంది.

భారతికి ధర్మరాజు మీద అపోహ పోయి కొంచెం సద్భావం ఏర్పడడం మొదలెట్టింది. ఇంత ఆఫీసు, పటాటోపం పెట్టుకుని అయిదు వేల కోసం పారిపోతాడా? ధర్మరాజు మీద కోపం తగ్గింది. కాని అతనితో మాట్లాడాలన్న కోరిక పోలేదు.

“అవును. ధర్మరాజు గారిని అర్జంటుగా కలుసుకోవాలంటే ఇప్పుడు ఎక్కడ దొరుకుతారు?”

“ఈ రోజు ఫరూకుద్దీన్ కేసు తీర్పుకి వచ్చింది. అందుకని ధర్మరాజు గారు కోర్టుకి వెళ్లేరు.”

“అయితే కోర్టుకి వెళ్లి కలుసుకుంటాను.”

“క్షమించాలి. మీకు అంత తొందరగా ఉంటే ఈ మధ్యాహ్నం ఒంటి గంటకి ఆఫీసుకి రాండి. ఆ సమయంలో ధర్మరాజు గారు మిమ్మల్ని చూసే ఏర్పాటు చేస్తాను,” అంటూ దారి లోకి వచ్చింది సెక్రటరీ.

భారతికి బుర్ర తిరిగిపోతోంది. కిరాయికి కూనీలు చేయించే ధర్మరాజుకి ఆఫీసు, సెక్రటరీ, భేషజమూ, పటాటోపమూనా? అమ్మ ధర్మరాజూ! మళ్లా కోర్టుకి వెళ్లేడంటే మరొక కేసు ధర్మం చర! వారికి.

కారులో, ధర్మరాజు ఆఫీసు వెతుక్కుంటూ, వెళ్లింది, భారతి. ఆఫీసు అంతా స్టయిల్ గానే ఉంది. వరండా మీద నడుస్తూ ఉంటే ఒక పక్క రకరకాల ఆఫీసులు ఉన్నాయి. ఒక తలుపు మీద "శరణం గచ్ఛామి!" అనిన్నీ, మరొక తలుపు మీద "సత్యం వద!" అనీ కనిపించేయి. ఇదేదో బౌద్ధ ఆరామమో, వేదాంత ఆశ్రమమో అయి ఉండాలి అనుకుంటూ ఉండగానే తరువాత తలుపు మీద "ధరం చర!" అని కనిపించింది. ఆ తలుపు తీసుకుని లోపలికి వెళ్లింది భారతి.

లోపల వయ్యారాలు ఒలకబోస్తూ బల్ల దగ్గర ఒక అమ్మాయి కూర్చుని ఉంది. స్వాగతభాషిణి కాబోలు. భారతిని పలకరించి, కూర్చోబెట్టింది. మరో ఇద్దరు ఎవరికోసమో నిరీక్షిస్తూ కూర్చుని ఉన్నారు. కొద్ది క్షణాలలో భారతికి పిలుపు వచ్చింది. ధర్మరాజు ఆఫీసు గదిలోకి వెళ్లింది.

"మీకు నా మీద చాల కోపంగా ఉందని విన్నాను."

"కోపమా! ఒళ్లు మండుతూ ఉంటే!! అయిదు వేలూ చెల్లించుకున్నాను. ఇంతవరకు ఆవగింజంత కదలిక అయినా లేదు."

"మీరలా తొందరపడితే ఎలా? మనం చెయ్యవలసిన పనులన్నీ చేసేం. వల పన్ని కాపలా కాస్తున్నాను. ప్రణాళిక పక్వానికి రాగానే పిట్ట దానంతట అదే చిక్కుతుంది."

"వలో! వల్లకాడో!! రెండు నెలలయింది."

"అమ్మమ్మ! ఎంత మాటన్నారు. మీకు నా సమర్ధత మీద నమ్మకం లేకపోతే నేనేమి చేసేనో చెబుతాను. దానిలోని బాగోగులు మీరే నిర్ణయించి చెప్పండి," అంటూ ధర్మరాజు సొరుగు లోంచి ఒక మేపు తీసేడు. దాని మీద ఎర్ర సిరాతో ఒక మార్గం గుర్తించబడి ఉంది. ఆ మేపుని బల్ల మీద పరచేడు. భారతి ఆత్రుతతో చూస్తోంది.

"ప్రస్తుతం రవణ 'సత్యం వద!' అనే కంపెనీలో పని చేస్తున్నాడు. వాళ్ల ఆఫీసు ఈ పక్కనే ఉంది. మీరు దారిలో చూసే ఉంటారు. ఈ ఉద్యోగం నేనే వేయించేను." ధర్మరాజు భారతి వైపు చూసేడు.

భారతి ఏమీ అనలేదు. ఆ మేపు వైపే చూస్తోంది. దాని మీద అక్కడక్కడ ఎర్ర సిరాతో సున్నలు చుట్టబడి ఉన్నాయి. అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, కోటనందూరు, తుని, పిఠాపురం, కాకినాడ.. ఇలా కొన్ని ఊళ్ల  చుట్టూ సున్నలు ఉన్నాయి. ఆ సున్నలని కలుపుతూ మందపాటి ఎర్రని గీత కనిపిస్తోంది.

“ఉద్యోగరీత్యా రవణ ఇలా సున్నలు చుట్టిన ఊళ్లల్లో కేంపు వేసి ఆ చుట్టుపట్ల ఉన్న పల్లెటూళ్లన్నీ చూసుకుంటాడు,” మేపుని చూపిస్తూ ధర్మరాజు  మాట్లాడుతునాడు. “ప్రతీ ఊళ్లోనూ చిట్టాలు తనిఖీ చేస్తానని వ్యాపారస్తుల దగ్గరకి వెళ్తాడు. తనిఖీకి ఒప్పుకున్నవాళ్లకి వ్యాపారపు పన్నులు తగ్గే ఉపాయాలు — చట్టబద్ధమైనవే — మా కంపెనీ సూచిస్తుంది. తనిఖీకి ఒప్పుకోని వాళ్ల పేర్లు మాకు పంపుతాడు. అప్పుడు ఆ పేర్లు మేము ప్రభుత్వానికి తెలియజేస్తాం. దొంగ వ్యాపారాలు చెయ్యని వాళ్లు, పుస్తకాలలో లెక్కలు సవరించని వాళ్లు ఎక్కడున్నారు? కూనీలు జరగడానికి ఈ పరిస్థితి చాలు.

“మనకి కావలసిన పని ఢోకా లేకుండా జరగడానికి మరొక ఎత్తు కూడ వేసేను. ఈ పక్క గదిలో “శరణం గచ్ఛామి!” అనే డిటెక్టివ్ కంపెనీ ఒకటి ఉంది. వాళ్ల తాలూకు మనుష్యులు ఇప్పుడు రవణని నీడలా వెంబడించి తిరుగుతున్నారు. రవణ వెళ్లిన ప్రతి ఊళ్లోనూ, రవణ వెనక, రవణ మీద, దుష్ప్రచారం చేస్తారు వీరు.”

“ఏమని?”

“మరేమీ లేదు. రవణ నిజానికి ప్రభుత్వం వారి సి. ఐ. డి. అనిన్నీ, అతనితో ఏ విధంగా మాట్లాడినా చిక్కేననిన్నీ, అతను నల్ల వ్యాపారం చేసే వర్తకులకీ, లంచాలు తినే ప్రభుత్వోద్యోగులకీ కొరకంచు లాంటి వాడనీ, చీడ పురుగనీ, ప్రచారం చేస్తారు. ఈ రకం వాతావరణంలో, పల్లెటూళ్లలో పీకలు ఉత్తరించుకు పోతాయి. వల విసిరేము. ఎర పెట్టేము. ఈ క్షణంలో రవణ మీద ఎవరో ఒకరు కత్తి నూరుతూ ఉంటారని నేను మీకు హామీ ఇస్తున్నాను. దేశం గొడ్డుపోలేదు. మనం కొంచెం ఓపిక పట్టాలంతే.”

ధర్మరాజు అంతా ఓపికగా అరగంట సేపు వివరించి చెప్పేడు. “కోర్టుకి వేళవుతోంది, వెళ్లాలి” అంటూ బిరబిరా బయటకి వెళ్లిపోయేడు.

భారతి మేపుని చేతిలోకి తీసుకుని పరికించి చూసింది. ఆ మేపులో ఉన్న ప్రోగ్రాం ప్రకారం రవణ నర్సీపట్నం వదలి, కోటనందూరు మీదుగా తుని వస్తాడు. తుని తాలూకా కూనీలకి, కుట్రలకి ప్రసిద్ధి అని జమిందారుగారి కోడలు భారతికి తెలుసు. అసలు అక్కడ జరిగిన కూనీలు సగానికి పైగా కోర్టుకి ఎక్కవు. కోర్టుకి ఎక్కినా ప్రాసిక్యూషన్ వారు నెగ్గరు. సాక్షులు దొరకరు. అప్పుడప్పుడు శవం కూడ కనబడదు. ఈ విషయాలన్నీ భారతికి తెలుసు. సంతృప్తిగా తల పంకించి, ఆ మేపుని యధాలాపంగా తీసుకుని, చేతి సంచిలో పెట్టుకుని, బయటకు వెళ్లిపోయింది, భారతి.

మసక చీకటిలో బాణంలా దూసుకు పోతూన్న కారులో అదే విధంగా మరొక సారి తల పంకించింది, భారతి! తన సాహస సామర్ధతలకి తనకే ఆశ్చర్యం వేసింది. ఇంకా పొగలు కక్కుతూన్న పిస్తోలు మీద వేలు ముద్రలు లేకుండా

తుడిచేసి, ఉరకలు, పరుగులతో ప్రవహిస్తున్న తాండవ నదిలో దానిని గిరవాటు వేసి, విశాఖపట్నం వైపు తిరుగు ముఖం పట్టింది భారతి. ఇంటికి రాగానే నిద్ర మాత్రలు వేసుకుని పక్క మీద మానులా వాలిపోయింది.

5

మరునాడు మధ్యాన్నం మూడు గంటలకి టెలిఫోను మోగిన చప్పుడుకి భారతికి మెలుకువ వచ్చింది. నిద్ర మాత్రల మత్తులో ఉన్న భారతి చెవులకి ధర్మరాజు గొంతుక దుందుభిలా వినిపించింది. అతని కంఠంలో ఆరాటన కంచు కాగడా వేసి వెతికినా లేదు. ఎంతో ప్రశాంతంగా, వ్యాపార ధోరణిలో, గత రాత్రి రవణని ఎవరో హత్య చేసేరనీ, ఆ వార్త తనకి అప్పుడే తెలిసిందనీ, కనుక ఇటుపైన భారతి ఏ విధమైన బెంగా పెట్టుకోవలసిన అవసరం  లేదనీ ఈ వార్త పేపరులో చూసుకుని నిర్ధారించుకున్న తరువాత ఎకౌంటు సరి చూసుకో వచ్చనిన్నీ ధర్మరాజు చెప్పేడు. వీలయితే సి వ్యు హొటేలుకి సాయంత్రం ఆరింటికి ఒక సారి రమ్మని కూడ చెప్పేడు.

సి వ్యు హొటేల్ లో, సముద్రాన్ని చూస్తూ, కాఫీ తాగుతున్నారు, భారతీ, ధర్మరాజూ. భారతి అయిదు వేల రూపాయలకి చెక్కు రాసి ధర్మరాజుకి అందించింది.

ధర్మరాజు కూడ చాల ఉషారుగా ఉన్నాడు. ఆ రోజు ఫరూకుద్దీన్ దోషి అనిన్నీ, అతనికి కఠిన శిక్ష విధించాలనిన్నీ కోర్టు తీర్మానించింది. ధర్మరాజు ఫరూకుద్దీన్ తో మాట్లాడేడు. ఈ కఠిన శిక్ష తప్పించుకోవాలంటే అసలు దోషి ఎవరో కనుక్కోవాలి. ఆ పని తను చేసి పెడతానని హామీ ఇచ్చేడు ధర్మరాజు. కొద్ది క్షణాల క్రితమే ఫరూకుద్దీన్ తరఫు వాళ్లు ధర్మరాజుకి అయిదు వేలు అడ్వాన్సు ఇచ్చి వేళ్లేరు. ఈ విషయమే ధర్మరాజు మాట్లాడుతున్నాడు, భారతితో.

తను ఎంత ప్రమాద పరిస్థితిలో ఉందో భారతికి తెలుసు. ఆవేశంతో వచ్చిన మొండి ధైర్యం సడలిపోయింది. ఇప్పుడు భారతికి ధర్మరాజు అవసరం చాల ఉంది. సిగ్గు విడచి అడిగింది.

"ధర్నరాజు గారూ! మిమ్మల్ని మొదటిసారి చూసిన దగ్గర నుండి, మీతో మాట్లాడిన దగ్గర నుండి______ చూడండి. నాకా అందం ఉంది. అయిస్వర్యం ఉంది___. మీరా బ్రహ్మ చారులు. మనిద్దరం పెళ్లి___."

"పెళ్లా! కూనీ కోరునా? నేనా! చేసుకోవడమా?"

భారతి స్థాణువులా ఉండిపోయింది.

**కథ వెనుక కథ**

ఇది కేవలం కల్పిత కథ.

ఆంధ్ర సచిత్ర వార పత్రిక, 4 ఫిబ్రవరి, 1972

సిలికాన్ ఆంధ్ర వారి సుజనరంజని, ఆగస్టు 2013

http://www.siliconandhra.org/nextgen/sujanaranjani/aug13/index.html

# ఎమిలీ

1

ఎముకలు కొరికే చలిలో నడవడం కష్టంగానే ఉంది. వేళ్లు కొంకర్లు పోవడం మొదలెట్టేయి. ఇంకా ఏడెనిమిది వీధులు దాటితే కాని నేను అద్దెకి తీసుకున్న గది ఉండే వీధి రాదు. అంత దూరం ఆ చలిలో ఒక్క పెట్టున ఎలాగూ నడవలేనని నాకు తెలుసు. అందుకని దారిలో ఉన్న చిన్న కాఫీ షాపులో దూరేను. మన దేశంలో వేసవిలో చలివేంద్రాలు ఎలాంటివో నాకు ఈ దేశంలో చలికాలంలో కాఫీ షాపులు అలాంటివి. పది పెన్నీలు ఇస్తే ఎన్ని కప్పులు కావలిస్తే అన్ని కప్పులు వేడివేడి కాఫీ పోసేవారు.

తాపీగా రెండు కప్పులు కాఫీ తాగేసి, ఒళ్లు వెచ్చబడ్డ తరువాత మళ్లా వీధి వెంబడి నడవడం మొదలు పెట్టేను. జోరుగా నడిస్తే గడ్డకట్టిన మంచు మీద కాలు జారే ప్రమాదం ఉంది. నెమ్మదిగా నడిస్తే చలి గుండెల్లోకి దూసుకుపోతోంది. సగం దూరం నడిచిన తరువాత చిన్న షాపు కనిపించింది. కొద్ది క్షణాలు తల దాచుకోవచ్చనే తలపుతో తలుపు తోసుకుని లోపలకి జొరబడ్డాను.

టింగుమని గంట కొట్టింది.

కొద్ది సేపట్లో ఒక పెద్దాయన – అరవై ఉంటాయేమో – వచ్చి ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి నా వైపు చూసేడు.

చలితో బిగుసుకుపోయిన నోరు తెరచి మాట్లాడడానికి ఒక నిమిషం పట్టింది. ఇటూ, అటూ చూస్తూ "ఇదేదో షాపు అనుకున్నాను, ఆఫీసులా ఉందే?" అన్నాను.

"ఇది షాపే. లోపలికి రా."

షాపులో చుట్టూ కలయచూసేను. అమ్మకానికి పెట్టిన సరుకులు ఏవీ కనిపించలేదు. కొనుక్కోడానికి వచ్చిన మనుష్యులూ కనిపించలేదు.

"ఈ షాపులో ఏమిటి అమ్ముతారేమిటి?"

“ఆనింగ్స్”

“అంటే?”

“ఎండ తగలకుండా ఉండేందుకు కొందరు కిటికీలకీ, ద్వారాలకి ముందు ఖాకీ గుడ్డ లాంటి బట్టతో చేసిన కప్పు ఒకటి కడతారు” అంటూ తన దగ్గర ఉన్న బొమ్మల కేటలాగు ఒకటి తెరచి రెండు, మూడు బొమ్మలు చూపించేరు ఆయన.

పంచపాళీలా కట్టిన చాందినీని ఆనింగ్ అంటారని బోధపడింది. వీళ్ల బేరాలన్నీ ఎండాకాలంలోనే తగులుతాయి కాబోలు; అందుకనే షాపు ఖాళీగా ఉంది. కాలం కాని కాలంలో నేను చాందినీలు ఎలాగూ కొనే బాపతు కాదని అతనికి తెలిసిపోయింది కనుక లోపలికి వెళ్లి ఇబ్బంది పెట్టినందుకు క్షమార్పణ చెప్పుకుని బయటకి నడవబోయాను.

“బయట బాగా చలిగా ఉంది. కొద్ది సేపు లోపల కూర్చోవాలని ఉంటే కూర్చో, మాకు అభ్యంతరం లేదు.” అంటూ నా ఆంతర్యాన్ని గ్రహించిన అతని భార్య బార్బరా లోపలి గదిలోంచి ముందు గదిలోకి వచ్చింది.

బార్బరా, రాబర్ట్ ప్లంబ్ – ఈ దంపతులిద్దరూ చేసే ఉద్యోగం తన్యత లేని చిన్న వ్యాపారం. ఏదో కాలక్షేపానికి చేస్తూన్న వ్యాపారమే కాని వారి జీవనోపాధి దీని మీద ఆధారపడి లేదని తెలుస్తూనే ఉంది. రోజూ నన్ను ఒక సారి షాపు దగ్గర ఆగి పలకరించి పోతూ ఉండమని ఆహ్వానించేరు. నా కబుర్లు వినేవారు, వారివి చెప్పేవారు.

చలికాలం వెళ్లి వసంతం వచ్చింది. వసంతం వెళ్లి వేసవి రాబోతూంది. నా చదువు పూర్తి కావచ్చింది కాని ఉద్యోగం ఎక్కడా దొరకలేదు. విద్యార్థి వీసా మీద ఉన్న నేను ఉద్యోగం చెయ్యడానికి ప్రభుత్వం ఒప్పుకోదు. ప్రేక్టికల్ ట్రెయినింగ్ అంటే ఒప్పుకుంటారు కాని దానికి ముందు ఏదో కంపెనీలో ఉద్యోగం దొరకాలి. కనుక ఏదైనా చిన్న ఉద్యోగం లాంటిది దొరికితే ఆ అనుభవాన్ని పురస్కరించుకుని మరొక ఉద్యోగం వెతుక్కోవచ్చు. అందుకని ఉద్యోగం వెతకడానికి బాబ్ ని సహాయం చెయ్యమని అడిగేను. ఉద్యోగం కావాలంటే మనకి ఏమి తెలుసో కంటె మనకి ఎవరు తెలుసో ముఖ్యం.

బాబ్ రెండు మూడు ఇంజనీరింగు కంపెనీలలో ప్రయత్నాలు చేసేడు కాని ఫలించలేదు. కారణాలు అనేకం. ఒక రోజు బాబ్ షాపు పక్క నుండి నడుస్తూ ఉండగా బాబ్ గుమ్మంలో నిలబడి ఎవ్వరితోటో – టాప్ కోటూ, హేటూ పెట్టుకున్న వ్యక్తితో – మాట్లాడుతున్నాడు. బాబ్ నన్ను చూసి దగ్గరకి రమ్మని సైగ చేసేడు. వెళ్లేను.

“పాల్! ఈ కుర్రాడిని నాకు బాగా తెలుసు. ఆ ఉద్యోగం ఏదో ఈ కుర్రాడికి ఇవ్వరాదూ. ఫారిన్ స్టూడెంటనీ, వీసా, గీసాలు అనీ పెట్టుకోకు. నీకు తోచినది, రొక్కం, అతని చేతులో పెట్టు.” అని అతనితో చెప్పి, నా వైపు తిరిగి,

“రావ్! ఇతని దగ్గర ఏదో చిన్న ఉద్యోగం ఉంది. పెద్దా, చిన్నా అని అక్షేపించకుండా అతనికి సాయం చేస్తూ ఉండు. వారానికో రెండు గంటలు కంటె ఎక్కువ పని ఉండదంటున్నాడు. నీ చదువుకా ఆటంకం రాదు. అతనిచ్చే డబ్బులు సినిమా ఖర్చులకి సరిపోతాయి కాని ఈ అనుభవంతో మంచి ఉద్యోగం దొరకొచ్చు.”

“ఏ పని చెయ్యాలేంటి?”

“వారానికో రోజు, వీలునప్పుడు ఈ ఆఫీసుకి వచ్చి, నాకు వచ్చే ఉత్తరాలన్నీ విప్పడం, చదవడం, అందులో నాకు పనికొచ్చేవి ఒక పోగు లోను, పనికిమాలినవిగా తోచినవి మరొక పోగు లోను పేర్చాలి. నేను ఆఫీసులో ఉన్నా, లేకపోయినా ఈ పని చేసి వెళిపోతూ ఉండాలి. అదీ పని. గంటకో మూడు డాలర్లు చొప్పున వారం, వారం ఇచ్చేస్తాను. నీ పని నచ్చితే కొత్త బాధ్యతలు కూడ ఇస్తాను.”

“మీరు చేసే ఉద్యోగం ఏమిటి?”

“నాది పత్తేదారీ పని. ఇదిగో నా కార్డు.”

“పాల్ డ్రేక్, డ్రేక్ డిటెక్టివ్ ఏజెన్సీ” అని ముచ్చటగా ముద్రించబడి ఉంది.

“పెరీ మేసన్ కల్పన అనుకున్నాను. మీరు నిజంగా పెరీ మేసన్ తో పనిచేస్తారా?” ఇంతింత కళ్లు చేసుకుని ఆశ్చర్యం ప్రకటిస్తూ అడిగేను.

“పెరీ మేసన్ కల్పనే. నేను మాత్రం కల్పన కాదు.”

డిటెక్టివ్ వాలి, ఆశ్వద్ధామ, అరీందం వగైరాలు గుర్తుకొచ్చారు. సైన్సులో మేము చేసే రిసెర్చి కూడ డిటెక్టివ్ పనే! గంటకి మూడు డాలర్లు తక్కువేమీ కాదు. అప్పుడు అమలులో ఉన్న కనిష్ఠ వేతనానికి రెట్టింపు. యూనివర్శిటీ వాళ్లు ఇచ్చే విద్యార్థి వేతనంతో పోల్చినా ఎక్కువే. వెంటనే పనికి ఒప్పేసుకున్నాను.

## 2

పనిలో చేరి నెల్లాళ్లు కావస్తోంది. పాల్ కి వచ్చే ఉత్తరాలని రెండు కాదు, మూడు వర్గాలుగా విడగొట్టడం మొదలు పెట్టేను. జమాఖర్చులకి సంబంధించినవి ఒక వర్గం. భార్యాభర్తలు ఒకరంటే ఒకరికి పడక ఒకరి మీద మరొకరు నిఘా వెయ్యడానికి ఉద్యుక్తులయేవారి వద్దనుండి వచ్చిన ఉత్తరాలు రెండవ వర్గం. తప్పిపోయిన పిల్లలు, అప్పులాళ్ల నుండి,

పెళ్లాల నుండి పరారయిన వ్యక్తులు, వగైరాల గురించి ఆచూకీల వ్యవహారాలు మూడవ వర్గం. ఖూనీ కేసులు, వంటి భారీ వ్యవహారాలు గురించి ఎవ్వరైనా వాకబు చేస్తే తన స్నేహితుడికి అప్పగించేసేవాడు, పాల్.

పని ఒక గాడిలో పడి సాగిపోతూన్న తరుణంలో, ఆర్ట్ జాన్సన్ అనే వ్యక్తి దగ్గరనుండి చేత్తో రాసిన రెండు పేజీల ఉత్తరం ఒకటి వచ్చింది. ఆ ఉత్తరం సారాంశం ఇది –

"నమస్కారములు. నేను ఏన్ ఫుల్లర్ ని 1957 లో వివాహం చేసుకున్నాను. మొదటి భర్త కొరియా యుద్ధంలో మరణించిన తరువాత తనొక్కతీ తన ఎనిమిదేళ్ల కూతురు ఎమిలీని సాకలేక – మా వివాహానికి నాలుగేళ్ల ముందు – ట్రోయ్, మిషిగన్ లో , ఒక అనాధాశ్రమంలో వదిలేసి ఎవరికైనా పెంపకానికి ఇచ్చెయ్యవచ్చని ఆ పిల్ల మీద సర్వహక్కులనీ వదులుకుంటూ హామీ పత్రం రాసి ఇచ్చేసింది. తనకున్న ఒకే ఒక బిడ్డతో ఇలా బంధాలన్నీ తెగతెంపులు చేసుకున్నందుకు తరువాత ఎంతగానో చింతించింది. ఎమిలీ జాడ ఎలాగైనా కనుక్కుని నా ఏన్ కి కూతురిని కలుసుకోవాలన్న కోరిక తీర్చాలని ఉంది,_ _ _ ."

అంటూ జాన్సన్ పెద్ద ఉత్తరం రాసి, ఏడుస్తూన్న ఎమిలీని బుజ్జగించడానికి "చిట్టితల్లివి కదూ, నేను త్వరలోనే వచ్చి నిన్ను మళ్లా తీసుకువెళతాను" అంటూ ఏన్ అన్న ఆఖరి మాటలు గుర్తు చేసుకుంటూ ఉత్తరాన్ని ముగించేడు.

ఆ ఉత్తరంలో జాన్సన్ ఎమిలీ రూపు రేఖలని వర్ణించి చెప్పేడు. బక్కపలచని శరీరం. చిన్న విగ్రహం. జొన్నపొత్తు పీచులా బంగారు రంగులో జుత్తు. నీలం కళ్లు. చిన్నతనంలోనే పాటలు బాగా పాడేదని ఒక అంశాన్ని గుర్తు చేసేడు. అనాధాశ్రమంవారు కూడ ఎమిలీకి సంగీతంలో ఉన్న ఆసక్తిని గుర్తించి అమెకి సంగీతంలో ప్రత్యేక బోధన చేయించేవారని వాళ్లు కన్నతల్లికి నెలవారీగా ఒక నివేదిక పంపేవారుట. ఒక ఏడాది పోయిన తరువాత ఎవ్వరో వచ్చి ఎమిలీని పెంపకానికి తీసుకుపోవడం వల్ల ఆ నివేదికలు ఆగిపోయాయిట. దానితో ఎమిలీ గురించి భోగట్టా బొత్తిగా తెలియకుండా పోయిందిట.

ఉత్తరం చదవగానే ఆ ఉత్తరం రాసిన వ్యక్తికి పాల్ సహాయం చేస్తే బాగుండుననిపించింది. చిన్నప్పుడు చదువుకున్న కుక్క–గాడిద కథ ఒక పక్కనుండి వద్దని పోరుతున్నా, నా బాధ్యతా పరిధిని అతిక్రమించి, తెగించి, మిస్టర్ జాన్సన్ కి ఫోను చేసేను. పాల్ అసిస్టెంట్ అని పరిచయం చేసుకున్నాను. జాన్సన్ గొంతులో ఉన్న సహనశీలత, మృదుత్వం, చిత్తశుద్ధి నన్ను బాగా ఆకట్టుకున్నాయి. తన కూతురు యోగక్షేమాలు ఒక సారి తెలుసుకోవాలన్న తపన తప్ప ఎమిలీ

జీవితంలో జోక్యం కలుగజేసుకునే ఉద్దేశం తన భార్య ఏన్ కి ఏమాత్రం లేదని హామీ ఇచ్చేడు ఆయన. వీలయి, ఎమిలీ ఒప్పుకుంటే, ఒక్క సారి కలుసుకోగలిగితే చాలనుకుంటోందని చెప్పేడు టెలిఫోనులో.

"డబ్బు ఖర్చయినా పరవా లేదు. భరిస్తాను. నాకు కావలసినదల్లా నా భార్య తన కూతురు ఎమిలీని ఒక్క సారి కలుసుకోవాలి. ఆమె కృంగి కృశించిపోతూ ఉంటే చూడలేకుండా ఉన్నాను."

నేను మిస్టర్ జాన్సన్ తో సలిపిన సంభాషణ సారాంశాన్ని ఒక కాగితం మీద రాసి, దానిని జాన్సన్ రాసిన ఉత్తరానికి జతచేసి, పాల్ ఆఫీసుకి వచ్చినప్పుడు పాల్ చేతికి స్వయంగా అందించేను.

పాల్ ఉత్తరం చదివి వెంటనే జాన్సన్ కి మళ్లా స్వయంగా ఫోను చేసేరు:

"చట్టబద్ధంగా దత్తత ఇచ్చేసిన తరువాత ఆ పిల్ల మీద కన్న తల్లిదండ్రులకి ఏ హక్కులూ ఉండవు. పెంపుడు తల్లిదండ్రులెవ్వరో తెలుసుకునే హక్కు ఎవ్వరికీ లేదు. దత్తతస్వీకార పత్రాలన్నీ కట్టకట్టి, వాటికి సికా ముద్ర వేసి, కోర్టు వారు దాచెస్తారు. వాటిని బయటకి లాగడం దరిదాపు అసంభవం."

"…."

"ఆ విషయాలన్నీ మీకు తెలుసంటారా. అందుకనే నా సహాయం అర్థిస్తున్నారా? సరే నేను ఏమి చెయ్యగలనో చూస్తాను." ఫోను పెట్టేసి, నా వైపు తిరిగి,

"ట్రోయ్ కారులో వెళదాం, నాతో వస్తావా? ఇక్కడికి ఇరవై మైళ్లు దూరం ఉంటుంది."

"వస్తాను," అని వెంటనే పాల్ వెంట పడ్డాను.

ఎమిలీని తల్లి వదలిపెట్టిన అనాధ శరణాలయానికి ఇద్దరం వెళ్లేం. శరణాలయం వారు మా ప్రశ్నలకి సమాధానాలు చెప్పడానికి – పాల్ అనుకున్నట్లుగానే – నిరాకరించేరు. నిరాకరిస్తూనే మా దీనవదనాలని చూసి, "పిల్ల ఆర్థిక అవసరాలన్నీ సమృద్ధిగా సమకూరుతున్నాయి. ఆ అమ్మాయి ఒక వృత్తివిద్యలో ప్రావీణ్యురాలయింది కూడ. ఆమె గురించి మీరేమీ బెంగపెట్టుకోనవసరం లేదు," అని మా కళ్లనీళ్లు తుడవడానికా అన్నట్లు ఊరట మాటలు చెప్పి మమ్మల్ని సాగనంపేరు.

ఇద్దరం తిరుగు ముఖం పట్టేం. ఏదో ఆలోచనలో ఉన్న పాల్ నా వైపు తిరిగి "వృత్తివిద్యలో ప్రావీణ్యురాలు" అన్నారు కదూ. "ఎమిలీకి చిన్నప్పుడు సంగీతంలో అభిరుచి ఉందని కదూ జాన్సన్ ఉత్తరంలో ఉంది?" అన్నారు.

ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వవలసిన అవసరం లేదు, ఆయన ఆలోచనా స్రవంతికి భంగం కలిగించకుండా, కిమ్మనకుండా కూర్చుని వింటున్నాను.

"చూడు. మీ ఇంజనీరింగు వాళ్లకి "ప్రొఫెషనల్ సొసైటీస్" ఉంటాయి కదా. అలాగే గాయకులకి కూడా "వృత్తిపరమైన సంఘాలు" ఉంటాయి. లేకపోతే కార్మిక సంఘాల వంటివి ఉంటాయి. ఆఫీసుకి వెళ్ళి, టెలిఫోను పుస్తకంలో పాటలు పాడే వాళ్లు, వాద్య బృందాలు ఉండే వృత్తివ్యాపార సంఘాల పేర్లు చూసి వాళ్లకి ఫోను చేద్దాం. వాళ్ల దగ్గర సభ్యుల జాబితాలు ఉంటాయి. ఆ సభ్యులలో మనకి కావలసిన వ్యక్తి సమాచారం దొరకొచ్చు. దరిదాపు 20 ఏళ్లు ఉన్న అమ్మాయి. పాటలు పాడే పిల్ల. జొన్నపొత్తు పీచు లాంటి బంగారం రంగు జుత్తు. నీలం కళ్లు. ఆఫీసుకి వెళ్లి ఇద్దరం చెరొక టెలిఫోను తీసుకుని ఏదైనా ఫలితం దక్కుతుందేమో చూద్దాం. లేకపోతే మీ యూనివర్సిటీ గ్రంథాలయం వారు సహాయం చెయ్యగలరేమో చూద్దాం."

ఒక వారం రోజులు శ్రమ పడ్డ తరువాత మా వడపోతలో ముగ్గురు ఎమిలీలు మిగిలేరు. ఒక ఎమిలీ క్లీవ్లండ్ లో ఒక నైట్ క్లబ్బులో పాటలు పాడుతోందనిన్నీ, మరొక ఎమిలీ నేష్విల్ లో గ్రామఫోను రికార్డు కంపెనీలని పట్టుకుని అవకాశం కోసం ఎదురు చూస్తోందనిన్నీ తెలిసింది. మూడవ ఎమిలీ షికాగోలో ఒక నాటక బృందంతో తిరుగుతోందనిన్నీ తెలుసుకున్నాం.

ఈ మూడింటిలో మాకు క్లీవ్లండ్ దగ్గర, 170 మైళ్లే. షికాగో 280 మైళ్లు ఉంటుంది. నేష్విల్ 530 మైళ్లు. దగ్గరగా ఉన్న ఊళ్లు కదా అని ముందు క్లీవ్లండ్, తరువాత షికాగో గాలించి తరువాత అవసరం వెంబడి నేష్విల్ సంగతి చూద్దామని పాల్ సలహా ఇచ్చేరు.

ఇల్లు కదలి వెళ్లినప్పుడు కదా దూరాల ప్రసక్తి? ప్రతి పనికీ ఇల్లు కదలి ప్రయాణాలు చెయ్యక్కర లేదు. పెద్ద పెద్ద ఊళ్లల్లో మాతో పరస్పర సంబంధాలు ఉన్న పత్తేదారీ సంస్థలు ఉంటాయి. మేము ఒకరికొకరు సహాయం చేసుకుని ఖర్చులు తగ్గించుకుంటాం. కాని కేసులు కీలకమైన స్థాయిలో ఉన్నప్పుడు మాత్రం పోటీదారులకి పని అప్పచెప్పడం కూడ మంచిది కాదు. ఇలా ఆలోచించి ముందే దూరంగా ఉన్న ఊళ్లల్లో ఉన్న ఎమిలీల భోగట్టాలు సంపాదించడం మొదలుపెట్టేం. నేష్విల్ లో ఉన్న ఎమిలీ వయస్సులో ఇటూ, అటూగా సరిపోయింది కాని ఆమె జుత్తు మాలకాకి రంగు నలుపు.

మూడొంతులు విగ్గు ధరించి ఉండొచ్చు. షికాగోలో ఉన్న ఎమిలీ వయస్సులో ఒక్క రవ పెద్దదేమో అనిపించింది. క్లీవ్లండ్ లో ఉన్న అమ్మాయి మీద ఆశలు పెంచుకుని, ఆ అమ్మాయి పాటలు పాడే నైట్ క్లబ్బు చిరునామా సంపాదించి, ఒకసారి కలుసుకోడానికి అవకాశం ఇమ్మని ఆమెకి ఒక ఉత్తరం రాసి పడేసేరు, పాల్.

ఒక నిర్ణీత సమయంలో కలుసుకోడానికి వీలవుతుందని అభిసారం ఇస్తూ ఆమె, తేదీ, సమయం ఇచ్చి రమ్మనమని ఆహ్వానించింది.

నన్ను కూడా వెంట తీసుకెళితే బాగుంటుంది కదా అని వెయ్యి దేవుళ్లకి మొక్కుకున్నాను. డిట్రాయిట్ నుండి క్లీవ్లండ్ కి విమానం ఎక్కక్కరలేదు; కారు తోలుకు పోవచ్చు. ఆ కారులో నేను కూడా ఉంటే సాయంగా ఉంటాను కదా అని అడిగేను. ఏ కళనున్నారో పాల్ "సరే" అన్నారు.

మేము ఇద్దరం నైట్ క్లబ్బులో మొదటాటకి టికెట్లు కొనుక్కుని ఒక వారగా ఉన్న కుర్చీలలో కుర్చున్నాం. ఆట మొదలయిందన్నట్లు ఎమిలీ బ్లెయిర్ ని పరిచయం చేస్తూ నల్లటి తెర ముందు నిలబడి సూత్రధారుడు ఉద్ఘాటించేడు. తెర తెరుచుకునేసరికి అక్కడ ఒక అమ్మాయి మైక్ దగ్గర నిలబడి ఉంది. గదిలో ఉన్నవారంతా ఒక్క పెట్టున కరతాళధ్వనులు చేసేరు. రంగం మీద, దీపం వెలుగులో, పిల్ల సన్నంగా, నాజూగ్గా, అందంగా కనిపించింది. బుజాల వరకు దిగజారిన జొన్నపొత్తు జుత్తు. నీలం కళ్లు. బొమ్మలా ఉన్న పిల్లని చూసి, ఆమె శ్రావ్యమైన కంఠాన్ని విని తన్మయత్వం చెందని వారు లేరేమో ఆ గదిలో. బాగా పాడింది.

పాట అయిపోయిన తరువాత, తెర మూసుకు పోయింది. మేమిద్దరం రంగస్థలం వెనక భాగం లోకి వెళ్లేం. అప్పటికే ఎమిలీ కుర్చీలో కూర్చుని సేద తీర్చుకుంటోంది.

"హాయ్! నా పేరు పాల్ డ్రేక్" అని పాల్ తనని తాను పరిచయం చేసుకున్నారు.

"నమస్కారం. స్వాగతం. అక్కడ ఆ కుర్చీలో కూర్చోండి. మీరు రాసిన ఉత్తరం మా మేనేజరు చదివి వినిపించేరు….."

పాల్ కి ఆ మాటలోని అంతరార్థం గభీమని అవగాహన కాలేదు. ముభావంగా ఊరుకున్నారు.

ఎమిలీయే అందుకుని అర్ధాంతరంగా ఆపు చేసిన వాక్యాన్ని పూర్తి చేసింది, "... ఆం చూడండి. నేను చదవలేను. నేను గుడ్డిదానిని."

“నా క్షమార్పణలు. నాకు ఆ విషయం తెలియదు, మిస్ బ్లెయిర్” తడబడుతూ సరి అయిన మాటలకోసం పాల్ వెతుక్కుంటున్నారు.

“మీకే కాదు. చాల మందికి తెలియదు. నేను రంగ ప్రవేశం చేసే ముందు, రంగం నుండి నిష్క్రమించే ముందు తెర మూసేసి నాకు ఆసరాగా ఉండి మా వాళ్లు తీసుకు రావడం, తీసుకుపోవడం చేస్తూ ఉంటారు.”

“వైద్యం ఇంతగా అభివృద్ధి చెందిన మన దేశంలో ఎవ్వరూ ఏమీ చెయ్యలేరా?”

“ఆ వైద్యపు వీధులన్నీ వెతికి చూసేం. లాభం లేదని తేలిపోయింది. నేను జీవితాంతం అంధురాలినే. అవును కానీ, నాతో ఏదో విషయం మాట్లాడాలన్నారు?”

తను వెతుకుతూన్న ఎమిలీ ఈ అమ్మాయి కాదని పాల్ డ్రేక్ మనస్సులో ఒక అభిప్రాయానికి వచ్చేసేరని నాకనిపించింది. వెంటనే వెళ్లిపోతే బాగుండదని కాబోలు, ముక్తసరిగా మూడు మాటల్లో తను వచ్చిన కారణం చెప్పి, ఆమెని ఇబ్బంది పెట్టినందుకు క్షమార్పణ వేడుకుని కుర్చీలోంచి లేచేరు, పాల్.

“మీరు వెతుకుతూన్న అమ్మాయిని నేనే!” అశనిపాతంలా సమాధానం వచ్చేసరికి పాల్ స్థాణువులా కళ్లప్పగించి చూడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయారు.

“అవును. నేనే ఆ అమ్మాయిని. నాకు ఎనిమిదేళ్లప్పుడు, నా తల్లి నన్ను వదలిపెట్టేసింది – నేను గుడ్డిదాన్ని అయిపోతున్నానని తెలియగానే నన్ను వదలిపెట్టేసింది.”

ఎమిలీ మాటల్లో కఠినత్వం లేకపోయినా అవి ధ్వనించిన తీరులో ఆమెకి తల్లి మీద ఏ విధమైన సుహృద్భావం లేదని అనిపించింది. తన కన్నతల్లి మంచి చెడ్డలు తెలుసుకోవాలన్న కుతూహలం లేకపోవడమే కాకుండా ఆమెని కలుసుకోవాలన్న కోరిక రవంత కూడ లేదని స్పష్టంగా చెప్పింది. అంతే కాకుండా దగ్గరలోనే ఉన్న షేకర్ హైట్స్ అనే సామంతుల శివార్లలో ఉన్న పెంపుడు తల్లిదండ్రుల యెడల విపరీతమైన అభిమానం ప్రదర్శించింది. కన్నతల్లిని కలుసుకోవడం జరగని పని అని ఆమె స్పష్టం చేసింది.

వెంటనే నైట్ క్లబ్బు వదలి కారులోకి వచ్చి కారులో ఉన్న ఫోనులో ఆర్ట్ జాన్సన్ ని పిలచేరు, పాల్. ఫోనులో మాటలు నాకు కూడా వినబడుతున్నాయి. కారులో నేను కూడా వింటున్నానని జాన్సన్ కి చెప్పి, తను ఎమిలీని కలుసుకున్న వయినం చెప్పేరు. ఎమిలీ గుడ్డిదన్న విషయం తనకి మొదటిసారిగా తెలియగానే చకితుణ్ణయానని చెప్పేరు.

విషయం పూర్తిగా చెప్పనందుకు క్షమార్పణలా, "అయినదేదో అయిపోయింది. మీరు ఈ కేసుని ఇంతవరకు నడిపించి ఇప్పుడు వదిలిపెట్టకండి. మీరు ఎలాగో ఒకలాగ ఎమిలీని ఒప్పించాలి."

"అది జరిగే పనిలా లేదు. అది సరే కాని, ఎమిలీని అనాధ ఆశ్రమంలో వదలి పెట్టినప్పుడు ఎమిలీ గుడ్డిదయిపోతోందన్న విషయం మీ భార్యకి తెలుసా?"

"నేను అప్పుడు అక్కడ లేను. నిజానిజాలు నిలకడమీద తేలవలసినవే. ఈ లోగా మీరు మాత్రం మీ ప్రయత్నం మానకండి," అంటూ మిస్టర్ జాన్సన్ ప్రాధేయపడ్డాడు.

"ఎమిలీ పెంపుడు తల్లిదండ్రులని కలుసుకుని ఏమైనా లాభిస్తుందేమో ప్రయత్నించి చూస్తాను." అని చెప్పి, "ఈ రాత్రికి మనం ఎక్కడైనా మొటేలులో పడుక్కుని రేపు ఎమిలీ పెంపుడు తల్లిదండ్రులని కలుసుకుని అప్పుడు తిరిగి వెళ్లిపోదాం" అన్నారు, పాల్.

క్లీవ్లండ్ లో నాకు తెలిసిన విద్యార్థి ఒకడు ఉన్నాడనిన్నీ, అతని దగ్గర నన్ను వదిలేస్తే మొటేలు ఖర్చులు తప్పుతాయనిన్నీ చెబితే ఆయన నా స్నేహితుడి గదిలో నన్ను వదిలేసేరు.

మరునాడు ఇద్దరం కలసి షేకర్ హైట్స్ లో ఉన్న బ్లెయిర్ దంపతులని చూడడానికి వెళ్లేం. వారు సహృదయులు లాగనే కనిపించేరు. కాని మా సందర్శనానికి కారణం తెలియగానే మండిపడ్డారు. "మేము ఎమిలీ కన్నతల్లి గురించి ఎప్పుడూ చెడ్డగా ప్రచారం చెయ్యలేదు. ఎమిలీ మనస్సు విరచడానికి ప్రయత్నం చెయ్యలేదు. ఆ హృదయం లేని తల్లి, ఎమిలీ దృష్టి పోగొట్టుకుంటోందని తెలిసికూడ, కిరాతకంగా అనాధ శరణాలయంలో విడచి వెళ్లిపోయిందే! ఎమిలీకి కోపం వచ్చిందంటే రాదూ, మరి?" అన్నారు మిస్టర్ బ్లెయిర్.

"మీరు చూడండి," మిసెస్ బ్లెయిర్ అందుకున్నారు, "మేము చిన్న నెలల పిల్లాడిని పెంచుకుందామన్న ఉద్దేశంతో ఆ అనాధ శరణాలయానికి వెళ్లేం. అక్కడ తొమ్మిదేళ్ల ఎమిలీ కనిపించింది. తల్లి లేదు. తండ్రి లేడు. కళ్లు కనిపించవు. హృదయవిదారకమైన పరిస్థితిలో ఉన్న ఆ అమ్మాయిని కాదని తగుదునమ్మా అంటూ మరొక పిల్లని ఏ ముఖం పెట్టుని పెంచుకుంటాం? ఎమిలీనే పెంచుకుందికి నిశ్చయం చేసేం. ఆ పని చేసినందుకు ఆ నాటి నుండి నేటి వరకు, ఒక్కనాడు కూడా, చింతించలేదు."

“అవును. మా కడుపున పుట్టిన కూతురు కంటె ఎక్కువ ప్రేమగా చూసుకుని పెంచుకున్నాం. ఎమిలీకి మేమే సర్వస్వం.” అని మిస్టర్ బ్లెయిర్ వంత పలికేరు.

ఇలా మా సంభాషణ ఒక గంటకి పైగానే సాగింది. వారిచ్చిన కాఫీ తాగుతూ, పాల్ వారి మీద అతి సున్నితంగా ఒత్తిడి పెట్టడం మొదలు పెట్టేరు.

“చూడండి. జరిగిపోయినదానికి వగచి ఏమి లాభం. ఎమిలీ గుండెల్లో ఆ ద్వేషభావం అలా రగులుతూ ఉంటే ఆమెకే మంచిది కాదు. ఎప్పుడో ఒకప్పుడు ఆమె కన్నతల్లిని క్షమించేసి, ఖాళీ పలకలా జీవితంలో మరొక అధ్యాయం మొదలుపెడితే ఎమిలీకే మంచిదేమో ఒకసారి ఆలోచించి చూడండి.”

పాల్ లో అంతర్గతంగా ఉన్న ప్రతిభ నాకు అర్థం అవడం మొదలైంది. బ్లెయిర్ దంపతులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. ఏమనుకున్నారో, “సరే! మేము ఎమిలీతో చెప్పి చూస్తాం. మీరు ఇంటికి వెళ్లిన తరువాత ఒక సారి ఎమిలీకి ఫోను చెయ్యండి.”

మర్నాడు పాల్ ఎమిలీకి ఫోను చేసేరు.

పేలిన అగ్ని పర్వతంలా విరుచుకు పడింది, ఎమిలీ. “మిస్టర్ డ్రేక్! నా తల్లి నన్ను అమానుషంగా నడిరోడ్డు మీద వదిలేసి వెళ్లిపోయింది. నాకు తల్లి అత్యవసరమైన పరిస్థితిలో, ఈ గుడ్డి పిల్లని ఎవరు సాకుతారని, తన సుఖం తను చూసుకుందామనే ఉద్దేశంతో నన్ను గాలికి వదిలేసింది, ఆ కిరాతకి. ఆమెని క్షమించమని అడగడానికి మీకు నోరెలా వచ్చింది?”

“చూడమ్మా. ఆమె కోణం నుండి కూడా ఆలోచించి చూడు. ఆమె హృదయం ఎంతలా తపన పడుతోందో. ఒక్క సారి కలుసుకుంటాననంటోంది.” ప్రాధేయపూరకంగా అడుగుతున్నారు, పాల్.

ఒక నిమిషం అంతా నిశ్శబ్దం.

“సరే. నా ప్రాణంతో సమానమైన నా పెంపుడు తల్లిదండ్రులు అడిగేరు కదా అని ఒప్పుకుంటున్నాను తప్ప మీ మీద కాని, ఆ కిరాతకురాలి మీద కాని నాకు ఈషణ్మాత్రమూ జాలి లేదు. ఆమెని కలుసుకుంటాను. ఒకే ఒక్క సారి. “హల్లో” అని ఒకే ఒక్క మాట మాట్లాడతాను. ఆ తరువాత కథ సమాప్తం.”

పాల్ వెంటనే ఆర్ట్ జాన్సన్ కి ఫోను చేసేరు. దంపతులిద్దరినీ వెంటనే బయలుదేరి, మరునాడే, క్లీవ్లండ్ రమ్మన్నారు: "ఎమిలీ తన కన్నతల్లిని ఏకాంతంగా కలుసుకుంటేనే మంచిది. నేనున్న హొటేలు లోనే రెండు పక్కపక్క గదులు తీసుకుంటాను. ఇద్దరు చెరొక గదిలోనూ దిగండి. నేను ఎమిలీని హొటేలుకి తీసుకుని వస్తాను."

మర్నాడు ఎమిలీ చాల ఆందోళనగా ఉంది. ఆమె మనోస్థితి ఉద్విగ్నంగా ఉంది. పాల్ ఆమె చెయ్యి పట్టుకుని ఏన్ జాన్సన్ తీసుకున్న గది వైపు నడచి వస్తున్నారు.

"నన్ను ఒక్కర్తినీ ఆమెతో వదలిపెట్టి వెళ్లిపోవద్దు" అంటూ ఎమిలీ పాల్ ని ప్రాధేయపడింది.

"అలాగే," అంటూ, పాల్ సుతారంగా గది తలుపు తట్టేరు.

"లోపలికి రావచ్చు" లోపలి నుండి సన్నని కంఠం వినబడింది.

తలుపు తెరుచుకుని పాల్, ఎమిలీ, వారి వెనక నీడలా నేను గదిలో ప్రవేశించాం.

గదిలో, కిటికీ దగ్గర, మధ్య వయస్సులో ఉన్న ఒకామె కూర్చుని ఉంది. ముమ్మూర్తులా ఎమిలీ లాగనే ఉంది – అవే నీలి కళ్లు, అక్కడక్కడ నెరిసింది తప్ప అదే మొక్కజొన్న జుత్తు. ఏన్, ఎమిలీ అప్పచెల్లెళ్లు అనుకునే ప్రమాదం లేకపోలేదు.

వణుకుతూన్న కంఠంతో, "హల్లో" అంది ఎమిలీ.

"ఎన్నాళ్లకి విన్నానమ్మా నీ గొంతు. ఇన్నాళ్లబట్టీ నీతో ఎన్నో విషయాలు చెబుదామని ఈ గుండెల్లో దాచుకున్నాను. సమయానికి ఒక్క ముక్కా జ్ఞాపకం రావడం లేదు. ఏదమ్మా ఒక్క సారి దగ్గరగా రా అమ్మా. నిన్నొకసారి చూడాలని ఉంది."

పాల్ ఎమిలీ చెయ్యి పట్టుకుని కిటికీ పక్కన ఉన్న కుర్చీ దగ్గరకి తీసుకు వెళుతూ ఉంటే ఏన్ లేచి నిలబడి రెండు చేతులూ ముందుకి చాచింది. కాని నేను అనుకున్నట్లు కూతురిని కౌగలించుకోడానికి ప్రయత్నం చెయ్యలేదు. కూతురు తిరస్కరిస్తుందని భయమో ఏమో.

ఏన్ చేతులు రెండూ ఎమిలీ భుజాలమీద వేసి, రెండు చేతులనీ ఎమిలీ చెంపల మీదకి చేర్చి, ముఖాన్నీ, పెదవులనీ, ముక్కునీ, కళ్లనీ తన సున్నితమైన వేళ్లతో సుతారంగా తడుముతూ, జుత్తు మీదకి వేళ్లు పోనిచ్చి, "ఎంత పెద్దగా ఎదిగిపోయావమ్మా! ఎంత అందంగా ఉన్నావు, తల్లీ!!"

ఎమిలీ జంకుగానే తన చేతి వేళ్లని ఏన్ చేతి వేళ్లతో కలిపింది. "నువ్వు…. అమ్మా! నువ్వు కూడా ….."

"అవునమ్మా. కాని నిన్ను చూడడానికి ……!" గద్గద స్వరంతో ఆమె గొంతుక జీరబోయింది.

"అమ్మా!" అంటూ ఎమిలీ ఏన్ చేతుల్లోకి ఒరిగిపోయింది.

**కథ వెనుక కథ**

ఆంధ్రజ్యోతి ( 29 సెప్టెంబరు 2103 ) ఆదివారం సంచికలో ప్రచురితం. తానా వారి తానా పత్రికలో తిరిగి ముద్రించేరు. ఈ కథని ప్రచురించిన వసంతలక్ష్మి గారు ఓ హెన్రీ కథలా ఉందని కితాబు ఇచ్చేరు. ఈ కథలో వచ్చే పాత్రలు, వర్ణించిన సంఘటనలు నిజమైనవే. కథనం కోసం అక్కడక్కడ ఊళ్ల పేర్లు, పాత్రల పేర్లు మార్చవలసి వచ్చింది.

# అవధులు

వైద్య కళాశాలలో చదువుకునే రోజులలో ముందుగా కొట్టొచ్చినట్లు కనిపించేది శాఖోపశాఖలుగా చీలిన వైద్య పరిజ్ఞానపు విస్తృతి. ఒక్క మానవ శరీరాన్ని అధ్యయనం చెయ్యాలంటే శరీరనిర్మాణశాస్త్రం, రోగనిర్ణయశాస్త్రం, ఔషధశాస్త్రం, సమ్మోహనశాస్త్రం, ఇలా ఎన్నో శాఖలు చదివి, వాటి మీద ఆధిపత్యం సంపాదించాలి. కొందరు శస్త్రచికిత్స వైపు మొజు చూపెడితే మరికొందరు సమ్మోహన వైద్యం అంటే సరదాపడేవారు.

అర్ధ రాత్రి వేళ, అపరాత్రి వేళ పురుళ్ళు పొయ్యటానికి లేవనవసరం లేకుండా, కడుపులో చల్ల కదలకుండా, తేలిగ్గా తెమిలిపోయే శాఖ ఏదైన ఉంటుందా అని వాకబు చేసి చర్మరోగాల శాఖ ఎంచుకున్నాను. తామర, గజ్జి, శోభి మచ్చలు, మొటిమలు, బొల్లి, ... ఇవేగా! చర్మరోగాలతో సుఖం ఏమిటంటే అవి ఒకంతట తగ్గవు. ఒక సారి బేరం తగిలిందంటే పది కాలాలపాటు రోగులు రివాజుగా వచ్చి, రుసుం చెల్లించి పోతూ ఉంటారు. ఇలా బద్ధకంతో అడ్డుదారి వెంబడి ఆలోచించి చర్మరోగాల మీద ఆధిపత్యం  సాధించాలని ఒక నిశ్చయానికి వచ్చేను.

ఉదయం నా చికిత్సాలయంలో అడుగు పెట్టేసరికి నిరీక్షామందిరం నిండుగానే ఉంది. నరసమ్మ ఇచ్చిన దస్త్రం అందుకుని పరీక్షామందిరంలో నా కోసం ఎదురు చూస్తూన్న సుందరమ్మని పలకరించటానికి వెళ్ళేను. పూర్వ పరిచయం ఉన్న ఉపతాపే ఈమె! వయస్సు ఏభయ్ ఉంటుంది. వినే నాథుడు దొరికితే చాలు తన గోడు వెలిగక్కుదామన్న తన్యతతో తన చేతిలో ఉన్న కాగితం మడత విప్పటం మొదలు పెట్టిందావిడ.

"ఏమమ్మా! ఎలా ఉన్నారు?" అన్నాను. నేరకపోయి అన్నాను.

"ఎలా ఉన్నానా? బాగుంటే ఇక్కడ ఈ పడిగాపులు ఎందుకు?" అంటూ తన చేతిలో ఉన్న కాగితాన్ని నా చేతిలో విసురుగా పెట్టింది. ఆ చర్యలో కొంచెం అసహనం కనిపించింది.

కాగితం విప్పి చూసేను. దాని మీద ఒక పెద్ద జాబితా మందుల పేర్లు ఉన్నాయి. సుందరమ్మ మా చికిత్సాలయానికి అయిదేళ్లబట్టి వస్తూ పోతూ ఉన్న వ్యక్తే. కనుక ఆమెని నిజంగా పీడిస్తూన్న రోగాలు, ఆమె ఊహించుకుంటూన్న రోగాలు అన్నీ నాకు పరిచయమైనవే. క్రితం సారి నన్ను సంప్రదించటానికి వచ్చినప్పుడు – అతిగా దురద వేస్తే గోకకుండా ఉండలేకపోవటం వల్ల తల మీద రక్తం చిమ్మి పుళ్ళు పడ్డాయంటూ అభియోగం చేసిందీమె. అదేపనిగా దురద వేస్తూ ఉంటే గోకాలనిపిస్తుంది. గోకుతూన్నకొద్దీ ఇంకా గోకాలనిపిస్తుంది. గోకగా, గోకగా చర్మం పెళుసుబారుతుంది. ఇంకా

గోకితే చర్మం చిట్లుతుంది. దీనిని ఇంగ్లీషులో "న్యూరోడెర్మటైటిస్" అంటారు. ఐటిస్ అంటే వాపు. డెర్మటైటిస్ అంటే చర్మం వాపు. ఇక్కడ "న్యూరో" అన్న విశేషణం "మానసిక" అనే అర్థాన్ని ఇస్తుంది. సహించరాని మానసిక ఒత్తిడి, తన్యత ఉన్న సందర్భాలలో వ్యక్తి అసంకల్పంగా చర్మాన్ని గోకటం "న్యూరోడెర్మటైటిస్" అనే రోగానికి ముఖ్యమైన లక్షణం. ఇది మా వృత్తిలో తరచుగా కనిపించే లక్షణం.

బిగించిన వీణ తీగలా ఉండే సుందరమ్మ జీవితమే తన్యతాభరితం. ఎలకల పందేలలా పరుగులు పెట్టే ఈ జీవితాలలో అందరూ బిజీ, బిజీ, బిజీ! అందరికీ టెన్షనే! కనుక రోగనిర్ణయానికి ఇబ్బంది లేదనిపించింది.

దురదతో బాధ పడేవారికి సర్వసాధారణంగా ఒక శాతం గాఢత ఉన్న "కోర్టిజోన్" లేపనంతో చర్మాన్ని మర్దనా చెయ్యమని సలహా ఇవ్వటం రివాజు. సుందరమ్మకి అదే సలహా ఇచ్చేను. తల మీద పుండ్లు మంట పెట్టకుండా ఉండటానికని పుదీనా కలిపిన ఆముదాన్ని తలకి రాస్తూ ఉండమని కూడ సలహా ఇచ్చేను. జీవితంలో వచ్చే ఒడిదుడుకులని, ఒత్తిడిని తట్టుకోటానికి ప్రాణాయామం, జపం వంటి యోగాభ్యాసాలు కూడ చెయ్యమని ప్రోత్సహించేను. వైద్య ధర్మం అంటే నేను నిర్వర్తించేను కాని, వైద్యుడితో రోగి సహకరించకపోతే వైద్యుడు చెయ్యగలిగేదేముంది?

సుందరమ్మ నా చేతికిచ్చిన కాగితం మీద రాసి ఉన్న మందుల జాబితాని పరకాయించి చూసేను. "ప్రోజాక్, క్లొనాజిపామ్.." ఇవన్నీ వ్యాకులతని, తన్యతని తగ్గించటానికి వాడే శక్తిమంతమైన మందులు. జాబితాని చదువుతున్నాను. మధ్య మధ్యలో మరచి పోకుండా తనకి తాను స్మరణకి తెచ్చుకుందుకా అన్నట్లు, "కేల్సియం మాత్రలు వేసుకోమంటారా? వద్దా?" వగైరా వాక్యాలు రాసుకుంది. గత అయిదేళ్ళల్లో ఈమెకి రాని రోగం లేదేమో అనిపిస్తుంది. ఒకసారి టాన్సిల్స్ వాచేయి. మరొక తూరి మూత్రనాళంలో తిష్ట ("ఇన్ఫెక్షన్") వచ్చింది. చర్మం మీద బొబ్బలు. నోటిలో పూత, పుండ్లు. పగిలిపోయిన పెదవులు. రక్తంలో మితిమీరిన కొలెస్టరాల్! ఈ రకం లక్షణాలు, విడివిడిగా కాకుండా ఇలా పుంఖానుపుంఖంగా , వస్తున్నాయంటే వీటన్నిటికి మూలకారణం మరొకటేదో ఉందన్నమాట.

ప్రతి వ్యక్తికి రోగాన్ని ఎదుర్కొనే శక్తి ఒకటి స్వతహాగా ఉంటుంది. ఈ శక్తిని రక్షరేకు అని కాని అసంక్రామ్యత అని కాని తెలుగులో అంటారు. దీనినే ఇంగ్లీషులో "ఇమ్యూనిటీ" అంటారు. ఎప్పుడూ తన్యతాభరితంగా ఉన్నవారి శరీరాలలో ఈ రక్షరేకు దిట్టంగా ఉండదు. అందుకనే తన్యతతో జీవించేవారికి అనేక రకాల రుగ్మతలు సునాయాసంగా వస్తాయి. తన్యత ఆరోగ్యానికి మంచిది కాదు. యోగాభ్యాసం మనస్సుని కుదుట పరచి తన్యతని తగ్గిస్తుంది. అందుకనే తన్యతని తగ్గించటానికి మందుల కంటె వ్యాయామం మంచి మార్గం. జపం కూడా మంచి మందే.

ఈ మారు సుందరమ్మకి సరికొత్త చర్మ రోగం మరొకటి వచ్చింది. "గత ఆరు నెలల బట్టీ, ఎక్కడ పెడితే అక్కడ, శరీరం మీద, ఎఱ్ఱటి మరకలు కనిపిస్తున్నాయి. అవి ఉన్న చోట విపరీతమైన దురద."

ఈమె రోగాలన్నిటికి మూల కారణం తన్యత అనే నమ్మకం నాలో ప్రబలంగా ఉండబట్టి, ఆమె సంసారంలో ఉద్రేక పరచే సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగేను. "సంసారం అన్న తరువాత సమస్యలు ఎందుకు ఉండవు? ఎవరికి ఉండవు?" అంటూ వేదాంత ధోరణిలో సమాధానం చెప్పింది. "ఆయనేమీ పట్టించుకోరు. కొత్తగా వచ్చిన కోడలితో కీచులాటలు వరకూ రాకపోయినా ఏవేవో స్పర్ధలు. ఎంతగా సర్దుకు పోతూన్నా అంతా అత్తగారిదే తప్పు. తలమునకగా ఉన్న పనులతో మనస్సుకి విశ్రాంతి లేకుండా పోతోంది" అంటూ సంసారాలలో అందరికీ ఉండే బాధలే చెప్పుకుంది. చర్మం మీద పొడ చూపే ఎఱ్ఱటి మరకలతోపాటు, తగ్గుముఖం పట్టిన తలదురద, పుండ్లు మళ్ళా ఎక్కువవుతున్నాయిట. "వీటన్నిటి వల్లా మానసికంగా ఒక రకం ఆత్రుత, మెదడులో ఒక రకం చీకటి కమ్ముకుంటోంది." ఈ లక్షణాన్ని ఇంగ్లీషులో "డిప్రెషన్" అంటారు. ఈ లక్షణాలు విజృంభించినప్పుడు ఊపిరి పీల్చటం కష్టంగా ఉంటోందా అని నేను అడిగితే, అవునని సమాధానం చెప్పిందామే.

వైద్యుడు ముందస్తుగా రోగి చెప్పుకునే గోడు వినాలి. ఆ తరువాతే పరీక్షకి ఉపక్రమించాలి. ముందు ఆమె కాళ్ళు, పాదాలు పరీక్షించేను. రెండు పిక్కల మీద పేత పేసినట్లున్న, బచ్చలిపండు రంగులో, చిన్న చిన్న చుక్కలు కనిపించేయి. దీన్ని ఇంగ్లీషులో "పెటీచియే" అంటారు. కేశనాళికలు చిట్లి, ఆ బీటల ద్వారా పరిసరాలలో ఉన్న కణరాసి లోకి రక్తం చిమ్మితే ఈ రకం మచ్చలు కనబడతాయి. కేశనాళికలు చిట్లటానికి అనేక కారణాలు ఉండొచ్చు. ఏస్పిరిన్ పడకపోవటం ఒక కారణం కావచ్చు. తిష్ట (ఇన్ఫెక్షన్) మరొక కారణం కావచ్చు. అతిగా తాగినా, ఎయిడ్స్ వ్యాధి ఉన్నా, రక్తనాళాలు వాచినా, లుకేమియా, లింఫోమా వంటి రక్తపు కేన్సరు ఉన్నా కేశనాళికలు చిట్లవచ్చు. రక్తంలో ఎఱ్రకణాలు, తెల్లకణాలు తోపాటు "పళ్ళేరాలు" అనే మరొక రకం  కణాలు ఉంటాయి. వీటిని ఇంగ్లీషులో  "ప్లేట్లెట్స్" అంటారు. "ప్లేట్" అంటే పళ్ళెం. "లెట్" అనే ప్రత్యయం "బుల్లి" అనే అర్థాన్ని ఇస్తుంది. అంటే ఈ కణాలు బుల్లి పళ్ళేల ఆకారంలో ఉంటాయన్న మాట. ఇవి ఎఱ్ర కాణాల కంటె పదింతలు చిన్నగా ఉంటాయి. రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఈ పళ్ళేరాలు ప్రధాన పాత్ర వహిస్తాయి.

పేతపొక్కుల లాంటి ఈ చుక్కలతో పాటు, సుందరమ్మ చేతుల మీదా, కాళ్ల మీదా అరవళ్లు కనిపించేయి. అరవడి అంటే కంది, కమిలి, నీలిగా తయారయిన చర్మం. దీన్ని ఇంగ్లీషులో "బ్రూజ్" అనీ, వైద్య పరిభాషలో  "పుర్పూరా" అనీ అంటారు. చర్మం కింద రక్తస్రావం జరిగితే ఈ రకం మచ్చలు వస్తాయి. పేతపొక్కుల లాంటి చుక్కలు, కమిలినట్లు

కనిపించే ఈ అరవళ్లు చూడగానే సుందరమ్మని పీడిస్తూన్న రోగం "నూరోడెర్మటైటిస్" కంటె సంక్లిష్టమైనది మరేదో అయి ఉంటుందని నాకు అనుమానం వేసింది.

ఈ అనుమానంలో సత్తా ఎంత ఉందో తెలియాలంటే రక్తాన్ని, మూత్రాన్ని మచ్చు తీసి పరిశోధనశాలలో పరీక్షించి చూడాలి. రక్తంలో ఎర్ర కణాలు, తెల్ల కణాలు, పళ్ళెరాలు ఎన్నెన్ని ఉన్నాయో లెక్కపెట్టించి చూశాను. మూత్రం పరీక్ష చేయించేను. గళగ్రంధి ("థయిరాయిడ్") ఎలా పని చేస్తున్నాదో తనిఖీ చేయించేను. పరీక్షా ఫలితాలు వచ్చేయి. అనుమానించినట్లే అంతా సజావుగా లేదు. మూత్రంలో కొద్దిగా రక్తం కనిపించింది. కాని కొట్టొచ్చినట్లు కనిపించినది రక్తంలో ఉన్న పళ్ళెరాల సంఖ్య. ఒక మైక్రోలీటరు (అంటే లీటరులో పదిలక్షో వంతు) రక్తంలో సాధారణంగా 150,000 నుండి 450,000 వరకు ఉంటాయి పళ్ళెరాలు. కాని సుందరమ్మ రక్తంలో 20,000 మాత్రమే ఉన్నాయి!

ఈ వైపరీత్యానికి కారణం ఏమిటో తెలిస్తే కాని సుందరమ్మకి వైద్యం చెయ్యలేము. పైగా రక్తశాస్త్రంలో నాకు ప్రావీణ్యత లేదు. అందుకని ఈ సమస్యతో నేనూ, నా సహాధ్యాయులూ రెండు వారాల పాటు కుస్తీ పట్టేం. రక్తంలో కనిపించే వైపరీత్యాలకి సవాలక్ష కారణాలు ఉండొచ్చు. వీటిని, ఒక క్రమపద్ధతిలో, ఒకటీ ఒకటీ పరిహరించుకుంటూ పోతే కాని అసలు కారణం నిర్ధారణ కాదు. లుకేమియా, ఎయిడ్స్, హెపటైటిస్ సి, లూపస్, సిర్రోసిస్, పడని మందులు, ఇలా ఆంజనేయుడి తోకలా ఒక పెద్ద జాబితాని తయారు చేసేం. వీటన్నిటినీ నేతి నేతి (ఇది కాదు, ఇది కాదు) అనుకుంటూ తొలగించగా అసలు రోగం బయట పడింది. దానికి పేరు పెట్టాలి కదా! "తెలియని కారణాల వల్ల రక్తం గడ్డకట్టే ప్రక్రియలో లోపం వల్ల వచ్చిన మరకలు" అని పేరు పెట్టేం. కారణం ఇదమిత్థంగా తెలియనప్పుడు ఇంగ్లీషులో "ఇడియోపేథిక్" అనే విశేషణం వాడతారు. "త్రాంబస్" అంటే గడ్డ లేదా గడ్డకట్టిన రక్తపు ముద్ద. "సైటో" అంటే రక్తకణాలకి సంబంధించిన. "సైటోపెనిక్" అంటే మనం చెప్పదలుచుకున్న కణాలు తక్కువగా ఉన్న సందర్భం. "పుర్పురా" అంటే నీలి రంగు మరకలు. కనుక ఈ జబ్బు పేరు ఏమిటన్నమాట? "ఎందుకు ఇలా జరుగుతోందో తెలియదు కాని, చాలినన్ని రక్తకణాలు లేకపోవటం వల్ల రక్తం గడ్డకట్టే ప్రక్రియలో లోపం వచ్చి, దాని వల్ల చర్మం కమిలినట్లు ఉండటం." దీన్ని ఇంగ్లీషులో "ఇడియోపేథిక్ త్రాంబోసైటోపెనిక్ పుర్పురా" అని అంటారు.

ఇది ఎందుకు వస్తుందో కారణం తెలియదని ముందే ఒప్పేసుకున్నాం కనుక కారణం చెప్పమని నన్ను ఇబ్బంది పెట్టకండి. ఇలా కారణం తెలియని సందర్భాలలో శరీరంలో అదృశ్యంగా పనిచేసే రక్షరేకు మీద నింద మోపటానికి ప్రయత్నిస్తారు. మనకి సర్వకాల సర్వావస్థలలో రక్షనిచ్చే ఆ వ్యవస్థ సరిగ్గా పని చెయ్యలేకపోయినంత మాత్రాన రక్తంలో

పళ్ళెరాల జనాభా పడిపోవలసిన అవసరం లేదు. ఒక సిద్ధాంతం ఏమిటంటే మనకి రక్షణ ఇవ్వవలసిన రక్షరేకు – కారణాంతరాలవల్ల – పళ్ళెరాలని చూసి పరాయి కణాలనుకొని, వాటిమీదకి దండెత్తి వాటి ఉనికికే ముప్పుతెస్తున్నాయని!

ఎర్రకణాలు, తెల్లకణాలు అందరికీ పరిచయమైనవే కాని ఈ పళ్ళెరాలు కూడ చాల ముఖ్యమైనవే. రక్తంలో వీటి జనాభా 30,000 కంటె తక్కువ ఉంటే పైన నుడివిన లక్షణాలే కాకుండా ముక్కు వెంబడి, ఇగుళ్ళ వెంట రక్తం చిమ్మటం కనబడుతుంది. మలంలోనూ, మూత్రంలోనూ కూడ రక్తం పడుతుంది. ఈ సంఖ్య 10,000 కి దిగువన ఉంటే రక్తనాళాలలో రక్తం బయటకి వచ్చి కణజాలం చుట్టూ చెలమలు కట్టినట్లు నిలబడుతుంది. ఈ పరిస్థితిని ఇంగ్లీషులో "హెమటోమా" అంటారు. ఈ సంఖ్య 10,000 కంటె తక్కువ ఉంటే మెదడులో రక్తస్రావం జరగటానికి సావకాశాలు ఉన్నాయి. అది మంచిది కాదు.

నా దగ్గర వైద్యం పొందుతూన్న రోజుల్లో సుందరమ్మ రక్తంలో పళ్ళెరాల సంఖ్య కేవలం వెయ్యి కి పడిపోయింది. ఇది ప్రాణాపాయ పరిస్థితి. అప్పుడు ఆమెని ఆసుపత్రిలో చేర్పించి, పళ్ళెరాలని రక్తంలోకి ఎక్కించవలసి వచ్చింది. (ఈ రోజుల్లో నిండు రక్తాన్ని ఎక్కించటం మానేసేరు, అవసరమైన అంశాన్నే ఎక్కిస్తారు.)

ఒక పక్క రక్షరేకు పళ్ళెరాలని చంపెస్తూ ఉంటే ఎంతకని ఎక్కిస్తాం? తాటిచెట్టు ఎక్కేవాడిని ఎంతకని తోస్తాం? అందుకని ఈ కణాలని తయారుచేసుకునే సమర్ధతని శరీరానికి సమకూర్చాలి. అందుకని ఆమెకి "ప్రెడినసోన్" అనే ఘృతార్ధాన్ని ("స్టీరాయిడ్" ) ఇవ్వవలసి వచ్చింది.

సుందరమ్మ రక్షరేకు ఎందుకు పనిచెయ్యటంలేదో తెలుసుకుని ఆ సమస్యని ఎదుర్కోవాలి తప్ప కేవలం రోగ లక్షణాలని కుదర్చడానికి మందులు వాడితే ఉపశమనం ఉంటుంది తప్ప జబ్బు నయం అవదు కదా. అందుకని రక్తపు వ్యాధులలో నైపుణ్యం ఉన్న వైద్యుడిని ("హెమటాలజిస్టు") సంప్రదించేను. అతని సలహా ప్రకారం సుందరమ్మ కడుపులో ఉన్న ప్లీహం (spleen) ని కత్తిరించి తీసెయ్యాలని నిశ్చయించేం. ఇది పిడికిలి ప్రమాణంలో ఉండే గోళాకారపు ఎర్రని గ్రంథి. ప్లీహం నుండి స్రవించే రసాలు తిష్టని ఎదుర్కోటానికి ఉపయోగపడతాయి. ఈ ప్లీహం తయారుచేసే ప్రతికాయాలు ("ఏంటీబోడీస్") పళ్ళెరాలని ఎదుర్కొని చంపుతాయి. కనుక ప్లీహాన్ని తీసేస్తే పళ్ళెరాల జనాభా పెరిగే అవకాశం ఉంది. కాని శరీరం రోగగ్రస్తం అవటానికి అవకాశాలు పెరుగుతాయి. ప్రస్తుత పరిస్థితులలో పళ్ళెరాల జనాభా పెంచవలసిన అవసరం ఎక్కువ ఉంది. తరువాత ఎప్పుడో తిష్ట వస్తే దానికి మరో మందు వేసుకోవచ్చు. ఇలా ఆలోచించి, సుందరమ్మకి నచ్చజెప్పి ప్లీహం తీసేశాం.

శస్త్రచికిత్స తరువాత సుందరమ్మ రక్తంలో పళ్ళెరాల సంఖ్య 333,000 వరకు పెరిగింది. చర్మం మీద కనిపించే మరకలన్నీ పోయి చర్మం తేట బారి ఆరోగ్యంగా కనబడటం మొదలయింది. శస్త్రచికిత్స పనిచేసినట్లే ఉందని సంతోషించేం.

మళ్ళా రెండు నెలల తరువాత సుందరమ్మని చూసేను. శస్త్రచికిత్స విజయవంతం అయిందని ఆమె, మా వైద్య బృందం ఏకగ్రీవంగా తీర్మానించేరు. కాని ఇప్పుడు మరో పుట్టెడు కొత్త లక్షణాల జాబితా రాసిన అరతావు కాగితం నా చేతిలో పెట్టింది ఆమె. "తరచుగా మూత్ర విసర్జన. అతిగా దాహం." దయబెటీస్ అనుకొని అన్ని పరీక్షలు చేయించేను. కాదని తేలింది. నిలకడ మీద, ఏ వైద్య సహాయం లేకుండానే, ఈ రెండు లక్షణాలు కూడ సర్దుకున్నాయి. నడుం నొప్పి, చేతి వేళ్ళల్లోనూ, కాలి వేళ్ళల్లోనూ సూదులతో గుచ్చినట్లు ఉంటోందిట. మళ్ళా మొదటి రోగం – నూరోడెర్మటైటిస్ – తలెత్తుతోందన్నమాట. ఆతృత, ఆరాటం, చిటపటలు, దురదలు – పాత కథ పునరావృత్తం అవుతోంది.

వైద్యానికి అవధులు ఉన్నాయి. సుందరమ్మ వంటి వ్యక్తులు తారసపడ్డప్పుడు అది వైద్యుడి చాకచక్యానికి ఒక అగ్ని పరీక్ష. వాళ్ళు గుక్క తిప్పుకోకుండా వంద లక్షణాలు చెప్పొచ్చు. వాటిల్లో కొన్ని మానసికమైనవి కావచ్చు. కొన్ని ప్రాణానికే ఎసరు పెట్టగల మౌలిక లక్షణాలు కావచ్చు. ఊక నుండి బియ్యాన్ని చెరిగినట్లు, వైద్యుడు ఈ లక్షణాలలో ముఖ్యమైనవేవో తేల్చుకుని ప్రాణం నిలబెట్టగలగాలి.

మన శరీరం అద్భుతమైనది. మనకి సర్వసాధారణంగా సంక్రమించే జులుబులు, దగ్గులు, నొప్పులు, మచ్చలు, దురదలు, మొదలైనవి ఎన్నో వాటంతట అవే సర్దుకుంటాయి. ఏ మందు వాడకుండానే! కొన్ని మందులు కొందరి మీద పని చేస్తాయి కాని అందరి మీదా పని చెయ్యవు. వైద్యశాస్త్రంలో మనకి తెలిసిన విషయాలకంటె తెలియనివే ఎక్కువ ఉన్నాయేమోనని అనిపిస్తూ ఉంటుంది. చర్మవైద్యం అంటే కదుపులో చల్ల కదలకుండా కాలు మీద కాలేసుకుని కూర్చుని రూపాయల చెట్టు కొమ్మ పట్టుకుని దులపటమే తరవాయి అనుకునేవాడిని!

**కథ వెనుక కథ**

ఈ కథలో వచ్చే పాత్రలు, వర్ణించిన సంఘటనలు, రోగాలు, మందులు అన్నీ నిజమైనవే. కథనం కోసం పాత్రల పేర్లు మార్చవలసి వచ్చింది.

# ఉపతాపి నేర్పిన పాఠం

మా పరీక్షా మందిరానికి ఉన్న చిన్న కిటికీ లోంచి బయటకి చూస్తే ఖాళీగా ఉన్న నిరీక్షా మందిరం, ఆ బయట కచ్చా రోడ్డు, ఆ రోడ్డుకి ఇరుపక్కలా ఎర్రటి ఎండలో మాడుతూన్న పూరిగుడిసెలు కనిపించేయి. ఇంక ఆట్టే వ్యవధి లేదు. చీకటిపడే లోగా కేలిఫోర్నియా చేరుకోవాలంటే ఇక్కడ మూటా, ముల్లె సర్దుకుని, కారు వచ్చే వేళకి సిద్ధంగా ఉండాలి.

మేము – అంటే కొంతమంది వైద్యులు, నర్సులు, దుబాసీలు, విమాన చోదకులు – అంతా కలసి మెక్సికోలో మారు మూలను ఉన్న ఈ చిన్న కుగ్రామానికి మొన్ననే వచ్చేం. కేలిఫోర్నియా–మెక్సికో సరిహద్దుకి దగ్గరగా ఉన్న చిన్న చిన్న ఊళ్లకి నెలకోసారి వచ్చి, ఒక వారాంతం ఇలా వైద్య శిబిరం వేసి అక్కడ ఉన్న బీదసాదలకి ఉచితంగా వైద్యం చెయ్యాలన్న సంకల్పమే ఈ ప్రయాణానికి కారణం. మమ్మల్ని సంప్రదించడానికి వచ్చే రోగులు ఆ మండుటెండలో, ఆ దుమ్మురేగుతూన్న రోడ్ల మీద నాలుగేసి గంటలు ప్రయాణం చేసి వస్తూ ఉంటారు. అందుకని శిబిరం కట్టేసేలోగా, మిగిలిన గంటలో, ఎవ్వరైనా వేచి ఉంటే చూడవచ్చు కదా అని కిటికీలోంచి చూసేను.

"ఇదిగో ఈ సినోరిటా తో ఆఖరు. ఈమెని చూసి పంపించేసరికి మన 'వేను' వస్తుంది. విమానం తయారుగా ఉంది." అంటూ మాతో పనిచెయ్యడానికి వచ్చిన ఒక స్వచ్ఛంద సేవకి చెప్పింది.

అలా ఆఖరు క్షణంలో వచ్చిన స్త్రీ వయస్సు ముప్పయి ట. కాని, చూడడానికి మరికొన్ని ఏళ్లు పైబడ్డట్టే కనిపించింది. ఈ ప్రాంతాలలో – ఈ ఎండలకి, సరి అయిన పోషణ లేక, జీవనపోరాటంలో అలసిపోవటం వల్ల – ప్రజలు వయస్సుకి మించి పెద్ద వాళ్లల్లా కనిపించడం కూడ సర్వసాధారణం.

బట్టకట్టు, తీరు సంసారపక్షంగానే ఉన్నాయి. అంత ఎండలోనూ ఒళ్లంతా కప్పే దుస్తులు, కూర్చోవడమా, నిలబడే ఉండడమా అనే తటపటాయింపు, దుబాసీ వైపు చూస్తూ మాట్లాడడమా, నా వైపే చూస్తూ మాట్లాడడమా అనే సంధిగ్ధత – ఈ లక్షణాలన్నీ చూసి సిగ్గేమో అని అనుకున్నాను.

ఆగంతకురాలిని కూర్చోబెట్టి మా దుబాసీ మాట్లాడడం మొదలుపెట్టేడు. ఆమె పేరు మరియా. ఎప్పుడూ నీరసంగా ఉంటుందిట. ఈ నీరసం ఈ నాటిది కాదు; కొన్ని ఏళ్లబట్టి ఉందిట. నెల్లాళ్ల కిందటే వాళ్ల ఊళ్లో ఒక డాక్టర్ ని సంప్రదించిందిట.

"నాకు 'ఎనీమియా' ఉంది అని చెప్పేరు."

మరియాని మరోసారి ఎగా దిగా చూసేను. రక్తలేమి — ఎనీమియా — లక్షణాలేవీ నాకు పొడచూపలేదు.

"మీ ఊరి డాక్టరు రక్తం పరీక్ష చేసే చెప్పేడా?"

"లేదు. నా కళ్లు చూసి చెప్పేరు."

ఇప్పటికీ మన దేశంలో కూడ వైద్యులు కింది రెప్పని కిందికి లాగి చూస్తారు. రెప్ప లోపలి భాగం పాలిపోయినట్లు ఉంటే రక్తలేమి అని నిర్ధారిస్తారు. రక్తానికి ఎరుపు రంగునిచ్చే రక్తచందురం బాగా లోపిస్తే తప్ప కంటి రెప్ప లోపలి భాగం పాలిపోయినట్లు అంత త్వరగా కనిపించదు. ఈ సిద్ధాంతాలు ఎలా ఉన్నా మరియాకి రక్తలేమి దోషం ఉందని నాకు అనిపించలేదు.

మరి మరియాకి రక్తలేమి దోషం ఉందని ఎవ్వరు చెప్పేరో నాకు తెలియదు: నాటు వైద్యుడు కావచ్చు, వైద్యం చదువుకున్న పండితమ్మన్యుడు కావచ్చు లేదా ఏ వైద్యుడి దగ్గర పని చేసిన బంటో బల్ల కట్టి వైద్యం చేసేస్తూన్నా ఆశ్చర్యపోను.

"ఆ వైద్యుడు మందు ఏదైనా ఇచ్చేడా?"

"ఇచ్చేడు."

"ఆ మందు వేసుకున్నావా?"

"వేసుకున్నాను."

"గుణం కనిపించలేదా?"

"లేదు."

రక్తలేమి, లేదా ఇంగ్లీషులో ఎనీమియా, మనిషిని నీరసపరచే రోగమే. కాదనను. పిన్న వయస్సులో ఉన్న ఆడవాళ్లకి రక్తలేమి వచ్చిందంటే దానికి కారణం శరీరంలో ఇనుము కొరత. ఈ కొరతకి ముఖ్య కారణం రుతుసమయంలో పోయే రక్తం. కాని మరియా రుతుస్రావం మోతాదు మించి లేదని చెబుతోంది. ఆమె మరేవిధంగాను రక్తం నష్టపోవటం లేదని ప్రశ్నల మీద తేలింది. ఇంతకు పూర్వం ఎప్పుడూ కూడ ఈమెలో రక్తలేమి పొడచూపలేదు.

మరియాని పూర్తిగా పరీక్ష చేసి చూసేను. ముఖం పాలిపోయినట్లు లేదు. గుండె జోరుగా కొట్టుకోవడం లేదు. ఈ రెండు లక్షణాలు రక్తలేమి సూచికలు. ఇటువంటి పరిస్థితులలో రక్త పరీక్ష చేస్తే అనుమానాలన్నీ పటాపంచలైపోతాయి. కాని ఈ 'శంకరగిరి మన్యాలలో' రక్త పరీక్ష సాధ్యం కాదే. నిజంగా నీరసమే కారణం అయితే ఈమె, ఈ ఎండలో, ఇంత దూరం, ఒంటరిగా ఎందుకు వస్తుంది? ఇక్కడేదో మర్మం ఉంది.

నీరసం అనేది వైద్యులు ఎదుర్కొనే సర్వసాధారణమైన లక్షణం. కారణం కేన్సరు కావచ్చు. లేదా, నిద్ర సరిపోకపోయినా నీరసం వస్తుంది. ఉపతాపి వచ్చి "నాకు నీరసంగా ఉంది, మందు ఇవ్వండి," అని అడిగితే ఏ మందని ఇస్తాం? ఆ నీరసానికి కారణం తెలియాలి కద. రోగి మరే ఆధారమూ ఇవ్వకపోతే వైద్యుడు అ నుండి బండిర వరకు అన్ని కారణాలు వెతకాలి. వెతికేను. నా మెదడులో దాచుకున్న రోగాల జాబితాని అకారాది క్రమంలో వెతికేను. చివరికి మిగిలిందేమిటి? సున్న. పెద్ద బండి సున్న. ఇదే పరిస్థితి మా ఊళ్లో ఉన్నప్పుడు ఎదురైతే రక్తం పరీక్ష అనీ, ఎక్సు-రే అనీ, రకరకాల పరీక్షలు చేయించి ఉండేవాడిని.

ఇక్కడ? కుళాయి లోంచి నీళ్లు వచ్చి విద్యుత్ దీపాలు వెలిగితే పరమానందం పడిపోతాం. కనుక రక్తపు పరీక్షల వంటి విలాసాల గురించి ఆలోచించడం దండగ.

మరియా వైపు మరొక సారి చూసేను. ఈమె వచ్చి ఇరవై నిమిషాలు అవుతోంది. ఇంతవరకు ఈమె నా వైపు కాని, దుబాసీ వైపు కాని కన్నెత్తి చూడలేదు. మొదట్లో సిగ్గు అనుకున్నాను. తరువాత అమెరికా నుండి వచ్చిన పెద్ద డాక్టరు వైపు చూడడానికి భయం అనుకున్నాను. ఇది సిగ్గూ కాదు, భయమూ కాదు, విచారం అని అనుమానం వేసింది.

ఆమె ముఖం లోకి మరోసారి చూసేను. ముఖంలో ఎక్కడా ఉద్వేగం లేదు. భుజాలు దిగజారిపోయి ఉన్నాయి. ఆమె మాట్లాడుతూన్నప్పుడు చేతులతో భంగిమలు చెయ్యడం కనబడలేదు. మాటల్లో ఉదాత్త అనుదాత్త స్వరాలు వినబడలేదు. ముఖకళవళికలలో చలనం లేదు. ఆమె మాట్లాడే స్పేనిష్ భాష నాకు అర్థం కాకపోయినా ఈ లక్షణాలకి భాషతో ప్రమేయం లేదు. తటాలున నా మనస్సులో మెరుపులా ఒక ఆలోచన వచ్చింది.

దుబాసీ వైపు తిరిగి, "సంసారంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అడుగు," అన్నాను.

ఆమెకి ఇద్దరు పిల్లలుట. చిన్నవాడికి ఒక ఏడు నిండింది. ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారుట. కాని వాళ్లని సాకడం అంటే ఎడతెగని పని. మొగుడు ఇంట్లో వేలెత్తి పని సహాయం చెయ్యడుట. పైపెచ్చు ప్రతి రోజూ మస్తుగా తాగి వస్తాడుట. తలకి మించిన పని భారంతో సతమతం అవుతోందిట.

“ఈ బాధలు పడలేనప్పుడు ఏడుస్తావా?”

“రోజూ.”

“ఈ బాధలు పడలేనప్పుడు చచ్చిపోతే బాగుండుననిపిస్తుందా?”

ఈ ప్రశ్నకి సమాధానంగా మెడ నుండి పాదాల వరకు కప్పుకున్న బురఖాలాంటి గుడ్డని తొలగించి చేతులు చూపించింది.

రెండు చేతులకీ, మణికట్టు దగ్గర కత్తిగాట్లు కనిపించేయి. బహుశా ఏ రెండు వారాల క్రితమో తగిలి, మానిన కత్తి దెబ్బల గాట్లు అవి!

ఆ గాట్లు ఎవరి వల్ల కలిగేయో తెలుసుకోవాలి. తాగొచ్చిన మొగుడు దౌర్జన్యం చేసేడా? లేక పోతే, ..... రెండు నిమిషాలు ఆలోచించి, కొంచెం తటపటాయించి, “ఇది నీ పనేనా?” అని అడిగేను.

ఒంచిన తల ఎత్తకుండా, నేల మీదే ఎక్కడికో చూస్తూ, “సీ” అని సమాధానం చెప్పింది.

ఈ “సీ” తో ఆమె అసలు రహశ్యం బయటపడింది. నిరాశావృతం అయిన ఆమె జీవితానికి పరిష్కారం దొరక్క, నిస్పృహతో, తన పిల్లల యెడల తనకున్న భాద్యతలని కూడ విస్మరించి – ఒక్క క్షణ కాలం – ఆమె అఘాయిత్యానికి తలపెట్టింది. ఒంచిన తల ఎత్తకుండా ఉండడానికి కారణం స్త్రీ సహజమైన సిగ్గు కాదు. తను తలపెట్టిన పనికి తలెత్తుకు తిరగ లేక.

పాశ్చాత్య దేశాలలో మానసిక వైద్యుడి దగ్గరకి వెళ్ళడంలో నామోషీ లేదు. ప్రతి చిన్న విషయానికి మానసిక వైద్యుణ్ణి గంట సేపు సంప్రదించి, రెండొందలు చెల్లించుకుని, వస్తూ ఉంటారు వీళ్లు. కాని సనాతన ఆచారాలు పాతుపోయిన దేశాలలోను, బడుగు దేశాలలోనూ, వర్ధమాన దేశాలలోనూ, మానసిక వైద్యుణ్ణి సంప్రదించడం అంటే నామోషీ.

మానసిక రుగ్మతలు ఎన్ని ఉన్నా చాపకిందకి తోసెస్తారు తప్ప పైకి పొక్కనివ్వరు. అందువల్లనే మరియా సాయంత్రం వరకు ఆగి, మా క్లినిక్ మూసేసే వేళకి, రోగులంతా వెళ్లిపోయిన తరువాత, అంత ఎండలోనూ, ఒంటి నిండా బట్టలు కప్పుకుని, వచ్చింది – ఎవ్వరైనా చూస్తే గుర్తు పడతారేమోనన్న భయంతో.

విపరీతమైన విచారం, ఆత్మ న్యూనత, విలాసాల మీద అయిష్టత – ఇవన్నీ ‘డిప్రెషన్’ అనే మానసిక రుగ్మతకి లక్షణాలు. ఈ మానసిక ప్రేరణాలు భౌతికమైన లక్షణాలుగా కూడ పొడచూపుతాయి: ఆకలి లేకపోవడం, నిద్ర పట్టకపోవడం, అలసట, నీరసం. మానసిక లక్షణాలు చెబితే పిచ్చివాళ్లల్లా జమకట్టేస్తారేమోనని సాధారణంగా రోగులు వైద్యుడి దగ్గరకి వెళ్లినప్పుడు ఈ భౌతిక లక్షణాలని ఏకరవు పెడతారు. డిప్రెషన్ ని గుర్తించడం ప్రగతి సాధించిన పాశ్చాత్య దేశాలలోనే కష్టం. అటువంటిది, అసలు లక్షణాలని కప్పెట్టి వడ్డీ లక్షణాలని ఎత్తి చూపే బడుగు దేశాలలో డిప్రెషన్ ని గుర్తించడం కష్టతరం.

నాకు విమానానికి వేళ అయిపోతోంది. ఆత్మహత్యకి తలపెట్టిన ఈ పిల్లల తల్లికి నేను ఏ విధంగా సహాయం చెయ్యగలను? ముందుగా మరియాని బాధిస్తూన్న రోగం ఏమిటో ఆమెకి వివరంగా చెప్పేను. మానసిక రోగాలు సర్వసాధారణం, ప్రపంచ వ్యాప్తం అని కూడ బోధ చేసేను. శరీరానికి రోగం వస్తే మందు వేసుకున్నట్లే మనస్సు దెబ్బ తింటే దానికి కూడ మందులు ఉన్నాయనీ, వాటిని వాడడం సంఘంలో తలవొంపులకి దారి తియ్యదనీ నచ్చచెప్పేను.

మరియాకి మరొక విషయం కూడ చెప్పేను. ఇందులో ఆమె చేసిన తప్పు కాని, పాపం కాని ఏదీ లేదని మరీ మరీ చెప్పేను. మందులు వేసుకుంటే కొంత కాకపోయినా కొంత ఊరట కలుగుతుందని ప్రోత్సాహ పరచేను. “నేను డాక్టర్ని. నేనేమిటి చెబుతున్నానో నాకు తెలుసు” అంటూ మరియాకి నా మాటల మీద నమ్మకం కలగాలని స్వోత్కర్ష అయినప్పటికీ ఉపదేశ వాక్యాలు చెప్పేను. మా క్లినిక్ లో మందుల కంపెనీలు దానంగా ఇచ్చిన మందులు కొన్ని ఉన్నాయి. వాటిల్లోంచి డిప్రెషన్ కి పనికొచ్చే మందుసీసా ఒకటి, నెల్లాళ్లకి సరిపడా, ఇచ్చి ఆ మందు రోజూ వేసుకుని, నెల్లాళ్లు పోయిన తరువాత మళ్లా క్లినిక్ కి రమ్మనమని చెప్పేను. “నేను రాకపోయినా ఎవరో ఒకరు చూసి మళ్లా మందు చీటీ రాసిస్తారు” అని చెప్పేను.

మందు మాత్రలు అంటే ఇచ్చేను కాని మానసిక రోగానికి ఒక “పెద్ద దిక్కు సలహాదారు” అంటూ ఒకళ్లు ఉండాలి. అంటే మన బాధని సానుభూతితో వినే నాథుడు ఉండాలి. బడుగు దేశాలలో అయితే మనకి తాతలో, అవ్వలో, అత్తలో, స్నేహితులో, ఎవ్వరో ఒకరు ఉంటారు. మన గోడు వాళ్ల దగ్గర వెళ్లబోసుకుంటాం. మన ఇళ్లల్లో మన ముసలమ్మలే మనకి మానసిక వైద్యులు. గంటకి రెండు వందలు పుచ్చుకోకుండా పని చేసి పెడతారు. అందుకని మరియాని అడిగేను.

“నీ కష్టసుఖాలు చెప్పుకోడానికి, నీతో చనువుగా ఉండి నీ హితవు కోరే వారెవరైనా ఉన్నారా?” అని అడిగేను.

“మా చెల్లెలు ఉంది. ఒక మంచి స్నేహితురాలు కూడ ఉంది.”

"అయితే నువ్వు ఇక్కడికి వచ్చిన వైనం, నేను మందు ఇచ్చిన వైనం వారితో చెప్పి, మానసిక రోగం సర్వసాధారణం అని డాక్టరు గారు చెప్పేరనిన్నీ, దీనికి మందులు ఉన్నాయని చెప్పేరనిన్నీ చెప్పు. ఛెప్పి గుండె మీద బరువు దింపుకో. నీ పిల్లలని సాకుతూ, నెల తిరిగిన తరువాత మళ్లా వచ్చి డాక్టరుని చూడు."

అలాగే అన్నట్లు తల ఆడించింది.

నేను చెప్పినది అంతా అర్థం అయిందో లేదో అని ఆమె ముఖ కళవళికలు పరీక్షగా చూసేను. ముఖంలో మార్పు ఏమీ కనిపించలేదు.

అరగంట తిరిగేసరికి 6,000 అడుగుల ఎత్తున ఇంటికి వెళ్లే చిన్న విమానంలో ఉన్నాను.

రెండు నెలలు పోయిన తరువాత మా బృందంలో పనిచేసే మరొక వైద్యుడు తటస్థ పడ్డాడు. అతను మరియాని నెల కిందట చూడడం జరిగిందిట. బాగా మెరుగ్గా ఉందని చెప్పేడు. నేనిచ్చిన మందు సీసా అయిపోతే మరొక సీసా ఇచ్చేరుట.

మరియాలో కనిపించిన మార్పుకి కారణం ఎక్కడుందా అని ఆలోచించేను. ప్రాణాంతకమైన రోగం ఎదురైనప్పుడు పరికరాలు, పనిముట్ల కంటె వైద్యుడి సమయస్ఫూర్తి, పనితనం ముఖ్యం. ఒకొక్కప్పుడు వైద్యం చెయ్యడానికి కావలసిన మొదటి పరికరం వినే చెవి. ఉపతాపి గదులోంచి ఎప్పుడు వెళుతుందా అని ఎదురు చూడకుండా చెప్పినవన్నీ జాగ్రత్తగా వినడం మొదటి మెట్టు. కావలసిన రెండో పరికరం వైద్యుడి కన్ను. వైద్యుడు రోగిని పరీక్షగా చూస్తూ, చెప్పేది వింటూ, నోటితో చెప్పని విషయాలని చేష్టలని బట్టీ, కళవళికలని బట్టీ సంగ్రహించాలి. ఇదీ నేను నేర్చుకున్న పాఠం.

**కథ వెనుక కథ**

ప్రచురణ: వాకిలి (http://vaakili.com/patrika/) ఆగష్టు 2013

ఈ కథలో వచ్చే పాత్రలు, వర్ణించిన సంఘటనలు, రోగాలు, మందులు అన్నీ నిజమైనవే. కథనం కోసం పాత్రల పేర్లు మార్చవలసి వచ్చింది.

# శృతి మించిన రాగం

ఉదయం నా చికిత్సాలయంలో నిరీక్షామందిరం నిండుగానే ఉంది.  అప్పుడే పరీక్షా మందిరంలో  ఒక  ఉపతాపిని పరీక్షించి ఆ పరీక్షకి సంబంధించిన  విషయాలు నా దస్త్రంలో రాసుకుందుకని నరసమ్మ బల్ల దగ్గర ఆగేను. ఎవ్వరో కొత్త ఉపతాపి అనుకుంటాను. తలుపు తెరుచుకుని లోపలికి వచ్చి నరసమ్మ బల్ల దగ్గర ఆగింది.  అంతస్తుకి తగ్గట్టు ధరించిన దుస్తులతో  ఆమె చూడటానికి నాజూగ్గాను, ఆరోగ్యంగానూ కనిపించింది.  వైద్యుడిని చూడటానికి వచ్చేవారంతా మూలుగుతూ,  ముక్కుతూ ఉండాలని నియమం ఏముంది? కొత్తగా వైద్యుడిని చూడటానికి వచ్చేవారంతా రివాజుగా నింపవలసిన కాగితం ఆమెకి అందించింది మా నరసమ్మ. అట్టకి తగిలించిన కాగితం అందుకుంటూ  ఆమె కుప్పలా కూలిపోయింది.

"నొప్పి" అంటూ  ఆక్రోశించలేదు.  ఛాతీని చేత్తో అదిమి పట్టుకోలేదు. తలపోటు ఉన్నట్లు ఆమె కళవళికలలో కనిపించలేదు.  కాళ్లల్లో సత్తువ ఉడిగితే మోకాళ్ల దగ్గర కాళ్లు మడతపడి, ఏ కుర్చీనో, తలుపునో, గోడనో ఆసరా చేసుకుని కూలబడతారు. ఆ లక్షణాలు ఏవీ లేవు. మొదలు నరికిన మానులా, నిలబడ్డ మనిషి కాస్తా గభాలున నేల మీద పడిపోయింది.

ఇదంతా నా కళ్ల ఎదుటే క్షణంలో జరిగిపోయింది. మెళ్లోనే ఉన్న స్థెతస్కోపుని చేతులోకి తీసుకుంటూ తలుపు తెరుచుకుని వరండాలోకి పరిగెట్టేను. వైద్య కళాశాలలో ఉన్నప్పుడు పాఠాలు వల్లే వేయించే వారు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోటానికి వాడే మంత్రం పేరు, "ఎ,బి,సి." ఎవ్వరైనా స్పృహతప్పి పడిపోతే ముందు చూడవలసినవి: ఎ – "ఎయిర్ వే" లేదా గాలి గొట్టం. బి– "బ్రీదింగ్" లేదా ఊపిరి. సి– "సర్క్యులేషన్" లేదా రక్తప్రసరణ. గాలిగొట్టానికి ఏదీ అడ్డు పడలేదు కదా? ఊపిరి ఆడుతోందా? రక్తం ప్రవహిస్తోందా?

ఆమె కింద పడిపోయిన ఉత్తరక్షణంలో ఆమె పక్కకి చేరి, ఆమె మెడమీద గాలిగొట్టానికి పక్కని చెయ్యి పెట్టి అక్కడ నాడి కొట్టుకోవటం చూసి సంతృప్తి పడ్డాను. ఊపిరి  కూడ బలంగానే ఉంది.  అంటే గుండె ఆగిపోలేదు. ఊపిరి ఆగిపోలేదు. ప్రాణానికి ఇప్పట్లో అపాయం లేదని ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాను. ఇంతలోనే ఆమె కళ్లు తెరచింది.

"ఏమమ్మా,  ఏమయింది? ఒంట్లో బాగా లేదా? " అని అడిగేను. ఒంట్లో బాగుంటే అమాంతం అలా ఎందుకు పడిపోతుంది? కాని ఏదో ప్రశ్న అడిగి ఆమె మన లోకంలో ఉందో లేదో తేల్చుకోవాలి కదా?

"బాగానే ఉన్నాను" అంటూ లేవబోయింది.

గొంతుక లోతుల్లోంచి నీరసంగా వచ్చిన ఆ సమాధానం ఆమె బాగా లేదని చెబుతోంది. మళ్లా స్పృహతప్పి పడిపోతుందేమోనన్న ఆరాటంతో ఆమెని కదలనివ్వకుండా, అలా నేల మీదే పడుక్కోనిచ్చి, ఇంకా పరీక్ష చేస్తున్నాను.

జలుబులు, జ్వరాలు, దగ్గులు మొదలైన చిల్లరమల్లర ఇబ్బందులతో ఈమె కంటె ముందు వచ్చి నిరీక్షిస్తూన్న రోగులు అక్కడే ఉన్నారు. అలా ముందొచ్చిన చెవుల కంటె ఇలా వెనకొచ్చిన కొమ్ములు వాడి అని ఎవ్వరూ ఈర్ష్య పడ్డట్లు కనబడలేదు. ఆగంతకురాలి పరిస్థితిని అందరూ ఆతృతతో చూస్తున్నారు.

కొద్ది క్షణాలలో సొమ్మసిల్లిన ఆ వ్యక్తి పూర్తిగా కోలుకున్నట్లే కనిపించింది. ఈ ఉదంతం అంతటికీ – ఆది నుండి అంతం వరకు – ఒక నిమిషం కంటె ఎక్కువ సేపు పట్టలేదు. మా నర్సు ఆమెని పరీక్షా మందిరంలోకి నడిపించుకుని తీసుకెళ్లింది.

ఉన్నపాటున ఒంటి మీద స్మారకం పోయి, క్షణాలలో పరిస్థితి కుదుట పడినప్పుడు దానిని వైద్య పరిభాషలో "సింకొపీ" అంటారు. దీనినే సామాన్యపు ఇంగ్లీషులో "ఫెయింటింగ్" అంటారు. దీనిని తెలుగులో స్పృహ తప్పటం అనొచ్చు.

సర్వసాధారణంగా (అంటే, ఏభయ్ శాతం) స్పృహ తప్పటానికి ముఖ్య కారణం మెదడుకి వెళ్లే రక్త ప్రవాహానికి ఆటంకం రావటం. గుండె కొట్టుకోవటం, తద్వారా రక్తపు పోటు సమ మట్టంలో ఉండటం అనేవి మెదడు పర్యవేక్షణలో జరిగే పనులు. ఈ పర్యవేక్షణకి మన కపాలంలో ఉండే నాడీతంతువు ఒకటి ఉపయోగపడుతుంది. ఈ నాడీతంతువుని "వేగస్ నెర్వ్" అంటారు. మన మెదడు అడుగు భాగంలో ఉన్న "మెడుల్లా అబ్లాంగేటా" దగ్గర బయలుదేరి, మెడ గుండా కిందకి దిగి, ఛాతీ లోంచి ఉదరకుహరం వరకు వెళుతుంది ఈ తంతువు. కొందరిలో అతి చిన్న ప్రేరేపణకి కూడ ఈ నాడి స్పందించి గుండె కొట్టుకునే జోరుని తగ్గిస్తుంది. దానితో రక్తపుపోటు పడిపోయి , మెదడుకి ప్రవాహం తగ్గుతుంది. అప్పుడు స్పృహ తప్పుతుంది.

ఈ వేగస్ నెర్వ్ ని రెచ్చగొట్టటానికి చిన్న కారణం చాలు. అందుకనే కొందరు రక్తం చూసినా చాలు స్పృహ తప్పుతారు. కొందరు ఇంజక్షన్ చేసే సూదిని చూస్తే చాలు మొహం తిరిగి పడిపోతారు. ఇలా భయం పుట్టటానికి ఫలానా అని కారణాల జాబితా అంటూ ఏదీ ఉండక్కరలేదు. కారణం ఏది అయినప్పటికీ గుండె కొట్టుకునే జోరు తగ్గిందంటే తగిన మోతాదులో మెదడుకి రక్తం అందదు. అప్పుడు తగినంత మోతాదులో ఆమ్లజని మెదడుని చేరదు. అప్పుడు స్పృహ తప్పుతాం. మనకి కారణం ఇదమిత్థంగా తెలియదు కాని, మగవారిలో కంటె ఆడవారిలో ఈ రకం స్పృహ తప్పటం ఎక్కువ. ఇలాంటి సంఘటనలు చూసే కాబోలు వారిని అబలలు అన్నారు.

స్పృహ తప్పటానికి  మరో కారణం  ఉంది. మెదడు నుండి వార్తలు సరిగ్గా అందుతున్నా సరే, గుండెకాయ కట్టడిలో లోపాల వల్ల  గుండె రక్తాన్ని సరిగ్గా పంపు చెయ్యలేకపోవచ్చు.  పదింట ఒకరిలో  స్పృహ తప్పటానికి ఇది కారణం కావచ్చు. అందుకని పరీక్షా మందిరానికి వెళ్లే దారిలోనే  "ఏ రకమైన గుండె జబ్బయినా  ఉందా?"  అని ఆమెని అడిగేను. అటువంటి సమస్యలు ఏవీ లేవని చెప్పిందామె.

పోతే, స్పృహ తప్పటానికి మూడో కారణం  కూర్చున్న వాళ్లు లేచినప్పుడల్లా రక్తపుపోటు అకస్మాత్తుగా పడిపోవటం. ఈ రకం మనలో చాల మందికి అనుభవం అయి ఉంటుంది. గ్రంథాలయంలోని బీరువాలలో అట్ట అడుగు వరసలో పుస్తకాలు చూడటానికి కూర్చుంటాం. అక్కడ కావలసిన పుస్తకం ఉండదు. పైవరసలో చూద్దామని లేచి నిలబడతాం. ఒక్కసారి లేచేసరికి కళ్లు చీకట్లు కమ్ముతాయి.  కాని త్వరలోనే తేరుకుంటాం.  అందుకనే నేల మీద కూర్చున్నవాళ్లు ఆసరా లేకుండా గభీమని లేచి నిలబడకూడదు.  ఇలా కళ్లు చీకట్లు కమ్మటానికి కారణం మనని రక్షించటానికి మన శరీరంలో  ఉన్న సంతులన యంత్రాంగమే!   కాని అప్పుడప్పుడు ఆ యంత్రాంగం సరిగ్గా పని చెయ్యదు.  దీనికి మళ్లా ఎన్నో కారణాలు ఉండొచ్చు. "పార్కిన్సన్  జబ్బు"  ప్రభావం కావచ్చు. మనం వేసుకున్న మందుల ప్రభావం కావచ్చు. శరీరానికి నీటి సరఫరా చాలినంత లేకపోతే అది కూడ రక్తపు పోటు పడటానికి, తద్వారా స్పృహ తప్పటానికి కారణం కావచ్చు.  అందుకనే  తరచు నీళ్లు తాగటం  మంచి అలవాట్లలో ఒకటి.

నర్సు అస్వస్థురాలిని పరీక్షామందిరంలో బల్ల మీద కూర్చోబెట్టింది.  మనిషిలో చలాకీతనం కనిపించలేదు. ఏదో పరాగ్గా ఉన్నట్లు ఉంది తప్ప మనలో మనిషిలా లేదు. అయినా సరే మాట్లాడిస్తున్నాను. రాత్రి ఇంటికి ఆలశ్యంగా వచ్చిందిట. వండుకుందుకి ఓపిక  లేకపోయిందిట.  బద్ధకంగా బల్ల మీద ఉన్న టొమేటోలు, బుట్ట మిరపకాయలు, కేరట్లు కత్తితో కోసుకుని తిని పడుక్కుందిట. "తింటూన్నప్పుడు రుచికి తమాషాగా అనిపించేయి.  పెదవులు తిమ్మిరెక్కినట్లయింది. ఉదయం లేచేసరికి ఒంట్లో నలతగా ఉన్నట్లనిపించింది.  మా  పక్కింటావిడ మిమ్మల్నొకసారి చూసి రమ్మని పంపించింది."  అని వివరణ ఇచ్చింది ఆమె.

రక్తపు పోటు ఎంతుందో అని కొలిచి చూసేను. బాగా తక్కువగా ఉంది.  అందుకనే మనిషి తోటకూర కాడలా జవసత్వాలు లేకుండా ఉంది.  రక్తపు పోటుని మరొక సారి  కొలుస్తూ, ఈ సారి మోచేతి మడత దగ్గర  స్తెతస్కోపు పెట్టి విన్నాను.  రక్త ప్రవాహపు శబ్దం వినబడలేదు. మణికట్టు దగ్గర వేళ్లు పెట్టి నాడి ఎంత జోరుగా కొట్టుకుంటున్నాదో అని చూసేను.  రక్తపు పోటు చాల ప్రమాదకరమైనంత తక్కువగా ఉంది.  సాధారణంగా రక్తపు పోటు 120 ఉంటుంది. ఈ విలోకనాంకం 90 దగ్గర ఉంటే అది తక్కువ కిందే లెక్క. ఈ విలోకనాంకం 80 దగ్గర ఉంటే   ఆ పరిస్థితిని వైద్య పరిభాషలో "షాక్" అంటారు.  ఈ పరిస్థితిని తెలుగులో ఘాతం అందాం.  ఇంగ్లీషులో అన్నా, తెలుగులో అన్నా శరీరం

"దెబ్బ" తిందని అర్థం. బల్ల మీద కూర్చున్న ఈమె యొక్క రక్తపు పోటు విలోకనాంకం 70 ఉంది! ఇంకా బతికే ఉందంటే ఆశ్చర్యంగానే ఉంది.

వెంటనే కూర్చున్న మనిషిని పడుక్కోబెట్టేను. రక్తపు పోటు మళ్లా కొలిచి చూసేను. ఇప్పుడు విలోకనాంకం 80 కి పెరిగింది. ప్రమాద పరిస్థితిలో మార్పు లేదు. ప్రాణం పోయినా పోవచ్చు. ఈమెని పెద్దాసుపత్రికి సత్వరం తీసుకెళ్లటానికి అంబులెన్సుని పిలవమని మా సిబ్బందితో చెప్పి, ప్రథమ చికిత్స మొదలు పెట్టేను.

ప్రస్తుతం నా ఎదురుగా ఉన్న నిదర్శనాలని బట్టి ఈ అమ్మాయికి వచ్చిన ఘాతానికి కారణం "ఎలర్జీ" అని నిర్ణయించి వైద్యం ప్రారంభించేను. ఎలర్జీ అంటే ఏదో పడని వస్తువు శరీరంలో ప్రవేశించటంతో శరీరానికి సహజంగా ఉండే రక్షరేకు రంగంలోకి దూకి మితిమీరి స్పందించటం.

గాలిలో ఉండే పుప్పొడి రేణువులు శరీరం లోకి వెళితే ఈ రకం స్పందన వల్ల తుమ్ములు వస్తాయి. ముక్కులోను, చెవులలోను ఉన్న సొరంగాలు వాచి ముక్కు దిబ్బడ వేస్తుంది. వసంతకాలంలో ఈ రకం స్పందనవల్ల చాల మంది ఇబ్బంది పడతారు. కాని తినే వస్తువులు పడక పోయినా, తేనెటీగలు, కందిరీగలు కుట్టినా కొందరి శరీరాల్లో రక్షరేకు మితిమీరి స్పందిస్తుంది. శత్రువు నైజం తెలియకపోతే ఒక ప్రణాళికా బద్ధంగా రక్షించటం కష్టం కదా. అటువంటి సందర్భాలలో శత్రుసైన్యాలనుండి రక్షించటానికి కోట ద్వారాలన్నీ బంధించేసినట్లు, ఇలా మితిమీరి స్పందించిన ఈ రక్షరేకు శరీరంలోని అవయవాలన్నిటిని బంధించెస్తుంది. ఈ హడావిడిలో గుండె, మూత్రపిండాలు, వగైరా కీలకమైనవి కూడా బంధించుకుపోతే మనిషి ప్రాణాలు పోతాయి.

ఈ రకం దెబ్బని ఇంగ్లీషులో "అనాఫిలేక్టిక్ షాక్" అంటారు. ప్రమాదం రాకుండా కాపుదల కోసం ముందుగా జాగ్రత్తపడటాన్ని "అనాఫిలేక్సిస్" అంటారు. శత్రువుల బారి పడకుండా కోట చుట్టూ కందకం తవ్వేమంటే మనల్ని మనం రక్షించుకోటానికి ముందుచూపుతో చేసిన పని అది. అలాగని ఈ భయం శృతి మించి రాగాన పడి ఊరంతా గోతులు తవ్వుకుంటామా? ఏ పిచ్చి తుగ్లక్కో అటువంటి పని చేసేడనుకుందాం. అప్పుడు ప్రజలు నిశ్చేష్టులయితే దానిని "అనాఫిలేక్టిక్ షాక్" తో పోల్చవచ్చు.

పడని వస్తువు శరీరంలో ప్రవేశించినప్పుడు శరీరం ఎలా స్పందిస్తుందో, ఎంత జోరుగా స్పందిస్తుందో చెప్పలేం. సాధారణంగా ఈ "పడని" వస్తువులు ఆహారపదార్థాలు అవుతాయి. వీటిల్లో కూడ పిక్కలు (వేరుశనగ, జీడి, బాదం, మొదలైనవి), చేపలు (రొయ్యలు, మొదలైనవి), మిరపజాతి ముఖ్యమైనవి. తరువాత చెప్పుకోదగ్గవి కందిరీగలు, తేనెటీగలు కుట్టడం వల్ల వచ్చే ఆపదలు. ఆ తరువాత చెప్పుకోదగ్గవి మందులు. కొందరికి ఏస్పిరిన్ పడదు. కొందరికి

పెనిసిలిన్ పడదు.  పడకపోవటం వల్ల ప్రస్ఫుటం అయే లక్షణాలు  అనేకం. కొందరికి ఒంటినిండా దద్దుర్లు లేస్తాయి. కొందరికి ఒళ్ళు చిటపటలాడుతుంది. కొందరికి ఒళ్ళంతా దురద వేస్తుంది. వీటిని తట్టుకోవచ్చు.  కొందరికి ఉబ్బసం లక్షణాలు పొడచూపుతాయి. మరికొందరికి ఊపిరి ఆడదు. అదృష్టం బాగులేకపోతే రక్తపు పోటు పడిపోతుంది. ఆ దెబ్బకి గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది.

ఈ చయనిక ప్రక్రియ ఎలా జరుగుతుందో చూద్దాం. పరాయి వస్తువు శరీరంలో ప్రవేశించినప్పుడు, శరీరం ఆ సంగతి గుర్తు పడుతుంది.  వెంటనే "హిస్టమీన్" అనే రసాయనం రక్తప్రవాహంలోకి విడుదల అవుతుంది.  కాని ఈ పరాయి వస్తువు "పడని" వస్తువు అయినప్పుడు శరీరం విడుదల చేసే ఈ హిస్టమీన్ శృతి మించి రాగాన పడుతుంది. మోతాదు మించి హిస్టమీన్ రక్తంలో ఉంటే రక్తనాళాలకి స్వతహాగా ఉండే స్థితిస్థాపకత పోవటమే కాకుండా  నాళాలలోని రక్తం బయటకి చిమ్మడం మొదలవుతుంది.  స్థితిస్థాపకత కోల్పోయినా సరే ధమనులలో రక్తం గుండె తోపుడు వల్ల ముందుకి జరుగుతుంది. కాని సిరలలో రక్తం ప్రవహించాలంటే అవి ముకుళించుకుని వికసిస్తూ ఉండాలి. అంటే వాటికి స్థితిస్థాపకత  ఉండాలి. స్థితిస్థాపకత  లేని నాళాలలో రక్తం  గుండె వైపు ప్రవహించలేదు.  దానితో పంపు చెయ్యటానికి చాలినంత రక్తం  గుండెకి అందదు.  అందువల్లనే రక్తపు పోటు పడిపోతుంది. అదే ఘాతం (షాక్) అంటే. ఇటువంటి సమయంలో రోగిని పడుక్కోబెట్టాలి. ఘాతం పడుక్కుని ఉన్నప్పుడు కూడ  జరగవచ్చు, కాని కూర్చున్న పరిస్థితితో పోల్చితే మెరుగు.

తిమ్మిరెక్కినట్లు ఉన్న పెదవులు, పడిపోయిన రక్తపు పోటు – ఈ రెండు లక్షణాలని ఆసరాగా చేసుకుని ఇది "అనాఫిలేక్టిక్ షాక్" అనే రోగనిర్ణయానికి వచ్చేను తప్ప  పరీక్షలు చేసి నిర్ధారించటానికి వ్యవధి లేదు.  ఇవే లక్షణాలకి ఇతర కారణాలు ఉంటే ఉండొచ్చు. కాని ఈ పరిస్థితులలో "అనాఫిలేక్టిక్  షాక్" కి వైద్యం చేసేసి ఆ తరువాత ప్రశ్నలు వేసి తర్జనభర్జనలు చేసుకోవచ్చు.

ముందుగా గుండె వైపు రక్తం ప్రవహించటానికి అనుకూల పడేలా  రోగి కాళ్లకింద  దిండ్లు పెట్టి కాళ్లని పైకి లేవనెత్తేను. మా ప్రథమ చికిత్స పేటికలో ఉన్న "ఎపినెఫ్రీన్" ని ఆమె తొడ కండరాలలోకి సూది ద్వారా ఎక్కించేను.  దీనిని "ఎడ్రీనలిన్" అనే వ్యాపారనామంతో కూడ  పిలుస్తారు. ఈ మందు రక్త నాళాల బిగిని పెంచి గుండె సరఫరా చేసే రక్తం పెరిగేలా చేస్తుంది. తరువాత "సెలీన్" ఎక్కించటం మొదలు పెట్టేను. సెలీన్ ఎక్కిస్తే శరీరంలో ప్రవహించే రక్తం ఘనపరిమాణం పెరుగుతుంది. కనుక పంపు చెయ్యటానికి వీలుగా ఎక్కువ రక్తం గుండెని చేరుకుంటుంది.

అంబులెన్సు వచ్చి ఆమెని ఆసుపత్రికి తీసుకు వెళ్లే వేళకి ఆమె రక్తపు పోటు  90 వరకు పెరిగింది.

తరువాత ఆసుపత్రి నుండి ఆమెకి వైద్యం చేసిన వ్యక్తి నన్ను టెలిఫోనులో పిలచి వేళకి నేను అందించిన ప్రథమ చికిత్స వల్ల ఆమె ప్రమాదం నుండి బయట పడిందని అభినందించేడు.

ఇంతకీ ఆమెకి ఈ "ఏనాఫిలేక్టిక్ షాకు" ఎందుకు వచ్చిందో తెలియదు. మూడొంతుల ముప్పాతిక తిన్న పదార్థం ఏదో పడలేదని నా అనుమానం. ఏ పదార్థానికి శరీరం ఇలా శృతిమించి స్పందిస్తుందో తెలుసుకోటానికి పద్ధతులు ఉన్నాయి. ఏ పదార్థం పడటం లేదో తెలుసుకుని వాటిని తినకుండా ఉండటమే ఈ వ్యాధికి వైద్యం. పడని పదార్థం ఆచూకీ తెలుసుకుని దానిని కాశీలో ఒదిలేసి వస్తే పుణ్యానికా పుణ్యం దక్కుతుంది, ప్రాణహాని తప్పించుకున్నవాళ్లమూ అవుతాము. ఆలోచించండి.

**కథ వెనుక కథ**

ఈ కథలో వచ్చే పాత్రలు, వర్ణించిన సంఘటనలు, రోగాలు, మందులు అన్నీ నిజమైనవే. కథనం కోసం పాత్రల పేర్లు మార్చవలసి వచ్చింది.

అక్షర – నాట్స్ (North America Telugu Society) నాల్గవ అమెరికా తెలుగు సంబరాల ప్రత్యేక సంచిక, పుటలు 284–289, 2015 లో ప్రచురణ.

# మరోలోకం

మిడతంభొట్లు మేష్టారు తిరుగుడు కుర్చీలో కూర్చుని నెమ్మదిగా, గుండ్రంగా తిరుగుతూ గదంతా మరొకసారి కలయజూసేరు. ఎదురుగా గోడ మీద ఉన్న ప్రశంశా పత్రాలని ఇంకోసారి చూసుకున్నారు. గదిలో గోడలని ఆనుకుని నిలువెత్తు బీరువాలు పుస్తకాలతో పిటపిటలాడుతున్నాయి. నేల మీద ఖాళీ అట్ట పెట్టెలు ఆ పుస్తకాలని అందుకోటానికి తయారుగా ఉన్నాయి.

⋯..ఎప్పటి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు రోజులు? నలభై ఏళ్లు నలభై నిమిషాలలా దొర్లిపోయాయి! ఎన్ని దూషణ భూషణ తిరస్కారాలు? ఇంకెన్నాళ్లు ఈ పరిశోధన? ఇంకెన్నాళ్లు ఈ దుకృంకరణాలు? "సదసద్ వస్తువుల మధ్య గల తారతమ్యాన్ని తత్త్వవేత్తలు మాత్రమే గ్రహించగలరు" అని గీతలో చెప్పనే చెప్పేడు. శక్తి, గరిమ; అలలు, రేణువులు; అస్తిత్వం, నాస్తిత్వం; నిత్యం, అనిత్యం; అమరత్వం, మృత్యువు; దేహి, దేహం అనే ద్వయీభావాల మధ్య ఉండే అంతరాలు బహు సూక్ష్మం. ప్రకృతి రహశ్యాలని భౌతికశాస్త్రం ఛేదించలేకపోతే తత్త్వశాస్త్రమే శరణ్యంలా ఉంది. ఈ కోణం నుండి సత్యశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది⋯..

ఇలా ఆలోచనలు ఆయన మస్తిష్కంలో ఝుమ్మని చెలరేగుతునాయి.

మిడతంభొట్లు మేష్టారు నెమ్మదిగా కూర్చున్న కుర్చీలోంచి కిందకి ఒంగి నేల మీద చిందరవందరగా ఉన్న కాగితాలలో కొన్నింటిని ఏరి చేతిసంచిలో సర్దుకున్నారు. ఎదట బీరువా పై అరలో ఎన్నాళ్లబట్టో ధూళి పొరలు సంతరించుకుంటూన్న తత్త్వశాస్త్రపు పుస్తకాలు రెండు అందుకుందామని లేచి నిలబడ్డారు. వెంటనే కళ్లు గిర్రున తిరిగి చీకట్లు కమ్మేయి. పడిపోకుండా బీరువానే ఆసరాగా పట్టుకున్నారు.

⋯..నెత్తురుపోటు ప్రభావం అయుంటుంది. ఇటుపైన ఉన్నపట్టున గభాల్న లేవకూడదు⋯..

కొద్ది క్షణాలలో తేరుకుని కళ్లు తెరచేరు. బీరువా పై వరుసలో ఉన్న పుస్తకాలన్నీ కంటి మట్టానికి ఒక అడుగు దిగువనే కనిపిస్తున్నాయి. బుర్ర కిందకి వంచి చూసేరు. కాళ్లు నేలని ఆనటం లేదు! ఇది కళ్లు తిరగటం కాదు; కాళ్లు తేలటం!

నలభై ఏళ్ల క్రితం సంగతి. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ప్రాంగణంలో, అంతర్జాతీయ భౌతికశాస్త్ర సమావేశం జరుగుతోంది. ఆ సందర్భంలో ఇదే రకం అనుభవం కలిగింది ఈయనకి. మనిషి ఉన్నపాటున అమాంతం గాలిలో

తేలిపోయేడు. భూమి ఆకర్షణ శక్తి ప్రాంతీయంగా పలచబారిందని — శాస్త్రీయత లోపించకుండా, కట్టుదిట్టంగానే — ఒక ఉపపాద్యాన్ని ప్రతిపాదించేడు. ఎవ్వరూ నమ్మలేదు. పైపెచ్చు కన్ను చెదిరిందేమో అన్నారు. కనికట్టు అన్నారు. పైత్యోద్రేకం అంటూ నాటు వైద్యాలు చేసేరు. గాలిదోషమేమో అంటూ భూత వైద్యుణ్ణి పిలిపించేరు. సీల ఒదులై ఉంటుందని హేళన చేసేరు. క్రమేపీ అంతా మరచిపోయేరు. ఇన్నాళ్ల తరువాత మళ్లా అదే అనుభూతి!

ఇప్పుడు పూర్వపు మిడతంభొట్లు కాదు. ఈయన సిద్ధాంతాలని అవహేళన చేసినవాళ్లు ఎంతమంది ఉన్నారో ఆదరించి అందలం ఎక్కించినవాళ్లూ అంతమంది ఉన్నారు. నోబెల్ బహుమానం గెలుచుకున్న తొలి తెలుగువాడు! అయినప్పటికీ సాపేక్షత్వ వేగంతో ప్రయాణం చేసే కేరం బోర్డు పిక్కతో కొట్టి తోటి సహాధ్యాయుడిని హత్య చేసేడన్న నేరం మీద తీహార్ జైల్లో వారం రోజులు నిర్బంధించేరు. సాక్ష్యాధారాలు సరిపోక ఒదిలేసేరు. “అఖండ మేధావంతుడు” అని కొందరనుకుంటే, “చిత్తచాంచల్యం ఉన్న వ్యక్తి” అని అనుకునేవాళ్లు లేకపోలేదు.

….. వైద్యుడిని చూసే వేళవుతోంది. రాధ వచ్చి తీసుకెళతానంది…..

ప్రస్తుతపు పరిస్థితులలో వైద్యం వల్ల ఉపశమనం ఉండదని ఆయనకి తెలుసు. వైద్యుడు చెయ్యబోయే రోగనిర్ణయం ఏముంటుంది? వార్ధక్యం వల్ల వచ్చే “వర్టిగో” అనబడే తలతిప్పు కావచ్చు అంటాడు. దానికి కారణం మధ్య చెవిలో ఉండే కాలువలలో ఖటిక రేణువులు పేరుకోవటం వల్ల సంతులన యంత్రాంగం సరిగ్గా పని చెయ్యకపోవటం అంటాడు. ఇవన్నీ కళ్లు ఎందుకు తిరుగుతున్నాయో చెబుతాయి కాని గాలిలో కాళ్లు తేలిపోవటం సంగతి? దానికి మానసిక వైద్యం కావాలంటాడు. ఆ మానసిక వైద్యుడేమంటాడో కూడ మిడతంభొట్లు మేష్టారు ఊహించగలరు. ఈ పరిస్థితికి ఏ “డిసోసియేషన్ డిసార్డర్” అనో ఒక ఇంగ్లీషు పేరు పెట్టి భూస్థాపిత ప్రక్రియలలాంటివి సాధకం చేస్తే సరిపోతుందంటాడు. వాళ్లెవరూ ఏమీ చెయ్యలేరని తనకి తెలుసు.

ఏ మానసిక నిపుణుడి సహాయం లేకుండానే మిడతంభొట్లు మేష్టారు పుస్తకాల బీరువా అంచు పట్టుకుని నెమ్మదిగా నేల మీదకి దిగేరు. కుర్చీలో కూర్చుని ఉద్విగ్నతకి, ఆరాటానికి తావివ్వకుండా నిదానంగా ఆలోచించటం మొదలు పెట్టేరు.

ఇంతలో దోమల హోరులా మంద్ర స్థాయిలో అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా వర్ణనాతీతమైన ఒక అసమాన్య దృశ్యం సాకారం పొందటం మొదలయింది. ఎదురుగా ఉన్న ప్రదేశం ప్రకాశమానమై, క్రమేపీ సాంద్రమానమైన ఒక ఆకారం సంతరించుకుంటోంది. పారదర్శకంగా ఉన్న ప్రదేశం ముందుగా మసకబారింది. క్రమేపీ రేఖాకృతి చెందింది. అటుపైన స్థూలరూపం దాల్చి, దరిదాపు మానవాకృతిలో, ఎదురుగా ప్రత్యక్షమైంది — ఒక శాల్తీ!

అది కలా, కనికట్టా, మాయా? లేక, పొరుగు గదులలో పూర్ణప్రతిబింబాలతో ("హోలోగ్రాములు" తో) ప్రయోగాలు చేస్తూన్న విద్యార్థులు ఈ గదిలోకి వారి సమాచారాన్ని ప్రక్షేపిస్తున్నారా?

ఎదురుగా ప్రత్యక్షమైన శాల్తీ సన్నగా, నిలువెత్తు పొడుగు ఉంది. మిలమిల మెరిసే రజత అంగరక్ష లాంటి ఉడుపులు. రెండు కాళ్లు. పాదాలు మాత్రం వెనక్కి తిరిగి లేవు! .....నాలుగు చేతులు ఉన్నాయా? అవి చేతులేనా? ..... శిరోభాగం కూడ మిలమిల మెరుస్తూ కోలగా, నున్నగా ఉంది. మానవాకృతి ఉంది కాని మానవుడు కాదేమో!.

"ఏమి అనుకుంటున్నారో తెలుసు నాకు. ఇది మనిషా కాదా అని కదూ?"

…..ఇదేదో మాట్లాడుతోంది! పైపెచ్చు తనకి అర్థం అయే భాషలో మాట్లాడుతోంది! ఆ గొంతుక ఎప్పుడో, ఎక్కడో విన్నట్లు ఉందే…..

మదిలో మెదులుతూన్న బెదురుని అదుపులో ఉంచి, "అవును. అదే అనుకుంటున్నాను" అంటూ బింకంగానే సమాధానం చెప్పేరు మేష్టారు.

"భూలోకిని కాదు నేను. మరోలోకం మాది. అరవై జ్యోతిర్వర్షాల దూరం నుండి వచ్చేను. మీ ధనూరాశిలో కనిపిస్తుంది మా తార. ప్రభుత్వపు సిబ్బందిలో పనిచేసే నౌకరుని; కలనయంత్రాల అదుపులో చాకిరీ చేసే చాకరుని కాను. బుద్ధిశాలిని. బాధ్యత తెలిసిన వాడిని. ఇంతవరకు చెప్పేది నమ్మగలరా?"

"నమ్మజాలని నిజాలు ఎన్నో చూసేను. సిద్ధాంతాలకి లొంగని నిజాలని చూసిన తరువాత నా సిద్ధాంతాలనే సవరించుకున్న సందర్భాలు ఉన్నాయి. నేను కనేది, వినేది తర్కరహితం కానంతసేపు నమ్మటానికే ప్రయత్నం చేస్తాను."

"నమ్మకం కుదిరిందా? అంత జోరుగా?"

"పామరులు, స్వకపోలకల్పితాలైన సిద్ధాంతాలని గుడ్డిగా నమ్మేవాళ్లు నమ్మకపోవచ్చు. పాండిత్యము, ప్రతిభలతో పాటు తెగువ ఉన్నవాళ్లు నమ్మగలరు . నువ్వు ఫలానా రాశిలోని, ఫలానా నక్షత్రం చుట్టూ తిరిగే ఫలానా గ్రహం నుండి వచ్చేనని చెబుతున్నావు కదా. నీ ఆకార వికారాలు చూసినా, నీ మాట విన్నా నమ్మాలనే అనిపిస్తోంది. "

"ఇప్పుడు ఎందుకు వచ్చేనో తెలుసుకోవాలని లేదా?"

"ఎందుకు లేదు? కుతూహలం అనేది లేకపోతే శాస్త్రవేత్తని ఎలా అవుతాను?"

“భూలోకులందరిని, కాపాడటానికి వచ్చేను.”

“ఇప్పుడు మాకొచ్చిన ఉపద్రవం ఏమిటి? ఈ భూగ్రహం మీద ఉన్న ప్రజలంతా ఎల్లప్పుడు ఏదో ఒక మిష మీద కొట్టుకు చస్తూనే ఉన్నారు, నిజమే. కణికాస్త్రాలు, అణ్వాస్త్రాలు ఎప్పుడు ఏ ముప్పు తెస్తాయో తెలియదు కదా. హరితగృహ వాయువులు పెరిగిపోయి మా గ్రహం వేడెక్కిపోతే ఎదురయే ప్రళయాన్ని తలుచుకుని కొందరు భయపడుతున్నారు. గతి తప్పిన గ్రహశకలాలు వచ్చి భూమిని గుద్దుకుంటే జీవకోటి అంతా చచ్చిపోతుందని కొందరు ఆందోళన పడుతున్నారు. ఇవన్నీ మా ఈతి బాధలు; మీవి కావు. ఒక మహాకవి చెప్పినట్లు పీత కష్టాలు పీతవి. వీటి నుండి తప్పిస్తామంటూ ఎక్కడో జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరొక లాతి సమాజం మాకు దూతని పంపటమా? ఈ ప్రతిపాదన తర్కబద్ధంగా లేదు.”

“ఎదురుగా వస్తోంది పెను ముప్పు. ఈతి బాధలని మీరు జాబితా వేసిన ఇబ్బందులన్నీ – ఏమిటబ్బా ఆ మాట – ఆఁ కేవలం నేపథ్యపు రొద. చిరాకు పెట్టేవి. చెప్పులోని రాళ్ల వంటివి. తల్చుకుంటే వాటిని ఎదుర్కోగలరు మీరు. వచ్చేది పెద్ద ప్రమాదం. మరొక 200 ఏళ్లల్లో – అదే, మీ కాలమానంలో – మీ పొరుగున ఉన్న ఒక పెద్ద తారలో పెను మార్పు వచ్చి పేలిపోతుంది. ఈ పేలుడులో పుట్టే శక్తి తరంగాలు ఎంతో వేగంతో వచ్చి మీ పరిసరాలని ఢీకొనటం వల్ల మీ పొరుగు తారలన్నీ పూర్తిగా నశించిపోతాయి. చుక్కలే నాశనం అయిపోతూన్నప్పుడు వాటితోపాటు గ్రహాలకి కూడ అదే గతి. ఆ గ్రహాల మీద ఉన్న జీవాలు అంతం అవటం తప్పేది కాదు. ”

“మా లోకం అంతం అయిపోతోందని జోశ్యం చెప్పి మమ్మల్ని బెదిరించటానికి ఇక్కడే మాకు ఎంతోమంది ఉన్నారు. రేపటితోటో మాపటితోటో మా పని సరి అని ఆరారా చెబుతూనే ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నాం. మీరు చేసిన విశ్లేషణతో మీలో మీకు ఏకాభిప్రాయం ఉందా? ”

“నమూనాల మీద, అంచనాల మీద మాకు గట్టి నమ్మకం ఉండబట్టే మావాళ్లు ఇంత దూరం దూతని పంపేరు. ఈ రకం పేలుడు మీ పొరుగునే ఉన్న క్షీరసాగరంలో జరగబోతోందని మా నమూనాలు ఒకసారి చెప్పేయి. చెప్పినట్లే ఈ మధ్య అటువంటి పేలుడు జరగటం వల్ల మా నమూనాల మీద నమ్మకం పెరిగింది మాకు.”

…..సా. శ. 1987 లో పాలపుంత క్షీరసాగరానికి పొరుగున ఉన్న పెద్ద మేజిలాన్ మేఘంలో ఉన్న SN 1987A అనే నీలి బృహత్ మహాతార బృహత్ నవ్యతారగా మారి పేలిపోవటం హబుల్ స్పేస్ టెలిస్కోప్ నమోదు చేసి సంచలనమే సృష్టించింది; అప్పటివరకు అరుణ బృహత్ మహాతారలే బృహత్ నవ్యతారలై పేలిపోగలవనే సిద్ధాంతం వీగిపోయింది. మన సూర్యుడు ఇలా పేలిపోటానికి అవకాశం లేదు కాని, మన పొరుగున ఉన్న ఎన్నో నీలి బృహత్ మహాతారలలో ఒకటి ఇలా పేలిపోవచ్చు. మన ఇల్లు దిట్టంగా ఉన్నప్పటికీ పొరుగున ఉన్న ఇల్లు కాలిపోతే అది మన మనుగడకి ముప్పు

తెస్తుంది కదా. పొరుగువాడు ఎలాపోతే మనకేమి అని చూస్తూ ఊరుకోవటం విజ్ఞుల లక్షణం కాదు కదా! ఈ ఆగంతకుడితో మరికొంచెం మాట్లాడి చూడాలి….

"దూతని పంపవలసిన అవసరం ఏమి వచ్చింది? వార్తని పంపితే సరిపోయేది కదా?"

"వార్తనో, దూతనో పంపాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం, చాల కాలం నుండి. నలభై ఏళ్ల క్రితం – మీ కాలమానం ప్రకారం – దూతని పంపి ఈ వార్తని మీకు అందజేద్దామని మొదట ప్రయత్నించేం. అప్పట్లో "దూ–రవాణా " మీద మా పరిశోధనలు పండలేదు; మా ప్రయోగం పూర్తి కాకుండా ఆగిపోయింది."

"అప్పుడు దూతని ఎక్కడికి పంపటానికి ప్రయత్నం చేసేరు?"

"మీ దగ్గరకే! నలభై ఏళ్ల క్రితం గాలిలోకి తేలిపోతూన్నట్లు అనుభవం అయింది మీకు. అవునా? ఆ అనుభవం కలగటానికి అప్పుడు మేము చేసిన ప్రయోగాలే కారణం. చూడండి! మా శాల్తీలని దూ–రవాణా చెయ్యాలనుకున్నప్పుడు పెద్దగా ఉన్న ఆ శాల్తీని రవాణా చెయ్యటం కష్టం. అందుకని ఆ శాల్తీలలో ఉన్న జన్యు సమాచారాన్ని ముందు కుదిస్తాం. కుదించి, ఒక గణిత సమీకరణంలో ఇముడ్చుతాం. ఇమిడ్చి, ఆ సమీకరణాన్ని మాత్రం వాకేతాలుగా మార్చుతాం. మార్చి, వాటిని స్థలకాల సమవాయంలో ఉన్న గుళిక సొరంగాల ద్వారా ప్రసారం చేస్తాం. అలా అవి అడ్డదారుల వెంట ప్రయాణం చేసి గమ్యం చేరుకున్న తరువాత మా సమీకరణం చెప్పిన ప్రకారం గమ్యంలో ఉన్న పదార్థాన్ని కూడగట్టి దానికి రూపు, ఆకారం వచ్చేలా చూస్తాం. ఈ పని జరిగేటప్పుడు గమ్యంలో యాధృచ్ఛికంగా పడున్న పదార్థం క్రమబద్ధం అవుతుంది. అప్పుడు ఆ సమీప ప్రాంతాలలో అబందరం తరుగుతుంది. ఈ తరుగుదల ప్రకృతి ధర్మానికి విరుద్ధం. అందుకనే ఆ ప్రాంతంలో మట్టుకు గురుత్వాకర్షణ నశించినట్లు భ్రాంతి కలుగజేస్తుంది."

గురుత్వాకర్షణ సిద్ధాంతం, తాపగతిశాస్త్రం, గుళిక సిద్ధాంతాలలో సిద్ధహస్తుడైన మిడతంభొట్లుకి ఈ సాంకేతిక భాష అర్థం అయింది. పైపెచ్చు ఎప్పుడో నలభై ఏళ్ల కిందట ఆయన అనుభవించిన అనుభూతిని ఇంత స్ఫూర్తితో విశ్లేషించి చెప్పినవారు ఇంతవరకు ఎవ్వరూ తారసపడలేదు. కాని ఆయనకి ఇంకా సందేహాలు పూర్తిగా నివృత్తి కాలేదు.

….. గుళిక సొరంగాలలో కాంతి వేగాన్ని అధిగమించి ప్రయాణం చెయ్యగలిగే స్థోమత ఉంటేకాని ఈ దూరప్రయాణం సాధ్యంకాదు…..

"మీ ప్రయోగాలు ఈ మధ్యంతర కాలంలో చెయ్యకుండా, నలభై ఏళ్లు పోయిన తరువాత మళ్లా ఇప్పుడు ఎందుకు చేసేరు?"

"మీరనుకుంటూన్నది నిజం కాదు. ఇరవై ఏళ్ల క్రితం మరొక ప్రయోగం చేసేం. అప్పుడు దూతని పంపకుండా కేవలం వార్తని పంపి చూసేం. ఆ వార్తని అందుకున్నారు మీరు. అందుకున్నట్లు దాఖలాలు ఉన్నాయి మా దగ్గర. వార్తని విన్నారు మీరు. అది ఎక్కడనుండి వస్తోందో చెప్పలేకపోయారు మీరు. అందువల్ల ఎలా స్పందించాలో తెలిసినట్లు లేదు మీకు. ఎవ్వరూ నమ్మినట్లు కూడా లేదు, మీ మాటని. అదే సమయంలో ఒక తార పేలిపోవటం కనబడింది, మీ ఆకాశంలో. దానిని చూసి, మేము మీకు పంపిన వార్త మరొకరిని ఉద్దేశించింది అనుకున్నారు. అనుకుని మీ మెదడులో చెలరేగిన వార్తకి తప్పుగా వివరణ చెప్పుకున్నారు. మా వార్తని పక్కకి తోసిపుచ్చి సమాధానం పడిపోయేరు."

మిడతంభొట్లు ఆశ్చర్యానికి అంతు లేదు. ఇరవై ఏళ్ల క్రితం "విశ్వాంతరాళం లోతుల్లోంచి మాట్లాడుతున్నాం" అంటూ ఒక కంఠధ్వని వినిపించింది. ఇదే కంఠం. ఇదే మాట తీరు. "మీ సూర్యుడు పేలిపోతున్నాడు, జాగ్రత్త పడండి" అన్న వార్త విన్నప్పుడు అది ఆకాశవాణో లేక తన అంతర్వాణి పెడుతూన్న ఘోషో అర్థం కాలేదు. అయినా మనస్సు చెబుతూన్న మాటలు నమ్మి "బ్రహ్మాండం బద్దలవుతోంది" అనుకుంటూ ఎంతో ఆరాటపడి ఎందరికో చెప్పి చూసేడు మిడతంభొట్లు. ఆ రోదన అరణ్య రోదనే అయింది. ఇది మూడో తడవ అంతర్గ్రహ జీవులు భూలోకులని హెచ్చరించటానికి చేస్తూన్న ప్రయత్నం అని మిడతంభొట్లు మనస్సులో ఒక ఆలోచన ప్రవేశించింది. దీనిని నిర్ద్వందంగా నిర్ధారించుకోవాలనే తీర్మానానికి వచ్చి,

"ఈ వార్త మోసుకురావటానికి నిన్నే ఎందుకు పంపేరు? నీ ప్రత్యేకమైన అర్హతలు ఏమిటి?"

"అంతర్ గ్రహ సేవలు అనే ఉద్యోగ విభాగంలో నేను పని చేస్తాను. ఆ ఉద్యోగ హోదాలో ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది నాకు. నా ప్రత్యేకత ఏమీలేదు. ఎవ్వరయినా వచ్చి ఉండేవారు ఆ విభాగం నుండి."

"ఏ అమెరికా అధ్యక్షుడినో, భారత ప్రధానినో పట్టుకుంటే పని జరుగుతుంది కాని నాలాంటివాడితో…"

"అదీ ఆలోచించేం. మీ నాయకులకి రెండు నెలలలో వచ్చే ఎన్నికలమీద ఉన్న శ్రద్ధ రెండువందల సంవత్సరాల తరువాత రాబోయే ఉపద్రవం మీద ఉండదు."

"మరయితే ఏమిటి చేద్దామని…."

"వార్తని అందించేను. మా ప్రభుత్వం, మా సిబ్బంది మీకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాం. వ్యోమనౌకలలో మిమ్మల్ని తరలించుకు పోతాం. మీ ప్రజలని, ప్రభుత్వాలని ఒప్పించగలరు మీరు." సమాధానం కోసం ఎదురు చూస్తూన్నట్లు ఆగంతకుడు చెప్పటం ఆపేడు.

తక్షణ కర్తవ్యం ఏమిటో మిడతంభొట్లుకి అవగాహన కాలేదు.

…‥ వార్తాహరుడు మరొక లోకం శాల్తీ లాగనే ఉన్నాడు. ఆ శాల్తీ చెబుతూన్న వార్త నిజంగా ఆ మరోలోకం వాళ్లు పంపినదే కావచ్చు. కాని వార్తాహరుడి వార్త నమ్మదగ్గదిగా లేదు. అరవై జ్యోతిర్ వర్షాల దూరం నుండి వార్త రావాలంటే కనీసం 60 సంవత్సరాలు పడుతుందే. గత నలభై ఏళ్లల్లో రెండు సార్లు వార్తని పంపేమంటాడు. మూడో తడవ ఆసామీ ఎదురుగా నిలబడ్డాడు. ఇది సాధ్యమా? పోనీ అని తెగించి ఈ శాల్తీ మాటని తను నమ్మినా తన మాటని ఎవరు వింటారు? పైపెచ్చు తనని అస్తిత్వం లేనివాటిని కని, వినే మనోవిదళన రోగిగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అగ్ర రాజ్యాలన్నిటిని ఒక తాటి మీదకి తీసుకు రావటం అంటే మాటలా? అంతర్జాతీయ వేదికలమీద మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే ఆసన్నమయే ఆపద ఆగుతుందా?.....

వేళ్లతో కణతల మీద రుద్దుకుంటూ, "మీరు వ్యోమనౌకని అక్కడనుండి తీసుకువచ్చి ఎంతమందిని రక్షించగలరు? ఎవరెవరిని రక్షించాలో ఎలా నిర్ణయిస్తారు? మానవజాతిని రక్షిస్తే సరిపోతుందా? మానవుడి మనుగడకి మిగిలిన జీవకోటి మూలాధారమే. ఆ సర్వభూత సమాహారం మాటేమిటి? వెనకటికి పెనువరద వచ్చినప్పుడు నోవా అనే వ్యక్తి పడవేసుకుని వచ్చి జాతికో జంట చొప్పున జీవకోటిని రక్షించేడని మా బైబిల్ చెబుతోంది. అలా మీరు కూడ ఆపద ఆసన్నమైన తరుణంలో వచ్చి మీకు తోచిన వాళ్లని రక్షిస్తే పోలా? నా సిఫారుసు ఎందుకు?"

"మా ఆలోచన అది కాదు. భూలోకంలో ఉన్న ప్రజలందరినీ – వీరు, వారు అనే తేడా లేకుండా – అందరినీ మోసుకుపోతాం. అదీ మా ఆలోచన."

"ఎప్పుడో 200 సంవత్సరాల తరువాత ఏదో ఆపద రాబోతోంది కనుక ఇప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలని నేను చెబితే ఎవరు పట్టించుకుంటారు? మా రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ రేపు రాబోయే ఎన్నికల మీద, ఈ కందాయంలో రాబోయే లాభాల మీద గురిపెట్టి ఉంటుంది. ఒక ప్రణాళికా బద్ధంగా దూరదృష్టితో పనులు చెయ్యటం కష్టమైపోతోంది. పైగా మా భూలోకులకి సమష్టిగా పనిచెయ్యటం చేత కావటం లేదు. ఈ ప్రపంచాన్ని, ఈ అమెరికావాళ్లని, ఈ చైనావాళ్లని, ముస్లిం రాజ్యాలని, కమ్యూనిష్టులని, ... వీళ్లందరినీ నమ్మించి ఒప్పించటం ఎలా సాధ్యం? పోనీ అంతర్జాతీయ సమితిలో ఉన్న 192 సభ్య దేశాలు, ఏడు బిలియన్ల ప్రజలు నమ్మేరనే – మాటవరసకి – అనుకుందాం. అప్పుడు వీళ్లందరినీ ఒప్పించి వ్యోమనౌకలు ఎక్కటానికి సహకరించేటట్లు చెయ్యటం ఎలా?"

"భయమేల మీకు? ఆ సేవాతంత్రాలన్నీ చూసుకుంటాం మేము. వ్యోమనౌకలని తయారు చేసే పద్ధతులు నేర్పుతాం మీకు. ఇక్కడ ఉన్న ఏడు బిలియను ప్రజలని ఒక క్రమ పద్ధతిలో వ్యోమనౌకలు ఎక్కించి వారిని పంపే ఏర్పాట్లు

దగ్గరుండి  చూస్తాం మేము. ఇదంతా జరిపించటానికి 200 ఏళ్లు పడుతుంది. వ్యవధి లేదు. ఒకటి మాత్రం మరచిపోకండి. మీ మంచి కోరి, మీకు సాయం చేద్దామనే కోరికతోటే ఈ పని చేస్తున్నాము కాని ఇందులో సొంత లాభం ఏమీ లేదు మాకు."

…..స్వలాభాపేక్ష లేకుండా ఎవరుంటారు? కేవలం పరోపకార బుద్ధితో పని చేసే వ్యక్తులు నూటికో కోటికో ఒకరు ఉంటే ఉండవచ్చు.  కాని స్వీయప్రయోజనాలని ఆశించకుండా  రాజ్యాలు ఏలటం కష్టం. కాందిశీకులు దేశంలోకి వెల్లువలా వస్తే వారు ఉండటానికి చోటు, తినటానికి తిండి పెట్టటమే ఎంతో కష్టం. అటువంటిది ఏడు బిలియన్ల ప్రజలకి రవాణా సౌకర్యాలు కల్పించి వారి బాధ్యతలని నెత్తిమీద వేసుకోవటం అంటే సామాన్యమైన పని కాదు.  ఇందులో తర్కానికి అందని  కిటుకు  ఉందేమో….. ఈ ఆలోచనని బయట పెట్టకుండా,

"మీరు తలపెట్టిన పని సాధ్యపడేది కాదు. ఇది నాకు తలకి మించిన పని. మా ప్రజాస్వామ్యంలో పుర్రెకో బుద్ధి. మా ప్రభుత్వం అత్యవసరమైన పరిచర్యలే ప్రజలకి అందించలేక పడరాని పాట్లు పడుతోంది. అంతర్జాతీయంగా ఇది అస్సలు పొసగదు. ఏ రాజ్యానికీ ఇతర రాజ్యాల మీద నమ్మకం లేదు. కనుక మా బతుకేదో మేము బతుకుతాం.  మీ సహృదయానికి మా జోహార్లు."

"పోనీ ఎవరు వస్తామంటే వారినే , మీ బైబిల్ లో నోవా చేసినట్లు జాతికో జంటని, తీసుకెళతాం."

"అదీ జరగని పనే! మా దేశంలోనే మిలియన్లకి పైబడి ఆకలితో అలమటిస్తూన్న అనాధలు ఉన్నారు. వారిని దత్తత చేసుకుని తమతమ దేశాలు తీసుకుపోయి పెంచుకుంటామని విదేశీయులు ఎంతగా బతిమాలినా  మా ప్రభుత్వం ఒప్పుకోవటం లేదు. అటువంటిది మీరు మమ్మల్ని అందరినీ ఉద్ధరిస్తామంటే ఎవరు ఒప్పుకుంటారు?"

"పోనీ మాతో వచ్చెయ్యండి మీరు."

"నేను ఉద్యోగ విరమణ చేసి వేదాంత తత్త్వం అధ్యయనం చేద్దామనే ప్రయత్నంలో ఉన్నాను. ఈ వయస్సులో నన్ను తీసికెళ్లి మీకేమి లాభం?"

"ఆ ఆలోచన వద్దు మీకు. మీ జీవిత కాలాన్ని సునాయాసంగా రెట్టింపు చెయ్యగలం.  మీ యవ్వనాన్ని పునరావృత్తం చెయ్యగలం.  మీకు సంసార సుఖాలు అందివ్వటానికి ఆరాటపడే  అందమైన ఆడవాళ్లు  ఉన్నారు మా దగ్గర. మీ వంటి మేధావి అవసరం ఎంతైనా ఉంది మాకు. వచ్చెయ్యండి నాతో. తీసుకుపోతాను."

…..ఆవు అందం ఎద్దుకి తెలిసినట్లు మనిషికి తెలుస్తుందా?.....

“ఎందుకయ్యా ప్రయాస పడతావు! నేను ఇల్లు దాటి బయటకి వెళితే చలామణీ కాను. నా ఆచారవ్యవహారాలు నావి. నా వెర్రి నాది. ఎవరి వెర్రి వారికి ఆనందం. పైగా నేను శాకాహారిని. నాకు అలవాటయిన ఆహారం కూడ మీ దగ్గర మూడొంతులు ఉండదు.”

“ఆ భయం లేదు మీకు. మాసం తినటం మానేశాం మేము. గతంలో ఒక అదృశ్యమైన విషాణువు కారణంగా మా లోకాన్ని అంతటినీ ఒక అంటువ్యాధి చుట్టుముట్టి మా ప్రజలందరినీ దరిదాపుగా రూపుమాపింది. దీనికి కారణం కొన్ని జాతుల ప్రాణులని చంపి తినటం వల్ల ఆ విషాణువు ఆ జంతు గణాల నుండి మా గణాలలోకి గెంతు వేసిందని మా శాస్త్రవేత్తలు తీర్మానించేరు. అప్పటినుండి ఇతర ప్రాణులని తినటం మానేసేం. మా పోషణకి కావలసిన ఆహారాన్ని అంతటినీ మేము కర్మాగారాల్లో తయారు చేసుకుంటాం. సహజంగా దొరికేవాటిని కూడ తినం; వాటిని మా కర్మాగారాల్లో మాకు అనుకూలమైన ఆహారాలుగా మార్చుకుని తింటాం. మా ఆర్ధిక వ్యవస్థలో ఏదీ వృధాగా పోనివ్వం. అన్నిటినీ పదేపదే వాడుకుంటాం. ప్రాణం ఉన్న ప్రతి జీవిని బాధ్యతతో పోషించి కాపాడుతాం. ప్రాణం పోయిన తరువాత – దేహికి పునర్జన్మ ఉందో లేదో తెలియదు కాని – మా వ్యవస్థలో ప్రతి దేహానికి పునర్ వినిమయం ద్వారా పునర్జన్మ ఉంది. మా జీవావరణంలో ఎంత ఎక్కువ జీవకోటి ఉంటే అంత సమర్ధవంతంగా పునర్ వినిమయం జరుగుతుంది. మేము తినే ఆహారం అంతా ఇలా పునర్ వినిమయం చేసే కర్మాగారాలలోనే తయారవుతుంది.”

“మీరు తినేవన్నీ ఇలా రీ సైకిల్ చేసినవేనా?”

“అవును. అందుకనే ఎంతమందినైనా పోషించగలమనే ధైర్యం ఉంది మాకు.”

తనడిగిన ప్రశ్నకి ఈ రకమైన సమాధానం వచ్చేసరికి మేష్టారి మెదడులో ఒక అనుమానం కదలాడింది. ఇదేనా ఆగంతకుడి రాకకి అసలు కారణం? నిజానిజాలు ఆ పెరుమాళ్లకే ఎరుక. కాని అనుమానం పెనుభూతం.

“మాలో ఒక మహాకవి, ‘జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి’ అన్నాడు. అంటే జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గతుల్యాలు. ఇది మా జన్మభూమి. ఇక్కడ పుట్టేం. ఇక్కడ పెరిగేం. ఇక్కడే చచ్చిపోతాం. అరవై జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న మరోలోకం వెళ్లి మరో అరవై ఏళ్లు బతికి బావుకునేది ఏముంది? నా శేష జీవితం – అరవై రోజులైనా సరే – ఇక్కడే గడుపుతాను. ప్రాణం పోయిన తరువాతా? పార్ధివ దేహాన్ని అగ్నికి అప్పగించటం మా ఆచారం. కనుక దయచెయ్యి మరి!” ఇదే చివరి మాట అన్నట్లు నిష్కర్షగా చెప్పేసేరు మిడతంభొట్లు!

తలుపు మీద టకటక చప్పుడయింది.

"సరే! మళ్లా కలుద్దాం. అప్పుడు మిమ్మల్ని ఒప్పిస్తాను."

"మళ్లా కలవక్కరలేదు. క్షేమంగా వెళ్లు."

ఇంతలో దోమల హోరులా, మంద్రస్థాయిలో, అస్పష్టమైన రొద వినబడింది. కంటికి ఎదురుగా ఉన్న వ్యక్తి చుట్టూ ఉన్న ప్రదేశం ప్రకాశమానమైంది. సాంద్రమానమైన ఆగంతకుడి ఆకారం క్రమేపీ మంచు విగ్రహం కరిగినట్లు కరిగిపోయి అదృశ్యమైపోయింది.

తలుపు మీద టకటక శబ్దం మరొకసారి అవుతూనే తలుపు తెరుచుకుంది.

"ఎవరితో మాట్లాడుతున్నారు?" అంటూ చొరవగా లోపలికి వచ్చిన రాధ గదంతా కలయచూసింది. ఏమీ కనబడలేదు. "పదండి ఇంటికి వెళదాం" అంటూ చెయ్యి పట్టుకుని బయటకి దారి తీసింది ఆయన సహధర్మచారిణి.

**కథ వెనుక కథనం:**

నేను గతంలో రాసిన గాలిదోషం, బ్రహ్మాండం బద్దలయింది అన్న కథలలోని అంశాలని ఇక్కడ ప్రస్తావించడం జరిగింది కాని ఆ కథలు చదవకపోయినా ఈ కథ అర్థం అవుతుంది.

వంగూరి ఫౌండేషన్ వారు 2013 లో నిర్వహించిన పదిహేడవ ఉగాది రచన పోటీలో $116/ గెలుచుకున్న కథ. కౌముది, ఏప్రిల్ 2012 లో ప్రచురణ పొందింది. (www.koumudi.net)

# తిరుగులేని ప్రయాణం

1

అతను కళ్లు తెరచేడు. చుట్టూ కలయజూసేడు.

అదొక చిన్న గదిలా ఉంది. అంతా ఆధునాతనంగా ఉంది. కాని, ఎక్కడా తలుపులు, కిటికీలు కనిపించలేదు.

అతను ఒక శయ్య మీద పరుండి ఉన్నాడు. నడుం చుట్టూ పటకా కట్టి ఉంది.

పటకా విప్పి, లేచి కూర్చున్నాడు. చుట్టూ చూసేడు. ఆ చిన్న గది రెండు మీటర్లు పొడుగుంటుందేమో!

"ఆకలేస్తోందా రాస్కర్? రోజనం కావాలా? శాకాహారమా? మాంసాహారమా?" గోడకి ఎగువ ఉన్న చిల్లుల పళ్లెం నుండి శబ్దం వినిపించింది.

అతను శయ్య దిగి చిరాకుగా గోడ మీద పిడికిలితో గట్టిగా గుద్దేడు. అక్కడ మీట ఉందో ఏమో, గభాలున ఒక సొరుగు లాంటిది తెరుచుకుంది. అందులో చిన్న నీటి కుళాయి, దాని కింద గమేళా, ఎదురుగా గోడ మీద అద్దం ప్రత్యక్షమయాయి. కుళాయి విప్పి ముఖం కడుక్కున్నాడు.

"నీళ్లని వృధా చెయ్యవద్దు. ఇక్కడ నీళ్లు అపురూపం" అదే వాక్కు హెచ్చరించింది.

"ఇప్పుడు వేళ ఎంతయి ఉంటుంది?" అంటూ అతను ఒక కేకేసేడు.

"అంతరాళంలో వేళకి అర్థం లేదు." సమాధానం వినిపించింది.

"బయలుదేరిన చోట ఇప్పుడు వేళ ఎంతయి ఉంటుంది?"

"తెల్లారి ఎనిమిది అవుతోంది."

– o –

ఈ సందర్భంలో వేళ గురించి భాస్కర్ అడిగిన ప్రశ్నకి అర్థం లేదు. కాలాన్ని గంటలలోను, నిమిషాలలోను కొలిచి ప్రయోజనం లేదు. రోజులు, వారాలతో కూడ ప్రయోజనం ఉండదు. ఈ కథనం మొదట్లో మొదలు పెట్టి చెబితే కాని

అసలు భాస్కర్ ఆవేదన అర్థం కాదు. ఈ కథ ఎలా మొదలయిందో, ఎలా పరిణమించిందో తెలుసుకుంటే వేళ ఎంతయిందో తెలుసుకుని ప్రయోజనం లేదని అర్థం అవుతుంది.

2

స్థానికంగా అది సాయం సమయం. ఆంబూరు కాడ కాలవ గట్టున కానా మీద కూర్చున్న అప్పన్న ఆకాశం వైపు చూస్తున్నాడు. తెల్లటి మేఘపు తునకలు ఇటూ అటూ పరిగెడుతూ ఒక సారి ఏనుగు ఆకారంలో, మరొక క్షణంలో హంస లాగ, ఇలా రకరకాలుగా ఆకారాలు మారుతూ ఉంటే ఆసక్తిగా కళ్లప్పగించి చూస్తున్నాడు. చూస్తూండగా హంస వెనక నుండి మరొక శాల్తీ గుండ్రంగా, పళ్లెంలా కనిపించింది. దాని మీద సూర్య రస్మి పడే సరికి మిలమిలా మెరుస్తూ వెండి పళ్లెంలా అనిపించింది. అది మేఘం కాదని అప్పన్నకి ఎవ్వరూ చెప్పకనే తెలిసిపోయింది. విమానమేమో అనుకున్నాడు. వైజాగులో, గోపాలపట్నం కాడ విమానాలు లేవడం, దిగడం చూసేడు. అది విమానం కూడ కాదు. చూస్తూండగానే అది విష్ణుచక్రంలా గిర్రున తిరుగుతూ ముందుకి చర్రున దూసుకు పోయింది. అదేమిటో అప్పన్నకి అర్థం కాలేదు.

– o –

స్థానికంగా ఉదయం 10 గంటలు. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో శాన్ లుయిాస్ అనే చిన్న ఊరి పొలిమేరల్లో వెండి పళ్లేల ఆకారంలో ఉన్న అయిదు నభోనావల్లో ఎవ్వరో ఆగంతకులు దిగి వచ్చేరన్న వార్త రేడియోలో వస్తోంది. స్పేనిష్ లోంచి ఇంగ్లీషులోకీ, ఇంగ్లీషు నుండి తెలుగులోకి మారుతూ వచ్చేసరికి వార్తలో స్పష్టత లోపించింది

– o –

స్థానికంగా ఉదయం 8 గంటలు. నూ యార్క్ నగరం వీధులు అప్పటికే ప్రజల కోలాహలంతో నిండుగా ఉన్నాయి. సి. ఎన్. ఎన్. వారి వార్తలు టెలివిషన్ మీద వస్తున్నాయి: “ఇరాక్లో యుద్ధం. ఆఫ్ఘనిస్థాన్ లో యుద్ధం. పాలస్తీనా మీద ఇజ్రయెల్ బాంబులు. సహారాకి దక్షిణాన ఉన్న దేశాలలో ఆకలి చావులు ఒక పక్క, అంటురోగాలు మరొక పక్క. అణు విద్యుత్ ఉత్పాదక కేంద్రాల నిర్మాణం విషయంలో అమెరికాకి, ఇండియాకి మధ్య ఏకీభావం కుదరకపోవడం వల్ల .....” ఈ వార్తలు చెప్పుకుపోతూ ఉండగా అకస్మాత్తుగా తెర మీద "ప్రత్యేక ప్రకటన" అంటూ నడుస్తూన్న వార్తలని ఆపు చేసేరు.

“ఎగువ నూ యార్క్లో బింఘంటన్ ఊరు బయట ..... విశ్వాంతరాళపు లోతుల్లోంచి ఒక నభోనౌకల బృందం దిగివచ్చి అక్కడ పొలాల్లో వాలిందిట. విచిత్రమైన రూపురేఖలతో ఉన్న ఆ ఆగంతకులు ఆ పల్లెపట్టున ఉన్న వ్యక్తులతో

ఇంగ్లీషులో మాట్లాడుతున్నారుట. చాల స్నేహశీలులా ప్రవర్తిస్తూన్న వారు నిజంగా దివి నుండి భువికి దిగి వచ్చిన సందర్శకులా? లేక, హాలీవుడ్ వారు "ఔట్డోర్ షూటింగ్" కి ఇక్కడకి వచ్చి, ప్రచారం కోసం హడావుడి చేస్తున్నారా అన్న విషయం ఇంకా తేలలేదు" అంటూ ఒక విలేకరి అనుమానం వెలిబుచ్చింది. తాజా వార్తలకి ఎదురు చూస్తూ ఉండండి... అంటూ ఉండగా....

ఇంతలో నూ యార్క్ నగరం నడిబొడ్డులో ఉన్న ఐక్యరాజ్య సమితిలో పెద్ద కోలాహలం చెలరేగడంతో టెలివిషన్ కేంద్రం వారు బొమ్మ మార్చి ఐరాస భవనం చూపిస్తున్నారు.

"మరో లోకం నుండి లాతివారో, జ్ఞాతులో – మిత్రులో, శత్రువులో తెలియదు కాని – భూమి మీద పెక్కు చోట్ల వాలేరుట. ఈ పరిణామం మన మంచికే వచ్చిందో, ముప్పుకే వచ్చిందో తెలియదుట. అందుకని అన్ని దేశాలు అప్రమత్తతతో ఉండాలనిన్నీ, సభ్య దేశాలలో పరస్పర సంప్రదింపులు కీలకం అనిన్నీ భద్రతా సంఘం ఒక సిఫార్సు జారీ చేసింది. ఈ ఆగంతకుల ప్రతినిధి ఒకరు ఐక్యరాజ్య సమితికి వస్తున్నారుట. ప్రపంచం లోని అన్ని దేశాల ప్రతినిధులూ ఉన్న "సర్వసభ్య సమితి" లో ప్రసంగించడానికి అనుమతి కోరుతూ వర్తమానం వచ్చిందిట."

– o –

ఈ కోలాహలం ఇలా సాగుతూనే ఉంది. ఇంతలో ఆగంతకుడు రానే వచ్చేడు. మూడు మీటర్లు పొడుగు. బరువు సుమారు 100 కిలోలు. మన లాగే కాళ్లూ, చేతులూ, మెడ మీద తలకాయ, వగైరా ఉన్నాయి. బుర్ర ఆకారం విచిత్రంగా ఉంది. మెడ నుండి బుర్ర కోలగా పైకి లేచి, అక్కడ బోర్లించిన ఆనపకాయ గుండులా పెద్ద పరిమాణంలో ఉందా బుర్రకాయ. అతని వెంట పరివారం లేదు, చేత ఆయుధం లేదు; ఒక పుస్తకం లాంటి వస్తువు ఏదో ఉంది.

అతని రాకని గమనించి రక్షక భటులు, పోలీసులు ఎందుకైనా మంచిదని తుపాకులు పైకెత్తి అప్రమత్తతతో సిద్ధంగా నిలబడి ఉన్నారు.

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ముందుకి వచ్చి ఆగంతకుడిని వేదిక వరకు నడిపించుకుని వెళ్లి, సభాముఖంగా అతని రాకకి కారణం ఏమిటో చెప్పని అడిగేడు.

అతను నేరుగా వేదిక ఎక్కేడు. చేతిలో ఉన్న పుస్తకం తెరచి మాట్లాడడం మొదలు పెట్టేడు.

"నేను మరో లోకం వ్యక్తిని. మరో కాలపు వ్యక్తిని. చాల దూరం నుండి వస్తున్నాను. నా వద్ద ఏ విధమైన ఆయుధాలూ లేవు. నా వల్ల మీరు భయపడవలసిన పని లేదు. శాంతి కాముకుడిని. మీ స్నేహం కోసమే వస్తున్నాను."

అతని మాట వినిపిస్తోంది కాని అతని పెదవులు కదలడం లేదు. కంఠంలోని కండరాలలో కూడ కదలిక లేదు. ముఖం, ఏ కళవళికలూ లేకుండా, బెల్లం కొట్టిన రాయిలా ఉంది.

"అరే! ఇతను మన భాష మాట్లాడుతున్నాడే!" కొందరు లోపల అనుకుంటూ ఉంటే కొందరు బయటికే అనేసేరు.

ఆగంతకుడు ప్రసంగం కొనసాగిస్తున్నాడు.

"మాది సాంకేతికంగా బాగా అభివృద్ధి చెందిన సమాజం. ఎవ్వరితోనైనా మేము భాషతో ప్రమేయం లేకుండా మానసికంగా మాట్లాడగలం. మా మనోభావాలు మా మెదడులో జరిపిన ప్రేరేపణల కారణంగా మా మెదడు ఒక విధమైన మేధోతరంగాలని పుట్టిస్తుంది. ఆవి మీ మెదడులో చేరి అదే రకమైన ప్రేరేపణలు కలుగజేస్తాయి. ఆ ప్రేరేపణలని మీ మెదడు మీ భాషలోకి మారుస్తుంది. కనుక నేను మాట్లాడేది మీమీ మాతృ భాషలలో మీకు వినిపిస్తోంది. మీరందరు ఎంతో ఆత్రుతతో ఉన్నారని నాకు తెలుసు. కనుక మీ ప్రశ్నలకి ముందు సమాధానాలు చెబుతాను."

సభలో ప్రజలు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. ఇంతలో ఐరాస అధ్యక్షులవారు, లాంఛనప్రాయంగా మొదటి ప్రశ్న అడిగేరు.

"ఈ విశ్వంలో బిలియన్ల పైబడి నక్షత్రాలు, వాటిలో కొన్నింటికైనా గ్రహ కుటుంబాలు ఉన్నాయి కదా, మీరు మా భూమినే ఎంచుకుని సందర్శించడానికి కారణం?"

"మేము మాకు అందుబాటులో ఇరుగు పొరుగున ఉన్న గ్రహజాలాన్ని సదా పరిశీలిస్తూనే ఉంటాం. ఎక్కడ మేము కలుగజేసుకోవడం అవసరమని మాకు తోస్తే అక్కడికి వెళ్లి మా సహాయ సహకారాలు అందిస్తాం. అందరికి నైసర్గికము, సహజము అయిన కొన్ని ఈతి బాధలు ఉంటాయి. అవి చాలనట్లు మీ భూగ్రహంలో మీరు కొన్ని కొని తెచ్చిపెట్టుకున్న తలపోట్లు కూడ ఉన్నాయి. వీటిని చూసిన తరువాత మా సహాయం మీకు అవసరం అనిపించి ఇక్కడకి వచ్చేం."

"మీరు ఏ రకం సహాయం చెయ్యగలరు? సహాయం చెయ్యడానికని వచ్చి మా కొంపలు ముంచరని మాకు ఏమి హామీ ఇవ్వగలరు?" రష్యా ప్రతినిధి ప్రశ్నించేరు.

"మీ అవసరం గుర్తించి మేము వచ్చేం. సహాయం అందిస్తామని చెయ్యి జాపుతున్నాం. ఇక్కడ నిర్బంధం ఏదీ లేదు. మీకు నమ్మకం ఉంటేనే మేము అందించే సహాయం అందుకోండి. మా సహాయం ఉభయతారకంగా లేదనిపిస్తే ఈ గ్రహం వదలి మరొక గ్రహానికి మా సహాయం అందిస్తాం."

"స్వలాభాపేక్ష లేకుండా మీరు అంత దూరం నుండి ఇక్కడకి వచ్చేరంటే నమ్మడం కష్టంగా ఉంది. మా నుంచి ఏమి ఆశించి వచ్చేరు?" భారతీయ ప్రతినిధి ఆరాటపడ్డారు.

"సాంకేతికంగా మీ కంటె మేము బాగా ఎదిగిన వాళ్లం కాబట్టి మాకు తోచిన విధంగా సహాయం చేద్దామని వచ్చేం."

"నేను నమ్మను. సొంత లాభం లేకుండా ఎవ్వరూ ఎవ్వరికీ సహాయం చెయ్యరు. ఇది సృష్టి నైజం." అన్నాడు భారతీయ బృందంలో మరొకడు.

"వచ్చిన వాడిని చెప్పదలుచుకున్నదేదో చెప్పనివ్వండి." పాలస్తీనా ప్రతినిధి అసహనంగా అన్నాడు.

"మేము మీ పరిచయం కోసం వచ్చేం. ఎన్ని సంవత్సరాల బట్టో మీతో సంభాషణలు కొనసాగించాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. మీ లోకంలో ఉన్న ఆరు బిలియను వ్యక్తులలో ఒకే ఒక వ్యక్తికి గతంలో మేము పంపిన వాకేతాలు అందేయి. ఆ వ్యక్తి మా వాకేతాలని అందుకోగలిగేడు కాని వాటిని పరిపూర్ణంగా అర్థం చేసుకోలేకపోయాడు. ఒక సారి అతనిని ఏకాంతంగా సందర్శించి మా లోకానికి అతిథిగా తీసుకువెళదామని కూడ ప్రయత్నించేం. ఆ ప్రయత్నం సఫలం కాలేదు. అదే రకం ప్రయత్నాన్ని ఈ సభ ద్వారా మరొక సారి చేస్తున్నాం. మీ లోకం ఎదుర్కొంటూన్న సమస్యలకి పరిష్కార మార్గాలు మా దగ్గర ఉన్నాయి," అంటూ చేతిలో ఉన్న పుస్తకాన్ని ఆడించేడు. ఆ పరిష్కార మార్గాలు ఆ పుస్తకంలో ఉన్నట్లు అతను సూచిస్తున్నాడా లేక మాట్లాడేటప్పుడు చేతులు అలా ఊపడం అతని అలవాటా అన్నది స్పష్టం కాలేదు.

ఆగంతకుడు ప్రసంగం కొనసాగిస్తూ, "బలవంతం చేసి మీ చేత ఏ పనీ చేయించం. మా దగ్గర ఉన్న ప్రత్యేక శక్తులని మీకు చూపిస్తాం. మీకు కావలసినవాటినే ఎన్నుకొండి. ఉదాహరణకి అతి చవకగా, సురక్షితమైన పద్ధతులలో శక్తిని ఉత్పత్తి చేసే పద్ధతులు మాకు తెలుసు. అవి మీకు నేర్పుతాం. ఇటుపైన మీరు శిలాజ ఇంధనాల మీద ఆధారపడవలసిన పని లేదు."

భారత బృందం కళ్లు మెరిసేయి. ఆసక్తితో వింటున్నారు.

"మా దగ్గర అతి చవకగా రసాయన ఎరువులు తయారు చేసే పద్ధతులు ఉన్నాయి. మీ సముద్రాలలో నీటిని తాగునీటిగా చెయ్యగలం. నీటి పారుదల సౌకర్యాలు ఉండి, ఎరువులు మంచివి దొరుకుతూ ఉంటే, పంటలకి ఏమి కొదువ? బంజరు భూములని, ఎడారులని కూడ సస్యశ్యామలం చెయ్యగలిగే ప్రతిభ మా దగ్గర ఉంది."

ఇజ్రయెల్ ప్రతినిధి ఆసక్తితో వింటున్నాడు కాని అమెరికాలో ఉండే వ్యవసాయ పరిశ్రమల వారి గుండెల్లో రాయి పడింది.

“అంతే కాదు. మీరు మీమీ రాజ్యాలని శత్రువుల బారి నుండి రక్షించుకుందికి అనేక రకాల ఆయుధాలు, ఆయుధ విద్యలు మా దగ్గర ఉన్నాయి. అవి మీ అందరికీ — ఏ ఆంక్షలు లేకుండా – ఉమ్మడిగా నేర్పుతాము. ఇటుపైన ఒక రాజ్యం మీద మరొక రాజ్యం బలం ఉపయోగించి అజమాయిషీ చెయ్యడానికి వీలు ఉండదు. అందరూ సమానులే!”

భద్రతా సంఘంలో శాశ్వత సభ్యులైన అయిదు దేశాల రాయబారులూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

“మరోలోకం అంటున్నారే. ఆ లోకం ఎక్కడ?” క్యూబా ప్రతినిధి అడిగేరు.

“ఇంతకీ మిమ్మల్ని ఏమని పిలవమంటారు? సరి అయిన ఉచ్చారణతో సహా చెప్పండి” ఫ్రాంసు ప్రతినిధి అడిగేరు.

“ఇక్కడకి 12 జ్యోతిర్వర్షాల దూరంలో ఉన్న ఒక నక్షత్ర కుటుంబం మాది. మీ పరిభాషలో మా తార పేరు “టౌ సేటీ.” భూమి నుండి ఆకాశంలోకి చూస్తే మా తార మీకు “సీటస్” రాసిలో, రాసిచక్రానికి దగ్గరగా కనిపిస్తుంది. ఆ నక్షత్ర రాసిలో మా పితృ నక్షత్రం చుట్టూ అయిదు గ్రహాలు తిరుగుతున్నాయి. మాది మూడో గ్రహం. “సీటస్” అంటే తిమింగిలం కనుక మీరు మమ్మల్ని ‘తిమింగిలాలు’ అని పిలవండి.”

“మీరు మమ్మల్ని ఏమని పిలుస్తారు?” మరొకరు ప్రశ్నించేరు.

“మా గ్రహం నుండి చూస్తే మీ సూర్యుడు భూతేశ రాసిలో కనిపిస్తాడు. భూతేశ రాసిలో ఉండే భూతలం మీద నివసించే మిమ్మల్ని మేము “భూతాలు” అని పిలుస్తాం.” అతను లోలోపల కొంటెగా నవ్వుకున్నాడేమో కాని బయటకి మాత్రం ముఖకళవళికలలో మార్పు కనిపించలేదు.

## 3

కాలం గడుస్తోంది. తిమింగిలాల పరపతి పెరుగుతోంది. మీ రక్షణే మా లక్ష్యం అంటూ ప్రపంచం నాలుగు మూలలా తిమింగిలాలు తిరగడం రివాజు అయిపోయింది. ప్రపంచంలోని ముఖ్య దేశాలలో తిమింగిలాల రాయబార కార్యాలయాలు వెలిసేయి. వారి సాంకేతిక నిపుణుల సహాయంతో ఎందుకూ పనికిరాని గొడ్డు భూములు కూడ పంటలతో పచ్చగా కలకల్లాడుతున్నాయి. బడుగు దేశాలలోను, వర్ధమాన దేశాలలోను తిండి గింజలకి, కట్టుబట్టకి, తాగునీటికి, విద్యుత్తుకి కొరత లేదు. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా, అన్ని దేశాలవారికీ, రక్షణకి సరిపోయే విధంగా, అదృశ్యమైన బలక్షేత్రంతో ఒక రక్షరేకు నిర్మించుకోవడం నేర్పేరు. ఎటువంటి దాడి నుండి అయినా ఈ రక్షరేకు రక్షిస్తుంది. కాని, మరొక దేశాన్ని భక్షించడానికి ఆ ఆయుధాలు పని చెయ్యవు.

ఈ పరిణామం అందరికీ నచ్చ లేదు. అగ్రదేశాల స్థానంలో ఉన్న వారికి అస్సలు నచ్చలేదు. అమెరికా వారి ప్రభావం, ప్రభ తగ్గిపోయాయి. అమెరికాలోని ఎన్. ఎస్. ఎ. లోనూ సి. ఐ. ఎ. లోను గుసగుసలు మొదలయేయి.

ఆగంతకుడు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించినప్పుడు అతని చేతిలో ఉన్న పుస్తకం బల్ల మీద పెట్టిన కొద్ది క్షణాలలోనూ ఎన్. ఎస్. ఎ. వారు దానిని అతి లాఘవంగా తస్కరించి, ఒక నకలు తీసేరు. ప్రసంగం అంతా టేపు మీద నమోదు చేసేరు. ఆ ప్రసంగంలో కాని, పుస్తకంలో కాని ఏదైనా గూఢార్థం ఉందేమోనని భాషాశాస్త్రవేత్తలు తరచి, తరచి విశ్లేషించడం మొదలు పెట్టేరు.

ఆ పుస్తకంలో ఉన్న రాత ముందుగా పరిశీలనకి గురి అయింది. చూడడానికి, కొరియా భాష రూపంలో ఉన్నప్పటికీ, త్వరలోనే అది ప్రస్తుతం భూమి మీద చలామణీలో ఉన్న ఏ భాషనీ పోలి లేదని తెలిపోయింది. పుస్తకంలో ఉన్నది సహజ భాష కాకపోతే కృత్రిమ భాష అయి ఉండవచ్చు. కంప్యూటర్ రంగంలో కృత్రిమ భాషలలో ప్రావీణ్యం ఉన్న పెద్దలని పిలిపించేరు. రహశ్య లిపులని ఛేదించడంలో అగ్రగణ్యులు వచ్చేరు. ఈజిప్టులోని పిరమిడ్లలో ఉన్న చిత్రలిపులని ఛేదించిన విధానాలు తిరిగి మననం చేసుకున్నారు. ప్రధాన సంఖ్యల మీద పరిశోధనలు చేసే గణిత శాస్త్రవేత్తలని పిలిపించేరు. ఫలితం శూన్యం.

ఈ తిమింగిలాల సర్వాధిపత్యానికి అడ్డు కట్ట వెయ్యకపోతే తమ అగ్రస్థానానికే ముప్పు అని అమెరికావారు భయపడ్డారు. తిమింగిలాల ఆయువుపట్టు తెలుసుకుని వాళ్లని ఒక దెబ్బ కొట్టకపోతే అమెరికా గతి ఏమి కాను?

భారతదేశంలో “రా” లో పని చేసే “రాకుమారులు” కూడా తిమింగిలాల “రాత” లో కీలకం కోసం పరిశోధన మొదలు పెట్టేరు. అమెరికావారు “హై టెక్” మార్గం తీసుకుంటే భారతీయులు “లో టెక్” మార్గం అవలంబించేరు.

ఆగంతకులు ఇంతకు పూర్వం భూలోకంలో ఎవ్వరితోనో సంభాషించినట్లు చెప్పుకున్నారు. ఆ వ్యక్తి ఎవరై ఉంటారో? ఈ ప్రశ్నకి సమాధానం అంతగా కష్టపడకుండానే దొరికింది. భారతదేశంలో అగ్రగణ్యుడైన భౌతికశాస్త్రవేత్త, రక్షక మంత్రివర్గానికి మాజీ సలహాదారుడు, అయిన ఆచార్య మిడతంభొట్లు ఉద్యోగ విరమణ చేసి వైజాగు దగ్గర ఉన్న ఒక ఆశ్రమంలో రామా కృష్ణా అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఆయనకి ఇతర గ్రహాలలో ఉన్న జీవులతో నిజంగా పరిచయం ఉందో, లేదో నికరంగా ఎవ్వరికీ తెలియదు కాని, ఆయనకి నోబెల్ బహుమానం వచ్చి ఉండకపోతే ఆ వైజాగులోనే పిచ్చాసుపత్రిలో పడేసి ఉండేవారు. ఈ సందర్భంలో ఆయనతో ఒకసారి మాట్లాడి చూడ్డం మంచిదని ‘రా ’ వారు వారి భాషాశాస్త్రవేత్త భాస్కర్ని వైజాగు పంపించేరు.

అప్పటికే తిమింగిలాలు ఏర్పాటు చేసిన భుక్తి సదుపాయాలవల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకి తిమింగిలాలు అంటే భయం పోయి, భక్తి భావం పెరిగింది. తిమింగిలాలు నిజంగా నిస్వార్థ బుద్ధితో మానవ రక్షణకే భూలోకానికి వచ్చేయని ప్రజలు నమ్మేరు.

ఈ అదును చూసుకుని ఉత్సాహం ఉన్న "భూతాలకి" తమ నభోనౌకలలో అంతర్ నక్షత్ర యానం చెయ్యడానికి అవకాశం కల్పిస్తామంటూ తిమింగిలాలు ప్రచారం చెయ్యడం మొదలు పెట్టేయి. తమ లోకం తీసుకెళ్లి, అక్కడ వింతలు, విశేషాలు ఉచితంగా చూపిస్తామంటూ తిమింగిలాలు అందరినీ ఊరించడం మొదలు పెట్టేయి.

దేశాన్ని ఏదో ఒక విధంగా వదలిపెట్టి అమెరికా వెళ్లే అవకాశం కోసం భారతీయులు ఎలా ఎదురు చూస్తున్నారో అదే మూసలో, వేలం వెర్రిగా ప్రజలు భూలోకాన్ని వదలి తిమింగిలాల లోకానికి ఎగబడి వెళ్లడానికి ఉద్యుక్తులవడం మొదలు పెట్టేరు. అందులోనూ డబ్బు ఖర్చు లేకుండా విశ్వవిహారం!

తండోపతండాలుగా ప్రజలు నభోనౌకాశ్రయాలకి చేరుకుంటున్నారు. ఒకొక్క దాంట్లో వేల మంది పట్టే సామర్ధ్యం గల బృహత్ నౌకలు ప్రతి ఖండంలోనూ వేచి ఉన్నాయి. ప్రయాణం కోసం ఎగబడుతూన్న ప్రజా వాహినిని ఎంతో సామర్ధ్యంతో తిమింగిలాలు అదుపులో పెట్టి, నౌకలలోకి ఎక్కించి సహాయపడుతున్నారు.

–o–

ఈ లోగా అమెరికా నుండి వార్త వచ్చింది. ఎన్. ఎస్. ఎ. లో ఉన్న భాషాశాస్త్రవేత్తలు, పుస్తకంలో ఉన్న భాషని ఛేదించి అర్థం చేసుకోలేకపోయినా అట్ట మీద ఉన్న పేరుని "యాంత్రిక అధ్యయన పద్ధతులు" ఉపయోగించి, మహా శక్తిసంపన్నమైన కలనయంత్రాల సహాయంతో పలికించగలిగేరుట. పుస్తకం అట్ట మీద పేరుని కలనయంత్రం "మానవ రక్షణార్థం" అని ఉచ్చరించిదిట. ఇంతకు తప్పించి లోపల ఉన్న పాఠ్యభాగం ఇంకా కొరుకు పడలేదుట. అట్ట మీద బొమ్మ చూస్తే చాలదూ? పుస్తకం అంతా చదవాలా?

ఈ వార్త వినేసరికి మిడతంభొట్లుని కలుసుకోడానికి బయలుదేరిన భాస్కర్ మనస్సు మరో మార్గంలో ఆలోచన మొదలు పెట్టింది. "ఎన్నాళ్లు ఎదుగూ బొదుగూ లేని ఈ ప్రభుత్వోద్యోగంలో బతకడం? ఇటువంటి అవకాశం అడిగినప్పుడల్లా రాదు" అనుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఆ దఫాలో భూమిని వదలి వెళ్లబోతూన్న ఆఖరి నభోనౌకని అందుకునే ప్రయత్నంలో వరసలో నిలబడ్డాడు. నౌక నిండి పోతోంది. తనవరకు రాకుండా తలుపులు మూసెస్తారేమో అన్న బెంగ అతనిలో గాఢంగా ఉంది.

మిడతంభొట్లుది చాల నిదానమైన తత్త్వం. భాస్కర్ తనతో స్వయంగా సంప్రదింపులకి వస్తున్నాడని “రా” వారు పంపిన వర్తమానాన్ని విన్నారు. విని, అతి నెమ్మదిగా తన అభిప్రాయం వెలిబుచ్చేరు.

“వాళ్లా! తిరిగి వచ్చేరా? గతంలో నాతో ఒకటికి రెండు సార్లు మాట్లాడేరు వాళ్లు. ఒక సారైతే ఎదురుగా నిలబడి గంటకి పైగానే మాట్లేడేరు. నేను ఆ విషయం చెబితే ఎవ్వరూ నమ్మలేదు, సరికదా నన్ను ఒక పిచ్చివాడిగా జమకట్టేరు. మన బెంగాలీ వాళ్లు “వ” కి బదులు “బ” వాడినట్లే ఈ తిమింగిలాలు అంటున్నారే — వీళ్లే వాళ్లయితే – “భ” కి బదులు “ర” పలుకుతారు. వీరి వ్యాకరణంలో “రభయోనభేదః!” తిమింగిలాల వద్దనుండి తస్కరించిన పుస్తకం పేరు “మానవ రక్షణార్థం కాదు....అది మానవ......”

అప్పటికే భాస్కర్ వైజాగు పొలిమేరల్లో వాలిన నభోనౌకని ఎక్కడానికి సిద్ధంగా ఉన్న వరసలో నిలబడి ఉన్నాడు. నౌక నిండిపోతోంది. తనకి అవకాశం రాదేమోనన్న భయంతో తన వద్ద ఉన్న “వి. ఐ. పి” రాజముద్రని చూపించి ఏదో ముఖ్యమైన ప్రభుత్వాధికారిలా వరస ముందుకు చేరుకున్నాడు. అక్కడ నౌకని ఎక్కడానికి సహాయపడే తిమింగిలాల సిబ్బందిలో ఒకడు అతనికి చేతిని అందించి నౌకలోకి ఎక్కించడానికి సహాయం చేస్తున్నాడు.

ఇంతలో మిడతంభొట్లు పంపిన వ్యక్తి పరుగు పరుగున వస్తూ, తలుపులు మూయడానికి తయారుగా ఉన్న నౌక మెట్లు ఎక్కుతూన్న భాస్కర్ని ఉద్దేసించి, ‘రభయోనభేదః’ ట. వాళ్లు వచ్చినది రక్షించడానికి కాదుట. నౌక ఎక్కొద్దు,” అని పెద్ద పొలికేక పెట్టేడు.

భాస్కర్కి ఆ మాటలలోని అంతరార్థం అర్థం అయిందో లేదో కాని నౌకని ఎక్కద్దు అన్న తాత్పర్యం అర్థం అయినట్లే ఉంది. వెనక్కి తిరిగి, మెట్లు దిగడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే అక్కడ ఉన్న పరిచారకుడు భాస్కర్ని లోపలికి ఒక్క తోపు తోసి, “బయలుదేరే వేళ అయింది” అంటూ తలుపులు మూసేసేడు.

4

భాస్కర్కి కోపం, చిరాకు పెల్లుబికి వస్తున్నాయి. కోపంతో గోడ మీద కాలితో తన్నేడు. గోడలో చిన్న కిటికీ తెరుచుకుంది.

అవతల నుండి ఎవ్వరో ఫలహారం ఉన్న ఒక పళ్లేన్ని ఆ కిటికీ లోంచి లోపలికి తోసేరు.

“ఆకలి వేస్తూ ఉండాలి. ఇది తిను.” ఆకాశవాణి మళ్లా వినిపించింది.

తన అసహాయతకి భాస్కర్లో ఉక్రోషం, ఉడుకుబోత్తనం వెల్లువలా పొంగుకొచ్చేయి.

విసురుగా ఆ ఫలహారపు పళ్లేన్ని నేల మీదకి గిరాటు కొట్టేడు.

వెంటనే ఒక తలుపు తెరుచుకుంది. ఒక పరిచారకుడు నేల మీద పడున్న పదార్థపు పొట్లాలని సేకరించి, పళ్లెంలో పెట్టి, అతని ముందుకి తోసి, "తిను. గమ్యం చేరుకునే వేళకి నువ్వు చిక్కిపోతే ఎలా?" అంటూ నర్మగర్భంగా ఒక వెకిలి నవ్వు నవ్వి బయటకి వెళ్లిపోయేడు.

**కథ వెనుక కథ:**

ఒక విధంగా ఆలోచిస్తే ఈ కథ మరోలోకం కథకి తరువాయి కథ. మరోలోకం చదవక పోయినా ఈ కథ అర్థం అవుతుంది.

వంగూరి ఫౌండేషన్ వారు 2015 లో నిర్వహించిన పందొమ్మిదవ ఉగాది రచన పోటీలో $116/ గెలుచుకున్న కథ. కౌముది ఏప్రిల్ 2015 లో ప్రచురణ పొందింది. (www.koumudi.net)

# బొమ్మలూరు

ఆమె బద్ధకంగా కళ్లు నులుముకుంటూ నిద్ర లేచింది. అలవాటయిన శయ్యలా అనిపించలేదు. ఒళ్లు విరుచుకుంటూ మంచం మీద నుండి కిందకి దిగింది.

విందు భోజనంతో పాటు తాగిన మాదక పానీయపు మోతాదు ఒక రవ ఎక్కువ అయిందో ఏమో బుర్రంతా దిమ్ముగా ఉంది. కాసింత కాఫీ కలుపుకు తాగితే కాని పూర్తిగా మెలుకువ వచ్చేటట్లు లేదు.

చుట్టూ ఆమె కలయజూసింది. పరిచయమైన గదిలా లేదు. అలాగని హొటేలు గదిలానూ లేదు. ఎవరిదో ఇల్లు.

లేచిన మంచం వైపు చూసింది. అతను ఇంకా పండుకునే ఉన్నాడు. సాధారణంగా వారాంతంలో – బయటకి వెళ్లి వచ్చిన తరువాత – వారిరువురు ఎవరి గదులలో వారే పడుక్కుంటారు. రాత్రి ఏమి జరిగిందో ఏమో అతను కూడ తన మంచం మీదనే ఉన్నాడు.

రాత్రి కారు తోలడం అతని వాటా కనుక అతను మందు పుచ్చుకోనే లేదు. విందు వాటిక నుండి వారింటికి కారులో మహా అయితే పదిహేను నిమిషాలు దూరం. తనకి తన పరుపు మీద తప్ప మరెక్కడా పడుక్కోవడం ఇష్టం ఉండదని అతనికి తెలుసే! ఇలా మధ్యంతరంగా ఇక్కడ ఆగవలసిన అవసరం లేదే! ఇది ఎవరిల్లబ్బా! మైకం కమ్మిన తనని తీసుకొచ్చి ఎవరో స్నేహితుల ఇంట్లో రాత్రి పడుక్కుందుకి ఆగి ఉంటాడా!

బుర్ర పని చెయ్యడం లేదు. కప్పు కాఫీ తాగాలి ముందు.

అతన్ని కుదిపి నిద్ర లేపింది.

"ఎక్కడ ఉన్నాం?" నెమ్మదిగా అతని చెవిలో గుసగుసలాడింది, ఆమె.

"ఎక్కడున్నామా? చెబుతాను కానీ ముందు లేచి కప్పు కాఫీ తాగనీ" అంటూ అతను లేచి మంచం మీద కూర్చున్నాడు. చుట్టూ కలయజూసేడు. ఎక్కడున్నాడో అతనికీ అర్థం కాలేదు.

"మంచి ప్రశ్నే! రూం సర్విస్ ని పిలచి కాఫీ తెప్పిస్తానుండు" అంటూ మగతగా మంచం పక్కనున్న బల్ల మీద టెలిఫోను కోసం చూసేడు. అక్కడ ఏమీ కనపడలేదు. లేచి కాళ్లీడ్చుకుంటూ పక్క గదిలోకి వెళ్లేడు.

"ఇది హొటేలులా లేదు. ఇక్కడొక వంట గది ఉంది. కాసింత కాఫీ పెడతానుండు," అంటూ కాఫీ కాచుకునే సరంజామా కోసం వెతికేడు. అక్కడ ఉన్న అలమారులు, సొరుగులు, బీరువాలు అన్నీ ఖాళీ. రెఫ్రిజిరేటర్ తెరచి చూసేడు. అక్కడ ఉండవలసిన పాలు కాని, పళ్లు కానీ, గుడ్లు కానీ, ఏవీ కనబడ లేదు. ఎండిపోయిన రెండు రొట్టె ముక్కలు కనిపించేయి తప్ప అది కూడా ఖాళీయే!

నిస్పృహతో చుట్టూ చూసేడు.  గోడకి తగిలించిన టెలిఫోను కనిపించింది. దానిని చేతిలోకి తీసుకుని చెవి దగ్గర పెట్టుకుని "హల్లో" అని పిలచేడు.

ఎవ్వరూ పలకలేదు. అసలు ఆ టెలిఫోనులో ఏ విధమైన శబ్దమూ వినబడలేదు. పైపెచ్చు  దాని నుండి ఏ తీగా బయటకి వస్తూన్న దాఖలాలు కనబడ లేదు. లోపల కనెక్ షన్  ఎక్కడో వదులుగా ఉందేమోనని ఆ టెలిఫోనుని ఇటూ అటూ కుదిపేడు. ఆ కుదుపుకి ఆ టెలిఫోను కాస్తా గోడ నుండి ఊడి అతని చేతిలోకి వచ్చేసింది. దాని వెనుక ఏ రకమైన తీగలూ లేవు. అక్కడ ఏ బెజ్జమూ లేని చదునైన గోడకి ఒక అయస్కాంతపు ముక్కతో అతికించబడి ఉంది.

ఇదేమి మాయదారి ఇల్లురా బాబూ అనుకుంటూ అతను, ఆమె మేడ దిగి ఆ ఇంట్లోంచి బయటకి వచ్చేరు – ఎక్కడైనా గుక్కెడు కాఫీ చుక్కలు దొరుకుతాయన్న ఆశతో.

బయట వీధిలో వాళ్ల కారు కనపడ లేదు.  అంతా నిర్మానుష్యంగా ఉంది. ఒక వ్యక్తి కాని, ఒక వాహనం కాని కనబడ లేదు. ఇల్లు ఎంత వింతగా ఉందో ఊరూ అలానే ఉన్నట్లు అనిపించింది.

"మన కారు ఏమైనట్లు?" ఆమె అడిగింది.

అతను బుర్ర గోక్కున్నాడు. ముందు రోజు సాయంత్రం తను కారు తోలుతూన్నప్పుడు ఏదో నీడ తన ముఖం మీద పడ్డట్లు అతనికి జ్ఞాపకం వచ్చింది. ఆ తరువాత ఏమి జరిగిందో ఎంత ఆలోచించినా అతనికి స్ఫురణకి రాలేదు. అలా దూరంలోకి చూస్తున్నాడు, ఏదైనా జ్ఞాపకం వస్తుందేమోనని.

దూరంలో ఒక గాలిగోపురమూ, గంటస్తంభమూ కనబడ్డాయి. అదేదో దేవాలయంలా ఉందని ఇద్దరూ అక్కడకి నడుచుకుని వెళ్లేరు. లోపల ప్రవేశించేరు. అంతా ఖాళీ. దేవుడి ఎదుట గంటని పదే పదే కొట్టేడు అతను – పూజారి దర్శనమిస్తాడనే ఆశతో. ఎవ్వరూ కనబడ లేదు.

"ఈ ఊళ్లో వాళ్లందరూ హడావిడిగా ఊరు ఖాళీ చేసేసి వెళ్లిపోయేరో ఏమో. ఏమి ఉపద్రవం వచ్చిందో?" అన్నాది ఆమె.

ఇద్దరూ బయటకి వచ్చేరు. "ఇక్కడ ఎవ్వరైనా ఉన్నారా?" అంటూ అతను ఎలుగెత్తి అరచేడు. అతని ఆర్తనాదం ఎవరికైనా వినబడిందో లేదో తెలియదు కానీ, ఎక్కడ నుండో ఒక కిలకిలారావం వినిపించింది. ఎక్కడో దగ్గర నుండే వస్తూన్నట్లు ఉందా ధ్వని. అది ఆర్తనాదం కాదు. ఒక చిన్న పిల్ల గొంతుకలా ఉంది. అందరూ హడావిడిగా ఊరు వదిలేసి పారిపోతూ ఒక చిన్న పిల్లని కాని దిగవిడచి పోయారా?

చుట్టూ చూసేరు, ఇద్దరూ. ఆ శబ్దం మళ్లా వినబడలేదు. ఇద్దరూ విన్నారు కనుక వినబడ్డ కిలకిల భ్రమ కాదు. మరేమై ఉంటుందో?

ఎలాగైనా ఈ ఊళ్లోంచి బయట పడాలి. వాళ్లిద్దరూ దిక్కు తోచక ఆ వీధులలో ఇటూ అటూ తిరుగుతున్నారు. ఇంతలో దూరంగా వీధి పక్కన ఆగిన ఒక కారు కనిపించింది.

అతను పరుగు పరుగున ఆ కారుని సమీపించేడు. మిలమిలా మెరుస్తూ కొత్తగా కనిపించింది. తలుపు తెరచేడు. కారు ఖాళీగా ఉంది. లోపల కూర్చున్నాడు. ఎదురుగా తాళాలు వేల్లాడుతూ కనిపించేయి. ఎంతో ఆశతో, ఎంతో ఆతృతతో తాళాలని తిప్పుతూ కారుని నడపడానికి ప్రయత్నించేడు. కారు ఏ రకమైన చప్పుడూ చెయ్యలేదు. "మూడొంతులు బేటరీ లో పసరు ఎండిపోయిందేమో" అనుకుంటూ కారు దిగి, బయటకి వచ్చి, ఇంజనుని కప్పి ఉండే మూతని పైకి లేవనెత్తేడు. ఆశ్చర్యం! అక్కడ ఇంజను లేదు. వెనక్కి వెళ్లి డిక్కీ తలుపు తెరచి చూసేడు. అక్కడా ఇంజను లేదు.

బిక్క ముఖంతో అతను నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

మళ్లా అదే కిలకిలారావం వినబడింది. సందేహం లేదు. ఒక అమ్మాయి గొంతుకలా ఉందా ధ్వని. ఎవరో తనని ఒక ఆట పట్టిస్తున్నారా? ముందూ, వెనకా, చుట్టూ చూసేడు. ఎవ్వరూ కనబడ లేదు. పరిస్థితి అర్థం కాలేదు.

ఇంతలో దూరం నుండి రైలు కూత వంటి శబ్దం వినబడింది. అతను, ఆమె, ఒకరి చేతులు మరొకరు పట్టుకుని, ఆ కూత వచ్చిన దిశ వైపు పరుగెత్తుకుని వెళ్లేరు. అక్కడ బయలుదేరడానికి సిద్ధంగా ఒక రైలుబండి కనబడింది.

"ఈ ఊరు నుండి బయట పడాలంటే ఇదే శరణ్యం. పద. బండి ఎక్కుదాం" అంటూ ఇద్దరూ ఆ రైలుబండి ఎక్కేసేరు.

లోపల అంతా అధునాతనంగా ఉంది. సరికొత్త బండిలా ఉంది. బారులు తీరిన దిండు కుర్చీలు ఇటు రెండు, అటు రెండు, మధ్యలో నడవ. కాని బండి అంతా ఖాళీ. ప్రయాణీకులు ఎవ్వరూ లేరు. "ఊరు వదలి అంతా వెళ్లిపోయి ఉంటారు" అనుకుంటూ సమాధానపడి కూర్చున్నారు. ఇంతలో బండి కదలింది. కిటికీలోంచి బయటకి చూస్తూన్న వారికి "బొమ్మలూరు" అని ఆ ఊరి పేరు ఒక బల్లచెక్క మీద కనిపించింది.

“హమ్మయ్య! ఎక్కడున్నామో తెలిసింది!” అనుకుంటూ ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ పీడకల ఇంతటితో అంతం అయిపోతుందన్న ఆశ వారిలో మొలకెత్తింది. బండి జోరందుకుంది. ఒక వంతెన దాటుకుని, ఒక గుహలోంచి బయటకి వచ్చి, నెమ్మదిగా పక్క స్టేషన్ లో ఆగింది.

“అరె! ఈ ఊరి పేరు కూడ బొమ్మలూరే! అరెరె! కాదు. మనం బయలుదేరిన చోటికే తిరిగి వచ్చేసేం!!”

ఈ సారి అతనికి భయం వేసింది. ఇదేమీ పీడకల కాదు కదా!

ఇద్దరూ గభీమని బండి దిగి, బయట పడ్డారు. భయంతో పరుగెడుతున్నారు. ఆమె వెనకపడిపోతోంది. పరిగెత్తలేక పడిపోయింది.

మళ్లా అదే కిలకిలారావం. అదే గొంతుక. ఆ అమ్మాయే! పడిపోయిన వ్యక్తిని చూసి నవ్వుతోందా?

అతను వెనక్కి తిరిగి ఆమెని లేవనెత్తడానికి సమీపించేడు.

ఏదో పొడుగాటి వస్తువు కదులుతూన్నట్లు వారిద్దరి మీదా పైనుండి ఒక కదిలే నీడ పడింది. ముందురోజు సాయంత్రం కారు తోలుతూన్న సమయంలో అతని మీద అదే రకం నీడ పడింది. ఒక్క క్షణం పాటు ఏమి జరిగిందో తెలియలేదు కాని మరుక్షణంలో ఆ కదిలే నీడ ఆమెని సమీపించింది. కిందకి ఒరిగిపోయిన ఆమెని లేవనెత్తింది. ఆ తరువాత అదే నీడ ఆమెని ఆదుకుందామని పరిగెత్తుకు వస్తూన్న అతనిని కూడ పొదివి పట్టుకుంది.

ఆ నీడ వారిద్దరిని పైకెత్తింది. వారు పైకి లేస్తూ ఉంటే గుడి గోపురం క్రమంగా కిందకి దిగిపోతోంది. ఎత్తుకి అలవాటు పడని కళ్లు తిరిగి చీకట్లు కమ్ముకున్నాయి. కదలిక ఆగిన తరువాత అతను కళ్లు విప్పేడు. ఉదయం ఏ మంచం మీద నుండి లేచేరో ఆ మంచం మీదనే ఇద్దరినీ పడుక్కోబెట్టింది ఆ కదిలే నీడ.

అతను, ఆమె కళ్లప్పగించి చూస్తున్నారు. చెవులు రిక్కించి వింటున్నారు. వాళ్లు ఒంటరిగా లేరు. ఎవరింట్లోనో ఉన్నారు. ఆ ఇల్లు కూడ వారనుకున్నట్లు ఖాళీగా లేదు.

చిన్న బాలిక చేసే కిలకిలారావం పైనుండి వస్తోంది. పైపెచ్చు ఆ పిల్ల కేరింతాలు కొడుతూన్న శబ్దం కూడ వినబడుతోంది.  ఆ అమ్మాయి ఆడుకుంటోంది కాబోలు. నేపథ్యం నుండి మరొక పెద్దామె గొంతుక స్పష్టంగా వినిపిస్తోంది: “అమ్మాయీ! చూడమ్మా! మీ నాన్న నీకోసం భూలోకం నుండి తీసుకొచ్చిన బొమ్మరిల్లు బావుందా?”

ఆ మాట వినగానే ఉదయం లేచినప్పుడు గుసగుసలాడుతూ ఆమె అతనిని అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికింది.

**కథ వెనుక కథ:**

ఆంధ్రజ్యోతి, 17 మే 2015 (ఆదివారం) సంచికలో ప్రచురణ పొందింది. ఆంధ్రజ్యోతి సంపాదకురాలు వసంతలక్ష్మి కథ పాఠకులకి అర్థం కాదంటూ నా చేత బలవంతంగా చివర మరొక్క వాక్యం రాయించి కలిపించేరు. పాఠకుల ఆలోచనాశక్తిని కించపరచడం ఇష్టం లేక ఆ చివరి వాక్యం ఒక్కటీ ఇక్కడ తీసేసేను.

ఎప్పుడో చిన్నప్పుడు ఇంటర్మీడియేట్ లో పాఠ్యపుస్తకం 'గలివర్స్ ట్రావెల్స్' లో 'వాయేజ్ ^ టు బ్రాబ్డింగ్నేగ్' చదువుతూన్నప్పుడు మా గురువుగారు ఇలాంటి కథే ఒకటి చెప్పగా అది గుర్తుకు వచ్చి రాసిన కథ. ఇటువంటి కథే టివిలో 1960 దశకం నాటి ట్వైలైట్ జోన్ పరంపరలో వచ్చిందని ఒక స్నేహితుడు నా దృష్టికి తీసుకువచ్చేడు.

# శిక్ష

అది ఒక చిన్న ఒంటిదూలం రేకుటిల్లు. లోపల ఉన్న ఆవరణ అంతా ఒకే ఒక్క గదిలా కనిపిస్తోంది. ఆ గదిలోనే ఒక వార, ఒక మడత మంచం. మరొక మూల, కొంచెం ఎత్తుగా ఒక తీనె. ఆ తీనె మీద ఏవేవో సంచులు, పొట్లాలు, సీసాలు ఉన్నాయి – వాటిలో ఉన్నవి తినుభండారాలులా ఉన్నాయి. ఆ పక్కనే పెద్ద సీసా నిండా తాగడానికి నీళ్లు. ఒక మనిషి వ్యష్టిగా బతకడానికి కావలసిన కనీస అవసరాలకి సరిపోయే సరంజామా అది. కాలం గడపడానికి కొన్ని పుస్తకాలు కూడ ఉన్నాయి. తప్పితే కుటీరంలాంటి ఆ రేకుటింట్లో విలాసాలకి కావలసిన కనీస సదుపాయాలు మరేవీ లేవు.

అతను ఆ గదిలోంచి బయటకి వచ్చేడు.

ఆకాశం నిర్మలంగా, నల్లగా కనిపించింది. సూర్యుడు నీరసంగా ప్రకాశిస్తున్నాడు.

అతను చుట్టూ చూసేడు. కనుచూపు మేర అంతా మోడువారిన ఎడారిలా ఉంది. చిన్న చిన్న రాళ్లు, ఇసక! ఒక మిట్ట లేదు, ఒక చెట్టు లేదు. ఒక పిట్ట లేదు.

"ఎవరక్కడ?" అని గొంతెత్తి గట్టిగా అరిచేడు.

అతని ఆక్రందనం పలచగా ఉన్న ఆ గాలిలో కలిసిపోయింది. కనీసం ప్రతిధ్వని అయినా తిరిగి రాలేదు.

కనుచూపు మేర అతను తప్ప మరొక నరమానవుడు ఉన్నట్లు లేదు.

అతను జుత్తు పీక్కున్నాడు. బోనులోని పులిలా కుటీరం లోపలికి వెళ్లి తిరిగి బయటకి వచ్చేడు. బయట ఉన్న ఒక రాతి మీద కూలబడ్డాడు.

ఎక్కడికైనా వెళదామా అన్నా ఎక్కడికి వెళతాడు? ఎక్కడికి వెళ్లగలడు? ఎక్కడికి వెళ్లడానికీ అక్కడ ఏమీ లేదు. అక్కడ అతను తప్ప మరెవ్వరూ లేరు.

కళ్ల మీద వెలుగు పడకుండా చేతిని నుదిటి మీద అడ్డు పెట్టుకుని దూరంగా చూస్తున్నాడు. దేనికోసమో ఎదురు చూస్తున్నట్లున్నాడు. అలా వారం రోజులబట్టి ఎదురు చూస్తున్నాడు! అక్కడ ఉన్న గులక రాళ్లని పోగులుగా పోసి రోజులు

లెక్కపెట్టడం అలవాటు చేసుకున్నాడు. కనీసం కాలగమనం తెలుస్తోంది. కాని కాలం గడవడం లేదు. నిమిషాలు యుగాల్లా ఉన్నాయి.

ఇంతలో దూరంలో దుమ్ము రేగింది. అది వీచే గాలి లేపిన దుమారం కాదు. ఏదో కదలిక వల్ల రేగిన దుమారం. సుడులు తిరుగుతూన్న ఆ గాలి వెనుక ఏదో నల్లటి ఆకారం కదలినట్లు కనిపించింది. నేల వేడికి గాలి వేడెక్కి పైకి లేస్తూ ఉండడం వల్ల ఆ ఆకారం నీళ్లల్లో ప్రతిబింబంలా, ఎండమావిలా, కదులుతోంది. అది భ్రమ కాదని అతనికి తెలుసు.

దూరంలో కనిపించిన గోరంత ఆకారం క్రమేపీ పెరిగి పెద్దదవుతోంది. కదలిక కనిపిస్తోంది. ఆ ఆకారం ఒకటి రెండయింది. రెండు మూడయింది. మొత్తం ముగ్గురు. ముందు ఒకడు నడుస్తున్నాడు. వెనక ఇద్దరు దేనినో మోసుకు వస్తున్నారు.

ముందు నడుస్తున్నవాడు అధికారిలా ఉన్నాడు. వెనక  పెట్టెని మోసుకొస్తూన్నవాళ్లు పనివారిలా ఉన్నారు.

ఎట్టకేలకు వారు ముగ్గురూ అతనిని సమీపించేరు.

"మస్తాన్! ఎలా ఉన్నావు?" ముందు నడుస్తూన్న వ్యక్తి అధికార స్వరంతో పలకరించేడు.

"ఎలా ఉంటాను? ఈ ఏకాంతం భరించలేకుండా ఉన్నాను. ఈ రకం శిక్ష నాకు తగదు. ఇది అన్యాయం."

"కిందటి సారి పట్టుకొచ్చిన పుస్తకాలు అన్నీ అప్పుడే చదివేసేవా?"

"ఎన్ని పుస్తకాలని చదవను? ఈ ఏకాంతం కంటె పెద్ద శిక్ష మరొకటి ఉండదు. ఆ ఖూనీ నేను చెయ్యలేదని ఎంత మొర పెట్టుకున్నా ఆ న్యాయస్థానంలో నా గోడు వినిపించుకున్న నాథుడు లేకపోయేడు. నన్ను మీతో వెనక్కి తీసుకుపొండి. అక్కడే ఖైదులో ఉండి ప్రభుత్వాన్ని క్షమాభిక్ష పెట్టమని వేడుకుంటాను. ఇక్కడ ఉండి ఏమి చెయ్యగలను?" అతను ప్రాధేయపడుతూ అడుగుతున్నాడు.

"మస్తాన్! నేను కేవలం ప్రభుత్వోద్యోగిని. నేను మాత్రం ఏమి చెయ్యగలను? తినడానికి తిండి తెచ్చిపెడుతున్నాను. తాగడానికి నీళ్లు తెచ్చిపెడుతున్నాను. నువ్వు నిర్దోషివేనేమో అనే అనుమానం నాలో లేకపోలేదు. అందుకే నేను చెయ్యగలిగింది చేస్తూనే ఉన్నాను. ఏకాంతం భరించలేనని  మొరపెట్టుకుంటూ ఉంటే జాలి పడి పుస్తకాలు, వగైరా, తెచ్చిపెడుతూనే ఉన్నాను కదా. ఇంకేమి చెయ్యగలను?"

మస్తాన్ మౌనంగా వింటున్నాడు.

"చూడు, మస్తాన్! వేళ మించిపోతోంది. మా తిరుగు ప్రయాణపు "గవాక్షానికి" కాలం మించిపోతే మేము ఇక్కడ నట్టడిపోతాం. మేము త్వరగా తిరిగి వెళ్లాలి," అంటూ తన సిబ్బంది మోసుకొచ్చిన పెద్ద పేటికని చూపించి, "ఇదిగో మేము మళ్లా తిరిగి వచ్చేవరకు నీ ఆకలి తీరడానికి, నీ కాలక్షేపానికి కావలసిన సామగ్రి, వగైరా, అంతా ఈ పెట్టెలోనే ఉన్నాయి. మేము వెళ్లిన తరువాత, తాపీగా ఈ పెట్టె కట్లు విప్పి మూత తెరచి చూసుకో!` అని చెప్పి ఆ అధికారి తన సిబ్బందితో చరచర వచ్చిన దారి వెంబడి వెళ్లిపోయేడు.

తిరిగి వెళ్లిపోతూన్న అధికార వర్గాన్ని చూస్తూ అక్కడ నిలబడే ఉన్నాడు. కంటికి ఆనినంత సేపు వాళ్లని అలా చూస్తూనే ఉన్నాడు.

దూరంలో నింగీ నేలా ఒకటైన చోట చిన్న గాలి దుమారం లేచినట్లు దుమ్ము రేగింది.

ఇక చేసేదేముంది? మస్తాన్ తన దగ్గర ఉన్న పరికరాలతో ఆ కర్ర పెట్టెని కట్టి ఉన్న లోహపు రేకుని ఊడబెరికి, పెట్టె మూత తెరచేడు.

మస్తాన్ తన కళ్లని తాను నమ్మలేకపోయేడు. మూత తెరవగానే బుట్టలోంచి తలెత్తి లేచిన నాగుపాములా ఆ పెట్టె లోంచి అపురూప లావణ్యంతో తొణికిసలాడే ఒక సౌందర్యవతి మెలికలు తిరుగుతూ లేచి నిలబడింది.

ఒక్క క్షణం అతను నిశ్చేష్టుడయాడు. నోట మాట రాలేదు. "నువ్వు...నువ్వు ఎవరు?" అని మాత్రం అనగలిగేడు.

"నేను...నేను మీ సహచర్యం కోసం వచ్చేను. నేను...నేను మీ సహచర్యం కోసం వచ్చేను."

"స...స...స... సహచర్యం అంటే ఏమిటి చెయ్యగలవు?"

"మి...మి...మి...మీరు ఏమి కావాలంటే అది చేస్తాను. మి...మి...మి...మీరు ఏమి కావాలంటే అది చేస్తాను."

"అంటే?"

"నేను మీ దాసిని. మీ చాకరుని. నేను మీ దాసిని. మీ చాకరుని. మీకు చాకిరీ చేస్తాను. మీకు చాకిరీ చేస్తాను. ఏ పని చెయ్యమంటే ఆ పని చేస్తాను. ఏ పని......"

అతను ఆశ్చర్యాంబుధి నుండి తేరుకున్నాడు. తన చేతిని ఆమెకి అందించి, ఆ పెట్టెలోంచి బయటకి నడిపించేడు.

ఆమె శరీరం మెత్తగా, మృదువుగా తగిలింది అతని చేతికి. ఆ కనుముక్కు తీరు, ఆ అందం, ఆ వినయం, ఆ విధేయత, ఆ మాట తీరు, . . . అన్నీ అతన్ని బాగా ఆకర్షించేయి.

ఆమె రాకకి కారకులు ఎవ్వరో? ప్రభుత్వమే పంపిందా? ఎందుకు పంపిందో? లేక . . . పోలీసు అధికారి తన మీద జాలి పడి చేసి పెట్టిన ఉపకారమా? అతనికి అవగాహన కాలేదు. ఆమెని అడిగితే మాత్రం చెబుతుందా? అయినా అడిగి చూసేడు.

"నేను మీ చాకరుని. మీకు చాకిరీ చెయ్యడానికి వచ్చేను. మీకు తోడు ఉండడానికి వచ్చేను. మీ కాలక్షేపానికి వచ్చేను." మాటలు నేర్చిన మైనాలా ఎప్పుడు అడిగినా ఇవే సమాధానాలు.

క్రమేపీ ఆ ఏకాంతంలో ఆమెతో మాట్లాడుతూ కాలక్షేపం చెయ్యడం అతనికి అలవాటు అయిపోయింది. ఆమె ముఖం చూడకుండా ఉండలేకపోతున్నాడు. నిత్యం అతని మనస్సు ఆమె సాంగత్యం కోరుకుంటోంది. రేయీ పగలూ ఆమే ధ్యానం. ఆమెపై మమకారంతో తన సందిట ఆమెని బందీ చేసి ఆమెకే బందీ అయిపోయేడు. కాలం కదలిక అతను గమనించనే లేదు.

పోలీసు అధికారికి పదే పదే మనస్సులోనే ధన్యవాదాలు సమర్పించుకున్నాడు. తొమ్మిది నెలలు తొమ్మిది రోజులులా గడచి పోయాయి.

సంభారాలన్నీ నిండుకుంటున్నాయి. భూమి నుండి సంభారాలతొ నభోనౌక తిరిగి వచ్చే సమయం ఆసన్నమవుతోంది.

అనుకున్న వేళకి నభోనౌక రానే వచ్చింది. అదే అధికారి ఇద్దరు భటులతో వచ్చేడు.

"మస్తాన్! ప్రభుత్వం వారు నీవు పెట్టుకున్న మొర విన్నారు. కొత్తగా దొరికిన సాక్ష్యాలు, ఆధారాలు నువ్వు ఆ ఖూనీ చెయ్యలేదని చెబుతున్నాయని న్యాయస్థానం తీర్మానించింది. కనుక నిన్ను వెనక్కి తీసుకెళ్లడానికి రాకెట్ సిద్ధంగా ఉంది. బయలుదేరడానికి ఎక్కువ కాల గవాక్షం లేదు. పద వెళదాం."

అవధులు మీరిన ఆనందంతో మస్తాన్ చుట్టూ కలయ చూసేడు. ఆమె కనిపించలేదు.

"ఒక్క క్షణం ఆగండి. ఆమె ఇక్కడే తిరుగాడుతూ ఉంటుంది. తీసుకొస్తాను." అంటూ ఆమె కోసం ఆ కుటీరం చుట్టూ పరుగున వెతుకుతున్నాడు. ఆమె కుటీరానికి పది బారల దూరంలో తిరుగాడుతూ కనిపించింది.

"రాకెట్ లో నీకు ఒక్కడికే చోటు ఉంది. ఈ పరిస్థితులలో మరొక శాల్తీని ఎక్కించుకుంటే రాకెట్ పైకి లేవదు. నువ్వు ఒక్కడివీ వచ్చెయ్!"

"ఆమెని ఇక్కడ దిగవిడిచా? ఆడది. ఒక్కర్తీ ఇక్కడ ఎలా బతుకుతుంది?"

"మస్తాన్! నిన్ను తీసుకు రమ్మని ప్రభుత్వం ఆదేశించింది. నేను నీకోసం ఆమెని ఇక్కడకి తీసుకొచ్చి దిగవిడిచేనన్న విషయం ప్రభుత్వానికి తెలియదు. ఆమెని తీసుకువెళితే అంతా ఇబ్బందిలో పడతాం. నువ్వు ఒక్కడివీ రా!" అంటూ మస్తాన్ జబ్బ పట్టుకుని లాగుతున్నాడు అధికారి.

మస్తాన్ పట్టు విడిపించుకుని ఆమె వైపు పరిగెత్తేడు.

అధికారికి తోడొచ్చిన ఇద్దరు జవానులు వెనక పరిగెత్తుకు వెళ్లి మస్తాన్ని పట్టుకున్నారు.

"ఆమె రాకపోతే నేనూ రాను. నన్ను ఇక్కడే వదిలెయ్యండి" అంటూ మస్తాన్ పెనుగులాడుతూ అరుస్తున్నాడు.

పోలీసు జవాను, "అలాగా!" అంటూ తుపాకీ తీసి ఆమె తలకి గురిపెట్టి పేల్చేడు.

ఆమె శరీరం కొట్టిన మానులా నేల మీదకి ఒరిగిపోయింది.

చుట్టూ ఉన్న అతని ప్రపంచం చిట్ట చీకటి అయిపోయింది. ఏదో వాసన! తుపాకిలో పేలిన మందుగుండు వాసనా? కాదు. అదేదో రబ్బరు కాలినట్లు వాసనలా ఉంది. అతను తేరుకుని ఏమిటి జరిగిందో చూసేడు.

తుపాకి దెబ్బకి ఆమె తల టొపారం లేచిపోయింది. రక్తం వరదలై ప్రవహించలేదు! ఆ శరీరం నుండి మాత్రం పొగలు లేస్తున్నాయి.

మస్తాన్ నిర్విణ్ణుడయాడు. ఆమె తలలో ఉన్న విద్యుత్ పరికరాలు, కంప్యూటర్లు కాలుతూన్న దృశ్యం చూడలేక అతను ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

కథ వెనుక కథ

ఈ కథని "వీక్షణం: సాహితీ గవాక్షం, సాహితీ మిత్రుల రచనా సంకలనం 2015" అనే జాల పుస్తకంలో ప్రచురించడం జరిగింది. సేన్‌ఫ్రాన్సిస్కో, బే ఏరియాలో ఉన్న తెలుగు భాషాభిమానులు కొద్దిమంది నెలనెలా ఒకరి ఇంట్లో కలుసుకోవడం జరుగుతోంది. ఈ సమావేశాల మూడవ వార్షికోత్సవం సందర్భంలో వెలువరించిన ప్రత్యేక సంచిక కోసం రాసిన కథ ఇది.

# పెళ్లి చేసి చూడు

1

ఆ మధ్య ఒక తెలుగు సాహితీ సదస్సుకి వెళ్ళేను. ఇది తానా, ఆటా ల మాదిరి ఎంతో ఆర్భాటంగా పెద్దలు జరిపే తిరనాళ్ళ కాదు. తెలుగు అంటే నిజంగా అభిమానం ఉన్న పిన్నలు నలుగురు కలుసుకుని స్వీయకవిత్వాలు చదువుకునే చిరు సభ. నేను లోపలికి వెళుతూ ఉంటే ఒక అమ్మాయి కరపత్రం ఒకటి చేతికి అందించింది.

"రండి! మనల్ని అణచి ఉన్న సంకెళ్ళని తెంచుకుందాం!" ఎవర్ని ఎవరు ఎప్పుడు ఎలా అణచిపెట్టేరో తెలుసుకుందామని చదవటం మొదలు పెట్టేను.

"స్త్రీల మీద హింస ఒక భయానకమైన స్థితికి చేరుకుంది. కుటుంబ హింస! శారీరక హింస! మానసిక హింస!!.....ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానవ హక్కులని మనం తిరిగి స్వంతం చేసుకోవాలి!!...వివక్షను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ, హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం…… "

తలెత్తి చూసేను.

సావిత్రి తనంత తాను పరిచయం చేసుకుంది.

"అరె! ఈ పిల్లని మనింట్లో ఎవ్వరికైనా చేసుకుంటే బాగుంటుందే" అనిపించి, "చూడరా! ఈ పిల్లెవరో బాగుంది. మనవాళ్ళల్లో ఎవరికైనా నప్పితే ఎదురు కట్నం ఇచ్చి చేసుకుందాం!" అని పక్కనున్న తమ్ముడితో అన్నాను.

ఎక్కడైనా పెళ్ళీడు పిల్లడు కాని, పిల్ల కాని కనిపిస్తే వెంటనే వాళ్ళకి సంబంధాలు చూసే పద్ధతి కాదు నాది. మనం చూపెట్టిన సంబంధం బెడిసికొడితే నన్ను తిట్టుకుంటారనే భయం ఒకటి వెనక ఉన్నప్పటికీ అసలు కారణం అది కాదు. మనిషిని చూడగానే వాళ్ళ పూర్వాపరాలన్నీ అంచనా వేసేసి ఎవరికి ఎవరు నప్పుతారో బేరీజు వేసేసే చాకచక్యం మా నాని పిన్నికి ఉందేమో కాని నాకు లేదు. అయినా సావిత్రిని చూడగానే తటాలున ఆ మాట నోటి వెంబడి వచ్చేసింది.

"మావయ్యగారూ! నేను 'బుక్' అయిపోయానండీ!" అంది సావిత్రి అప్పటికప్పుడే వరస కలుపుతూ. మీకంత సరదాగా ఉంటే మా అన్నయ్య మూర్తికి ఏదైనా మంచి సంబంధం చూసిపెట్టండి!"

సావిత్రిని కలుసుకోవటం అదే మొదటి సారి. మూర్తిని ముఖాముఖీ కలుసుకోవటం కూడ అదే మొదటి సారి. మా ఇద్దరికీ అభిరుచులలో కొన్ని పోలికలు ఉండటంతో అతనితో టెలిఫోనులోను, ఇ–టపాలోను తరచుగా మాట్లాడుతూనే ఉన్నాను కనుక ఒక విధంగా మూర్తి పరిచయస్తుడి కిందే లెక్క.

"ఏమయ్యా! పోనీ నీకో పిల్లని చూసిపెట్టమంటావా?" కరపత్రాన్ని మడచి జేబులో పెట్టుకుంటూ మూర్తిని అడిగేను – పెద్ద అరిందా భంగిమలో! అతను "అలాగే చూసిపెట్టండి" అని అనుంటే నా ఎరికని తుపాకేస్తే పిల్ల లేదు.

"లేదండీ. నాకు ఈ అమెరికాలో పెరిగిన పిల్ల వద్దు. మన దేశం వెళ్ళి మన సంప్రదాయంలో పెరిగిన పిల్లని, బాగా తెలుగు మాట్లాట్టం, పాట పాడటం వచ్చిన పిల్లని చేసుకుంటాను."

"శుభం!" అనుకుంటూ అక్కడనుండి తప్పుకున్నాను. అమెరికాలో పెరిగిన పిల్లల మీద అతను తెలిసో, తెలియకో విసిరిన విసురుకి కించిత్తు బాధ పడ్డాను, ఇద్దరు ఆడపిల్లల తండ్రిని కనుక!

మూర్తి 'పోస్ట్ డాక్' పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. సావిత్రి ఇంకా పి. హెచ్. డి. కోసం కృషి చేస్తోంది. అన్నా, చెల్లెలూ బాధ్యత, మర్యాద తెలిసిన వాళ్ళలా ప్రవర్తించేరు. ఇద్దరికీ సంగీత సాహిత్యాల్లోనూ, చిత్రలేఖనంలోనూ అభిరుచి ఉన్నట్లు కనిపించేరు. పైపెచ్చు స్త్రీల హక్కుల కోసం ఏదో ఉడతా భక్తిగా కరపత్రాలు అందిస్తున్నారు. సాంఘిక బాధ్యతలు ఉన్న కుర్రాళ్ళు కనుక నేను కూడ వారిద్దరితోనూ స్నేహ బంధం కలిపేను.

ఆ స్నేహాన్ని పురస్కరించుకుని, సావిత్రి తన పెళ్ళికి పిలచింది కాని వెళ్ళలేకపోయాను. రోజులు దొర్లిపోతున్నాయి. ఒక రోజున మూర్తి దగ్గరనుండి ఇ–టపా వచ్చింది. తెరచి చూసేను. "మూడు వారాలు సెలవు పెట్టి ఇండియా వెళుతున్నాను. సావిత్రి 'లైన్ క్లియర్' చేసింది కనుక పెళ్ళి చేసుకుని వస్తాను. నా పెళ్ళికైనా మీరు తప్పకుండా రావాలి."

అభినందనలు చెబుదామని ఫోను తీసి మూర్తిని పిలచేను. "మూర్తీ, పిల్లని వెతుక్కోటానికి మూడు వారాలు సరిపోవు," అంటూ హెచ్చరించేను.

"వెతుక్కోనక్కర లేదండి. అంతా నిశ్చయం అయిపోయింది."

"మేనరికం ఏమిటి?"

"కాదండి. పై సంబంధమే. మా వాళ్ళు చూసిపెట్టేరు. వాళ్ళు బందరుట."

"మీ వాళ్ళు చూసిపెట్టేరంటున్నావు. ట అంటున్నావు. నువ్వు పిల్లని చూడక్కరలేదా?"

"మా వాళ్ళకి నచ్చితే నాకు నచ్చినట్టేనండి!"

ఇరవయ్యొకటో శతాబ్దపు మొదటి దశాబ్దంలో అమెరికాలో ఉంటూన్న కుర్రాడి నోటి వెంబడి ఈ మాట వినేసరికి గతుక్కు మన్నాను. ఎప్పుడో శతాబ్దం క్రితం మా పెద్ద మావయ్య గారికి పెళ్ళి సంబంధాలు చూస్తూన్నప్పుడు మెద్రాసులో చదువుకుంటూన్న మా మావయ్య గారు "మీరు కోతిని తీసుకొచ్చి మెళ్ళో పుస్తె కట్టమంటే కట్టేస్తాను. నేను పిల్లని చూడవలసిన పని లేదు" అన్నారుట. "మా అన్నయ్య అంటే అన్నాడు కాని, మా వాళ్ళకి బుద్ధి ఉండక్కర లేదూ, వాళ్ళు వాడన్నంత పనీ చేసేసేరు," అని మా అమ్మ మా అత్తయ్యని ఎప్పుడూ వెటకారం చేసేది. కాని ఈ ఇరవయ్యొకటవ శతాబ్దంలో పిల్ల వాడు ఒప్పుకున్నాడే అనుకుందాం. ఆ పిల్ల ఎలా ఒప్పుకుందో నాకు అర్థం అయి చావ లేదు. అదే మాట అన్నాను.

"ఫోనులో మాట్లాడుకున్నామండి."

వెనకటికి, చంద్రుడి మీద అమెరికా వాళ్ళు కాలు మోపిన కొత్తరోజుల్లో, నేను ఇండియా వెళ్ళటం తటస్థ పడింది. మా ఇంటి పక్కన ఉన్న పోస్ట్ మాస్టారు మంగపతిరావు గారితో పిచ్చాపాటీ మాట్లాడుతూ, "మా అమెరికా వాళ్ళు ఎంత గొప్ప వాళ్ళో చూసేరా! చంద్రుడి మీద కాలు మోపేరు!" అన్నాను, సగర్వంగా!

"నీకెలా తెలుసు?"

"వాళ్ళు కళ్ళకి కట్టినట్లు అన్నీ టి. వి. లో చూపించేరు కదండీ! మీరు చూడ లేదా?"

"వాళ్ళు టి. వి. మీద చూపించినవన్నీ నిజమేనని నమ్మేసే వెర్రి కక్కగట్టలా ఉన్నావు. ఆ అమెరికాలో ఏం చదువు వెలగబెడుతున్నావో ఏమో!" అని నన్ను, నా అమాయకత్వాన్ని చూసి చాలా జాలి పడ్డారు ఆయన.

నేనూ అలాగే మూర్తి మాటలు విని జాలి పడ్డాను. తెలుగు రాని హిందీ తారలని ముందు పెట్టి, తెర వెనక నుండి తెలుగులో సంభాషణలు చెప్పించినట్లు అట్నించి ఎవ్వరిచేతనైనా పాట పాడించి, మాటలు మాట్లాడించి ఉండొచ్చుకదా! పక్కింటి అమ్మాయి సినిమాలోలా!! కీడెంచి మేలెంచమన్నారు. వెనకటికి ఒక మొండి చెయ్యి పెళ్ళికొడుకు పొడుగు చేతుల చొక్కా వేసుకుని పెళ్ళి చూపులకి వెళ్ళేడుట. మూడు ముళ్ళూ పడ్డ తరువాత "నెగ్గేమురా బాబూ!" అంటూ బోర విరుచుకుని, కాలరెగరేసి, చొక్కా చేతిని వెనక్కి లాగి మొండి చెయ్యి చూపించేడుట. "నెగ్గని వారెవరూ!" అని కూని రాగాలు తీస్తూ పెళ్ళికూతురు చెవులమీదకి దిగజారిన జుత్తుని తొలగించి సొట్ట చెవులని చూపించిదిట. కనుక పిల్లని

పిల్లడూ, పిల్లడిని పిల్లా చూసుకోకుండా వీళ్ళు పెళ్ళికి ఒప్పుకున్నారనే సరికి నా మనస్సు కకలావికలమై రకరకాల దిశలలో పరుగులు మొదలెట్టింది.

"పిల్ల బందరంటున్నావు, పోనీ పెళ్ళికూతురు ఫొటో అయినా చూసేవా?" అని కొంచెం శ్లేష ధ్వనించేలా అడగాలనే అడిగేను.

"చూసేనండి. మీకు పంపిస్తాను, చూడండి," అంటూ మా సంభాషణ జరుగుతూండగానే పార్వతి ఫొటో ఇ-టపాలో పంపించేడు.

బొమ్మ చూసేను.

మూర్తికి ఉన్న ఒక్క అప్పచెల్లెలూ ఈ అమెరికాలో ఉందాయె. మరి ఈ పిల్లని ఎవరు ఎంపిక చేసి పెట్టేరో నాకు అర్థం కాలేదు.

"కట్నం ఏ మాత్రం ఇస్తున్నారేమిటీ?" కట్నం కోసం పిల్లని చూడకుండా చేసేసుకుంటున్నాడేమో అని అనుమానం పీకుతోంది.

"మా సావిత్రిని బావ గారు కట్నం లేకుండా చేసుకున్నారు. మా ఇంట్లో ఇక ఆడ పిల్లలు లేరు. కనుక నేను కట్నం కోసం ఆశ పడవలసిన అవసరం లేదు. వాళ్ళు పిల్లకి విమానం టికెట్టు కొనిస్తే చాలు."

"అది మాత్రం వాళ్ళు ఎందుకు కొనివ్వాలి?"

"గురువు గారూ! గురువు గారూ!! నా దగ్గర అంత డబ్బు ఎక్కడిదండీ? నాకొచ్చే 'పోస్ట్ డాక్' జీతం – మీకు తెలియనిది ఏముంది – నాకే బొటాబొటీ. ఈ మధ్యే పాత కారొకటి కొన్నాను. మిగిలిన డబ్బులు కొత్త సంసారానికి కావాలి కదా. పైగా విమానం టిక్కెట్టు కొన గలిగే స్థోమత వాళ్ళకి ఉంది. మీ అమ్మాయి 'నాన్నా! ఇల్లు కొనుక్కుంటున్నాను, కొంచెం డబ్బు సహాయం చెయ్యండి' అని అడిగితే మీరు సాయం చెయ్యరా ఏమిటి?"

మా ఆవిడవి పాము చెవులు. నేను మేడమీద గదిలో తలుపులేసుకుని మాట్లాడుతున్నా, పెళ్ళి, పెళ్ళి కూతురు అన్న మాటలు విని వంట మధ్యలో ఆపి మేడ మీదకి పరిగెత్తుకొచ్చి పెళ్ళి కూతురు ఫొటో చూసి మూతి విరిచింది.

మూర్తికి అభినందనలు చెప్పి, క్షేమంగా వెళ్ళి, లాభంగా రమ్మని ఆశీర్వదించి టెలిఫోను పేట్టేసేను.

2

నేను హైదరాబాదులో 'డాట్ కాం' కంపెనీ నడిపిన రోజులవి. కనుక నాకు హైదరాబాదు వెళ్ళవలసిన పని తగిలింది. పిల్ల బందరే అయినా పెళ్ళి హైదరాబాదులో చెయ్యటానికి ఒప్పుకున్నారు. ఊళ్ళోనే ఉన్నాను కనుక పెళ్ళికి వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను.

పెళ్ళికి వెళుతున్నానని నా స్నేహితుడు, కంపెనీలో వాటాదారూ తన మెర్సిడీస్ కారునీ, డ్రైవరునీ ఇచ్చి పంపేడు – మా కంపెనీ స్టేటస్ ప్రదర్శించమని ప్రోత్సహిస్తూ!

రథం లాంటి కారు, 'యూనిఫారం' లో డ్రైవరు, పటాటోపం చూసి పెళ్ళివారు ఎదురొచ్చి, పలకరించి, పెద్దలకి పరిచయం చేసేరు. పెళ్ళికూతురు తల్లి బొద్దుగా, సూర్యాకాంతంలా ఉంది. తండ్రి రమణారెడ్డిలా సన్నంగా, రివటలా ఉన్నాడు. పెళ్ళికొడుకు నాకు కావలసిన వాడు అని చెబుతూ పరిచయం చేసుకున్నాను. "మావయ్యగారూ, మావయ్య గారూ!" అంటూ సావిత్రి నాకు కాఫీ, టిఫినూ ఇప్పించింది.

'మంథావారిదీ మాదీ కలిపి నూటొక్క వీసం' అన్న సామెతాలా నాకూ, మూర్తికీ ఏమీ ఆస్తి లేకపోయినా, నా కారు చూసి, మా స్నేహం చూసి మూర్తి అమెరికాలో ఎంతో ఆస్తిపరుడే అయుంటాడని ఆడ పెళ్ళివారు అనుకుంటూ ఉంటే విని నవ్వుకున్నాను.

ముహూర్తం వేళకి నాలుగు అక్షతలు జల్లి ఇంటికి తిరిగొచ్చేసేను.

నాలుగు రోజులు దొర్లిపోయాయి. శనివారం తెల్లారుతోంది. ఇంటి నుండి నా శ్రీమతి ఫోను చేసే వేళ అది. అందుకని అప్పటికే లేచి ఉన్నాను – ఫోను మీద వచ్చే పిలుపుకి ఎదురు చూస్తూ సుప్రభాతం వింటున్నాను. ఇంతలో ఫోను మోగింది.

"మా మూర్తినీ, సావిత్రినీ, వాళ్ళ తల్లిదండ్రులనీ రాత్రికి రాత్రి జైల్లో పెట్టేరు. మీరు ఉన్నపట్టున బయలుదేరి పోలీసు స్టేషన్ కి రావాలి" అంటూ, పోలీస్ ఠాణా చిరునామా ఇచ్చేరు అట్నించి పిలచిన గొంతు.

నాకు మతి పోయింది. మూర్తి, సావిత్రి ... వీళ్ళిద్దరూ కుర్రాళ్లు. పైగా బుద్ధిమంతులూను. జైలుకి వెళ్ళవలసినంత అపచారం వీళ్ళేమి చేసి ఉంటారో నాకు అర్థం కాలేదు. తల్లి దండ్రులని కూడానా?

మనస్సు పరి పరి విధాల పరుగెత్తుతూంది. కారెక్కి పరుగు పరుగున పోలీసు స్టేషన్ కి వెళదామని డ్రైవరుని లేపి పోలీసు స్టేషన్ కి తీసికెళ్ళమన్నాను.

ఊరు తెల్లారకుండా పోలీసు ఠాణా అనే సరికి డ్రైవరు శాంసన్ కి కుతూహలం పెరిగి ఎందుకని అడిగేడు. రెండ్రోజుల క్రితం పెళ్ళి చేసుకున్న పెళ్ళి కొడుకునీ, పెళ్ళి కొడుకు అప్పచెల్లెలునీ, వారి తల్లి దండ్రులనీ జైల్లో పెట్టేరని చెప్పేను.

"సార్!, ఇది డౌరీ కేసులా ఉందే. ఒక్కరుదా వెళ్ళి ఏమీ చెయ్యలేరు. ఒక లాయరుని వెంట తీసికెళ్ళండి." శాంసన్ తమిళ క్రైస్తవుడైపోయేడు కాని, తెలుగువాడయి ఉంటే 'సిరికింజెప్పడు…' పద్యం చదివేసి ఉండేవాడు, నా హడావుడి చూసి.

నేను ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి స్థాణువులా నిలబడిపోయాను.

"సార్! కల్యాణం నాలుగు దినాలుదా అయింది. ఎల్లారు జైలులో పడ్దారంటిరి. పెళ్ళికొడుకు ఎన్. ఆర్. ఐ. దా? ఇది కట్నం కేసు! ఇండియాలో ఇప్పిడి ఒక బిజినెస్ మాదిరి అయిందిదా. ఆంధ్రాలో మరీ రొంబగా ఉందిదా. ఈ పెళ్ళి కేసులు పోలీసోళ్ళకి పండగేనండి. పెళ్ళి చేసుకున్నోళ్ళు బూడిదై పోతారు దా! పోలీసోళ్ళూ, లాయరోళ్ళూ బాగుపడుతున్నారండి. ఈ మధ్య గల్ఫ్ నుండి వచ్చి, ఇక్కడ అమ్మాయిని పెళ్ళిచేసుకుని, ఒక ముస్లిం కుర్రాడు దా జైల్లో పడ్దాడండి. అతని లాయరు దగ్గరకి తీసికెళతాను, వస్తురా?"

నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఆ మధ్య మన తెలుగబ్బాయే, 18 ఏళ్ళ వయస్సుకే డాక్టర్ అయేడని పత్రికల్లో ఒకటే రాసేరు. ఇండియా వెళ్ళి, పెళ్ళి చేసుకుని, కట్నం కేసులో చిక్కడి, సకుటుంబంగా జైల్లో పడి, నానా అవస్థలూ పడి, లాయర్లకీ, పోలీసులకీ ముడుపులు చెల్లించుకుని, అయిన పెళ్ళిని రద్దు చేయించుకుని చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో బయట పడి తిరిగి అమెరికా వచ్చేడు. తప్పెవరిదో తెలియదు కాని కుర్రాడికి మూడేళ్ళ ఆర్జన పోయింది. తట్టెడు ఖర్చు అయింది. వార్తాపత్రికలలో వారాల తరబడి రాసేరు. "మంచి పని అయింది. ఈ మగాళ్ళకి ఇప్పటికైనా బుద్ధి చెప్పాలి!" అని మా ఆవిడ సంతోషం ప్రకటించింది కూడా!

"వివాహం విడాకులతో అంతం అయిందిట. ఎవ్వరు ఏమి బావుకున్నారని ఆ సంతోషం? కేసు వివరాలు తెలియకుండా నువ్వలా తీర్మానించటం బాగు లేదు!" అన్నాను, కొంచెం ఉక్రోషంగా.

"వివరాలు తెలియక్కర లేదు. మీ మగాళ్ళు తరతరాలుగా చేస్తూన్న పనేగా. ఆ డాక్టరు కట్నం అడిగే ఉంటాడు. లేక పోతే ఆ అత్త కోడలిని కోడింటికం పెట్టేసి ఉంటుంది."

“చూడు. అమెరికాలో డాక్టర్ సంపాదన ముందు ఇండియాలో – అందులోనూ, మన బెమ్మిగాళ్ళు – ఇచ్చే కట్నం ఏపాటి? సముద్రంలో కాకిరెట్ట! కట్నం కోసం అల్లరి పెట్టేడంటే నేను నమ్మను.”

“పోనీ, అత్తగారూ, మరదళ్ళూ సూటీ, పోటీ మాటలు అనేసి ఉంటారు! మన పిల్లలకైతే నేను అమెరికా సంబంధాలే చేస్తాను. తెల్లవాళ్ళయినా పరవాలేదు కాని, ఛస్తే నేను ఇండియా సంబంధానికి ఒప్పుకోను.”

“పెళ్ళయి మూ(డ్రో)జులు కాలేదు. సూటీ, పోటీ మాటలు అనటానికి అవకాశం రావాలి కదా! పెళ్ళన్న తరువాత రెండు భిన్నమైన మనస్తత్వాలు గల మనుష్యులు, రెండు భిన్నమైన వాతావరణంలో ఉన్న సంసారాలు కలసి, మెలసి మెలగటం నేర్చుకోవాలి. మన పెళ్ళయి ముప్ఫయ్ ఏళ్ళవుతోంది. అయినా మనం ప్రతిరోజూ వాదించుకోవటం లేదూ? కోర్టులకెక్కుతున్నామా? చీటికీ, మాటికీ అమెరికా సంబంధాలో అంటావు. నీకు ఈ తెల్లవాళ్ళంటే మోజు పోలేదు. వాళ్ళు మాత్రం విడాకులిచ్చుకు చావటం లేదూ?”

ఈ సంభాషణ చినికి, చినికి గాలివానవటం, మేమిద్దరమూ కొన్నాళ్ళ పాటు రివాజుగా మాట్లాడుకోవటం మానేసుకోవటమూ జరిగిపోయాయి. మా ఇళ్ళల్లో పట్టుదలలూ, పౌరుషాలూ ముందూ, ఆ తర్వాతే పిల్లల పుట్టుకానూ మరి! అవకాశం ఇస్తే చాలు ఆవిడ ఈ మగాళ్ళు ఆడవాళ్ళకి తరతరాలుగా చేసిన అన్యాయాలు ఏకరవు పెడుతుంది. మా గిల్లీకజ్జాలు విడాకులవరకూ పోలేదనటానికి సాక్ష్యం నేను రోజూ తెల్లవారు ఝామున లేచి నా శ్రీమతి పిలుపుకి ఎదురు చూడటమే!

నేనిలా పాత జ్ఞాపకాల దొంతరలలో మునిగి తేలుతూ ఉంటే శేంసన్ బంజారా హిల్స్ లో ఒక మేడ ముందు ఆపి, నన్ను కారులో ఉండమని, లోపలికి వెళ్ళి, కొంతసేపయిన తరువాత తిరిగొచ్చేడు. నన్ను వెంటబెట్టుకుని లోపలికి వెళ్ళి రెడ్డి గారికి పరిచయం చేసేడు.

నాకూ, మూర్తికీ ఉన్న పరిచయం చెప్పి, ఆర్థిక స్థోమత లేని కుర్రాడు. ఇంకా జీవితంలో స్థిరపడలేదు. సహాయం చెయ్యకలరా అని అడిగేను – నా కారుని, డ్రైవరుని చూసి నాకు వడ్డించెస్తాడేమో అన్న భయంతో. రెడ్డి ఫోను తీసి పోలీస్ స్టేషన్ ని పిలచి వాళ్లతో పది నిమిషాలు మాట్లాడేరు.

“గిది IPC 498A కేసు. కట్నం, గిట్నం, లాంచనాలు అంటూ అత్తింటొల్లని పరేషాన్ చేస్తున్నా, ఇంట్లగింట్ల ఏమైనా కిందమీదైనా, పిల్లగాన్ని, వాని అమ్మ అయ్యను ఈ సెక్షన్ కింద జైల్ల పెట్టోచ్చు. దీన్ని మన మహిళా సంఘాలన్ని పూర సపోర్టు చేస్తున్నయి.”

నాకు తెలంగాణ తెలుగుతో పరిచయం సున్న. రెడ్డి గారి భాష గభీమని అర్థం కాలా! ఆయన ఇంగ్లీషులో మాట్లాడినా బాగుండిపోను.

“మా మూర్తి కట్నం అక్కరలేదన్నాడే! అమ్మాయికి విమానం టికెట్టు కొని అమెరికా పంపిస్తే చాలన్నాడు. పెళ్ళయి రెండు రోజులు కూడా కాలేదు, డొమెస్టిక్ వయలెన్స్ కి అవకాశం ఏదీ? అసలా అబ్బాయి దగ్గర వయలిన్ తప్ప ఎప్పుడూ వయలెన్స్ కనిపించలేదే!” మూడు నిద్రలయినా ముగియకుండా మూర్తి – అందులోనూ అత్తవారింట – కొత్త పెళ్ళాం మీద చెయ్యి చేసుకుంటాడంటే నేను నమ్మ లేదు.

“పెండ్లాన్ని కొట్టకర్లే! పెండ్లాన్ని గాని అత్తింటొల్లని గాని, తక్కువచేసి మాట్లాడినా సరే, that is grounds for a complaint. Besides, in India, this is a non-bailable, non-compoundable, cognizable criminal offense” అన్నారు రెడ్డి.

నేను బిక్క మొహం వేసేను, ఆయన మాట అర్థం అయింది కాని భావం బొత్తిగా అర్థం కాలా!

“నాన్-బెయిలబుల్ కనుక గీ కేసులా బెయిలుండది. కోర్టులా జడ్జి ముందె జామీను కట్టి ఇడిపియ్యాల. శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసిన్రంటే యిగ సోమవారం పొద్దుగలవారకు యేమి జెయ్యడానికి గాదు. గీ మధ్య మన పోలీసోండ్లు గిట్లాంటి పనులల్లా బాగా వుషారైన్రు.”

పెరీ మేసన్ పుస్తకాలు తప్ప కోర్టు వ్యవహారాలతో నాకు బొత్తిగా పరిచయం లేదు. “రుజువయేవరకూ నిందుతుడు నిర్దోషి కదా? కనీసం కోర్టులో ప్రాధమిక సాక్ష్యం ప్రవేశపెట్టి, నిందుతుడు కనీసం తప్పు చేసుండొచ్చు అనే విషయం అనుమానాస్పదంగా ఉందని నిరూపించాలి కదా?” అని భయపడుతూనే అన్నాను.

“గిది cognizable offense బే! ‘గీడు నన్ను లోల్లి పెట్టిండు’ అని ఆడది గిన అంటే, ఎనకా ముందూ సూడకుండ బొక్కలేస్తరు మన పోలీసోళ్ళు. రుజువు, గిజువు, సాక్ష్యం, బీక్ష్యం ఏం అక్కర్లే!”

“మరి గయ్యాళి పెళ్ళాంతో బాధలు పడే మగాడికి కూడా ఈ రకం హక్కులు ఉన్నాయా?”

“లేవు. గిది దోళ్ళాకోసం special గా ఇచ్చిన చట్టం. జమానకెల్లి వాళ్ళాకు జరుగుతున్న అన్యాయానికి గిది ప్రతీకారం.”

“ఇది న్యాయం కాదే! ఇది పక్కా బ్లేక్ మెయిల్ ” కొంచెం ఉక్రోషంగానే అన్నాను.

"గీ IPC 498A, గంత మంచిగ లేదు. దీనిలో గొంచెం మార్పులు తేవాలె అని  సుప్రీం కోర్టు గూడ అంటున్నది. గీ చట్టాన్ని మార్చాలి! ఓట్ల కోసం, సీట్ల కోసం గింజుకులాడె మన రాజకీయనాయకులకు గంత ధైర్యమేది?" అన్నారు రెడ్డి గారు.

"ఇండియాలో నాయం ఎప్పుడో సచ్చిపోనాదండి. ప్రతోడికీ ఎదటోడు అన్నేయం చేసేసేడని ఒకటే దురద. కోస్తా వోళ్ళకో రూలు, ముల్కీ వోళ్ళకో రూలు. పెళ్ళిళ్ళు చేసుకున్నప్పుడు, ఆస్తులు పంచుకున్నప్పుడు ముస్లిమోళ్ళకో రూలు. మాకో రూలు, మీ హిందువులకో రూలు. ముస్లిమోళ్ళు మక్కా ఎల్లాలంటే మన గవర్నమెంటు టికెట్టు కొనిస్తారు. నాకు ఇవ్వరు." శాంసన్ తన గోడు తను చెప్పుకున్నాడు. శాంసన్ గల్ఫ్ లో పని చేసి బాగా డబ్బు గణించి హైదరాబాదులో ఇల్లు కట్టుకుని కాలక్షేపానికి డ్రైవరు పని చేసుకుంటున్నాడు. లోకం పోకడ బాగా తెలిసిన మనిషి.

"శాంసన్ చెప్పినది నిజం. ఎవరిమీదనొ గోపంతోని పెట్టిన చట్టాలు మిగిల్నయి. ప్రతోడు మరొకనిమీదొడి ఏడ్సేటోడె. వాడి కులం వీడికి పడదాయె. వీడి మతం వాడికి నచ్చదు. వానికోక చట్టం. వీనికోక చట్టం. వీనికి న్యాయమైతె వానికి నష్టం, వానికి న్యాయమైతె వీనికి నష్టం. మీకు తెలవందేమున్నది? గీ రిజర్వేషన్ల పేరిట సదువులల్ల, ఉద్యోగాల్లోపట గిది జరగతనే ఉన్నది గద. గిట్ల జెయ్యకపోతే ఓట్లు పడయి మరి. మన తాతల్నాటి కాలంల కన్యాశుల్కం! మరి గిప్పుడు వరకట్నం!...."

లాయరు గారు ఇలా చెప్పుకు పోతూ ఉంటే అసలు విషయం మరచిపోయే ప్రమాదం ఉందని ఆయనని తక్షణ కర్తవ్యం ఏమిటని అడిగేను.

"మీరు జేశెడిదేం లేదు. ఓ 50 లచ్చలు ఖర్చు పెడితే ఏమైనా పని గావచ్చు."

"ఏభై లక్షల రూపాయలంటే హండ్రెడ్ థౌజండ్ డాలర్లు! లాయరు ఖర్చులూ, కోర్టు ఖర్చులూనా? మూర్తిని బజారులో పెట్టి అమ్మేసినా అంత డబ్బు రాదు."

"గది కోర్టు ఖర్చులు గాదు. పోలీసోల్లని మేపనీకి."

నేను బిక్క మొహం వేసేను – ఈ మారు తడారిపోయిన గొంతుకతో!

రెడ్డిగారు ఏవేవో తంటాలు పడి సాయంత్రానికి మూర్తి తల్లిదండ్రులని జైలు నుండి విడిపించేరు. "మావయ్య గారూ! నా పేస్ పోర్టు వీళ్ళ కస్టడీలో పెడితే నన్ను కూడా విడిపిస్తామంటున్నారు. ఇప్పుడు నా చదువేం కాను?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది, సావిత్రి.

సోమవారం కోర్టు తెరిచే వరకూ సావిత్రిని విడిపించటం కుదరలేదు. పోలీసుల చేతిలో సావిత్రి పేస్ పోర్టు పడకుండా చూసేసరికి మా తాతలు దిగొచ్చేరు.

పాలిపోయిన ముఖంతో ఉన్న మూర్తిని జైల్లోనే వదిలేసి, కొంత కాకపోతే కొంతయినా సంఘటనలు అదుపులోకి వచ్చేయని సంతోషిస్తూ ఉంటే, "ఎందుకైన మంచిది, వాళ్ళ చెల్లెను ఇండియా కెల్లి జల్దిగ బయటకి పంపెయండ్రి, లేకుంటె గామెన్ని కష్టాలు పడల్సొస్తదో ఏమో" అని రెడ్డి గారి సలహా మీద మలేసియా వరకు టికెట్టు దొరికితే సావిత్రిని నిలబడ్డపాటుగా కోలాలంపూర్ పంపేసి, ఇంటికి వచ్చి నిద్రపోయేను – ఆ రాత్రికి.

తెల్లవారుఝామున నేను ఎదురు చూసే వేళకి టెలిఫోను మోగింది. నా శ్రీమతే పిలుస్తోందని టెలిఫోను తీసేను. "మూర్తి నాన్నగారు పోయారు! మీరు అర్జంటుగా రావాలి" మళ్ళా నిన్నటి గొంతు.

స్థాణువునై పోయాను. నోరు పెగలదీసుకుని "ఏమైందేమిటి?" అని అడిగేను.

"గుండె ఆగిపోయిందండి!"

శవం మీద పడి ఏడవటానికి కూతురైనా లేకుండా చేసేనే అన్న బాధతో రెడ్డి గారి ఇంటికి పరిగెత్తుకెళ్ళేను. తండ్రి తలకి కొరివి పెట్టటానికైనా మూర్తిని విడచిపెట్టమని పోలీసులని అడిగేము. వీలు లేదన్నారు. "కొడుకు అమెరికాలో ఉంటే ఏమిచేసుండేవారు? ఇప్పుడూ అదే చెయ్యమనండి" అని పోలీసులు సలహా ఇచ్చేరు. ఈ లంపటంలోంచి మూర్తిని జామీను మీద విడిపించేసరికి పద్నాలుగు రోజులు పట్టింది. ముప్ఫయి వేలు ఖర్చు అయింది. మూర్తి పేస్ పోర్టు పోలీసులు తమ అధీనంలో ఉంచేసుకున్నారు.

బెయిలు మీద ఇంటికొచ్చిన మూర్తిని ఎలా పరామర్శించాలో అర్థం కాలేదు. ఏ మాటంటే ఏ అర్థం స్ఫురిస్తుందో అని ఒక భయం.

"నువ్వు బయట పడ్డందుకు చాలా సంతోషం, పద ఇంటికి పోదాం" అన్నాను.

"జైల్లో పడ్డందుకు చాలా సంతోషంగా ఉంది. పదండి ముందుకి!"

చకితుణ్ణయాను!

"జైల్లో నేను కలిసిన మనుషులు, వారి అనుభవాలు నాకు ఒక కొత్త వెలుగుని చూపాయి."

“ఏమయిందయ్యా?”

“మొదట్లో నా జీవితం నాశనం అయిందనుకున్నాను. అమెరికాలో నా ఉద్యోగం పోయింది. ఈ దేశం విడచి వెళ్ళటానికి వీలు లేకుండా నా పేస్పోర్టు పోయింది. నాలా జీవితం నాశనమైన వాళ్ళు ఇంకా చాలా మంది జైళ్ళల్లో మగ్గుతున్నారని తెలిసిన తరువాత వాళ్ళు చేసిన మహాపాపం ఏమిటా అని శోధించటం మొదలుపెట్టేను.”

“అది అలా ఉండనియ్యవోయ్! అసలు నీ మీద కేసు పెట్టటానికి నువ్వు చేసిన తప్పు ఏమిటిట?”

“ఈ కేసు విషయాలు ఎవ్వరితోటీ సంప్రదించటానికి వీలు లేదని నా లాయరు ఆంక్ష పెట్టేడు. కనుక కోర్టులో లావాదేవీలు పూర్తయేవరకు నేను సమాధానం చెప్పగలిగే పరిస్థితిలో లేను.”

“పోనీ! ఆడపెళ్ళివారితో మాట్లాడి వస్తాను. ముల్లు వెళ్ళి అరిటాకు మీద పడ్డా, అరిటాకు వెళ్ళి ముల్లు మీద పడ్డా అరిటాకుకే కదా నష్టం అని నచ్చ చెప్పి చూస్తాను. కేసు విరమించుకోమని చెబుతాను. జరిగిందేదో మరిచిపోయి ఇద్దరూ అమెరికా వచ్చేసి సుఖంగా ఉండండి.”

“లేదండి. ఇది non-cognizable offense అండి. ఈ కేసు కోర్టులో నమోదైన తరువాత అభియోగం చేసినవాళ్ళు మనస్సు మార్చుకుని వెనక్కి తీసుకోటానికి వీలు లేదుటండి. ఒక వేళ వీలున్నా నాకు జరిగిన అన్యాయం తరువాత నేను ఆ పిల్లతో కాపురం చెయ్యటమనేది కలలోని మాట!”

పోనీలే! ఇప్పుడు కర్తవ్యం ఏమిటి?”

“ఏమోనండి. అంతా అయోమయంగా ఉంది. ఈ కేసు ఇప్పట్లో తెమిలేటట్టు లేదు. ఇది నా ఒక్కడికీ వచ్చిన కష్టం కాదు. మన సమాజానికి పట్టిన చీడ. చట్టాలను దుర్వినియోగపరచి, స్వలోభాలకి పోయి, పరుల జీవితాలను చెడగొట్టి, వారి జీవితాలను ప్రశ్నార్థకాలుగా మార్చి ఆడుకునే ఆడవారు, వారి పుట్టింటివారు ------స్త్రీవాదాన్ని సమర్ధించిన నేను స్త్రీవాదమనే జ్వాలలో పడి చిమ్మెటలా ఆహుతి అయిపోయానండి.”

“పోనీ, అప్పో, సొప్పో చేసి డబ్బు పట్టుకొచ్చి ఇస్తాను. ఆ లంచాలు మేపేసి బయటపడతావా? అమెరికా పోదాం!”

“లేదండి. ఇదేదో న్యాయస్థానంలో తేలాలి. ప్రేమ వేడిలో పడి పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళ సంగతేమో నాకు తెలియదు కానీ, పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు రాతకోతలు లేని వ్యాపార ఒప్పందాలలాంటివి. కనుక అపార్థాలు, మాట పట్టింపులు వస్తూ ఉంటాయి. లాంచనాలు సరిపోలేదని వాళ్ళో మాటంటే వీళ్ళో మాట అంటారు. తరువాత ‘బావ గారూ’ అంటే

'వదిన గారూ' అని వరసలు పెట్టుకుని పిలుచుకోనూ పిలుచుకుంటారు. అంతే కాని కక్షలు, కావేషాలు, కార్పణ్యాలు పెట్టుకుని జీవితాలనే కాల్చుకుంటారా? నేను చేసిన తప్పేమిటో న్యాయస్థానంలో తేలకుండానే నాకు శిక్ష పడిపోయింది! ఇహ కోర్టుకెళ్ళి సాధించేదేమిటంటారా? కనీసం నా ఆత్మగౌరవం నిలుపుకోవాలి. ఈ రకం అన్యాయం నాతో అంతరించాలి, మరెవ్వరికీ ఇలా జరగకూడదు."

"....." ఏమనాలో తెలియలేదు!

3

ఈ మధ్య వాషింగ్టన్ లో జరిగిన తానా సభకి వెళ్ళేను. సభా ప్రాంగణంలోకి ప్రవేశిస్తూ ఉంటే ఎవ్వరో చేతికి ఒక కరపత్రం అందించేరు.

"రండి! సమాన హక్కుల కోసం పోరాడండి! భారతీయ సంసారాలలో అసమానతని తొలగించండి! 498A అనే తెర వెనుక దాగి భారతీయ సంసారాల్లో చిచ్చు పెడుతున్న తీవ్రవాదులని నిరసించండి!!"

తలెత్తి చూసేను.

సావిత్రి!!

పరిచయం చేసుకోవలసిన అవసరం లేని సావిత్రి! మహంకాళి సావిత్రి!

**కథ వెనుక కథ:**

ఈ కథలోని ప్రధాన సంఘటనలు అన్నీ నిజంగా జరిగేయి. ప్రధాన పాత్రలు కూడ నిజమైనవే. పేర్లు మార్చడం జరిగింది. ఈ కథలోని తెలంగాణ యాసతో సంభాషణలు రాయడానికి సహాయం చేసిన కుమార్^ కలగర కి ధన్యవాదాలు.

ఈమాట అంతర్జాల పత్రిక మార్చి 2007 లో మొదట ప్రచురితమైంది. రచన (2008) కథామహల్ లో 'లోలకం' అన్న పేరుతో అచ్చయి వెయ్యినూటపదహార్లు పారితోషికం గెలుచుకుంది.

# ఇల్లు కట్టి చూడు

"ఒరేయ్! అన్నయ్యా! భయం!!"

"గిరీ! ఇంకా సాయంకాలం ఏడు దాట లేదు. ఇప్పుడే కదా చీకటి పడింది! నాన్న గారు కాసేపట్లో వచ్చేస్తారు. అంతవరకు కుదురుగా కూర్చో. భయమేసే ఆలోచనలు బుర్రలోకి రానీయకు."

"మాట్లాడకుండా కూర్చుంటే భయమేసే ఆలోచనలే వస్తున్నాయిరా!"

"పోనీ, వర్డ్ బిల్డింగ్  ఆడుకుందాం. నేను దేవుడితో మొదలు పెడతాను ... గాడ్"

"డాగ్"

"గోట్"

ఇలా ఒక అరగంట ఆట ఆడేసరికి గిరికి వచ్చిన ఇంగ్లీషు మాటలు అయిపోయాయి. అందుకని ఆట ఆపేసేం.

"భయం!"

"ఊరికే భయం, భయం అంటూ నన్ను కూడ భయపెట్టెయ్యకు! పోనీ మరొక ఆట ఆడదాం. నేను తమాషాగా మాటలోని అక్షరాలని కలగా పులగం చేసి అంటాను, నువ్వూ అలాంటిదే మరొకటి అనాలి."

"సరే!"

"సిరం, కలాబుడ్డి"   అని ఆట మొదలుపెట్టేను.

"చొక్కరు, నిక్కా"

"చెక్క, అల్లెలు"

"పుహం, సింలి"

"..."

“అయ్యా బాబోయ్” అంటు గిరి నా పీక ఒక్క సారి పట్టేసుకున్నాడు.

అదేవిటిరా? ఇప్పుడేమొచ్చింది?”

“పు..పు..ప్పు..లి”

“నువ్వే కదురా అన్నావ్. మరి భయమేసే మాట ఎందుకు అన్నావ్?”

ఇలా పట్టుకున్న నా పీకని నాన్నగారి కిర్రు చెప్పుల చప్పుడు వినిపించే వరకు వదల లేదు, వాడు.

ఇంకొక రెండు క్షణాలలో ఒక చేత గొడుగు కర్ర, మరొక చేత హరికేన్ లాంతరుతో నాన్నగారు పాక లోకి రానే వచ్చేరు. వచ్చి కర్ర, లాంతరు మాకిచ్చి మమ్మల్ని ఇంటికి వెళ్ళిపోమన్నారు.

“చీకట్లో పురుగూ పుట్రా ఉంటాయి. కర్రతో రోడ్డు మీద గట్టిగా కొడుతూ, దీపం వెలుగు ఎక్కడ పడుతోందో అక్కడే అడుగు వేస్తూ జాగ్రత్తగా వెళ్ళండి.”

గిరి భయపడ్డట్టు నాన్నగారికి చెప్పలేదు. చెప్పుంటే “హోరి! వెర్రి కక్కగట్టా!” అనుండేవారు.

★ ★ ★ ★ ★ ★ ★

అది 1955 వేసంగిలో సంగతి. నాన్నగారు ఇల్లు కట్టిస్తున్నారు. ఇంటికి కావలసిన కలప, ఇటిక, గునపాలు, పారలు, మొదలైన సరంజామా అంతా స్థలంలోనే ఉన్నయ్. పగలల్లా పని వాళ్ళు ఉంటారు గనుక పరవా లేదు కాని రాత్రి మాత్రం మనిషి కాపలా లేకపోతే సరుకులు మాయం అయిపోతాయి.

కనుక నూతికి ఎదురుగా చిన్న ఒంటిదూలం పాక వేసి, అందులో ఈ సామాను పెట్టి దానికి రోజూ కాపలాకని నాన్నగారు ఆ పాకలోనే ఒక మడత మంచం వేసుకుని పడుక్కునేవారు. సాయంకాలం ఏడింటికి ఇంటికి వచ్చి భోజనం చేసి మళ్ళా ఒక గంటలో తిరిగి వెళ్ళిపోయేవారు. ఆ గంటసేపూ కాపలా పని ఇంట్లో పిల్లల మీద పడేది. ఇంటి దగ్గర ఉన్న మగ పిల్లలలో నేనే పెద్దవాడిని కనుక ఆ బాధ్యత తరచు నా మీద పడేది.

నేనేమీ చిన్న వాణ్ణీ చితక వాణ్ణీ కాదు. అయినా సరే నాకు కూడ ఆ దయ్యాల తోటకి ఎదురుగా ఉన్న స్థలంలో ఒంటరిగా కూర్చుందికి బెదురుగానే ఉండేది. ఈ భయానికి కారణం లేకపోలేదు.

నేను అప్పటికే కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో చేరి ఒక ఏడు అయింది.హాస్టల్ లో ఉండే వాడిని. హాస్టల్ అంటే వాల్తేరులో సద్ధర్మ సదనం లాంటి భవనం కాదు. బ్రిటిష్ వాళ్ళు ఉన్న రోజులలో యుద్ధంలో దెబ్బలు తగిలిన సైనికులకి వాడిన హాస్పిటల్ వార్డులు. అక్కడ ఉన్న మామిడి తోటని నరికి, మధ్యలో తెరిపి చేసి, అక్కడ తాత్కాలికంగా కట్టడానికి ఎనిమిదేసి గదుల చొప్పున ఎనిమిది కట్టడాలు పొడుగ్గా, గుర్రాల సాలల్లా కట్టేరు. అక్కడ పుకారు ఏమంటే ఆసుపత్రిలో చచ్చిపోయిన సైనికులు దయ్యాలయి ఆ తోటల్లో తిరుగుతున్నాయని. కాలేజీకి వెళితే దయ్యాలు. మా ఊరొస్తే దయ్యాలు. ఈ దయ్యాల సంసారం కాదు కాని భయపడి చస్తున్నాం.

అందుకని గిరిని నాకు సాయం ఇచ్చి పంపేవారు. వాడు నా కంటె భయస్తుడు. పెళ్ళికెళుతూ పిల్లిని చంకనెట్టుకు వెళ్ళడం అంటే ఇదే!

నాన్నగారు ఇల్లు కట్టడం అంటే ఇప్పుడు మొదలు పెట్టేరు కాని, అసలు అమ్మకీ నాన్నగారికీ తమదంటూ ఒక ఇల్లు ఉంటే బాగుంటుందనే కోరిక చాల ఏళ్ళబట్టి ఉంది. కోరికలుండడంలో తప్పు లేదు. తీరే అవకాశాలు రావద్దూ?

అలాగని మాట అనుకున్నంత మాత్రాన వచ్చిన నష్టం ఏమిటి? అందుకనే “ఇల్లు కట్టుకుంటే బాగుండును” అని అనుకునేవారు అప్పుడప్పుడు. ఇలా మసకగా ఉన్న ఊహ ఘనీభవించి ఒక స్ఫటికాకారం దాల్చడానికి ఆ వేళ పోష్టు జవాను పట్టుకొచ్చిన ఉత్తరం నాంది పలికించింది.

ఉత్తరం చదివి నాన్నగారు చిందులు తొక్కడం మొదలు పెట్టేరు. వీలు చూసుకుని త్వరలో ఇల్లు ఖాళీ చేసెయ్యమని మా ఇంటి కొత్త యజమాని ఉత్తరం రాసేడు. ఖాళీ చెయ్యమని అతను అడిగినందుకు నాన్నగారికి కోపం రాలేదు. అతను ఇల్లు కొనుక్కున్నప్పుడు, “ఏమయ్యా! నువ్వు ఉండడం కోసం కొనుక్కుంటే చెప్పు, ఖాళీ చేసేస్తాను,” అని నాన్నగారే అన్నారు.

“పంతులు గారూ! పిల్లలతో ఉన్నారు. మీరు కోటయ్యకి ఎంత అద్దె ఇచ్చేవారో నాకూ అదే ఇవ్వండి. నేనెక్కడో ఖరగ్^పూర్ లో ఉద్యోగం చేసుకుంటున్నాను. నాకీ ఇల్లు ఇప్పట్లో అక్కర లేదు,” అని తన ఇద్దరి పెళ్ళాల సమక్షంలోనూ చెప్పేడు. చెప్పి, మా ఇంట ముగ్గురూ భోజనం చేసి మరీ వెళ్ళేరు. అటువంటి ఆసామీ ఖరగ్^పూర్ వెళ్ళిన వెంటనే మనస్సు మార్చుకుని ఇల్లు ఖాళీ చేసెయ్యమంటూ ఉత్తరం రాసేడు.

ఏమనుకున్నాడో ఏమో, తనెందుకు మనస్సు మార్చుకున్నాడో సంజాయిషీ కూడ రాసేడు.

ఈ సంజాయిషీ చదివిన తర్వాతే నాన్నగారికి కోపం వచ్చింది.

"పంతులుగారూ! మీకిచ్చిన మాట నిజమే. మీరు ఆ ఇంట్లో గత పదిహేను ఏళ్ళబట్టీ ఉంటున్నారు కనుక ఇల్లు మీదే అని మీరు అనే ప్రమాదం ఉందని అక్కడ మీ ఇరుగు పొరుగులు నాకు పిరికి మందు పోసేరు. అందుకనే మిమ్మల్ని ఖాళీ చెయ్యమని అడుగుతున్నాను," అంటూ మర్మం లేకుండా మనసులో మాట రాసేడు.

ఆ ఇల్లు అధర్మంగా కొట్టేద్దామన్న ఊహ నాన్నగారికి ఏ కోశాన్నా లేదు.

నిప్పు లాంటి తనని రైలు ఇంజనులో ఫైర్ మన్ గా  పనిచేసే ఒక అనామకుడు అనుమానిస్తాడా? అదీ నాన్నగారి కోపానికి కారణం.

ఈ వెధవ పని ఆ కొవ్వూరి వెంకయ్యప్పే చేసుంటుందని ఒకరు, లేదు షరాయి మేస్టరు చేసుంటాడని మరొకరు పత్తేదారీ మొదలు పెట్టేరు.

చెప్పుడు మాటలు ఎవ్వరు చెప్పేరో మనకి తెలియదు. తెలియనప్పుడు మరొకరిని మాట అనడం ఏమి భావ్యం? "అమ్మన్న గారూ, అమ్మన్న గారూ" అంటూ ఇంట్లో పెట్టిన ఇంగువ చారు పట్టుకు పోయేది ఒకరైతే "పంతులు గారూ, పంతులు గారూ" అంటూ అవసరం అయినప్పుడల్లా ఇంటి పంచని వేల్లాడి హోమియోపతీ మాత్రలు పట్టికెళ్ళేది మరొకరు. వీళ్ళేనా వెనక్కి తిరగ్గానే చెప్పుడు మాటలు చెప్పేది? చెప్పుడు మాటలు చెప్పినవాడిది కాదు తప్పు; విన్న వాడిది. అందుకని నాన్నగారికి ఇంటి ఓనరు మీదే కోపం వచ్చింది. అదే ఊపులో ఇరుగు పొరుగులందరిమీదా విరక్తి పుట్టింది.

ఆ కోపంతో ఉత్తరం వచ్చిన ఉత్తరక్షణం ఇల్లు ఖాళీ చెయ్యడానికి ఉద్యమించేరు. అనుకున్నంతలో అద్దె ఇళ్ళు ఎక్కడ దొరుకుతాయి? ఆఖరికి పక్క వీధిలో, పెత్తెలుగు మేష్టారి ఇంటికి ఎదురుగా ఉన్న ఇంద్రగంటి రత్తమ్మ గారింట్లో ముందు భాగం ఖాళీగా ఉందని తెలిసి అమ్మతో చెప్పకుండా ఒక నెల అద్దె బయానాగా ఇచ్చి చక్కా వచ్చేరు.

"చెరువు మీద అలిగి, నీలాంటి వాడే, ముడ్డి కడుక్కోవడం మానేసేడుట. అలా ఉంది నువ్వు చేసిన యావ్వారం," అని మామ్మ నాన్న గారిని మందలించింది. "ఆ రత్తమ్మ పరమ గయ్యాళి. గోడ మీద మేకులు కొడితే తన గుండెల మీద కొట్టినట్లు ఉందని ఆ ఇంట్లో ఇంతకు పూర్వం అద్దెకి ఉన్న వాళ్ళని తరిమి తగిలేసింది. మనింటి నిండా ఇంటిడు పిల్లలు. గంటల పంచాగం వేల్లాడదీసుకుందికైనా గోడకి మేకు కొట్టాలి కదరా! ఇహ ఇంట్లో ఆడ పిల్లలు ఉన్న తర్వాత కాటుక వేళ్ళని అద్దం పక్క గోడకి రాసి తుడుచుకున్నా తుడుచుకుంటారు. ఒక పూత వెల్ల వేస్తే పోయేదానికి బదులు అకస్మాత్తుగా ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటే మళ్ళా ఎక్కడికి పోతాంరా?"

“ఆ రత్తమ్మ చండశాసనురాలుట. ఏడాది క్రితం మొగుడు చచ్చిపోయినప్పుడు శవాన్ని సావిట్లో పడుకోబెట్టి, అటకెక్కి ఆస్తులకి సంబంధించిన రాతకోతల కాగితాలన్నీ కొంగులో దోపుకుని, అటక దిగొచ్చి అప్పుడు ఘొల్లు మందిట! మనని బతకనిస్తుందా?” అంటూ చిన్నక్క తనకి తెలిసిన మసాలాని తను అందించింది.

నోరు మంచిదైతే ఊరుమంచిదౌతుందనే తత్వం అమ్మది. రత్తమ్మ గారితో వరస కలిపింది. ఆవిడ కొడుకునీ, కోడలునీ మచ్చిక చేసుకుంది. అయినా సరే రత్తమ్మామ్మ గారికి మా ఇంట్లో పిల్లలు చేసే రొద కిట్టలేదుట. కోడలా కోడలా అని వరసలు కలుపుతూనే ఇల్లు ఖాళీ చేసెయ్య మన్నారు. సంవత్సరం తిరగకుండా మళ్ళా మా పాత ఇల్లు ఉన్న వీధిలోనే అనకాపల్లి మేస్టారి ఇంట్లోకి మారేం.

ఈ ఇంట్లో సదుపాయం తక్కువ. వాస్తు కోసమనో మరెందువల్లో వీధి గుమ్మంలో, గేటు పక్కనే పాయిఖానా కట్టేరు. దాని పక్కనే నుయ్యి. నూతికెదురుగా ప్రహరీ గోడని ఆనుకుని నేలమట్టంగా దింపిన పంచపాళీయే వంట గది. మిగిలిన ఇల్లంతా పది మెట్లు ఎగువ. పప్పు కావాలన్నా, ఉప్పు కావాలన్న కొండెక్కినట్లు ఈ మెట్లన్నీఎక్క వలసిందే. పెద్దవాళ్ళందరికీ కీళ్ళ నొప్పులో, వాతపు నొప్పులో ఉండబట్టి ఈ ఎగుడూ, దిగుడూ ఇబ్బందే పెట్టింది. మరేవిధంగా చూసినా ఇల్లు వాసయోగ్యంగా లేదనే చెప్పాలి. కనుక మళ్ళా ఇల్లు మారవలసి వచ్చింది. ఆ సందర్భంలో ప్రసాదరావు మావయ్య గారూ, రామం అత్తయ్య ఊళ్ళో అద్దెకిచ్చిన వారిల్లు ఒక సారి చూసి పోదామని వచ్చి మమ్మల్ని పలకరించడానికి వచ్చేరు.

ప్రసాదరావు మావయ్య గారికి అమ్మన్నా, నాన్నగారన్నా మంచి భక్తి. ఆయన చదువుకునే రోజులలో ఆయన జాతకం చూసి, “ప్రసాదరావూ! నువ్వు మేజస్ట్రేటు ఉద్యోగం చేస్తావు” అని చెప్పేరుట. ఇప్పుడు ఆయన పెద్దాపురంలో ఆర్. డి. ఒ. గా పనిచేస్తున్నారు. అందుకని ఆయనకి నాన్నగారంటే అపరిమితమైన గురి. రామం అత్తయ్య కి అమ్మ దేవతే. ఇంటిని అద్దెకి ఇచ్చేసి పెద్దాపురం వెళ్ళిపోయినా తుని వచ్చినప్పుడు మమ్మల్ని పలకరించకుండా వెళ్ళేవారు కాదు.

మా పరిస్థితి చూసి ఎవరో పరాయి వాళ్ళు ఉండే కంటె మేముంటే బాగుంటుందని మమ్మల్ని వారింట ఉండమని అడిగేరు. “సొంత ఇల్లే అనుకుని ఉండండి. మీరు ఇల్లు కట్టుకునే వరకు ఇల్లు ఖాళీ చెయ్యమని అడగం,” అని హామీ ఇచ్చేరు. కనుక నేను స్కూలు ఫైనలు పూర్తి చేసి ఇంటరులో జేరే వేళకి మేము ప్రసాదరావు మామయ్య గారి ఇంట్లోకి మారేం.

ఆ ఇంట్లో ఉన్న రోజులలో అమ్మ చిట్టన్నయ్యతో అనేది, "చిట్టిపంతులూ, ఇలా పిల్లి పిల్లల్ని మార్చినట్లు సంసారాన్ని ఎన్ని సార్లురా మార్చడం? మీ నాన్న గారు రిటైరయే రోజులు వచ్చేయి. ఆయన ప్రోవిడెంట్ ఫండు పెట్టి చిన్న స్థలం కొనుక్కుని మనదంటూ ఒక చిన్న ఇల్లు కనీసం ఒక పాక ఉంటే బాగుంటుందిరా అబ్బాయ్."

అప్పుడు చిట్టన్నయ్య ప్రోద్బలంతో నాన్నగారు స్థలం కోసం వెతకడం మొదలు పెట్టేరు.

తునిలో మేముండే కొత్తపేట ఊరుకి ఓ చివర ఉంది. కంది చేలు నరికి, రోడ్లు వేసి కట్టగా వెలిసిన శివారు. బజారులో బయలుదేరి పోలీసు నుయ్యి దాటిన తర్వాత సూరవరం రోడ్డు వెంబడి  లక్షిందేవి చెరువు వైపు వస్తూ ఉంటే ముందుగా "సెంటుజార్జి కోట"  తగులుతుంది. ముక్కు మూసుకుని పదడుగులు జోరుగా వేసి ముందుకి వస్తే ఎడం పక్క రాజు గారి తోట. దీనినే ఏనుగు తోట అనేవారు. ఈ తోటలో ఒక మూల రాజుగారి ఏనుగు ఉండేది. అక్కడ కంపు భరించలేకనో ఏమో దరిమిలా ఆ ఏనుగుకి పిచ్చెక్కింది. తుపాకితో కాల్చేసి అక్కడే పాతి పెట్టేసేరు. తర్వాత సెంటు జార్జి కోటని పడగొట్టేసి ఏనుగు దిబ్బ మీద ఒక పార్కు కట్టేరనుకోండి.

ఆ పార్కు వెనక గుర్రాల సాలలు. నా చిన్నతనం నుండీ ఈ సాలలు శిధిలావస్థలోనే ఉన్నాయి తప్ప నాకు గుర్రాలెప్పుడూ కనిపించ లేదు. ఈ ఏనుగు దిబ్బ, గుర్రాల సాలలు మొదలుకొని, ఇటు సూరవరం రోడ్డు వెంబడి ఒక అర మైలు పైగా విస్తరించి ఉండేది, రాజుగారి తోట. నేను ఎనిమిదో తరగతి చదివే రోజులలో కూడ ఆ తోటలో అపురూపమైన రకరకాల ఫలవృక్షాలు ఉండేవి. దక్షత లేక క్రమేపీ పాడయి పోయింది. ఈ తోటకి ఎదురుగా, సూరవరం రోడ్డుకి కుడివైపున శ్రీ రాజా ఉన్నత పాఠశాల వారి బంతుల బీడు. ఓ ఇరవై ఎకరాలు ఉంటుంది. ఆ బీడు పక్కనే రాణీ సుభద్రయ్యమ్మ వారి పేర కట్టించిన ఘోషాసుపత్రి. ఆసుపత్రి చిన్నదే అయినా ప్రాంగణం పెద్దది. ముప్పై ఎకరాలు పైగానే ఉంటుందేమో. అదీ దాటుకు వస్తే దయ్యాల తోట, దాని తర్వాతే కొత్తపేట మొదలవుతుంది.

ఈ కొత్తపేటలో మేముండే వాళ్ళం. బజారుకి వెళ్ళాలన్నా, రైలు స్టేషన్ కి వెళ్ళాలన్నా, ఊళ్ళో మరెక్కడికి వెళ్ళాలన్నా ఈ పేట దాటి, ఆ దయ్యాల తోట దాటి, బంతుల బీడు గేటు దాటి వెళ్ళేవాళ్ళం.

నిజానికి ఈ దయ్యాల తోట ఒక మామిడి తోట. కుర్ర కుంకలు తోటలో చొరబడి కాయలు కోసేయకుండా  ఆ మామిడి చెట్ల మీద దయ్యాలు ఉన్నాయని ఒక వదంతి పుట్టించేరేమోనని ఈమధ్య నాకొక అనుమానం పుట్టుకొచ్చింది. కాని అప్పట్లో మాత్రం నేను కూడ ఆ చెట్ల మీద దయ్యాలున్నాయని నమ్మిన వాడినే. నమ్మక చస్తానా? ఘోషాసుపత్రి ప్రాంగణంలోనే శవాలని కోసే గది ఉండేది. ఆ శవాలకి సంబధించిన దయ్యాలే ఘోషాసుపత్రి గేటు ముందున్న తాటిచెట్టు మీద ఒకటి, ఆ పక్కనున్న మామిడి  తోటలో మరికొన్ని ఉండేవి.

"ఉండేవి" అని తెలుసున్నట్లు ఎందుకు చెబుతున్నానంటే దేవరకొండ వెంకటేశ్వర్లు స్వయంగా చెప్పేడు కనుక.

వాడికి ఎలా తెలుసంటారా?

వాడు ఒక రాత్రి సైకిలేసుకుని ఆ దారి వెంబడి వెళుతూ ఉంటే ఆ సైకిలు వెనక సీటు మీద వచ్చి కూర్చుందిట ఒక దయ్యం. వాడు ఇలా వర్ణించి చెబుతూ ఉంటే నమ్మకుండా ఎలా ఉండడం? అయినా లాయరు గారి మేనల్లుడ్ని కనుక వాడిని కొంచెం క్రాసు పరీక్ష చేసేను.

"నువ్వు దెయ్యాన్ని నీ కళ్ళతో చేసేవా? కోతలు కోసేస్తున్నావా?"

"నా కళ్ళతో చూడలేదు. వెనక్కి తిరిగి చూడడానికి భయం వేసింది."

"చూడకపోతే దయ్యం సైకిలెక్కిందని ఎలా తెలిసింది?"

"వెనక సీట్లో ఏదో ఎక్కింది. ఆ బరువుకు హేండిల్ బార్ ఇటూ అటూ విసిరేయడం మొదలు పెట్టింది."

"ఏదో ఏమిటి. నా బొంద! ఎవరో ఎక్కి ఉంటారు."

"అది ఎవరో అయితే నేను తొక్కుతున్నకొద్దీ ఎందుకు ఎక్కువ బరువవుతుంది? కనుక అది ఖచ్చితంగా దయ్యమే."

దయ్యాలకి పాదాలు వెనక్కి తిరిగి ఉంటాయనీ, అవి మన వెంట పడ్డప్పుడు మనం వెనక్కి తిరిగి చూస్తే వెంటనే మటుమాయం అయి పోతాయనీ, దేవగణంలో పుట్టినవాళ్ళకి దయ్యాలు అస్సలు కనిపించనే కనిపించవనీ, ఇలా చెలామణీ అవుతూ వున్న రకరకాల సిద్ధాంతాలతో పాటు దేవరకొండాడు పైన చెప్పిన సమాధానంతో మరొక కొత్త సిద్ధాంతం లేవదీస్తున్నాడన్న మాట. సైకిళ్ళు ఎక్కిన దయ్యాలు క్రమేపీ బరువెక్కుతాయని.

"నీతో ఎంత దూరం వచ్చిందేమిటి?"

"దయ్యాల తోట చివరికంటా వచ్చింది తర్వాత దిగిపోయింది."

"దిగి ఎక్కడికి వెళ్ళిందంటావ్?"

"మళ్ళా మామిడితోటలోకి వెళ్ళిపోయి ఉంటుంది."

కనుక చీకటి పడ్డ తర్వాత మాకు అటువేపు వెళ్ళడానికి భయం వేసేది. దేవరకొండాడి మాటలొక్కటే కాదు అందుకు కారణం. ఆ తోటలో ఎప్పుడూ చిన్న చిన్న దీపాలు మినుకు మినుకు మంటూ, వెలుగుతూ, ఆరుతూ, గాలిలో ఎగురుతూ కనిపించేవి. దయ్యాలే చిన్న చిన్న బుడ్డి దీపాలు పట్టుకుని ఎగురుతున్నాయని అనుకునేవాళ్ళం. పైపెచ్చు చీకటి పడే సమయానికి అవి వంటలు వండుకునేవి కాబోలు ఎప్పుడూ బంగాళా దుంపల వంటకాలలా ఘుమఘుమ వాసనలు వచ్చేవి.

ఘోషాసుపత్రి పక్కన ఉన్న మామిడి తోటలోనే దయ్యాలు ఉండేవి. ఆ ఎదురుగా ఉన్న ఏనుగు తోటలో దయ్యాలు ఉండేవి కాదు. అక్కడ వెదురు పొదలలో పాములు ఉండేవి.

దరిమిలా 1952 నాటికి రాజు గారు వెదురుపొదలతో పాటు తోటంతటినీ కొట్టించేసి, రోడ్లు వేయించి  ఇళ్ళ స్థలాలుగా అమ్మకానికి పెట్టేరు. రిజిస్ట్రీ చేయించుకునేటప్పుడు ఇటు అమ్మేవాళ్ళూ, అటు కొనేవాళ్ళూ కూడ నాన్నగారి సలహా కోసం వచ్చేవారు. కనుక ఊళ్ళో ఎక్కడెక్కడ ఏయే స్థలాలు ఉన్నాయో, ఎక్కడెక్కడ ధరలు ఎలా పలుకుతున్నాయో ఈ వివరాలన్నీ నాన్నగారికి బాగా తెలిసేవి.

ఏనుగు తోటలో స్థలాలు వేడి వేడి పకోడీలలా అమ్ముడు పోయాయి కాని, ఘోషాసుపత్రి కి ఎదురుగా ఉన్న వీధిలో మంగలి మాన్యపు స్థలాలు గభీమని అమ్ముడు పోలేదు. అక్కడ గజం రెండు రూపాయలు పలుకుతోంది అప్పట్లో. అందులో వెయ్యి గజాల స్థలం రిజిస్ట్రేషన్ విషయాలలో సహాయం చేసినందుకు గాను రూపాయిన్నర చొప్పున బేరం కుదుర్చుకున్నారు. తనకి వచ్చిన రెండు వేల ప్రోవిడెంటు ఫండులోనూ పదిహేను వందలు పెట్టి ఆ స్థలం కొనేసేరు.

ఆ స్థలంలో ఒక తోట వేసి, ఆ తోట మధ్యలో అప్పారావు డాక్టరు గారి ఇల్లు మాదిరి ఒక ఇల్లు ఉంటే బాగుంటుందని అమ్మ, చిట్టన్నయ్య ఏవేవో పథకాలు వేస్తున్నారు. స్థలం మధ్యలో మంచి మేడ, చుట్టూ ప్రహారీ గోడ, గోడ మీదనుంది బయటకి ఒరుగుతూ బోగన్ విలియా  మొక్కలు, వీధి వాకట్లో పువ్వుల మొక్కలు, క్రోటన్లు, పెరట్లో అరటి బోదెలు, మామిడి చెట్లు ఇలా ఏదో పెద్ద పథకమే ఉంది అమ్మ బుర్రలో.

స్థలం కొనేయడం కొనేసేరు కాని, నన్ను కాకినాడలో చదివిస్తూ ఇల్లు కట్టడానికి నాన్నగారికి దమ్ములు చాలలేదు. చేతిలో చిల్లి గవ్వ లేదు.

వెధవ డబ్బు అదే వస్తుంది. అంతకీ అవసరమైతే తన ఒంటి మీద బంగారం అమ్మేస్తానంటూ అలవాటుగా అమ్మ మెడ తడుముకుంది. అప్పటికి కాని ఆమెకి గుర్తుకి రాలేదు. కూతురి పెళ్ళికి కాసుల పేరూ, కొడుకుల చదువులకి ఎనిమిది పేటల చంద్రహారాలు వెళ్ళిపోయాయని.

ఈ సందర్భంలో దాసు మావయ్య గారు – ఈయన నాన్నగారి స్నేహబృందంలో ఒకరు – ఒక సలహా ఇచ్చేరు. మా ఊళ్ళో సలహాలు ఇచ్చే వాళ్ళు చాలమందే ఉండేవారు. అది కూడ డబ్బు పుచ్చుకోకుండా ఫ్రీ గా ఇచ్చేవారు.

"వెయ్యి గజాలు ఏమిటి చేసుకుంటారండీ? అయిదు వందల గజం అమ్మేసి ఆ డబ్బుతో మిగిలిన జాగాలో ఒక పాక వేసుకుని ఉండండి. మీదంటూ ఒక ఇల్లు ఉన్న తర్వాత అందులో మీరు కల్లే తాగేరో, గంజే తాగేరో ఎవరు చూడొచ్చారు."

దస్తావేజు మీద సిరా ఇంకా ఆరకుండానే స్థలాన్ని రెండు ముక్కలు చేసి ఒక ముక్కని అమ్మేయడానికి అమ్మ ఇష్టపడ లేదు. చిట్టన్నయ్య ససేమిరా అన్నాడు.

"చేతిలో చిల్లి గవ్వ లేకుండా ఇల్లెలా కడతావోయ్. కాలేజీ చదువులు చదివేవు కాని, కానీ లంచం పుచ్చుకోవడం చేతకాలేదు నీకు. మేడ కడతాడుట! మేడ! ఇల్లు కట్టి చూడు, పెళ్ళిచేసి చూడు అన్నారు," అంటూ దాసు మావయ్య గారు అన్నయ్య మీద ఒక వెటకారపు విసురు విసిరేరు.

"అమ్మా, నేను అప్పో సొప్పో చేసి ఎలాగో డబ్బు పట్టుకొస్తాను. అంతవరకు దాసు మావయ్య గారి మాట వినేసి తొందరపడి ఏమీ చేసెయ్యకండి," అని పదే పదే చెప్పి అన్నయ్య తన ఉద్యోగపు ఊరు వెళ్ళిపోయేడు.

అన్నయ్య ఎక్కిన రైలు బండి ఔటర్ సిగ్నల్ దాటే వరకు ఆగి, దాసు మావయ్య గారు నాన్న గారి మీద పనికి ఉపక్రమించేరు. "మీ వాడికి ఆవేశం తప్ప అనుభవం లేదు. కరువు కాలం. సిమెంటు దొరకడం లేదు. కలప దొరకడం లేదు. మీ వాడికి రైల్వేలో ఉద్యోగమా ఏమన్నానా, అక్కడ ఉన్న కలప సరుకులు హోల్సేల్ గా పట్టుకొచ్చేసి ... ఎవరోయ్! ఈ పక్క వీధిలో ఉన్నాడు, వాడపల్లి వారి అల్లుడు. రైల్వేలో గార్డ్ గా పనిచేస్తున్నాడు, అని అక్కడ ఉన్న నన్ను సంబోధిస్తూ .... మేడ కట్టేయడానికి! పునాదులేసి డబ్బు లేక పదేళ్ళ పాటు ఒదిలేసేరు ఆ దేవరకొండ వారు. చూస్తున్నాం కదా! పరిగెత్తి పాలు తాగే కంటె నిలబడి నీళ్ళు తాగడం మేలు. మీరు అందని వాటికి అర్రులు చాచి తూగ లేరు. నా మాట వినండి," అంటూ అక్కడ ఉన్న నాన్నగారిని ఉద్దేశిస్తూ కొంచెం ఘాటుగా ఉపన్యాసం ఇచ్చేరు.

అప్పట్లో నా దగ్గర తంతే దమ్మిడీ లేదు కనుక ఇంటి విషయంలో నాకు ఓటు హక్కు లేదని నాకూ తెలుసు, ఆయనకీ తెలుసు. కుర్రాడినని నన్ను పూర్తిగా కొట్టిపారెయ్యడానికా వీలు లేదు. ఎందుకంటే మా వూళ్ళో మొదటివాడిగా నాకు ఇంజనీరింగు కాలేజీలో సీటు వచ్చింది. ఆయనేమో బట్టల కొట్లో గుమస్తా. అందుకని నన్ను మాటలలో కలిపీ కలపనట్లు మాటవరసకి కలిపేరు.

ఇలా తర్జనభర్జనలు జరుగుతున్న తరుణంలో కరైకుడీలో అలగప్ప చెట్టియార్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగు వెలగబెడుతూన్న శాస్త్రి బావ సెలవులకని చోడవరం వెళుతూ దారిలో అమ్మని చూసిపోదామని తునిలో దిగేడు. చోడవరం వెళితే, "ఏమిరా! పరీక్షలు ఎలా రాసేవురా?" అని పెద్ద మామయ్య గారు అడుగుతారు. తునిలో అలాంటి ప్రశ్నలు వేసి అత్తయ్య ఇబ్బంది పెట్టదు. తునిలో దిగడానికి అది కూడ ఒక కారణమే.

అత్తయ్య ఇల్లు కట్టుకుంటున్నాదంటే వాడికి మాత్రం సరదా కాదూ! వసారాలో ఉన్న ఉయ్యాల బల్లని డ్రాయింగు బోర్డులా వాడేసి, వాడు రెండ్రోజుల్లో ఒక ప్లేను గీసేసి, "అత్తయ్యా! ఇహ ఇంటి ప్లేను గీయించడానికి నువ్వేమీ ఖర్చు పెట్టక్కర లేదు. ఇదిగో మన కొత్తిల్లు," అంటూ డ్రాయింగు కాగితం చుట్టని అమ్మ ముందు పరచి ఏవేవో చెబుతున్నాడు.

తన అన్న కొడుకు ఇంత ప్రయోజకుడైపోయినందుకు అమ్మ ఎంతగానో సంతోషించింది. నాకు అయిన్^స్టయిన్^ అంటే ఎంత గౌరవమో అమ్మకి వాళ్ళ అన్నయ్య అంటే అంత ఇది. ఆ అన్న కొడుకు వీడు. ఇన్ని క్వాలిఫికేషన్లు ఉండడంతో చిట్టన్నయ్య ఇంటికి వచ్చే వరకూ వాడు అమ్మకి కన్సల్టెంటుగా చెలామణీ అయిపోయేడు.

"ఏమిరా, శాస్త్రీ! దీనికి కాస్ట్ ఎస్టిమాటు వేసేవా?" ఇంటికొచ్చిన చిట్టన్నయ్య అడిగేడు.

"లేదు, బావా."

"ఇక్కడ నల్లరేగడి మట్టి. పునాదుల దగ్గర కక్కుర్తి పడితే ఇల్లు కట్టిన మర్నాడే గోడలు బీటలు వేసేస్తాయి. ఏదీ, పునాదులు ఎలా డిజైన్ చేసేవో చూపించు."

"పునాదుల గురించి ఇంకా ఆలోచించలేదు బావా."

"పోనీలే. ఎలివేషన్ ఏదీ? రూఫ్ ఏదీ? ఆ రెండు వేసి పట్టుకురా చూద్దాం."

రెండు గంటల తర్వాత వాడు బిక్క ముఖం పెట్టుకుని వచ్చేడు.

"డాబా వేసెద్దాం."

"రూఫ్ ఏదోయ్"

"రూఫ్ వెయ్యడం తెలియలేదు."

"హోరి నీ ఇల్లు బంగారం గానూ. ఇదిట్రా నువ్వు వెలగబెడుతూన్న ఇంజనీరింగు" అని నాన్న గారు అందుకున్నారు.

అత్తయ్య దగ్గర వేసిన కుప్పి గంతులు మావయ్య గారి దగ్గర పారవని తెలిసి తెలివిగా అక్కడ నుండి తప్పుకున్నాడు, శాస్త్రి బావ.

ఈ సంభాషణ అంతా దాసు మావయ్య గారు విన్నారు. విని, అమ్మ దగ్గరకి వచ్చి,

"చెల్లమ్మా, చూడండి. స్థలం కొని చాల రోజులు అయిపోతోంది. ధరలా పెరిగి పోతున్నాయి. మీరు ఈ వేసంగిలో ఏదో విధంగా ఇల్లు కట్టేయ్యాలి. మీ చిట్టిపంతులు డబ్బు గణించి మేడ కడతానంటే నేను వద్దంటానా! పోనీ, అందాకా స్థలంలో ఓ మూలకి చిన్న పంచ దింపుదాం. డబ్బు సర్దుబాటు అయినప్పుడు ముందుకి మేడ కట్టుకుందాం. చిట్టిపంతులుకీ, శాస్త్రికీ ఈ పని అప్పజెబితే వాళ్ళు గాలిలో అలా మేడలు కడుతూనే ఉంటారు."

వేడిగా ఉన్న ఇనప కడ్డీ మీద సమ్మెటతో దెబ్బ వేసినట్లు, ఏమీ పాలు పోని స్థితిలో అమ్మకీ, నాన్నగారికీ దాసు మావయ్యగారి బోధ నచ్చింది.

దీర్ఘ చతురంగా ఉత్తరముఖంగా ఉన్న స్థలంలో నైరృతి మూల చిన్న పంచ దింపడానికి నిశ్చయం చేసేరు. ఉన్న స్థలంలో సగానికి పైగా తూర్పుకీ ఈశాన్యానికీ ఒదిలేయడం మంచిదే అని దాసు మావయ్య గారు చెప్పగానే "సరే" అన్నారు నాన్న గారు.

"ఇల్లు మరీ మూలకి వచ్చినట్లుంది. అప్పారావు డాక్టరు గారి ఇల్లులా స్థలంలో మధ్యకి ఇల్లు ఉంటే బాగుంటుందని అన్నయ్య అంటున్నాడు కదా" అన్నాను.

"అనడానికేమి! అంటాడోయ్. ఇల్లు ఇలా ఒక మూలకి ఉంటే, రేప్పొద్దున్న డబ్బు అవసరం వస్తే ఆ తూర్పు భాగాన్ని మరొక స్థలంగా అమ్మేసుకోవచ్చు. అంతే కాకుండా తూర్పు వైపు ఎక్కువ జాగా వదిలెయ్యడం వాస్తు ప్రకారం మంచిదోయ్."

నాన్న గారు స్థలం కొనడం చూసి మరికొంత మంది ముందుకి వచ్చి ఇటూ అటూ ఉన్న స్థలాలని కొనేసేరు. కాని ఆ నిర్జన ప్రదేశంలో మొట్టమొదట శంకు స్థాపన జరిగిందీ, గృహప్రవేశం జరిగిందీ మా ఇంట్లోనే.

ఇల్లు కట్టాలంటే నీళ్ళు కావాలి కదా. అందుకని ముందస్తుగా నుయ్యి తవ్వించేరు. శాస్త్రం మాట ఎలా ఉన్నా ఇంటిని నైరృతి మూలలో ఇరికించడానికి నిర్ణయం అయింది కనుక, నుయ్యి వీధి గుమ్మంలోకి వచ్చింది. అంటే ఇంటికి ఎవ్వరు వచ్చినా ముందు వాళ్ళకి కనబడేది నూతి దగ్గర స్నానాలు చేస్తూన్న ఆడవాళ్ళు. ఈ విషయం ఇల్లు కట్టడం పూర్తి అయేవరకు అవగాహన కాలేదు.

నుయ్యి తవ్వడం మొదలు పెట్టేరు. లంకెల బిందెలేమైనా దొరుకుతాయనుకున్నారో ఏమిటో, నాన్నగారు తవ్వకం అవుతూన్నంత సేపు నన్ను అక్కడ కాపలా పెట్టేరు. నూతిలో నీళ్ళకి బదులు పెట్రోలియం పడితే బాగుండునని నేను కోరుకున్నాను. లంకెల బిందెలూ దొరకలేదు, ఖనిజపు నూనే పడలేదు, కాని కొబ్బరి నీళ్ళల్లాంటి తియ్యటి నీళ్ళు పడ్డాయి.

ఇల్లు కట్టడానికి కావలసిన ఇటికలు, సున్నం, కలప వగైరాలన్నీ సమకూర్చడం మొదలు పెట్టేరు నాన్నగారు. అన్నీ ఒక్క సారి కొనలేరు కనుక ఒకటీ, ఒకటీ కొనడం మొదలు పెట్టేరు. ఇలా కొన్న సరుకంతా ఎక్కడ దాచుతారు? మా స్థలంలోనే నిల్వ చెయ్యడానికి నిశ్చయించేరు.

ఇలా నిల్వ చేసిన సరుకులకి ఆ రోజు సాయంకాలం నేను, గిరి కాపలా కాసేం.

పునాదులు తవ్వడం మొదలు పెట్టేరు. తవ్వకం సగం అయేసరికి పక్క స్థలం కొనుక్కున్న బెహరా డాక్టరు గారు ముగ్గు, పురికొస తాడుతో ఒక సర్వే చేసే మనిషితో తన స్థలం సరిహద్దులు గీసుకుందికి వచ్చేరు. ఆ కొలతలు అయేసరికి మా పునాదులు ఒక అడుగు ప్రాప్తికి వాళ్ళ స్థలంలోకి వెళ్ళినట్లు తేలింది.

నిజానికి తప్పు మాది. సూరవరం రోడ్డు మొగలో ఉన్న మాటేటూరి స్థలం మరీ రోడ్డు మీదకి వెళ్ళిపోయిందని పంచాయితీ బోర్డు వారు వారి స్థలం పడమటి సరిహద్దు నుండి ఒక అడుగు కోసేసి, వారి తూర్పు సరిహద్దుని ఒకడుగు తూర్పుకి జరిపేరు. దాంతో బెహరా వారి స్థలం ఒకడుగు తూర్పుకి జరిగింది. ఈ విషయం మా వాళ్ళు చూసుకోలేదు. మా ఇల్లు స్థలం మధ్యలో ఉండుంటే ఈ మాత్రపు సరిహద్దులలో సర్దుబాటు వల్ల ఎవ్వరికీ నష్టం రాకపోను – ఇంకా ఎవ్వరూ ప్రహారీ గోడలు కట్టలేదు కనుక. కాని మా వాళ్ళు మేడ, మేడ నుండి మిద్దె, మిద్దె నుండి పంచపాళీ, పంచపాళీ నుండి పాక అనుకుంటూ ఇంటి పునాదులని నైరృతి మూలకి తోసెయ్యడంతో మా పునాదులు ఒక అడుగు మేరకి బెహరావారి స్థలంలోకి వెళ్ళేయి.

తవ్విన గోతులన్నీ కప్పేసి మళ్ళా కొత్త పునాదులు తియ్యాలంటే తడిపి మోపెడవుతుంది. అపసంతికి పనెక్కువ, లోభికి ఖర్చు ఎక్కువ అని ఊరకనే అనలేదు.

స్థలాన్ని మధ్యకి కోసి రెండు స్థలాలు చేస్తే గిస్తే నుయ్యి మనకి ఉండాలని నూతిని స్థలం మధ్యలోకి వచ్చేటట్లు తవ్వించేసేరేమో, ఇప్పుడు పునాదులని తూర్పుకి జరిపితే ముందుముందు ముంగిటి వాకిలిలో మేడ కట్టుకోవాలంటే నుయ్యి అడ్డొస్తుంది. కనుక పునాదులని మరీ ఎక్కువగా తూర్పుకి జరపడానికి వీలు లేకపోయింది. ఎలాగైతేనేమి అతి కష్టం మీద పునాదులని రెండడుగులు జరిపి పని తిరిగి ప్రారంభించేరు. దీని పర్యవసానం ఏమిటయ్యా అంటే పక్కింటి

వారింటికి మా ఇంటికి మధ్య అనుకున్న ప్రహారీ గోడ కాస్తా హరీమనిపోయింది. వాళ్ళింటి గోడకీ మా ఇంటి గోడకీ మధ్య గోచీ అంత గంత మిగిలింది.

అన్నయ్య సెలవు పెట్టి ఇంటికి వచ్చేసరికి పునాదుల పని పూర్తి అయిపోయింది. అనుకున్నది ఒకటి, అయింది మరొకటీ అయేసరికి అగ్గిరాముడై పోయేడు.

ఎలాగైతేనేమి వాడిని సముదాయించేరు.తెల్లారి లేచి పునాది గోడలు చూడడానికి వెళ్ళేడు. చూసి చకితుడయేడు. నేలమట్టానికి సమాంతరంగా, చదునుగా ఉండవలసిన పునాదిమట్టం, కుంభాకారంగా ఉబ్బెత్తుగా కనిపించింది.

మేస్త్రీని పిలిచేడు.

"అది అలాగే ఉంటది బాబూ! మేం పద్దినవూ ఇళ్ళు కడతనాం గందా," అంటూ పెద్ద మేస్త్రి సూరన్న అన్న మాటలు అగ్గి మీద గుగ్గిలమే అయాయి. దీనిని ఇప్పుడు గోటితో మీటక పోతే తర్వాత గొడ్డలి కావలిసి వస్తుందని అన్నయ్య ఆ పునాది గోడని పడగొట్టించి మళ్ళా చదునుగా వచ్చేటట్లు కట్టించేడు. తను కట్టిన గోడని పడగొట్టించేడని అన్నయ్య మీద సూరన్న వారం రోజుల పాటు అలిగేడు.

ఏమైతేనేం గోడలు లేచే వేళకి పెద్ద బావ రెండు తాటిచెట్లు కొట్టించి పట్టుకొచ్చేడు. అప్పల్నాయుడు వాటిని అతి చాకచక్యంతో దూలాలగానూ వాసాలగానూ కోసి ఇంటికి కొప్పు వేసేడు. ఇంట్లో చల్లగా ఉంటుందని ముందు బిళ్ళ పెంకు వేసి దాని మీద బంగాళా పెంకు అమర్చి కొప్పుని ఇలా కప్పేరో లేదో అలా గృహప్రవేశం అన్నారు.

ఇంకా గోడలకి గిలాబీలు అవలేదు. గదులలో నేలకి ఇంకా గచ్చు పడ లేదు. ఇల్లు పూర్తయేవరకు ఆగడం వాస్తుకి మంచిది కాదన్నారు. గృహప్రవేశానికి నేను కాకినాడ నుండి ఇంటికి వచ్చేసరికి వాకట్లోనూ, ఇంట్లోనూ అంతా బురద బురద.

ఇంట్లో అడుగు పెట్టి చూద్దును కదా. సొంత ఇంటి కోసం కలలు కని కలవరించిన అమ్మ గృహప్రవేశం హడావిడిలో పందిట్లో ఎక్కడో ఉంది; కనబడనే లేదు. రిటైరైన తర్వాతనైనా ఇల్లు కట్టుకో గలిగిన నాన్నగారు కనిపించ లేదు; ఆయన వడ్రంగులతోటీ, తాపీ మేస్త్రీలతోటీ కుస్తీ పడుతున్నట్లున్నారు, బయటెక్కడో. ఇల్లు తననుకున్నట్లు కట్టలేదని అలిగేడో ఏమో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు గాంధీగారిలా చిట్టన్నయ్య గృహప్రవేశానికి రానేలేదు.

కాని, మడిగట్టుకుని ఎప్పుడు పెట్టేసిందో గదిలో దేవుడి మందిరం ఒక మూల, ఆవకాయ జాడీలు మరొక మూల సర్దేసి, గుమ్మానికి అడ్డుగానిలబడి చాటంత మొహంతో మామ్మ కనిపించింది.

నన్ను చూడగానే, "నా వరాల తండ్రే, నా ధనాల కుప్పే, ఏడు కొండలవాడా వచ్చావా, నాయనా. ఈ రోజు కోసం అరవై ఏళ్ళ బట్టి ఎదురు చూస్తున్నానురా!"

నేను మామ్మ దగ్గరగా వెళ్ళబోయేను.

"ముట్టుకోకు. ఇంకా మడే. ఫలారం చేసిన తర్వాత నీకూ, గిరికీ తోట చిన్నాడిని పులి కరిచిన కథ చెబుతాను" అంది.

"వాడు పులి అంటే భయపడతాడు. పోనీ పిడత కథ చెప్పు."

ఆ వేళ మామ్మ పిడత కథ చెబుతూ ఉంటే నేనూ గిరీ ఊకొడుతూ ఊకొడుతూ పూర్తిగా వినకుండానే మొదటిసారిగా మా ఇంట్లో నిద్రపోయేం.

**కథ వెనుక కథ:**

ఈ కథలోని సంఘటనలు, నిజంగా 1954 లో జరిగినవే. పాత్రలు, పాత్రల పేర్లు కూడ మార్చలేదు.

ఈమాట (http://eemaata.com) సెప్టెంబరు 2003 లో "నాన్నగారు కట్టిన ఇల్లు" గా ప్రచురితం.

# బల్లి ఫలితం

ఆదివారం. మధ్యాహ్నం. వేళ రెండున్నర. గదిలో టెలిఫోను మోగింది.

"మీ కోసం ఇద్దరు వచ్చేరు. పైకి పంపమంటారా?"

"పంపండి."

వారం రోజులబట్టీ హొటేలు గదిలో ఉంటున్నాను. ఊళ్లో ఉన్న కళాశాలలో అతిథి ఆచార్యుడిగా పాఠాలు చెప్పటానికి వచ్చేను. తరగతిలో విద్యార్థులు హొటేలు గదికి రాత్రి పది లోపు ఎప్పుడైనా, అభిసారం లేకపోయినా, వచ్చి కలుసుకుని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని ప్రోత్సాహ పరచేను. కాబట్టి గదిలో ఉన్నంత సేపు వచ్చే పోయే విద్యార్థులతో నాకు కాలం గడవకపోవటం, తోచకపోవటం అంటూ లేదు.

ఇద్దరు వ్యక్తులు తెరచి ఉంచిన తలుపు దగ్గర నిలబడి లోపలికి రావటానికి తటపటాయిస్తున్నారు. లోనికి రమ్మని ఆహ్వానించేను. వయస్సు లోనూ, వాలకం లోనూ నా తరగతిలో ఉన్న విద్యార్థులులా లేరు. ప్రశ్నార్థకంగా చూసేను.

"అయ్యా! ప్రొఫెసర్ దివాకర్  కోసం వచ్చేం." అన్నాడు ఆగంతకులలో చిన్నవాడు.

"నేనే దివాకర్ ని, లోపలికి రాండి."

"నన్ను చంద్రం అంటారండి. నేను ఇక్కడ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగులో పి. ఎచ్. డి. పట్టా కోసం పరిశోధనా పత్రం రాస్తున్నాను – 'మన మూఢనమ్మకాల వెనక ఉన్న శాస్త్రీయత'  అన్న అంశం మీద. దిశా నిర్దేశం చెయ్యటంలో మీ సహాయం కోరి వచ్చేను."

"నేను ఆ రంగం వాడిని కాదే. మీకు నేను ఏ విధంగా సహాయం చెయ్యగలను?"

"మీరు రాసే వైజ్ఞానిక కల్పనలంటే నాకు చాల ఇష్టం." పక్కనున్న పెద్దాయన అందుకున్నారు. "నన్ను డాక్టర్ రవిచంద్ర అంటారు. చంద్రం వరసకి నాకు మేనల్లుడు అవుతాడు. ఇతని పరిశోధనకి మీరే మంచి దిశానిర్దేశకులన్న నమ్మకంతో – మీరు ఈ ఉళ్లో ఉన్నారని తెలిసి – తీసుకువచ్చానండి."

నేను రాసిన ఒక కథలో తిరుపతిని కేంద్ర బిందువుగా వాడుకున్నాను. ఆ కథని ఉదహరించి, ఆ కథ వైద్యపరంగా తనకి ఎందుకు నచ్చిందో టూకీగా వివరించి, నాకు చేతనయిన సహాయం చెయ్యమని అడిగేరు, డాక్టర్ రవిచంద్ర.

"నమ్మకం అనేది సాపేక్ష భావం. శాస్త్రీయమైన రుజువు దొరకనంతసేపూ అన్నీ మూఢనమ్మకాలే! అవునా?" అని సమాధానం కోసం ఆగకుండానే, "ఒక గంటలో మరొకరు వస్తున్నారు. వారొచ్చే లోగా నా చిన్ననాటి సంఘటన ఒకటి చెబుతాను. విన్న తరువాత ఆ కథనంలో మూఢం ఏదో, శాస్త్రం ఏదో ఆలోచించండి. ఏమంటారు?"

"చెప్పండి!" ఇద్దరూ ఏకకంఠంతో అన్నారు.

జీడిపప్పు పకోడీలు, కాఫీ పైకి పంపమని హొటేలు వారికి టెలిఫోనులో చెప్పి, "అయితే చెబుతాను, అలా కూర్చోండి. ఇది ఎప్పుడో 1950 దశకపు ఉత్తరార్థంలో జరిగిన సంఘటన," అని మొదలెట్టాను.

సూర్యం, గోపాలకృష్ణ, నాగముని గిండీ కాలేజీ హాస్టల్లో కలిసి ఉండేవారు. చదువు పూర్తి చేసి ఎవరి ఇళ్లకి వారు వెళ్లేరు. వాళ్లు ఇళ్లు చేరేరో లేదో వెనువెంటనే ఉద్యోగంలో చేరమని ప్రభుత్వం వారి నుండి ఉత్తరాలు వచ్చేయి.

బళ్లారి దగ్గర హొళగొంది అనే కుగ్రామం వచ్చి ఉద్యోగంలో చేరమని విశాఖ ప్రాంతాల్లో నివసించే సూర్యాన్ని అడిగేరు. తుంగభద్ర డ్యామ్ కి కాలువలు తవ్వించవలసిన పని. ఇంట్లో ఉన్న అట్లాసు తీసి చూస్తే బళ్లారి కనిపించింది కాని హొళగొంది కనపడలేదు. ప్రభుత్వం వారు ఉద్యోగం ఇస్తూ రాసిన ఉత్తరంలో ఆ హొళగొంది ఎక్కడ ఉందో చెప్పలేదు కాని బళ్లారిలో రైలు దిగి, అక్కడ డివిజనల్ ఇంజనీరు ఆఫీసుకి వెళితే వారు దారి చెపుతారని మాత్రం ఉంది. ఇటువంటి దైవోపహతమైన ప్రదేశాలనే మనం తెలుగులో వెటకారానికి 'శంకరగిరి మన్యాలు' అంటాం. బొద్దింకలు, తేళ్లు, మండ్రగబ్బలు వగైరాలు వీరవిహారం చేసే ప్రదేశం అది.

గోపాలకృష్ణది కృష్ణా జిల్లా. అతని ఉద్యోగం దుడుమా జలపాతం దగ్గర కడుతూన్న జలవిద్యుత్ డ్యామ్ దగ్గర. విశాఖపట్నంలో రైలు దిగి, పాడేరు, చింతపల్లి మీదుగా మాచ్కండ్ చేరుకోమని అతనికి వచ్చిన ఉత్తర్వులో ఉంది.

పోతే నాగమునిది బళ్లారి. అతనిని డెహరాడూన్ లో భారతీయ వాయుదళాలలో ఇంజనీరుగా ఎంపిక చేసేరు.

తునిలో రైలెక్కి మదరాసులో దిగటం వరకే తెలుసున్న సూర్యానికి బళ్లారి నైసర్గిక స్వరూపం తెలియదు. కృష్ణా జిల్లాలో పుట్టి పెరిగిన గోపాలకృష్ణ విశాఖ జిల్లా వైపు ఎప్పుడూ రాలేదు. నాగమునికి రాయలసీమ సంగతే పూర్తిగా తెలియదు. వీరు ముగ్గురూ ఉత్తరాల ద్వారా ఒకరినొకరు సంప్రదించుకున్నారు.

"ముందు మా ఇంటికి వచ్చి మకాం పెట్టేవంటే ఇక్కడ నుండి మన్యప్రాంతమైన మాచ్కండ్  వెళ్లటంలోని సాధకబాధకాలు మావాళ్లు నీకు చెబుతారు," అంటూ గోపాలకృష్ణకి సూర్యం ధైర్యం చెప్పి, మూటా, ముల్లె సర్దుకుని బళ్లారి ప్రయాణం అయేడు. నాగముని, విధవరాలైన తల్లిని బళ్లారిలో ఒంటరిగా వదిలేసి, డెహరాడూన్ వెళ్లిపోయేడు.

సూర్యం ఇలా వెళ్లేడో లేదో, గోపాలకృష్ణ పెట్టె, పరుపుచుట్టతో హౌరా మెయిల్ లో  దిగి, బండి కట్టించుకుని ఇంటికి చక్కా వచ్చేడు. మంచి కలుపుగోలు మనిషేమో ఇంట్లో ఉన్న ఇంటెడు పిల్లలకి ఆప్తుడయిపోయేడు. రామయ్యగారికీ, సీతమ్మగారికీ బళ్లారి వెళ్లిపోయిన కొడుకు సూర్యం స్థానంలో గోపాలకృష్ణ కనిపించేడే తప్ప ఏమీ భారం అనిపించలేదు. సీతమ్మగారు పుట్టి, పెరిగిన ఊరు మాడుగుల అవటంతో ఆ మన్యపు ప్రాంతాల గురించి ఆమెకి బాగా తెలుసు.

"మరిగించకుండా నీళ్లు తాగొద్దు. మన్యంలో దొరికే పళ్లు – ఘుమఘుమలాడుతూ ఎంత ఆకర్షణీయంగా కనిపించినా సరే – తినొద్దు. దోమతెర వేసుకోకుండా పడుకోవద్దు," అని తీసుకోవలసిన ఎన్నో జాగ్రత్తలు చెబుతూ, ఒక్కొక్క పొట్లంలో చిటికెడు పసుపు పొడి వేసి పొట్లాలు కట్టి, "ప్రతి రోజూ, వేడి అన్నం పట్టెడు తీసుకుని, పిడచకట్టి, అందులో పొట్లం పసుపు వేసి, దానిని తిన్న తరువాతే మిగతా భోజనం చెయ్యి నాయనా. మన్యపు జ్వరం నీ దరిదాపులకి రాదు," అంటూ రెండు నెలలకి సరిపడా పసుపు పొట్లాలు, దినుసులు మూటలు కట్టి అతనిని సాగనంపింది.

"ఇప్పుడంటే పసుపు ఆరోగ్యానికి మంచిదనీ, కేన్సరు రాకుండా అడ్డుకుంటుందనీ అమెరికాలో ఒప్పుకుంటున్నారు కాని, అప్పుడూ, ఇప్పుడూ పసుపు తినటానికి, మలేరియాకి సంబంధం ఏమిటో ఎవ్వరూ పరిశోధనలు చేసినట్లు లేదండి," అన్నారు డాక్టర్ రవిచంద్ర.

సూర్యం స్ఫురద్రూపి. దబ్బపండు లాంటి శరీర ఛాయ. విశాలమయిన నుదురు. తీర్చి దిద్దినట్లున్న కనుముక్కు తీరు. గిండీ కాలేజి హాస్టల్ భోజనం బాగుండేదేమో, పిల్లాడు నిగనిగలాడుతూ, చూడముచ్చటగా ఉండేవాడు. ఇటువంటి ముక్కుపచ్చలారని కుర్రాడిని రాయలసీమ రాళ్ల మధ్య, ఆ హొళగొందిలో, తిండీ తిప్పలు లేని అడవిలో, మండుటెండలో సర్వే చెయ్యమని పంపితే ఎలా తాళుకోగలడు?

ఉద్యోగం రాటుపోట్లకి అలవాటు పడ్డాడు కాని తిండి సదుపాయం లేక ఇబ్బంది పడేవాడు. తల్లి సంరక్షణలోనూ, అప్పచెల్లెళ్ల చాటున పెరిగినవాడు కాబట్టి కనీసం కాఫీ కాచుకోవటం కూడ నేర్చుకోలేదు. హొళగొందిలో హొటేలు సదుపాయాలు కూడ లేవు. బళ్లారి వచ్చినప్పుడు మాత్రం ఏ డాక్ బంగళాలోనో పడుక్కుంటే లాస్కర్ కేరేజీతో భోజనం పట్టుకొచ్చేవాడు. అందుకని ఆఫీసు పని కల్పించుకుని తరచు బళ్లారి వచ్చేవాడు – భోజనం కోసం.

ఒక రోజు నాగముని తల్లి ఆ ఊళ్లోనే ఉంటున్నాదని జ్ఞాపకం వచ్చి ఆమెని ఒకసారి పలకరించటానికి వెళ్లేడు. అప్పుడు కాని ఆమె విధవరాలన్న విషయం సూర్యానికి తెలియలేదు. నాగముని ఒక్కడే కొడుకుట. నాగమునికి అయిదేళ్లయినా నిండకుండానే 'ఆయన' గుండె పోటు వచ్చి పోయారుట. ఈమెకి ఎంతకాదన్నా నలభయి అయిదు మించి ఉండవని సూర్యం అంచనా వేసేడు. అందుకని 'పిన్నిగారూ' అని వరస పెట్టి పిలచి, ఆమె ఇచ్చిన కాఫీ తాగి, బయలుదేరబోయేడు.

"భోజనం చేసి వెళ్లు బాబూ! దూరం నుండి వచ్చేవు."

"పరవాలేదండి. మళ్లా వస్తాను."

"ఇంటిదగ్గర ఎవ్వరైనా ఎదురుచూస్తూ ఉంటారా? అటువంటప్పుడు బలవంతం చెయ్యను."

"ఎవ్వరూ లేరండి. నేనే వండుకు తింటాను. బళ్లారి వచ్చినప్పుడు కేరేజీ తెప్పించుకుంటున్నాను."

"సరే! ఈ పూట నువ్వు ఇక్కడ భోజనం చెయ్యకుండా వెళ్లడానికి వీలు లేదు. అలా ఆ పంచపాళీలో ఉన్న మంచం వాల్చి ఒక్క కునుకు తీశావంటే, చిటికెల మీద వంట చేసి పెడతాను. తిని వెళుదువుగాని."

సూర్యం మరీ హఠం చెయ్యకుండానే ఒప్పుకున్నాడు. నాగముని తల్లి పార్వతమ్మ, పక్కన కూర్చుని, కొసరి కొసరి వడ్డించి తినిపించింది.

"ఊళ్లోకి వచ్చినప్పుడు వస్తూ ఉండు నాయనా. మా నాగుని నీలో చూసుకుని సంతోషపడతాను. ఎక్కడో ఉత్తరాదిన ఉన్నాడు. ఎలా ఉన్నాడో, ఏమో!"

సూర్యం హొళగొంది నుండి బళ్లారి వచ్చినప్పుడల్లా కాకపోయినా నెలకో తడవ ఈమెని పలకరించటానికి వీరింటికి వెళ్లటం, ఆమె బలవంతం చేసి ఇతనికి భోజనం పెట్టి పంపటం రివాజుగా జరుగుతూ వచ్చేయి.

నాలుగు నెలలు గడిచేసరికి సూర్యం ఆరోగ్యం కుంటు పడింది. కాలేజీలో ఉన్నప్పుడు వారానికొకసారి చేసే సర్వే ఇప్పుడు రోజూ చెయ్యవలసి వస్తోంది. ఎండలో తిప్పట. పోషణ సరిగ్గా లేదు. మనిషి చిక్కిపోయాడు. సాయంకాలం అయేసరికి పక్కలు వెచ్చబడేవి. తిరగటానికి ఓపిక ఉండేది కాదు. కొత్త ఉద్యోగం. ఇంటికి వెళ్లటానికి సెలవు దొరకటం కష్టం. ఈ పరిస్థితులలో సూర్యం మేనమామ రవణ బళ్లారికి బదిలీ అయి రావటం కేవలం కాకతాళీయం.

సూర్యాన్ని చూడగానే పరిస్థితి బాగులేదని పసికట్టిన రవణ వెంటనే బళ్లారిలో ఉన్న ప్రభుత్వపు ఆసుపత్రికి తీసుకెళ్లేడు. వైద్యులు చాంతాడంత పొడుగున్న జాబితా రాసిచ్చి ఆ పరీక్షలన్నీ చెయ్యాలన్నారు. పరీక్షలు అయిన తరువాత మందుల జాబితా రాసిచ్చి, అవి కొని ఓ నెల్లాళ్లపాటు వేసుకుని తిరిగి రమ్మన్నారు. మందులు పని చెయ్యలేదు. మరికొన్ని పరీక్షలు చేసి, రక్తంలో ఏదో దోషం కనిపిస్తోందనిన్నీ, ఇసనోఫిల్స్ అనే ఒక రకం తెల్ల కణాలు మోతాదుకి మించి ఉండటమే నీరసానికి కారణమనీ, కాని ఆ జాతి తెల్లకణాల పెరుగుదలకి కారణం ఇదమిత్థంగా తేల్చి చెప్పటానికి, కొన్నాళ్లపాటు ఆసుపత్రిలో చేర్పిస్తే వైద్యుల పర్యవేక్షణలో అసలు కారణం తేలవచ్చనీ సిఫార్సు చేసేరు.

"ఈ పరిస్థితికి కారణం ఏమై ఉంటుందని మీరు ఊహిస్తున్నారు?" అంటూ రవణ వాకబు చేసేడు.

"అలవాటు లేని ప్రదేశంలో, అనారోగ్యమైన పరిసరాల్లో ఉండే పరాన్నభుక్కులు కావచ్చు, ఎలర్జీ కావచ్చు. అంటే పడని పదార్థం శరీరంలో ప్రవేశించినప్పుడు శరీరం దానిని ఎదుర్కొని పోరాడినప్పుడు తెల్లకణాల జనాభా పెరగొచ్చు. ఏ పదార్థం పడలేదో తెలియాలంటే 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) అంటూ ఒకటీ, ఒకటీ మినహాయించుకుంటూ పోతే తప్ప అసలు దోషం ఎక్కడుందో బోధ పడదు," అని చెప్పి పరీక్షల నిమిత్తం వైద్యులు సూర్యాన్ని ఆసుపత్రిలో చేర్పించేరు.

ఆసుపత్రిలో చేర్పించేసరికి ఇదేదో మొండిరోగం అన్న అనుమానం రవణ బుర్రలో నాటుకుపోయింది. జరిగిన విషయాలన్నీ తన అక్క సీతమ్మకి వివరంగా రాసి, తను దగ్గర ఉండి చూసుకుంటూన్నంత సేపు ఎవ్వరూ కంగారు పడవలసిన అవసరం లేదని ధైర్యం చెబుతూ ఉత్తరం టపాలో పడేసేడు రవణ.

పకోడీలు, కాఫీ పట్టుకొచ్చి, బల్ల మీద సర్ది, వెళ్లిపోయేడు ఉపచారాలు చేసే హొటేలు కుర్రాడు. ఆ పళ్లేలని, కప్పులని అతిథులిద్దరి వైపు తోసి, కథ చెప్పటం కొనసాగించేను.

బళ్లారి వెళ్లిన నాలుగు నెలలకే కుర్రాడికి సుస్తీ చేసిందన్న వార్త ఊళ్లో — చిన్న గ్రామం కనుక — నలుగురికీ నాలుగు ఘడియలలో తెలిసిపోయింది.

"బళ్లారిలో ఎవరింట్లోనైనా భోజనం చేసేడా?" అని ఒక శ్రేయోభిలాషి ఆత్రుతగా వాకబు చేసేరు.

"అక్కడ పార్వతమ్మ అని మా వాడి స్నేహితుడి తల్లి ఉంది. వారింట రెండు, మూడు సార్లు భోజనం చేసినట్లు రాసేడు మా వాడు."

"కొంపతీసి ఆవిడ విధవావిడ కాదు కదా?"

“ఆ విషయం మీకు ఎలా తెలుసు?” సీతమ్మ గారి గొంతులో ఆశ్చర్యం కంటె ఆతృత ఎక్కువగా ప్రస్ఫుటమైంది.

“మీరు బళ్లారి అనే సరికల్లా భయం వేసిందమ్మా. ఆ ప్రాంతాల వితంతువులలో ఒక మూఢనమ్మకం ఉంది. తాము వండిన వంటలో విషం కలిపి బ్రాహ్మణ బ్రహ్మచారులకి భోజనం పెట్టి బలి ఇస్తే ఆ విధవ స్త్రీకి మరుసటి జన్మలో మరి వైధవ్యం రాదుట. ఏ ఉల్లిపాషాణమో వాడితే చావు హఠాత్తుగా వచ్చి పట్టుబడిపోటానికి అవకాశాలు ఎక్కువ. అందుకని అతి నెమ్మదిగా పని చేసే విషాలని ఈ రకం విషప్రయోగాలకి వాడతారు. అందుచేత ఆ ప్రాంతాలలో వితంతువుల ఇళ్లల్లో ఎవ్వరూ భోజనం చెయ్యరుట.”

సీతమ్మగారికి కంగారు ఎక్కువయింది. ఆమె మనస్సు పరిపరి విధాల పరిగెట్టింది. కాకపోతే ఈ కరువు రోజుల్లో ముఖపరిచయం కూడ లేని సూర్యాన్ని చేరదీసి భోజనం పెట్టవలసిన అవసరం ఏముంది పార్వతమ్మకి? ఛ! తప్పు. తను ముక్కు, ముఖం ఎరగని గోపాలకృష్ణని చేరదీసి, భోజనం పెట్టి, మంచిచెడ్డలు చూసి మాచ్కండ్ పంపలేదూ. సాటి స్త్రీని ఇలా అమానుషంగా అనుమానించటమా? కాని కీడెంచి మేలెంచమన్నారు. ఈ మూఢ నమ్మకంలో వీసమెత్తు నిజం ఉంటే? అనుమానం పుట్టాలే కాని, పుట్టి పెనుభూతమై కూర్చుంది. ఈ విషయం అంతా పూసగుచ్చినట్లు ఆమె రవణకి ఉత్తరంలో రాసి, ఈ విషయం వైద్యులతో చెప్పి ఆ విషానికి విరుగుడు ఉందేమో చూడమని చెప్పేరు.

ఇది ఉత్తరాలతో తెమిలే పని కాదని రామయ్యగారు తన హోమియోపతీ మందుల పెట్టెని చంకన పెట్టుకుని బళ్లారి ప్రయాణమై వెళ్లేరు. రవణ బావగారిని వెంటేసుకుని పెద్దాసుపత్రికి వెళ్లేడు. రామయ్య గారు కొంచెం జంకుతూనే విష ప్రయోగం ఏదైనా జరిగిందేమో చూడమని వైద్యులని అడిగేరు.

తాగుతూన్న కాఫీ కప్పుని కింద పెట్టి, డాక్టర్ రవిచంద్ర అందుకుని అన్నారు: “మనిషిని చంపటానికి సవాలక్ష విషపదార్థాలు ఉన్నాయి. ఫలానా విషం పేరు చెప్పి, ఈ విషం శరీరంలో ఉందేమో నిర్ధారించమని అడిగితే ఆధునిక వైద్య పరికరాలతో సమాధానం చెప్పొచ్చు. కాని ‘ఏ విష ప్రయోగం జరిగింది?’ అని ప్రశ్న అడిగితే సమాధానం అన్ని వేళలలోనూ తేలికగా దొరకకపోవచ్చు. ఆర్సెనిక్, సయనైడ్, బెల్లడోనా, పాము గరళం వంటి తీవ్ర విషాలు కాని శరీరంలోకి వెళితే వాటి ప్రభావం కొట్టొచ్చినట్లు వెనువెంటనే కనిపిస్తుంది. కాని అతి నెమ్మదిగా పని చేసే విషాల ప్రభావం ప్రయోగం జరిగిన కొన్ని నెలల తరువాత కాని కనిపించకపోవచ్చు. రైసిన్ అనే విషం ఉంది. దానిని ఆముదపు గింజలనుండి తీస్తారు. అది సూది ద్వారా శరీరం లోకి ఎక్కిస్తే మరణం ఖాయం. కాని రైసిన్ అవశేషాలు శవపరీక్షలో కనిపించటం కష్టం కనుక ఇటువంటి విష ప్రయోగాలు జరిగినప్పుడు వాటిని గుర్తించటం చాల కష్టం. కనిపించిన లక్షణాలని చూసి వైద్యులు ఏవో మందులు ఇస్తారు.”

అవును, డాక్టరుగారూ! మీరు చెప్పినట్లే బళ్లారిలో వైద్యులు కూడ ఇదే మాట చెప్పి రవణతో, “మీకు ఏ విషం మీద అనుమానం ఉందో చెపితే రక్తంలో ఆ విషం అవశేషాలు ఉన్నాయేమో చూస్తాం,” అన్నారుట. అది కనిపిస్తే పోలీసుల చేత దర్యాప్తు చేయించవచ్చని కూడ చెప్పేరుట.

అప్పుడు రామయ్యగారు తాను ఎప్పుడో విన్న ఒక విషయం రవణతో చెప్పేరు.

“రవణా! చూడు. నన్ను ఒక అనుమానం పట్టుకు పీడిస్తోంది. ఇంటి దగ్గర బయటకి ఏమైనా అంటే మీ అక్క గాభరా పడుతుందని మౌనంగా ఊరుకుని వెంటనే బయలుదేరి వచ్చేసేను. వైధవ్యం పొందిన ఆడవారు ఒక బ్రహ్మచారిని అమ్మవారికి బలి ఇస్తే తరువాత జన్మలో వైధవ్యం రాదనే మూఢ నమ్మకం ఈ బళ్లారి ప్రాంతాలలో ఉంది. అమ్మవారికి పూజ చేసి ‘నైవేద్యం’ అవకాశం వెంబడి పెట్టుకుంటామని మొక్కుకుంటారు. అవకాశం చూసుకుని నెమ్మదిగా, నిదానంగా పని చేసే విషాన్ని భోజనంలో కలిపి పెడతారు. దాని ప్రభావం కొద్ది నెలలు పోయిన తరువాత కాని కనబడదు.”

“అయితే ఆ విషం సంగతి మనం వైద్యులకి చెప్పొచ్చు కదా, బావా! ఆ విషం మచ్చు ఒకటి సంపాదిస్తే వైద్యులకి ఇవ్వచ్చు కదా!”

“అది ఎలా తయారు చేస్తారో వినికిడిగా తెలుసు. నిజానిజాలు తెలియవు. అందుకనే తటపటాయిస్తున్నాను. నీకు చెబుతా, విను. ఒక జాతి బల్లిని పట్టి, దాని తోకకి దారం కట్టి, దానిని తలకిందులుగా వేలాడగడతారుట. ఆ బల్లి నోటికి అందీ అందని దూరంలో పత్తి గింజల పిండి కొద్దిగా జల్లిన పళ్లెం పెడతారుట. పళ్లెంలో ఉన్న పిండి కోసం బల్లి నాలిక చాచినప్పుడల్లా నోటినుండి నురగ జారి పిండిలో పడుతుందిట. అప్పుడు ఆ పిండిని బాగా కలియబెట్టి, చిటికెడు పిండిని ఏ పప్పులోనో, పులుసులోనో కలిపి వడ్డిస్తారుట. నాలుగైదు మోతాదులు పడ్డ తరువాత ఫలితం కనిపించటం మొదలుపెడుతుందిట. ఎవ్వరు, ఎప్పుడు ఈ విషప్రయోగం చేసేరో పట్టటం ఎవరి తరం?”

“ఇది మూఢ నమ్మకమో, కాదో తేల్చడం ఎంతసేపండీ? ఒక బల్లిని పట్టుకుని, ఆ బల్లి చేత చొంగ కార్పించి, దానిని పరీక్ష చేస్తే పోలా?” ఇంతవరకూ మెదలకుండా కూర్చున్న చంద్రంలో కొంచెం కదలిక కనిపించింది.

“ఏ బల్లిని? అంటే ఏ జాతి బల్లిని? ఆ విషయం మనకి తెలియదు కదా. అయినా అలాంటి ప్రయోగం చేసి చూడాలంటే డబ్బు ఉండాలి, వనరులు ఉండాలి, నిజం తెలుసుకోవాలనే ఆకాంక్ష ఉండాలి. ఈ రోజుల్లో, ఈ దేశంలో అటువంటి స్ఫూర్తి ఎవ్వరికి ఉందోయ్? ఏ అమెరికావాడో, ఇంగ్లీషువాడో కనుక్కుంటే ‘మా వేదాల్లో ఉందిషా!’ అనటం అంటాం.”

రవణ ఈ బల్లి కథని బళ్లారిలో వైద్యులకి చెప్పి, ఆ బల్లి విషం సూర్యం శరీరంలో ఉందేమో చూడమని అడిగితే, "బల్లి విషం ఏమిటోయ్? ఎక్కడా వినలేదు" అని పరిహాసం చేస్తారేమోనని ఒక పక్క భయపడుతూనే, వైద్యుల దగ్గర రహస్యాలు ఉంచకూడదనే నియమానుసారం అడగనే అడిగేరు. వైద్యులు వీరి మాటలు వినేసి, భయపడవలసినది లేదని చెప్పి వాళ్లు చెయ్యదల్చుకున్న వైద్యం చేసి సూర్యాన్ని గట్టెక్కించేమని అనుకుని ఇంటికి పంపించేసేరు.

రోజులు గడుస్తూన్నకొద్దీ సూర్యం కడతేరా గట్టెక్కలేదేమో అన్న అనుమానం రామయ్యగారిని పట్టుకుంది. బల్లి కథనంలో కొంత బలం ఉందేమో? ఎందుకంటే, ఇంగ్లీషు వైద్యులు ఏ మందులు వాడేరో కాని దబ్బ పండు రంగులో ఉన్న సూర్యం శరీరం మీద – ప్రత్యేకించి మెడ మీద, ఛాతీ మీద, లేత నీలం రంగులో మచ్చలు కనిపించేయి. బళ్లారి ఆసుపత్రిలో వైద్యులు "ఆర్సెనిక్ ట్రై ఆక్సైడియం" మందు వాడినట్లు ఆయనకి చూచాయగా జ్ఞాపకం ఉంది. అంటే పాషాణ త్రికభస్మం. ఈ మందులో ఉన్న లోహాన్ని కాలేయం కాని, మూత్రపిండాలు కాని పరిపూర్ణంగా విసర్జించలేని సందర్భాలలో అది చర్మంలో పేరుకొని నీలి మచ్చలుగా ప్రస్ఫుటం అవుతున్నాయని ఆయన అనుమానం. కాలక్రమేణా వాటి పర్యవసానం ఎలా ఉంటుందో? వైద్యశాస్త్రంలో ప్రావీణ్యం లేని మనిషి కనుక అంతకంటే లోతుగా చూడలేకపోయేరు.

"ఒకప్పుడు 'ఆర్సెనిక్ ట్రై ఆక్సైడియం' ని రక్తపు కేన్సరుని – అంటే, లుకీమియాని – కుదర్చటానికి వాడేవారు. ఇసనోఫీలియాని చూసి లుకీమియా అనుకున్నారో లేక లుకీమియాకి వాడే మందుని ఇసనోఫీలియా మీద ప్రయోగాత్మకంగా వాడేరో! ఇప్పుడు కొత్త మందులు వచ్చేక ఆర్సెనిక్ జాతి మందుల వాడకం తగ్గింది కాని, మదరాసు జనరల్ హాస్పిటల్ వారు 1950 దశకంలో ప్రచురించిన ఔషధకోశంలో చూస్తే ఈ మందు పేరు కనబడవచ్చు." అంటూ డాక్టర్ రవిచంద్ర బళ్లారి డాక్టర్లు ఆ మందుని ఎందుకు వాడేరో ఊహించేరు. తల ఊపి కథ కొనసాగించేను.

ఎల్లోపతీ మందులు గుణం చేసినా చెయ్యకపోయినా హాని చెయ్యగలవని నమ్మే వారిలో రామయ్యగారు ఒకరు. ఎల్లోపతీలో గుణం కనిపించినట్లే కనిపించి రోగం తిరగబెడుతూ ఉంటుందనిన్నీ, అంతేకాకుండా ఎల్లోపతీ మందుల వాడకం వల్ల అవాంఛనీయ ఫలితాలు ఎక్కువగా కనిపిస్తాయనిన్నీ ఆయన ఆక్షేపణ.

"సూర్యం ఒంటి మీద మచ్చలకి కారణం పార్వతమ్మ చేసిన విషప్రయోగం వల్ల వచ్చిన మచ్చలయినా కావచ్చు, లేదా ఇంగ్లీషు వైద్యులు ఇచ్చిన మందులలో ఉన్న విషపదార్థాలైనా కావచ్చు కదా? విషపూరితమైన మందులు ఎన్నో ఉన్నాయి కదా?" రవిచంద్ర మరొక అభిప్రాయం వెలిబుచ్చేరు.

రామయ్యగారి భయం అదే! సూర్యం శరీరం మీద మచ్చలు ఇంగ్లీషు మందుల ప్రభావమైనా కావచ్చు లేదా బల్లి విషం వల్ల అయినా కావచ్చు అని ఆయన అనుమానం. నిజంగా బల్లి విషప్రయోగమే జరిగి ఉంటే? దాని ఫలితంగా ఈ నీలి మచ్చలు శరీరం అంతా వ్యాపించి, ప్రాణానికే ముప్పు తెస్తే?

"ఆరోగ్యంగా ఉండే కుర్రాడు నీరసం, నీరసం అంటున్నాడు. ఇవి హోమియోపతీలో 'లేఖసిస్' లక్షణాలు. ఈ మందుని పాము గరళం నుండి తయారు చేస్తారు. పాములు, బల్లులు సరీస్పృపాలే కదా. పాము గరళం విషం అయినప్పుడు బల్లి చొంగ ఎందుకు విషం కాకూడదు?" అని రామయ్యగారు తర్కించుకుని "ఒక వేళ బల్లి విషం శరీరంలో ఉంటే దానికి విరుగుడుగా ఇది పని చేస్తుంది!" అనే నమ్మకంతో లేఖసిస్–30తో వైద్యం మొదలు పెట్టేరు.

"కొమోడో డ్రేగన్ అనే ఒక జాతి బల్లి ఉంది. దీనినే మానిటర్ లిజర్డ్ అని కూడ అంటారు. దీని చొంగలో ఉన్న విషం ఉపయోగించి మధుమేహానికి, అంటే డయబెటీస్ కి , మందు కనిబెట్టేరనిన్నీ, ఆ మందుని వాడటానికి అమెరికా ప్రభుత్వం అంగీకరించిందనిన్నీ ఈ మధ్యనే ఒక పత్రికలో చదివేను. కనుక బళ్లారి బల్లుల చొంగలో ఏదో విషమో, ఔషధమో ఉందంటే నేను నమ్ముతాను కాని, హోమియోపతీ పద్ధతి శాస్త్రీయమైనదని మీరంటే నేను ఒప్పుకోలేను. ఆ రోజులలో లుకీమియాని కుదర్చటానికి సరి అయిన మందులు లేవు. సూర్యానికి వచ్చినది ఇసనోఫీలియా అయితే దానికి ఆర్సెనిక్ ట్రైఆక్సైడ్ వాడటం అనేది పిచిక మీద బ్రహ్మాస్త్రం. కాదు, అది నిజంగా లుకీమియా అయినట్లయితే ఆ మందుకి ఆ రోగం కుదిరిందంటే అది కేవలం కాకతాళీయం అని నా నమ్మకం!" అన్నారు డాక్టర్ రవిచంద్ర.

"మీరే కాదు. ఆధునిక వైద్యులంతా చెప్పేది కూడ ఇదే. కాని నెమ్మది మీద సూర్యం ఆరోగ్యం కోలుకుంది. శరీరం మీద మచ్చలు పూర్తిగా పోడానికి పదేళ్లు పైనే పట్టింది. తన హోమియోపతీ వైద్యం వల్లనే సూర్యం పూర్తిగా కోలుకున్నాడని రామయ్యగారి నమ్మకం."

"ఇలా గుణం కనిపించిన సందర్భాలని మేము 'ప్లసీబో ఎఫెక్ట్' అంటాం. అంటే, నమ్మకం ఉన్నప్పుడు పంచదార మాత్రలు కూడ పరమౌషధంగా పని చేస్తాయి." డా. రవిచంద్ర మరో సారి తన నమ్మకాన్ని వెలిబుచ్చేడు.

"నమ్మకం అంటారా? మూఢ నమ్మకం అంటారా?"

"ఈ ఉదంతం జరిగిన తరువాత సూర్యం ఎన్నేళ్లు బతికేడు?"

"అతను ఇప్పటికీ ఆరోగ్యంగానే తిరుగుతున్నాడు!"

“ఆయనతో కూడ ఒక సారి ముఖాముఖీ జరిపితే నా పరిశోధనా పత్రానికి సాక్ష్యాధారాల మద్దత్తు ఉంటుంది. ఆయనకి సిఫార్సు చేసి ఒక ముఖాముఖీ ఏర్పాటు చేసిపెట్టగలరా…?”

వేళ మూడున్నర దాటింది. గదిలో టెలిఫోను మోగింది.

“మీకు కేటాయించిన సమయం అయిపోయింది. మీ సిద్ధాంత వ్యాసం విజయవంతం అవాలని ఆశిస్తున్నాను.” అంటూ అర్థగర్భితమైన చిరునవ్వుతో నేను లేచి నిలబడ్డాను.

**కథ వెనుక కథ:**

ఈ కథ లోని సంఘటనలు అన్నీ నిజంగా 1948 – 52 మధ్య కాలంలో జరిగినవే. పేర్లు మార్చడం జరిగింది. ఈమాట (http://eemaata.com/em/issues/201403/3420.html ) మార్చి 2014 లో ప్రచురితం.

# జాతకబలం

వెనకటికి ఒక ఊళ్లో ఒక రాజు గారు ఉండేవారు. ఆయన పేరు మనకి తెలియదు; అనవసరం కూడ. ఆయన రాజ్యం పేరు కూడ మనకి అనవసరమే. ఈ భూలోకాన్ని ఏలగలిగే, మహా ప్రతిభావంతుడైన కొడుకుని ఒకణ్ణి కనాలని ఎల్లప్పుడూ కలలు కంటూ ఉండేవాడట – ఆయన.

ఈనాడంటే మన దేశం ఇలా పిప్పళ్ల బస్తాలా పిటపిటలాడిపోతోంది కాని, పూర్వం – అంటే, ధర్మం మూడు కాళ్ల మీద మెక్కుతూ నడుస్తూన్న రోజులలో – పుత్రకామేష్టి లాంటి పెద్ద యజ్ఞాలు చేసి, పెళ్లాలకి పరమాన్నం పంచిపెడితే చాలు, పిల్లలు పుట్టేవారట. ధర్మం రెండు కాళ్ల మీద నిట్టనిలువుగా నిలబడ్డం నేర్చుకున్న రోజులలో కూడ అడవుల్లో తపస్సు చేసుకుంటూన్న ముని పుంగవులని అంతఃపురానికి పిలిపించి, “మహానుభావా! పిల్లల్ని కనడంలో ఉన్న ధర్మసూక్ష్మం ఏమిటో మాకు బోధపడి చావడం లేదు, ఆ పని కూడ మీరే చేసిపెట్టండి” అని బతిమాలుకునేవారు. రోజులలా వెళ్లిపోయాయి. ఇప్పుడో? ధర్మం ఒంటి కాలి మీద నిలబడలేదుగా! అందుకని ఉప్పిగంతులు వేస్తోంది. ఇలా ఒంటి కాలు మీద నిలబడి గారడీలు చేస్తూన్న రోజులలో కూడ, మన పవిత్ర భారతదేశంలో రాజులకి ఒక పట్టాన పిల్లలు పుట్టేవారు కాదు. ఈ లొసుగుని కనిపెట్టే కాబోలు ఆఖరికి బ్రిటిష్ వాళ్లు కూడ పిల్లలు లేని రాచ కుటుంబాలలో దత్తత స్వీకారం నిషిద్ధం అని ఒక మెలి పెట్టి, రాజ్యాలని ఒకటీ, ఒకటీ కబళించేరు.

ఏది ఏమైతేనేమి? ఏతావాతా, ఒక నాడు అపర వరాహమిహురుడని అనిపించే వర్చస్సుతో శోభిల్లుతూన్న ఒక జ్యోతిష శాస్త్రజ్ఞుడు మన రాజు గారి ఆస్థానానికి అరుదెంచేడు. ముఖం చూసి, చెయ్యి చూసి, జననకాలం తెలిసిన వారికి జాతక చక్రం వేసి, జననకాలం తెలియని వారికి నామ నక్షత్రం ఆధారంగా చేసుకుని, అందరికీ జోశ్యం చెప్పి, పండితులనీ, పామరులనీ, సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేడు. అందరి మెప్పూ పొందేడు. రాజు గారు సకల మర్యాదలతో పండితుడిని సత్కరించేరు. తనని ఏకాంత గృహంలో కలుసుకుని, అంతరంగికమైన ప్రశ్నలకి సమాధానాలు చెప్పమని వినయ విధేయతలతో అర్థించేరు. జోశ్యులవారు అంగీకరించేరు.

ఈ భూలోకాన్ని ఏలగలిగే మహా ప్రతిభావంతుడైన కొడుకుని కనాలని ఉందంటూ రాజు గారు తన మనస్సులొ ఉన్న కోరికని వెల్లడి చేసేరు. తన జాతకం చూపెట్టి తనకా అదృష్టం పడుతుందా అని అడిగేరు.

మన జ్యోతిష్కుడు సామాన్యమైనవాడా, ఏమైనానా? రాజు గారి జాతకంతో నిమిత్తం లేదన్నాడు. ఎటువంటి కొడుకు కావలిస్తే అటువంటి కొడుకు పుట్టేలా ముహూర్తం పెట్టగలనన్నాడు. రాణివాసానికి ఉన్న అక్షాంశ రేఖాంశాల విలువలు, ఆ ఊరు సూర్యోదయ, సూర్యాస్తమయ కాలాలు వగైరా దత్తాంశాలన్నీ సేకరించేడు. "అశ్వనీ, భరణీ, కృత్తికాపాదం మేషం, కృత్తికా త్రయోయోహో, రోహిణీమృగశిరార్ధం వృషభం,..." అంటూ ఏవేవో వేళ్ల మీద లెక్కించేడు. ఏ సమయంలో పిల్లవాడు భూపతనం అయితే మహారాజయోగాలు పడతాయో లెక్కగట్టేడు. ఆ సమయంలో ప్రసవం కలగాలంటే ఏ సమయంలో మహరాజావారు మహరాణీవారితో సంభోగించాలో ఘడియలు, విఘడియలతో సహా నిర్ణయించేడు. సుముహూర్తం ఆసన్నమైనదని తెలుసుకుందికివీలుగా ఆకాశంలో నక్షత్రాలు ఏవేవి ఎక్కడెక్కడ ఉంటాయో అంతా కూలంకషంగా రాజుగారికి అర్థం అయే రీతిలో వివరించి చెప్పేడు. తను చెప్పినట్లు కార్యక్రమం అంతా తు. చ. తప్పకుండా పాటిస్తే ఈ భూలోకాన్ని ఏలగలిగే పుత్రుడు తప్పకుండాపుడతాడని హామీ ఇచ్చేడు.

రాజుగారు సావధానంగా ఆలకించేరు. ఆయన అంతఃకరణం ఉత్తుంగ తరంగాలతో గెంతులు వేసింది. విషయం అంతా రాణిగారికి బోధ పరచేరు. ఆమె కూడ ఒప్పుకుంది. సుముహూర్తం ఆసన్నమయే సమయం కొరకు ఇరువురూ వేచి ఉన్నారు.

రాజుగారికి సతతం పరిచర్యలు చేసే భృత్యుడు, ఒక దివాకీర్తి, ఇదంతా సావధానంగా విన్నాడు. మంగలి మహదానందం పడ్డాడు. అనుకూలవతియైన అతని భార్య అతని పన్నుగడలో సహకరించడానికి ఒప్పుకుంది. ఈ దెబ్బతో మంగలి క్షుర కత్తికి స్వస్తి చెప్పి, కొడుకు చేత ఖడ్గం పట్టించి, రాజ్యాలని ఏలే…ఇలా కలలు కంటూ ముహూర్తం కోసం ఎదురు చూసేడు.

నెలలు గడుస్తున్నాయి. రాణిగారు గర్భవతి అయిందన్న వార్త ఒక సుముహూర్తాన్న ఊరందరికీ తెలిసింది. ఊరంతా దీపాలు వెలిగించి, తోరణాలు కట్టి, భజంత్రీలు వాయించి కోలాహలంగా పండుగ చేసుకున్నారు.

మన మంగలి భార్యా గర్భవతి అయింది. రాణీ గారి కోసం వాయించిన బాజాలనే మన మంగలి ఇంటికొచ్చి పెళ్లాం దగ్గర కూడ వాయించేడు.

నెలలు నిండేయి. రాణిగారితోపాటు రాజ్యం అంతా ప్రసవ వేదన పడింది. రాణీ గారు ప్రసవించి మగ శిశువుని కన్నారు. ప్రజలు యువరాజుకి జేజేలు పట్టేరు.

అదే సమయంలో మన భృత్యుడి పెళ్లాం కూడ పూరి పాకలో ఒంటరిగా నొప్పులు పడి పురుడు పోసుకుంది.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. యువరాజు శుక్లపక్ష చంద్రుడిలా పెరిగేడు. కత్తి పట్టి కదన రంగంలోకి యువకిశోరంలా ఉరికి రాజ్యాలు జయించేడు. తండ్రి కన్న కలలన్నీ నిజం చేసేడు.

మన మంగలివాడి కొడుకు కండలు పెంచి కత్తిరి పట్టేడు. అందినవారి జుత్తు, అందనివారి జేబులు కత్తిరించేడు. కారాగారం నుండి తిరిగి వచ్చిన తరువాత చిప్ప చేతికి వచ్చింది. వాడి తండ్రి కన్న కలలన్నీ కల్లలయేయి.

మంగలికి తను చేసిన తప్పేమిటో అర్థం కాలేదు. దొంగాడికి తేలు కుట్టినట్లు ఆ దివాకీర్తి రాత్రీ, పగలూ కుమిలి, కుమిలి ఏడ్చేడు. రహశ్యం బయటకి పొక్కితే రాజుగారు తల తీయించేస్తారేమోనని భయం.

యువరాజుకి పట్టాభిషేకం జరుగుతోంది. ఊరంతా పందిరి వేసేరు. చేతికి ఎముక లేదా అన్నట్లు రాజావారు అందరికీ భారీగా బహుమతులు చదివించి కార్యక్రమం అంతా పటాటోపంగా జరిపించేరు.

ఈ సంబరాలన్నింటిని నారదులవారు గగనయానం చేస్తూ చూడనే చూసేరు. దివి నుండి భువికి దిగి వచ్చేరు. ఆయన మహా జ్ఞాని కదా. జరిగిన కథ అంతా ఆయనకి అవగాహన అయింది. కాని రాజు గారు చేసినది ఏమిటో, మంగలి చెయ్యనిది ఏమిటో ఆయనకి బోధ పడలేదు. అప్పుడు ఆ బ్రహ్మ మానస పుత్రుడు హుటాహుటి సత్యలోకానికి వెళ్లి బ్రహ్మనే అడిగేడు. ఈ సృష్టి విచిత్రాన్ని వివరించమని ప్రణమిల్లి  అడిగేడు.

బ్రహ్మ మందస్మిత వదనారవిందంతో చెప్పుకొచ్చేడు.

"నారదా! జ్యోతిష శాస్త్రం జైమిని మహర్షి రచించేరు. ఈ శాస్త్రానికి ఆయువు పట్టు ముహూర్త బలం. ఈ ముహూర్త నిర్ణయం బహు జాగరూకతతో జరగాలి. ఈ ముహూర్తాన్ని పాటించడంలో గోరంత తేడా వస్తే ఫలితంలో కొండంత తేడా కనిపిస్తుంది."

నారదులవారు విరించి వ్రాక్కుచ్చుతూన్న కథనాన్ని అత్యంత కుతూహలంతో అవధరిస్తున్నారు.

"మహరాణి  గర్భంలో ఫలోత్పాదన జరిగవలసిన సమయం ముహూర్తం. అంతఃపురం యొక్క అక్షాంశ, రేఖాంశాలని అధారంగా చెసుకుని కాలనిర్ణయం జరిగిన పిమ్మట, ముహూర్త నిర్ణయం చేసేడు కాలజ్ఞాని అయిన జ్యోతిష్కుడు. మానవమాత్రుడు సతీసంగమ సమయాన్ని తన అధీనంలో ఉంచగలడేమో కాని, రేతస్ఖలన సమయాన్నీ, పురుష బీజం స్త్రీ అండంతో సంయోగం చెంది ఫలోత్పాదన జరిగే సమయాన్నీ నిర్దేశించలేడు, నియంత్రించలేడు. కనీసం ధర్మం నాలుగో పాదం మీద కుంటుతూ, మెక్కుతూ నడవగలిగినంత సేపూ ఈ నియంత్రణ మానవుడి సాధ్యం కాదు.

“ఇదంతా జ్యోతిష శాస్త్రపు బాహ్య పరిధి. ఈ పరిధి మానవ పరిధి. ఇందులో కారణకార్యాల మధ్య సంబంధం ఒక విధమైన లంకెల గొలుసు వంటిది. ఇందులో అక్షాంశాలూ, రేఖాంశాలూ స్థల నిర్ణయం చేస్తే నక్షత్రాలు కాల నిర్ణయం చేస్తాయి. దీనినే స్థలకాల సమవాయం అంటారు. ఈ స్థలకాల సమవాయంలో మానవుడి పుట్టుక అనే సంఘటన రేఖాచిత్రంలో ఒక బిందువు వంటిది. మానవుడి జీవితకాలంలో ఈ బిందువు స్థలకాల సమవాయంలో చేసే సంచారాన్ని బిందుచారం అంటారు. ఒకే బిందువు దగ్గర మొదలయిన ఈ బిందుచారం అనేక దిశలలో చేయవచ్చు. అదే విధంగా ఒకే సమయంలో పుట్టినా వివిధ వ్యక్తుల గ్రహచారాలు వివిధ రీతులలో ఉండవచ్చు.”

“పితృదేవా! మరయితే జాతక శాస్త్రంలో శాస్త్రీయత లోపించినట్లేనా??”

“తొందర పడకు, నారదా! కథాకథనం సగంలో ఆపి ఏమి ప్రయోజనం? సృష్టి రహశ్యాన్ని సావధానంగా ఆలకించు.”

“ఒకే బిందువు నుండి అనంతమైన దిశలలో అనంతమైనన్ని బిందుపథాలని నిర్మించవచ్చు. ఒకొక్క బిదుపథం ఒకొక్క వ్యక్తి యొక్క బిందుచారం. ఎవరి బిందుచారం ఏదో నిర్ణయించే హక్కు సృష్టి కర్తనైన నాకు కూడ లెదు. ఆ హక్కు సంచిత కర్మకి ఉంది.”

“నిర్ణయించే హక్కు లేకపోతే లేకపోవచ్చు. జరిగిన విషయం ఎలా జరిగిందో వివరిస్తారా, పితృదేవా?”

“దానికేముంది నారదా. జరిగిన విషయం అడిగేవు కనుక చెబుతున్నాను. రాణి గర్భకోశంలోనూ, మంగలి భార్య గర్భకోశంలోనూ ఫలోత్పాదన జరిగే సమయం ఆసన్నమవుతూన్న సందర్భం అది. నేను లఘుశంకామాత్రుడనై అధిష్టించిన సింహాసనం దిగే నిమిత్తం కిరీటం తీసే ప్రయత్నంలో నా చేతిని కిరీటం మీదకి పోనిచ్చిన సమయం అది. అదే క్షణంలో మహరాణికి ఫలోత్పాదన జరిగింది. నా హస్తం కిరీటాన్ని శిరోచ్ఛాదన చేసే భంగిమలో ఉన్న సమయంలో ఫలోత్పాదన జరిగింది కనుక తద్రూపేణా అంకురార్పణ జరిగిన బాలుడికి పట్టాభిషేకం జరిగింది.

“లిప్తమాత్రపు కాలహరణం జరిగిన తరువాత నా కిరీటం నా తల మీద నుండి నా రెండు చేతులలోకి వచ్చింది. ఆ వేళకి తలకిందులుగా నా చేతులలో ఉన్న కిరీటం బిక్షాపాత్ర భంగిమలో ఉన్న సమయంలో మంగలివాడి భార్యకి ఫలోత్పాదన జరిగింది. అలా పుట్టుకొచ్చిన మంగలివాడి కొడుకు చేతికి చిప్ప వచ్చింది. ముహూర్తంలో తేడా లిప్త మాత్రమే, జాతకంలో ఎంత తేడా వచ్చిందో చూడు.”

ఈ రోజులలో ఇంగ్లీషు మాటలు వాడితేగాని ఈ ప్రపంచంలో ఎవ్వరికీ ఏదీ అర్థం అవటం లేదు. కనుక ఇదే విషయాన్ని ఆధునిక పదజాలంతో – ఇంగ్లీషు మాటలు ఉపయోగించి – చెబుతాను, విను. మనం గమనించే దృగ్విషయాలు

(ఫినామినా) అన్నిటికి కారణం (కాజ్) ఉండి తీరాలనే నమ్మకం ఆధునిక విజ్ఞాన దృక్పథానికి ఒక పునాది రాయి వంటిది. ఒక కారణం అవధీకృతం (బౌండెడ్) అయితే దాని పర్యవసానం కూడ అవధీకృతంగానే ఉంటుంది. గోదావరికి ఎంత చెంబు తీసుకెళితే అన్ని నీళ్లే వస్తాయి. ఒక సమశ్యకి ఇటువంటి అవధీకృత లక్షణాలు ఉంటే దానిని సవ్యంగా కూర్చబడ్డ సమశ్య (వెల్ పోజ్డ్ ప్రాబ్లెం) అంటారు. కాని మనకి తారసపడే సమశ్యలన్నీ అవధీకృత సమశ్యలే అవాలని ఎవ్వరూ శాసించలేదు. అపసవ్యంగా కూర్చబడ్డ సమశ్యలు (ఇల్ పోస్డ్ ప్రోబ్లెంస్) కూడ అప్పుడప్పుడు మనకి తారస పడుతూ ఉంటాయి. ఈ సమశ్యలని పరిష్కరించడానికి కూడ శాస్త్రీయ పద్ధతులు వాడతారు, కాని వాటివల్ల మనకి లభ్యమయే పరిష్కారం ఎటువైపు మొగ్గుతుందో చెప్పలేం. జ్యోతిషం ఈ జాతికి చెందిన శాస్త్రం. అశేష శేముషీ దురంధరులు, బహుముఖ ప్రజ్ఞాశాలురు అయిన వారి చేతులలో ఈ శాస్త్రం రాణిస్తుంది తప్ప అల్పజ్ఞుల చేతులలో ఈ శాస్త్రం రాణించదు.”

నారదుడి అనుమానాలన్నీ పటాపంచలయిపోయాయి. తండ్రికి నమస్కరించి శలవు తీసుకున్నారు.

**కథ వెనుక కథ:**

చీకటి పడగానే గుడ్డి, బుడ్డి కిరసనాయిలు దీపాల వెలుగులో భోజనాలు అయిన తరువాత వాకట్లో పడక కుర్చీలో పడుక్కుని మా నాన్నగారు, శ్రీ వేమూరి సోమేశ్వరరావు గారు, మాకు, మా ఇరుగుపొరుగున ఉన్న పిల్లలకి, పెద్దలకి కథలు – శంకరాచార్యుల వారి కథ నుండి ట్రంకు మర్డరు కేసు కథ వరకు – అన్ని రకాల కథలు చెప్పేవారు. వాటిల్లో ఇది ఒక కథ.

(సిలికాన్ ఆంధ్ర వారి సుజనరంజని అంతర్జాల పత్రిక 2001 లో ప్రచురితం, రచన మాసపత్రికలో మళ్లా అచ్చయింది.)

# ఓ పెన్నీ, నా పెన్నీ!

ఏవిఁటో! ఈ ప్రపంచం అర్థం అయి చావటం లేదు నాకు!

పిదప కాలం పిల్లలు, పిదప కాలం బుద్ధులూనా? లేక వయస్సు మీరుతూన్న కొద్దీ నా విలువలకీ, నేటి ప్రపంచానికీ బొత్తిగా పొంతన లేకుండా పోతూందా?

ఏవిఁటో! మతి పోతోంది!

ఆ మధ్య మా అమ్మాయి సీత ఇంటికి వచ్చింది.

దాన్ని మెల్లిగా బ్రతిమాలి, బెల్లించి, నాతోపాటు ఉదయపు నడకకి తీసుకెళ్ళేను.

రోజూ పొద్దున్నే ఒక గంట సేపైనా నడవమని మా ఆవిడ ఇంట్లో పోరు. అందుకని వీలయినప్పుడల్లా ఒక గంట సేపు నడుస్తాను. ఆ వేళ మా అమ్మాయిని వెంటబెట్టుకుని వెళ్ళేను.

మీరు నమ్మండి, నమ్మకపోండి. నేను నడకకి వెళ్ళిన ప్రతి రోజూ – దరిదాపుగా ప్రతిరోజూ – దారిలో నేల మీద ఒక పెన్నీ (సెంటు లేదా పైస) కనిపించి తీరుతుంది. కరువు రోజుల్లో పుట్టి పెరిగిన శాల్తీనేమో, ఒంగుని పెన్నీని తీసి జేబులో వేసుకుంటాను. మా ఆవిడ మాట విన్నందుకు నాకు దక్కే పారితోషికం ఇది. బిందు సింధు న్యాయంలా ఈ బిందువులన్నీ ఓ రోజు ఓ సింధువు కాకపోతుందా అని ఒక ఆశ.

రోడ్డు మీద పెన్నీ కనిపించగానే, "సీతా! ఆ పెన్నీ అందుకో!" అన్నాను.

"నాకు ఓపిక లేదు డాడీ. ఒంగి తియ్యటానికి ఖర్చయే శ్రమకి సరిపడా విలువ లేదు ఆ పెన్నీలో!" అంది మా అమ్మాయి.

"పోనీ ఒక నికెలు (ఐదు పైసలు) కనబడితే ఒంగి తీస్తావా?" అన్నాను.

"తియ్యను"

"ఎంత కనబడితే ఒంగి తీస్తావేవిఁటి?

“ఒక డాలరు కనబడితే ఒంగి తీస్తాను.”

దానికేం! అది పిల్ల జమీందారు. మా అమ్మ పేరింటిదేమో మా అమ్మ పోలిక వచ్చేసింది. డబ్బంటే ఖాతరు లేదు.

పెన్నీకి విలువ లేకుండా పోయింది కదా! ఇండియాలో రూపాయి కాసుకే విలువ లేకుండా పోయింది. పూర్వం ముష్టివాడి వైపు ఒక కానీ విసిరేవాడిని. ఆ అలవాటు ప్రకారం మొన్నీమధ్య హైదరాబాదు వెళ్ళినప్పుడు ముష్టివాడి వైపు, అమెరికా వాడిని కదా అని, ఘరానాగా ఒక పావలా కాసు విసిరి కాలరు ఎగరేసేను. వాడు పరిగెత్తుకు వచ్చి “బాబూ ఓ ఐదు రూపాయలు ఇప్పించండి. ఈ పావలాకేవీఁ రావండి. తవఁరు ఇక్కొడోరు కాదా బాబూ?” అన్నాడు.

గతుక్కు మన్నాను.

నాకు తెలియకుండానే, నా ఎట్టఎదుటే రోజులు మారిపోతున్నాయి!

పత్రికల్లో చూసే ఉంటారు. ఇప్పుడు బంగారం ధర $650 దాటుతోంది. పూర్వం, అంటే, 1960, 1970 దశకాలలో, వెండి వెల ఇలాగే వేలం వెర్రిగా పెరిగిపోయింది.

పాత రోజుల్లో అమెరికాలో వెండి క్వార్టర్లు ఉండేవి. క్వార్టర్ అంటే మన పావలా కాసులాంటి నాణెం. కైవారంలో అర్ధరూపాయంత ఉండేది. విలువలో డాలర్ లో నాలుగో వంతు.

అప్పట్లో వెండి ధర ఎంతలా పెరిగిపోయిందంటే క్వార్టర్లో ఉన్న వెండి విలువ క్వార్టర్ యొక్క బజారు విలువ కంటె ఎక్కువ ఉండేది. క్వార్టర్ ని కరిగించేసి అలా వచ్చిన వెండిని బజారులో అమ్మేసుకుంటే లాభసాటి వ్యాపారం అన్న మాట!

ఈ కిటుకు ప్రజలు పసికట్టేసేరన్న విషయం ప్రభుత్వం వారు కూడ పసికట్టేసి, క్వార్టర్ లో ఉన్న వెండిని తీసేసి బజారు విలువ లేని మరొక మిశ్రమ లోహంతో కొత్త క్వార్టర్ నాణేలు పోత పొయ్యటం మొదలు పెట్టేరు. వెండి డాలర్లతో పాటు వెండి క్వార్టర్లు కూడా కాలగర్భంలో కలసి పోయాయి.

ఈ పురాణం అంతా ఎందుకు చెప్పుకొస్తున్నానంటే, రెండు తరాల క్రితం క్వార్టర్ కి పట్టిన గతే ఇప్పుడు పెన్నీ కి పడుతోంది. అమెరికాలో సెంటుని పెన్నీ అంటారని చెప్పేను కదా. సెంటు అంటే డాలర్లో నూరవ భాగం. అంటే మన రూపాయికి పైస ఎలాగో డాలరుకి పెన్నీ అలాగన్న మాట.

రాగినీ, యశదాన్నీ కలిపిన మిశ్రమ లోహంతో పెన్నీలు తయారు చేస్తారు. ఇటీవలి కాలంలో గేసలీనుతో పాటు బంగారం, బంగారంతో పాటు రాగి, దానితో యశదం — ఇలా అన్నిటి ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయి కదా. కనుక క్వార్టరుకి పట్టిన గతే ఈ పెన్నీకి కూడా పట్టబోతూంది.

పెన్నీలని కరిగించి, ఆ ప్రక్రియలో వచ్చిన లోహాన్ని బజారులో పెట్టి ప్రజలు అమ్మేసుకునే లోగా పెన్నీ విలువ — అంటే పెన్నీ కాసులో ఉన్న లోహం విలువ – తగ్గించాలి.

పెన్నీకి ఏం విలువుందని దాంట్లో విలువని ఇంకా తగ్గించటానికి?

లేదా⋯..పెన్నీలని చెలామణీ లోంచి తీసెయ్యాలి!

మా ఇంట్లో మేడ మెట్లు ఎక్కగానే వచ్చే చిన్న వసారాలో ఒక తీనె, దాని మీద ఒక వరస బీరువాలు ఉన్నాయి. ఆ తీనె మీద వెడల్పాటి మూతి ఉన్న ఒక గాజు సీసా ఉంది. బిల్ ఫోల్డ్ అనండి, వాలెట్ అనండి, పర్సు అనండి — వాటిలో చిల్లర బరువు ఎక్కువ అయినప్పుడల్లా చిల్లరలో ఉన్న  పెన్నీలన్నీ తీసి ఆ సీసాలో వేస్తూ ఉంటాం. ఈ రకం సీసా ప్రతీ ఇంట్లోను ఉంటుందని నేను ఘంటా బజాయించి చెప్పగలను.

ఇప్పుడు ఆ సీసా కదపలేనంత బరువుగా ఉంది. ఆ సీసాని ఒంచి, అందులోంచి నూట అరవై పెన్నీలు బయటకి తోడి, ఈ $1.60 విలువ చేసే డబ్బునీ మూసలో వేసి కరిగించగా వచ్చిన లోహాన్ని బజారులో అమ్మితే $1.36 వస్తుంది. (పెన్నీలో 97.5 శాతం యశదమూ, 2.5 శాతం రాగి ఉన్నాయని లెక్క కట్టేను.) అంటే ఏమిటన్న మాట? పెన్నీ నాణెం యొక్క బజారు విలువ పెన్నీ లోని లోహం విలువతో దరిదాపుగా సరితూగుతోంది. ఇంతటితో అయిపోయిందా? ఈ పెన్నీలని తయారు చెయ్యటానికి టంకశాలలు కావాలి. ఆ టంకశాలలని నడపటానికి మనుష్యులు కావాలి. వాళ్ళకి జీతాలు ఇవ్వాలి. కనుక ఒకొక్క పెన్నీని తయారు చేసి చెలామణీలోకి వదలటానికి మన అమెరికా ప్రభుత్వపు టంకశాలకి పెన్నీ కంటె ఎక్కువే ఖర్చు అవుతున్నాది. దక్షత ఎరిగిన పెద్దలు చెయ్యవలసిన వ్యాపార సరళి కాదు ఇది!

ఒక ఉపాయం ఏమిటంటే రెండవ ప్రపంచయుద్ధపు రోజులలోలా ఉక్కు పెన్నీలు తయారు చెయ్యటం. లేదా 1857 లో చేసినట్లు చెయ్యటం. మనకి పూర్వం ఇండియాలో దమ్మిడీలు, ఠోలీలు ఉన్నట్లు 1857 లో అమెరికాలో అర్ధ పెన్నీలు ఉండేవి. అర్ధ పెన్నీ ఆ రోజులలో చెలామణీలో ఉన్న అతి చిన్న నాణెం. దాన్ని వాడుక లోంచి తొలగించేరు. అలాగే పెన్నీని ఇప్పటి వాడుక లోంచి తీసేస్తే ఎలాగుంటుందంటారు?
నన్నడిగితే పెన్నీలు ఒక బెడదగా తయారయేయంటాను. ఈ ఏడు అమెరికా ప్రభుత్వపు టంకశాల తొమ్మిది బిలియన్లు (అంటే, తొమ్మిది వందల కోట్లు) పెన్నీలని తయారు చేసి విడుదల చేస్తుందిట. ప్రభుత్వం ముద్రించిన మిగిలిన

నాణేలన్నిటిని కూడగట్టి లెక్క పెడితే వాటి కంటే ఈ పెన్నీలు రెండింతల పైనే ఉంటాయిట. ఇన్ని పెన్నీలు తయారు చెయ్యవలసిన అవసరం ఎందుకు వచ్చిందిట? విలువ లేని నాణేలని ప్రభుత్వం ఎంత జోరుగా అచ్చొత్తుతున్నారో అంతా జోరుగానూ ఈ నాణేలు చలామణీలోంచి జారుకుంటున్నాయి; రోడ్ల మీద, ఇళ్ళల్లో సీసాల్లోనూ, సొరుగుల్లోనూ మూలుగుతున్నాయన్న మాట. వెధవది, రోడ్డు మీద ఖాళీ కోకాకోలా డబ్బా కనిపిస్తే పర్యావరణం కలుషితం అయిపోతోందని ఒంగి తీస్తున్నారు కానీ, పెన్నీలని ఎవ్వరూ – నా లాంటి పురాణ పురుషులు తప్ప – తియ్యటం లేదు.

పూర్వం, అంటే 1857 లో అర పెన్నీని నిషేధించిన రోజుల్లో, దాని విలువ ఇప్పటి డైం (పది పైసలు) తో సమానం. అంత విలువున్న నాణేన్నినిషేధించి నప్పుడు ప్రజలకి అపరిమితమైన ఇబ్బంది ఏమీ కలగ లేదుట. మనకి స్వతంత్రం వచ్చిన కొత్తలో కాణీలు, అణాలు, బేడలు తీసేసి నయా పైసలు ప్రవేశ పెట్టినప్పుడు వస్తువుల వెలలని కొత్త పద్ధతి లోకి మార్చాలి కదా. అప్పుడు అర పైస కోసం కక్కుర్తి పడి, ఆ ప్రాప్తికి ధరలు పెంచిన వ్యాపారస్తులు లేక పోలేదు కాని, మొత్తం మీద ఆ మార్పు సజావుగానే జరిగింది. అలాగే పెన్నీని ఎత్తేసినంత మాత్రాన మిన్ను విరిగి మీద పడిపోదు.

పెన్నీని వాడుక లోంచి తీసేస్తే ధరలన్నిటినీ నికెలు (ఐదు పెన్నీల నాణెం) పరిమాణంలో చెప్పాలా? అక్కర లేదు. ఇప్పటిలాగే లెక్కలన్నీ చేస్తాం. కాని డబ్బు చేతులు మారేటప్పుడు మాత్రం మొత్తాన్ని ఎగదోసి (round up) కాని, దిగదోసి (round down) కాని చేసి ఇచ్చి పుచ్చుకోవటాలు చేస్తాం. అంటే మనం ఇవ్వ వలసిన మొత్తం $4.32 అయితే దానిని $4.30 అనీ, $4.37 అయితే దానిని $4.40 అనీ అంటాం అన్న మాట.

ఈ పద్ధతిలో కొందరికి నష్టం రాదా అని మీలో కొందరు అనుకోవచ్చు. కాని ఈ పద్ధతి అప్పుడే – మనకి తెలియకుండానే – అమలులో ఉంది. రెండు ఉదాహరణలు చెబుతాను. కొన్ని ప్రాంతాలలో అమ్మకపు పన్ను డాలరు మీద ఏడున్నర పైసలు అనుకుందాం. మనం డబ్బు జమ కట్ట వలసిన సమయంలో ఆ అర్ధ పైసని పైకి ఎగదోస్తారు (round up). అప్పుడు మనం కిమ్మనకుండా ఊరుకుంటున్నాం కదా. అలాగే మా ఊళ్ళో చాలా షాపులలో కేష్ రిజిస్టర్ పక్కన చిన్న పళ్ళెం లో కొన్ని పెన్నీలు పోసి ఉంటాయి. చిల్లర ఇచ్చిపుచ్చుకునే సమయంలో మన దగ్గర ఒక పెన్నీ లేక పోతే ఆ చిప్పలో పెన్నీ తీసి షాపువాడికి ఇవ్వొచ్చు. అలాగే షాపువాడు మనకి చిల్లర ఇచ్చినప్పుడు మనకి అక్కర లేని పెన్నీలు ఆ చిప్పలో వెయ్యొచ్చు. కనుక ఇది పెద్ద సమస్య కాదు.

నిజానికి 1990 లో న్యూజీలండ్ లో పెన్నీలు రద్దు చేసేసిన సందర్భంలో వారికి ఎటువంటి చిక్కులూ రాలేదు. ఆ రోజుల్లోనే నేను న్యూజీలండ్ వెళ్ళటం తటస్థ పడింది కనుక నేను గమనించిందేమిటంటే, పెన్నీలు రద్దు చెయ్యటం వల్ల ధరలు పెరగ లేదు. ప్రజలకి ఇబ్బందులు కలగ లేదు. చాలా వ్యాపారులు వినియోగదారుల వైపే మొగ్గు చూపి ధరలని దిగదోపు (round down) చేసే వారు. నగదు రూపంలో కాక క్రెడిట్ కార్డు రూపంలో లావాదేవీలు జరిగినప్పుడు

ఇబ్బందే లేదు. కాగితం మీద లెక్కలు ఎప్పుడూ సెంటు ప్రమాణంలోనే ఉంటాయి. నగదు రూపంలో చూసినప్పుడే – పెన్నీలు లేవు కనుక – ఈ “దోపు” (rounding) అవసరం వస్తూ ఉంటుంది.

ఉదాహరణకి మన వర్తకులు బొత్తిగా నీతినీ నిజాయతీని కాశీలో వదలి పెట్టేసి వారి ఖాతాదారులని మోసం చేసే ఉద్దేశంతో ఈ “దోపు” ని ఎప్పుడూ తమకి అనుకూలంగానే చేస్తూ ప్రతి నికెలునీ రాబట్టుతున్నారనే అనుకుందాం. అంటే సగటున ఇచ్చిపుచ్చుకోలు జరిగినప్పుడల్లా వర్తకుడికి రెండు పెన్నీలు లాభం వస్తుంది, లేదా వినియోగదారుడికి రెండు పెన్నీలు నష్టం వస్తుంది. మనం ఇలాంటి ఇచ్చిపుచ్చుకోళ్ళు రోజుకి రెండు చేసాం అనుకుందాం. అప్పుడు మనకి ఏడాదికి వచ్చే నష్టం $14.60. ఈ నష్టం భరించరాని కష్టం కాదు. మన ఇళ్ళల్లోని గాజు సీసాల్లో మగ్గుతూన్న పెన్నీల విలువ ఇంత కంటె ఎక్కువే ఉంటుంది. లేదా ఒక పిజ్జా మీద ఖర్చు పెట్టినంత.

మనకి నష్టం రాకపోతే పోయింది, ఆ వర్తకుడికి ఏటికి, కస్టమర్ ఒక్కంటికి $14.60 చొప్పున లాభం వస్తున్నాది కదా అని మీరు వాపోవచ్చు. ఈ లాభాల మీద వాడు పన్నులు కట్టాలి కనుక వాడు మరీ అంత మెరిగి పోడు, పైపెచ్చు వాడు మన వల్ల మెరిగిపోతున్నాడని మనకి తెలిస్తే వాడి దగ్గర కొనటం మానేసి పక్క కొట్లో కొంటాం. కనుక వ్యాపారస్తులు కూడ అంత దురాశతో ప్రవర్తించరు. కనుక ఈ “దోపు” డీ (rounding) పైకి జరిగినా కిందకి జరిగినా వ్యాపారస్తులు కాని, వినియోగదారులు కాని అమాంతం ధనవంతులూ అయిపోరు, కుదేలూ అయిపోరు.

ఈ పెన్నీ పరిస్థితి పరిశీలించినట్లే ఇండియాలో పైస ని కూడ ఒక సారి చూద్దాం. మన పవిత్ర భారత దేశంలో ఇప్పుడు ఉన్న చిల్లర బిళ్ళలని అన్నిటిని రద్దు చేసేసి, రూపాయి కాసుని అతి చిన్న నాణెంగా పరిగణించాలని నేను ప్రతిపాదిస్తున్నాను. వస్తువుల ధరలు రూపాయిలు, పైసలలో మునపటిలాగనే ఉండొచ్చు. ఖాతా ఆఖరుగా ఖరారు చేసుకునే సమయంలో మాత్రం మొత్తాన్ని దగ్గరగా ఉన్న విలువకి “దోపు” చేస్తూ ఉంటాం.

సిటీ బస్సు ఎక్కినప్పుడు కండక్టరు చేస్తూన్న పని కంటె ఇది నయమే కదా! వాడు రూపాయి కాగితం పుచ్చుకుంటాడు, చిల్లర ఇవ్వడు!

**కథ వెనుక కథ**

ఈ వ్యాసం (కథ కాని కథ) ఈమాట జూలై 2006 అంతర్జాల పత్రికలో ప్రచురితమైంది.

http://eemaata.com/em/issues/200607/894.html